SOME PAGES IN THE ORIGINAL CONTAIN FLAWS AND OTHER DEFECTS WHICH APPEAR ON THE FILM

**Digitized in 2006**
**by**
**Thrinaina Informatics Ltd, Secunderabad, A.P., India.**
(http://www.thrinaina.com)

From the original owned by
**Sundarayya Vignana Kendram**
**and its partner Institutions**

as part of the
**British Library Endangered Archives Programme**
supported by the
**Lisbet Rausing Charitable Fund**

Except for individual research purpose
any reproduction should be made with
written permission from the

**Sundarayya Vignana Kendram,**
1-8-1/B/25/A, Bagh Lingampally, Hyderabad - 500 044
Andhra Pradesh, India

సత్యనారాయణశాస్త్రి, చివుకుల

వస్తుగుణదీపము

నూజవీడు, 1925

Record no 1673

Satyanārāyaṇaśāstri, Civukula

Vastuguṇadīpamu

Nūjavīḍu, 1925

Record no 1673

**SUNDARAYYA VIGNANA KENDRAM**
1-8-1/B/25/A, Bagh Lıngampallı
Hyderabad – 500 044, Andhra Pradesh, Indıa

Bıblıographıc Record Target

సత్యనారాయణశాస్త్రి, చివుకుల
వస్తుగుణదీపము / రచయిత చివుకుల సత్యనారాయణశాస్త్రి -
నూజవీడు  చివుకుల సత్యనారాయణశాస్త్రి, 1925
10 522 3 p  21 cm
Record no  1673

Satyanārāyanaśāstrı  Cıvukula
Vastugunadīpamu / racayıta Cıvukula
Satyanārāyanaśāstrī - Nūjavīdu  Cıvukula Satyanārāyanaśāstrı
1925
10 522 3 p  21 cm
Record no  1673

35 mm mıcrofilm
Image placement  IA (IIA) IB IIB  Date filmıng began

1673

వైద్య గ్రంథములు

వస్తు గుణదీపము.

S.No: 549

Acc No: 19764

ఆయుర్వేద గ్రంథరత్నమాలా ప్రచురణములు:—తురీయరత్నము.
అధ్యక్షుడు:—చి. సత్యనారాయణశాస్త్రి.

శ్రీరస్తు.

శ్రీధన్వంతరయేనమః.

# వస్తుగుణదీపము

ఇది

చక్రదత్త, వైద్యకల్పద్రుమ, రసరత్నసముచ్చయాది,
గ్రంథకర్తయగు
చివుకుల సత్యనారాయణశాస్త్రిచే,

S. No: 549

రచింపబడి

Acc No: 19762.

నూజవీడు,
స్వకీయాయుర్వేద ముద్రాక్షరశాలయందు
ముద్రింపబడి,
ఆయుర్వేద గ్రంథరత్నమాలా కార్యస్థానమున,
తదధికారియగు గ్రంథకర్తచే,
ప్రకటింపబడినది.
1925.

MAD

రిజిస్టర్డు, కాపీరైటు. వెల రు 4—0—0.

శ్రీ ర స్తు.

# భూ మి క.

వైద్యపండితులారా!

మా ఆయుర్వేద గ్రంథరత్నమాలయందు చక్రదత్త, వైద్యకల్పద్రుమము, రసరత్నసముచ్చయము అను మూడుగ్రంథములు ప్రకటించితిని. ఈ వస్తుగుణదీపము నాల్గవది. ఈ గ్రంథమాలయందు ఆయుర్వేదమునకు సంబంధించిన రసశాస్త్రము, కాయచికిత్స, నిదానము, ద్రవ్యగుణము, స్వస్థవృత్తము, శారీరము అను విషయములంగూర్చి ప్రత్యేకముగ గ్రంథములను ప్రకటింపదలచి ఈ వస్తుగుణశాస్త్రమును గూడ ప్రకటించితిని.

ఈపుస్తకమునందు సాధ్యమగునంతవరకు మూలికాదులయొక్క స్వరూప - వర్ణ - ఆకృతి - నామ - జాతులనను స్వరూప నిరూపకధర్మములును, రస - గుణ - వీర్య - విపాక - శక్తులను, నిరూపిత స్వరూపధర్మములును, ఆయావస్తువులు ప్రధానముగ గల ఆయుర్వేదోక్తమగు కొన్ని ఉత్తమ యోగములును, వృద్ధవైద్య పరంపరయందు ఒకొక్కవస్తువును ప్రత్యేకవ్యాధులందు వాడునట్టి రహస్యప్రక్రియలును, మహారస, ఉపరస, సాధారణరసాదులయొక్కయు, లోహ రత్నాదుల యొక్కయు, శోధన మారణాదులును, విషములయొక్క శోధనములు, వికారశాంతులు (విరుగుడులు) ను, నాతి విస్తరముగ వ్రాయబడినవి. దేశమున హిందీప్రచారము హెచ్చుగ జరుగుచుండుటచేతను ఆయుర్వేద గ్రంథములు అన్నియు చాలభాగము హిందీభాషయందు తర్జుమా చేయబడి సంస్కృతజ్ఞులు కానివారలనేకులు హిందీగ్రంథములనుచదువుచుండుటచేతను, ప్రతిద్రవ్యమునకు ఇంగ్లీషు పేర్లనిచ్చుటకన్న హిందీనామము నిచ్చుట యుక్తమని వానిని వ్రాసి యాపదములను సులభముగ తెలిసికొనుటకు అకారాదిపదములపట్టికయు చేర్చితిని. అవశ్యముగ నీయదగిన సంస్కృతనామములను వ్రాసితిని. మరియు నీగ్రంథమునందు ఆయాపోటులను వ్రాసిన ఆధ్మానము, అనాహము, హిధ్మ, శాంతోత్క్లేశము మొదలగు వ్యాధులపేర్లే వైద్యేతరులు వినియుండరు. గాన నీగ్రంథమునందు చెప్పిన వ్యాధులకన్నిటికి సాధారణమగు నిదానములు వ్రాయబడినవి.

గాన నీగ్రంథమున వస్తుగుణము, చికిత్స, నిదానము నను భాగము లుండుటం బట్టి వైద్యులును, వైద్యాభిమానులును గూడ దీనివలన కొంత యుపకారమును పొందగలరు.

ఈగ్రంథమున అనేక భ్రమప్రమాదము లుండవచ్చును. వానినెల్ల దయతో విమర్శించి నాకు వ్రాసినచో శిరసావహించి అటి కాలముననే సంపవహార్పన సవరించుకొందును.

నూజవీడు, 2—12—25 } వైద్యవిధేయుడు, చివుకుల సత్యనారాయణశాస్త్రి.

## సంకేతములు.

హిం. హిందీ.

సం. సంస్కృతము

చూ. చూడుము.

## ఈగ్రంథమందలి హిందీపదముల అకారాదిసూచీ.

—:O:—

అంజీర్, అంజీరపండు
అండ్, ఆముదపుచెట్టు
అండఖర్బూజా, బొప్పాయి
అంధాహులీ, దుష్టపుతీగ
అంబాడా, అంబాళపుచెట్టు
అకర్కర్, అక్కలకర్ర
అగర్, అగురుచెట్టు
అగేధూ, తక్కిలి
అజమాయిన్, అజామోదము
అడహర్, కందులు
అతీస్, అతివస
అదరఖ్, అల్లము
అనన్నాస్, అనాస
అనార్, దానిమ్మ
అనన్త, సుగంధి
అఫీమ్, నల్లమందు
అమలతాస్, రేల
అమర్ బేల్, పాచితీగ
అరలు, దుండిలము
అరణీ, తక్కిలి
అశోణీ, అశోకము
అసగంధ్, పెన్నేరు
అహిఫలా, పొట్ల
అగ్గ-హూలీ, దుష్టపుతీగ
అంబియాహాలిదీ, కస్తూరిపసుపు
ఆక్, జిల్లేడు
ఆక్లీస్, చంపకము
ఆదూసా, అడ్డసరము
ఆమ్, మామిడి
ఆమ్లా, ఉశిరిగ
ఆలుబుఖారా, ఆలుబుకరా
ఆలూ, బంగాళాదుంప
ఇంద్రాయణ్, పాపగ
ఇమిలీ, చింతపండు
ఇలాయచ్, ఏలకులు
ఈఖ్, చెరకు
ఈసుబోల్, ఇసపగోలువిత్తులు
ఉడుర్, కందులు
ఊంటనీ, గాడిద
ఏలోనా, రామాఫలము
ఏలువా, కూతురుబుడమ
ఐరండ్, ఆముదపుచెట్టు
ఓడహుల్, దాసాని-మందార
కంకుష్ఠ, కంకుష్ఠము
కంగనీ, కొర్రలు
కంటాయీ, కాండ్రిగు-వాకుడు
కంతపుంఖా, ములువెంపలి
కంబీలా, కంపిల్లము
కంబోయీ, పురుగుడు
కందూరీ, తియ్యదొండ
కకడీ, దోస
కచరియా, బుడమ
కచనార్, కాంచనము
కచూర్, కచ్చూరము.
కటసరైయా, ములుగోరింట
కటహార్ } పనస
కటహాల్ } పనస
కటాయా, నేలములక
కటేలాలోన్, బిడలవణము
కటేరీ, వెఱ్ఱికుసుమ
కటిపాండర్, కలిగొట్టు
కగుపామగ్, బ్రహ్మమేడి
కడవీకచమర్, చేదుదొండ
కడవీఘోంటీ, చేదుసొర
కడవీతోరియా, చేదుబీర
కతీరాగోంద్, కతీరాగోదు

కదమ్, కడిమి
కనేర్, కరవీరము గన్నేరు
కపాస్, ప్రత్తి
కపూర్, కర్పూరము
కపూర్‌కచారీ గంధకచోరము
కపూర్‌హలదీ. కస్తూరిపసుపు
కబీలా, కంపిల్లకము
కభైయా, కామంచి
కమల్, తామరతీగ
కరంజ, కానుగు
కరంజువా, గచ్చ
కరల్లా, కాకర
కరహర్, మంగ
కరోందా, ఓకచెట్టు
కర్కాందా, కలివె
కలయీా, వంగము
కళియారీ, విషబొద్ది
కసీన్, అన్నభేది
కసేరూ, కోవిలదుంప
కసౌందీ, కసివెంద
కచ్చురీ, ఇంగువపత్రి
కస్తూర్, కస్తూరి
కాంకిలా, చల్వమిర్యాలు
కాంకరియా, మోదుగు
కాంగా, వెల్లుల్లి
కాంస్. రెల్లు
కాకజంఘా, వెలమసంధి
కాకడాశింగీ, కర్కాటకశృంగి
కాబియానోన్, కాచలవణము
కాయాం, చిలగడం
కాయఫల్, కట్ఫలము
కాయూ, తూటికూర
కాలాదానా, కట్లవిత్తులు
కాలాజీరా, నల్లజీలకర్ర
కాలాముగానీ, నల్లపెసర
కాలీమరిచ, నల్లమిర్యాలు
కాసా, కంచు
కింకిణీ, కాండ్రేగు
కింకిరాత్, కింకిరాతపుష్పము కొండగోగు
సందివర్ధనము
కివాంచ్, దూలగొండి
కీడామారీ, పెద్దహంసపాది
కుందేకావృక్ష మల్లిచెట్టు
కుంభీ, తూటికూర
కుంహడా, బూడిదగుమ్మడు
కుంభేక్, గుమ్మడు పెద్దగుమ్మడు
కుకురౌందా, కుకుందగము
కుడా, కొడిశ గిరిమల్లి
కురంటా, గోరంటచెట్టు
కుడ్, కోష్ఠు
కుల్థీ, ఉలవలు
కులింజన్, కళింగరాష్నము
కువారిపాఠా, కలబంద
కుశ, దర్భ
కుసుమ, కుసుంబా
కుల్ఫా. బచ్చలి పొయిలి
కెవోండా, తుమ్మెదమామిడి
కేవాడా, మొగలి
కేత్డా, మొగలి
కైయిన్, వెలగి
కేంగా, అగిటి
కేసర్, కుంకుమపువ్వు
కోదో, ఆరికలు
కోయల్, గింజెను
కోయీా, కలువ
కాంఫ్, చిన్నదూలగొండి



కాడియాలీ, రత్నపురుష
కారేయ, కొర్రగలు
కావాఠోడీ, కాకిదొండ
కాహ. మద్ది
ఖంబారీ, పెద్దగుమ్మడు
ఖజూర్, ఖర్జూరము
ఖడియా, సుద్ద
ఖరైటీ, ముత్తవపులగం
ఖస్‌ఖస్, గసగసాలు
ఖర్బూజా, కరుబూజాపండు
ఖారీనోన్, వఙ్రదు
ఖాపరియా, కఫరి
ఖిరనీ, పాలచెట్టు
ఖిలావా, జీడిచెట్టు
ఖీరా, దులుదోస
ఖురసాని, కురాసానివాము
ఖైర్, చండ్ర
ఖైలై, పేలాలు
గింగతిరియా, నీరుపిప్పలి
గింధరాజ్, గుగ్గిలము
గంధవాలా, కురువేరు
గంధవిరోజా, గంధఫిరోజా
గంధేలఘాస్, కస్తూరిగాము
గజపీపల్, గజపిప్పళ్లు
గజిపాని, ఉక్కళి
గదహాపుర్నా, గలిజేరు
గ[illegible], [illegible]గిజ్జలు
గ్యాంకీఫలీ, గోరుచిక్కుడు
గిలోయీ, తిప్పతీగ
గుడ్, బెల్లము
గుడుహాల్, [illegible]సాని[illegible]
గుడుపగోసా, ఫిరంగిసాంబ్రాణి
గు[illegible]తోరా, కొండగోదగ
గూగుల్, మహిసాక్షి
గూమా, పీయగుతుమ్మి తుమ్మి
గూలర్. మేడి
గేహూం, గోధుమలు
గేదరేత్, మరువము
గైరిక్, కావిరాయి
గోంకీ, సన్నిదుంప
గోఖురీ, పల్లేరు
గోజియా, ఎద్దునాలుకచెట్టు
గోజునియా, మంకెన
గోపీచందన్, తువరిమన్ను
గోమా, తుమ్మి
గోరీసర్, సుగంధపాల
ఘుఘురబేల్, డావరడంగి
ఘనబహేడా, రేల
ఘుఘుంచీ, గురివెంద
ఘుయ్యా, సారకంద
ఘుఘరాన్, డావరడంగి
ఘూంఘా, నత్తలు
ఘోడా, గుర్రము
ఘోలా, కలువ
చందన్ చందనము
చకవడ్, తంటెపుచెట్టు
చనా, చనే } శనగలు
చమేలీ, జాజితీగ
చవ్య, చవ్యము
చరేలీ, మండూకపర్ణి
చాదీ, గిజతేగు
చా[illegible], తేయాకు
చిచిగా, అటుకులు
చినుడ్, కలిగోటుగింజలు
చిరోంజీ, మొగలిపండు

చిర్చిప, ఉత్తరేణి
చిగాయతా, నేలవేము
చిల్, చక్రవర్తికూర
చీతా, చిత్రమూలం
చీనాకకడీ, పందిరిదోస
చూకా, పులిచింత
చూర్ణహార్, చాగ
చూల్, చుక్కకూర
చోటీ, యెర్రగురివెంద
చోపచీనీ, పిరంగిచెక్క
చోరకరుచికర్, జమ్మి
చాపతియా, చంచలికూర
చొల్లా, అలుసులు
చౌలాయీ, చిర్రి
ఛతోనా, కుక్కగొడుగు
ఛరీలా, రాతిపువ్వు
ఛాతా, కుక్కగొడుగు
ఛిరేటా, దూసరి
ఛుయీముయీ, నిద్రగన్ని
ఛుహారీ, కుర్ంజివాము
ఛోటకిరాయాతా, నాగజిహ్వ
ఛోటనఖీ, నఖముచిప్పలు
ఛోలా, శనగలు
జంగలీహలదీ, అడవిపసుపు
జన్త్రీహాయూత్, పత్రబీజము
జమాల్‌గోటా, నేపాలము
జమీకంద్, అడవికంద
జలకుంభీ, తూటికూర
జలపాయీ, తుమ్మెదమామిడి
జలపిపల్, నీరుపిప్పలి
జలబేంత్, నీటిప్రబ్బలి
జవాసా, కొండకసివెంద-దూలగోవిల
జవాఖార్, యవక్షారము

జస్త, సత్తు
జాత్రీ, జాజితీగ
జాఫర్, జాభరాపూవు
జామున్, నేరేడు
జాయఫల్, జాజికాయ
జాయీ, జాజితీగ
జియాపుతా } పుత్రజీవి
జియాపోతా }
జువార్, జొన్నలు
జూహీ, జూకామల్లి
జైత్రి, జాపత్రి
ఝునఝునియా గిలిగిచ్చ
ఝూవూకావృక్ష్, పక్కిచెట్టు
టేసూ, మోదుగు
టేంటూ, దుండిలము
టేరా, ఊడుగు
డావడా, కోలపొన్న
డికామాలీ, చక్కయింగువ
డోడ్కీ, మనుబాల-ముషిణి
ఢాల్, మోదుగు
ఢేరా, ఊడుగు
తగర్, గ్రంథితగరము
తమాఖు, పొగాకు
తరుబూజ్, పుచ్చకాయ
తాలమఖానా, గోలిమిడి
తిత్‌లౌకీ, చేగసొర
తినసునా, తినిశ
తిని, నెవ్వరిధాన్యము
తిరిచ్చు, తినిశ
తిల్ నువ్వులు
తిలక్, తిలకపుచెట్టు
తిన్నీ, నెవ్వరిధాన్యము
తిసీ, అగసి



తుంబురుకాపేడ్, తుమికిచెట్టు
తున్, తూని
తేజపాత్, ఆకుపత్రి
తోంబ్రీ, ఆనబ
తోరయీ, ఆగాకర-బీర
త్రాయమాన్, కలుగొరిసుసు
దధియార్, దుష్టపుచెట్టు
దవనపాపరా, పర్పాటకము
దవనా, అడవిదవనము
దాఖ్, ద్రాక్ష
దాదమానీ, గోరింటచెట్టు
దాభ్, దర్భ
దాల్చీనీ, దాల్చినచెక్క
దారుహలదీ, మానుపసుపు
దుపహరియా, మంకెన
దులాహ్, కొండకసివెంద
దూబ్, గరిక
దూధ్‌బిలారీ, పాలగుమ్మడు
దూధియా, నాగార్జుని
దూధీకలవ, డిటో
దౌనా, దవనము
దోలా, కోలపొన్న
ధత్తూర్, ఉమ్మెత్త
ధనియా, ధనియాలు
ధామిన్, తడచెట్టు
ధాయ్, ఆరెచెట్టు
ధారా, మోదుగు
ధునేర్, మాచిపత్రి
ధూపసాల్. సరళదేవదారు
ధూహార్, బొమ్మజెముడు
ధౌ, [illegible]
నకచికనీ, నకచికిని
నఖి, నఖముచిప్పలు

నగసల్. కిక్కిసగడ్డి-దేవసళము
నకడా, పెరుగుతోటకూర
నవసాదర్, నవాసాగరము
నళి, గువ్వగుత్తిక
నాగిఘాన్, ఈశ్వరి
నాగరబేల్, తమలపాకుతీగ
నాగేశ్వర్, నాగకేసరము
నారంగ్, నారింజ
నిసోడా నక్కెర
నిసోత్ } తెగడ
నిసోథ్ }
నిర్విషీఘాస్, నిర్విషి
నీంబూ, నిమ్మ
నీమ్, వేప
నీల్, నీలి
నీలాతూతియా, మైలతుత్థము
నీలాథోథా, డిటో
నేవారీవాసంతీ, నేపాలము
నేవారీ, అడవిమల్లె
నోనియా, పాయిల-బచ్చలి
పద్మాక్, పద్మకము
పసణీ, పర్పటపుచెట్టు
పనిజియా, పుత్రజీవి
పనీర్, తెగడ
పనిసిగా, నీరుపిప్పలి
పన్నా, పచ్చలు
పమాడ్, తంటెపుచెట్టు
పగివల్, అడవిపొట్ల
పరిశ్రేప్, చేదుపుచ్చ
పరహాట్, పారుజాతము
పసగన్, గొంతెముగోరు
పవాడ్ తంటెపుచెట్టు
పాక్, పోకచెట్టు

పాఖర్, జువ్వి
పాచీ. మూర్గొండ
పాడల్, కలిగొట్టు
పాదల్, డిటో
పాడ్, చిరుబొద్ది
పాతాళఆవరా, నేలయుసిరిగ
పాయఘసాకీ, ఇండుపగింజలు
పారా, పాదరసము
పాలగ్. పాలంకి – అడవిబచ్చలి
పాషాణభేద్, పిండికొండ
పింఖన్ జువ్వి
పిండాల్ పిలగడము
పిత్తపర్ } కోలపొన్న
పిగానీ }
పిడిడ్‌శాక్. ప్పక్క–
పిత్రంజియా, పుత్రజీవి
పిత్తపాపడా పర్పాటకము
పియాబాసా, ములుగోరింట
పిస్తోలా. వెర్రిపసుపు
సితహింగ్, చక్క–ఇంగువ
పితల్, ఇత్తడి
పిపల్, రావిచెట్టు
పిపర్ } పిప్పళ్ళు
పిపలీ }
పిపరామూల్, పిప్పలీమూలము
పీలాచందన్, పీతచందనము
పీలాజీవంతి, స్వర్ణజీవంతి
పీలు, గోగు
పుండేరియా } ప్రపౌండరీకము
పుండేరి }
పున్నాగ్, పున్నాగము
పూతికరంజ్, సెసులిచెట్టు
పేఠా, బూడిదగుమ్మడి

పోపయ్యా, బొప్పాయి
పోదీనా, పుదీనా
పోయీకానాగ్, మట్టుబచ్చలి
పోహకర్‌మూల్, పుష్కరమూలము
ఫర్ఫేంద్ } పాపగ
ఫరఫేంద్ }
ఫగనాహా, మొక్కపుచెట్టు
ఫర్‌హాద్, బాడిద
ఫాలసా యీతచెట్టు
ఫూల్‌గోభీ కాబేజీపూవు
ఫూల్‌ప్రియంగూ } పేరింఖాము
ఫూల్‌పేగ్ }
బందక్, బోణ
బందాల్, బదనిక
బకాయన్, పెనువేప
బకుల్, పొగడ
బటవాస్, అనుములు
బడాఅండ్, పెద్దాముదము
బడాజంబీర్, గజనిమ్మ
బడేజీవంతీ, పెద్దజీవంతి
బడ్‌హార్, పెమ్మరేగు
బడపత్రి, వటపత్రి
బచ్చనాగ్, వసనాభి
బబూలా, కలువ
బగ్‌వేగ్, వెంపురు
బర్‌బరీ, వాగుంట
బర్‌సంగ్, కరివేప
బహూశిన, పెల్లగి
బహేరా, తానికాయ
బ్రహ్మసోచలీ, పొద్దుతిరుగుడు చెట్టు
బాంకకోడా, గొడ్డుకాకర
బాదాం, బాదంపప్పు
బాల్‌ఛడ్, జటామాంసి



బాలమఖీరా, ములుదోస
బాంస్, వెదురు
బిదాలీ, డావర్‌దంగీ
బిలాకంద్, నేలగుమ్మడు
బిలార్‌కంద్, పాలగుమ్మడు
బీజోరానీంబ్, మాదీఫలము
బూరా, పంచదార
బేటవాస్, అనుములు
బేత్, పేము
బేర్, రేగు
బేల్, మారేడు
బైంగన్, వంకాయ
బోల్, జాలింతబోలం
భద్రఆమల, నేలవుసిరిక
భమర్‌చిల్లీ, పొణికి చెట్టు
భాంగ్, గంజాయి
భాంగ్రా, గుంటగలగర
భారంగ్, గంటుభారంగి
భిండీ, బెండ
భిలియా, గుమ్మడికాయ
భిర్‌వోసీకంస్, సన్నిదుంప
భుంటీ, మొక్కజొన్నలు
భూతృణ్, భూతృణము
భూఆమ్లా, నేలవుసిరిక
భూమికదమ్, నేలకడిమి
భూయీఖుఖసా, నేలతంగేడు
భూయీచంప్, భూచంపకము
భేడ్, మేక – గొర్రి
భైంస్, గేదె
భోజపత్ర, భుజపత్రి
మక్కా, మొక్కజొన్నలు
మకోయ, కామంచి
మచ్ఛీ, చేప

మఘేఘీ, పొన్నగంటి
మజీఠ్, మంజిష్ఠ
మటర్, బటానీలు
మనసాగాఖ్, జెముడు
మరసా, తోటకూర
మరుఆ } మరువము
మరువా }
మరేఠీ, మహారాష్ట్రి
మలాంజీ, ముంజదర్భ
మషపనీ, కారుమినుము
మసీనా, అగసి
మస్సీ, వెలమసంధి
మసూర్, చిరుసెనగ
మహువా, ఇప్పచెట్టు
మాంసరోహిణీ, మాంసరోహిణి
మాచిక్, మాచిచెట్టు
మార్‌ముగానీ, కారుపెసర
మాధవీ, బండిగురివెంద
మాల్కంగనీ, జ్యోతిష్మతి
మాల్తీ, మాలతి
మిశ్రీ, పంచదార
మీఠానీంబూ, కమలాఫలము – తియ్యనిమ్మ
మీఠానీమ్, కరివేప
మీఠాలకరీ, యష్టిమధుకము
ముండీ, బోడతరము
ముగలాయీఅండ్, దేశవాళిచేపాలము
ముగవన్, పిల్లిపెసర
ముచుకుంద్, ముచుకుందము
మురామాంసీ, ముగ
ములహాటి } యష్టిమధుకము
ములైఠీకా }
ముష్కదానా, కస్తూరిబెండ
ముసలీ, నేలతాడి

మహారీ, చాగి
మూంగ్, పెసలు
మూంగా, పగడము
మూలీ, ముల్లంగి
మూసాకానీ, ఎలుక చెవికూర
మేంబకీ, కటుకరోహిణి
మేషంశింగీ, ఒద్ది
మేథీ, మెంతులు
మేవష్టీ, వావిలి
మేహంగీ, గోరింట
మైనఫల్, మంగ
మైనశిల్, మణిశిల
మోఖా, మొక్కపుచెట్టు
మోతీ, ముత్యములు
మోతికిసీల్, ముత్యపుచిప్పలు
మోథా, ముస్తలు
మోర్‌ఫత్రాశ్, పగకాత్పృణము
మోమ్, మైనము
మోరాశిఖా, మయూరశిఖి
మోషా, మొక్కపుచెట్టు
మౌలసిరీ, పొగడ
రసౌత్, రసాంజనము
రాంగ్, వంగము
రాజదానీ, తెల్లరాజనాలు
రామతోరయీ, అనప
రామబాణ్, ఒసుమొగిలి
రామసరా, మంజదర్భ
రీఠా, కుంకుడుచెట్టు
రూపామాక్షీ, రౌప్యమాక్షికము
రేవందచీనీ, రేవల్చిన్ని
రేషంగ్, [illegible]
రోహిడా, ముల్లుమోదుగ
[illegible], ఆరెబ

లటకణ్, జాబరాపూవు
లజ్జావతీ, నిద్రగన్ని
లఘేరా, నక్కెర
లశున, వెల్లుల్లి
లవలీ, రామాఫలము
లాఖ్ హీ, లక్క
లాల్‌చందన్, రక్తచందనము
లాల్‌మరిచ, మిరపకాయలు
లాల్ ప్యాజ్, నీరుల్లి
లాల్‌ముర్గా, మయూరశిఖి
విసోడా, నక్కెర - విరిగిచెట్టు
వీల్, నీలి
లేసువా, దొగ్గలికూర
లోంగ్, లవంగము
లోద్, లొద్దుగు
లోహ్యా, అలసందలు
వంజా, కాండేర్లిగు
వంశలోచన్, తవక్షీరి
వచా, వస
వడ్, మర్రి
వనగన్నా, అడవిచెరకు
వనపీపల్, అడవిపిప్పళ్ళు
వనశాజిన్, కారుమునగ
వనంభీ, మండూకపర్ణి
వగహంటా, నేలములక - ములక
వర్ణావిలీ, ఉలిమిడి
వాయచీ, బావంచాలు
వాయువిడంగ్, వాయువిడంగాలు
వాల్వా, కురువేరు
వ్వాచీ, బావంచాలు
విచ్చివామాస్, తేలుమణి
విజయసార్, వేగిస
విధారా, వృద్ధదారు - జీర్ణదారు



విషఖపరా, గలిజేరు
వేణారమూల్, వట్టివేరు
శంఖ్, శంఖము
శంఖాహులీ, రత్నపురుష
శంఖినీ, తెల్లకట్లతీగ
శకరకంద్, చిలగడం
శరపుంఖా, వెంపలి
శర్మానీ, నిద్రగన్ని
శలాయీ, అందుగు
శహద్, తేనె
శ్యామతమాల్, చీకటిచెట్టు
శిరియారీ, చంచలికూర
శిలాజీత్, మొమ్మాయి
శివలింగీ, లింగదొండ
సంబాలూ కేబీజ్, రేణుకలు
సంహాలు, వావిలి
సజ్జీ సర్జక్షారము
సతవన్, సప్తపర్ణి
సతపుత్రీతోరయీ, గుత్తిబీర
సతవడ్, ఎడాకులరటి
సతావర్, పిల్లిపీచర
సతోనా, డిటో
సత్యానాసీ, వెర్రిపుచ్చ
సఫేద్‌ముసలీ, చల్లగడ్డ
సఫేద్‌జీరా, తెల్లజీలకర్ర
సఫేద్‌మరిచ, తెల్లమిర్యాలు
స్వద్రా, రుద్రజట
సనాయే, సునాముఖి
సముద్రఫల్, వేరుమల్లి
సముద్రఫేన్ సముద్రపునురుగు
సరగాతగుటూజ్, పుచ్చకాయ
సరివన్, ముయ్యాకుపొన్న
సరీఫా, శీతాఫలము

సగోన్, ఆవచెట్టు
సపతూత్, గంగరావి
సహోరా, తుమ్మచెట్టు
స్థలకమలినీ, మెట్టదామర
సాంపకీఛత్రి, కుక్కగొడుగు
సాగోన్ / సాగవన్ } టేకు
సాంగ్, ఆటకమామిడి
సాంఫ్, పాము
సాంభర్‌నోన్, శాంబరలవణము
సాతేలా, సంబరేణు
సింగరఫ్, ఇంగిలీకము
సిందూర్, గంగసిందూరము
సిందూరియా, జాబరాపూవు
సిజవృక్ష్, జెముడు
సిరస్, దిరిసెన
సిహార్, నాచు
సిహార్, వావిలి
సీసమ్, యిరుగుపచెట్టు
సుల్తాన్‌చంపక్, పున్నాగము
సువ్వర్, పంది
సుహాగా, పటిక - వెలిగారము
సూరణ్, అడవికంద
సూర్యాఖార్, సురాకారము
సేమల్, బూరుగు
సేవంతీ, చామదుంప
సోంచలీ, ఆదిత్యభక్తి
సోంఠ్, శొంఠి
సోనా, అభ్రికము - బంగారము
సోనాపాఠా, దుందిలము
సోనామాఖీ, స్వర్ణమాక్షికము
సోమైలా, డావరడంగి
సోయా, సదాప

సోరు, సురాకాగము
సౌంఫ్, అడవిసదాప - సోపు
షొజినా, మునగచెట్టు
హంసపగీ, హంసపాది
హరడ్, కరక్కాయ
హరితాల్, తాళకము
హరీమూంగ్, పచ్చపెసలు
హలదీ, పసుపు
హడభాంగా, నల్లేరు
హాలోహాలిం ఆడాలు
హపూబేర్, విత్తుబోడసరము
హింగ్, ఇంగువ
హింగోర్, గారచెట్టు
హీరాబోల్, బాలింతబోలు
హుకహుజ్, పొన్నిద్దుతిరుగుడుచెట్టు
హుర్ హుర్ } చిలుకకూర
హుల్ హుల్ } చిలుకకూర

హిందీ అనుక్రమణిక సమాప్తము.

శ్రీ ధన్వంతరయే నమః.

# వస్తుగుణ దీపము.

---

అంకుడుచెట్టు:— స్వరూపవిజ్ఞానము. ఇది బర్రెఅంకుడు, చిట్టిఅంకుడు అని రెండువిధములు. బర్రెఅంకుడునే "బర్రెంక" యనియు పిలుతురు. చిట్టిఅంకుడును తెల్లపాలయనియు పాలబరికెయనియు వాడుకచేయుదురు దీనికర్ర తెల్లగ దంతమువలె నుండును. ఎండిన తర్వాత మిగుల తేలికగనుండును. ఈకర్రతో పాకోళ్ళు, కర్రచెప్పులు, మంచములు మొదలైనవి చేయుదురు. బర్రెంకచెట్టుకన్న నిది చిన్నచెట్టేకాని మొత్తముమీద పెద్దవృక్షములలోచేరినది. దీనిఆకులు జామఆకులవలెనుండును. చెట్టు బూడిదచల్లినట్లు తెల్లగనుండును. దీనిపూవులు తెల్లగను గంధశూన్యముగ నుండును కొడిశపాల కాయలవలె దీనికాయలు రెండేసిచొప్పున గుత్తులుగ నుండి వానిచివరలు ఒకదానినొకటి కలసికొనియుండును ఆకులనుగాని కొమ్మనుగాని నఱికినను గిల్లినను పాలుగారును.

రసాదివిజ్ఞానము. పాలు వెగటు వాసనగలిగి నాలుకకు తగిలినచో వెగటుగ కారముగ మంటగ నుండును.

లఘుగుణమును ఉష్ణవీర్యమును కటు విపాకమును గలది. దీని ఆకులను కాల్చి మసిచేసి యామసిని కొబ్బరినూనెలో కలిపి రాచినయెడల దద్దులు తామర మొదలగు చర్మరోగములు మానును. దీనిపాలు పాషాణములనుకట్టును. దీనిఆకు పసరు తు 64 లు, ఆవునేయి తు 16 లు మిరియాలకల్కము తు 4 లు వీనినేకముజేసి నేయిమాత్రము మిగులునట్లుకాచి వడియగట్టిన ఘృతమును పావుతులంమొదలు తులమువరకు దినమునకు రెండుసారులు సేవించుచుండిన కుష్ఠము మేహపొడలు నశించును.

అంగూరు: చూ. ద్రాక్షపండు.

అంజీరుపండు:—సం. అంజీర, మంజుల, కాకోదుంబరికాఫల.

హిం అంజీర్.

ఇది మేడిపండ్లలో నొకభేదము తీపిగ శీతవీర్యముగ మధురవిపాకముగ గురుగుణముగలదిగనుండును. దీనిని తినిన రక్తదోషమును వాతపిత్తములను హరించును. రుచిబుట్టించును శ్లేష్మమును ఆమవాతమును కలిగించును

అంతరదామర:—స్వరూపవిజ్ఞానము. ఇది చెరువులలోను నీటిగుంటలలోను మొలచు నాచుజాతియొక్క నీళ్ళలోతేలియుండును దీనివేళ్ళు సన్నముగ దారముల కుంచికవలె నీళ్ళలోనే యుండును. మెత్తుగా పెరగను. దీనికిపుష్పము ఫలము ఉండదు. ఆకుయొక్క చిన్న పెద్ద భేదముచేత రెండువిధములు. చిన్నాకుగలది పద్మాకారముగనుండును. పసుపు పచ్చరంగుగలసిన ఆకుపచ్చరంగుగలిగియుండును. దీనిరసము చిక్కగ యెర్రగ చప్పగ నుండును. పెద్దఆకులు గలది ఆకుపచ్చరంగు గలిగియుండును. మరియు దీనికాడ షుమారు మూడంగుళముల నిడివి గలదియై చివరఆకును గలిగియుండును. కాడ నడుమబోలుండును. దీనిని త్రొక్కి తీసినరసము పలచగ పసుపువన్నెగలిగి చేదుగా నుండును. ఈరెండు దినుసుల యొక్కలందు క్షారముకలదు. క్షారపాకవిధానము ననుసరించి తీయబడిన క్షారము తాటిబెల్లములో పొదిగి తినిన యెడల శూల కడుపుబ్బరము హరించును

శుద్ధిచేసిన మైలతుత్థమును చిన్నాకుల అంతరదామరి ముద్దలో పెట్టి లఘుపుటము వేసినయెడల తెల్లగ భస్మమగును. మరియు నీమొక్క...గయొక్క ముద్దలో శుద్ధిచేసిన పత్రతాళకపు ముక్కను పెట్టి లఘుపుటమువేసిన సిందూరించును. చిన్నాకులయొక్క భస్మాదుల జేయుటకును పెద్దాకులయొక్కను క్షారాది ప్రయోగములు సంధించి యూషముగ వాడుటకును వైద్యులుపయోగింతురు. ఈజాతియొక్కలను శరీర



మునందువేసి కట్టినయెడల శరీరమందలిమంట (దాహరోగము) తక్షణమేతగ్గును. జలుబుజేయును. తాళకసిందూరము, మైలతుత్థభస్మము, క్షారపాకవిధానము అను వానినిగూర్చి ఆయాశీర్షికలక్రింద చూచునది.

అందుగుచెట్టు:—దీనికి సంస్కృతమున శల్లకి గజభక్ష గజప్రియ సురభి సురభిరస మహారుహా కుందురుకీ స్రవా అనునవి నామాంతరములు.

హిందీభాషయందు "శలాయీ" అందురు. ఇది పెద్దవృక్షము. మాను తెల్లగానుండును. దీనియాకృతి సాధారణముగా మునగచెట్టువలె యుండును దీనిఆకు కొనువేప ఆకువలె నుండును గాని అంతకన్న కొంచెముచిన్నది కొమ్మనరికి పాతినను బ్రదుకును. దీనిని నరికిన యెడల విశేషముగ పాలుగారును. పాలకు సువాసనయుండును. దీనిపండ్లయందు మూడు తెల్లరేఖలుండును. పుష్పములు తెల్లగానుండును. దీనిజిగురునకే కుందురుష్కమనియు ఫిరంగిసాంబ్రాణియనియు పేరు. ఫిరంగిసాంబ్రాణిగుణముల నాశీర్షికక్రింద చూడుడు.

దీనిచక్కరసము వగరు రుచిగలది గురుగుణమును, శీతవీర్యమును, మధురవిపాకమును గలిగి యుండును. పిత్తాతిసారమును రక్తపిత్తమును మూలవ్యాధిని వ్రణదోషములను హరించును. మలబంధము జేయును దీనిచక్క కషాయముచేతగాని రసముచేతగాని వ్రణములను కడిగినను చక్కచూర్ణమును చల్లినను వ్రణముమానును. దీనికషాయమును తులము లేక రెండుతులములు పంచదారకలిపి త్రాగినయెడల రక్తపిత్తము తక్షణముతగ్గును, వీర్యపుష్టినిజేయును. దీనిపండునుదినిన కఫవాతములను అర్శస్సును కుష్ఠమును అరోచకమును పోగొట్టును. పువ్వునకుగూడ ఫలముయొక్క గుణములుండును. అందుగుపుల్లతో దంతధావనముచేసికొనిన దంతములు గట్టిపడును.

అంబరు:—ఇది యూనానీ సంప్రదాయమందు చెప్పబడినది. తిమింగిలపుచేదునే అంబరుఅందురు. సువాసన గలిగి యుండును. ఇది

విశేషముగ దొరకుట దుర్లభము. ఒకజాతివృక్షపు జిగురునుగూడ అంబరందురు. కొందరు కొన్నిసువాసన ద్రవ్యములను చేర్చి అంబరువండుదురు. దీనిని కాహోబా, కారుబాయనియు పిలుతురు. చేదుగానుండును వీర్యవృద్ధికరమైన ఔషధములలో దీనినిచేర్తురు. ఉష్ణవీర్యముగలది

అంబాళపుచెట్టు:—దీనికి సంస్కృతమందు ఆమ్రాతక, పీతనక కపిచూత, తనుక్షీరి, కపిప్రియ, పీతన, కపీతన, మధురామ్లక, భృంగీఫల, రసాఢ్య, అంబరాతక, అంబరీష, అథ్వగభోజ్య అనునివి నామాంతరములు.

హిందీయందు; అంబాడా అందురు.

ఇది సాధారణమైనచెట్టు, ఫలజాతిలో చేరినది. దీనిఆకులు కని వేపాకులవలె నుండును గాని అంతకన్న కొంచెముపెద్దవి. పర్వత ప్రదేశములందు అడవులలో పెరుగును. పెరళ్ళలోగూడ వేసి పెంతురు. దీనికి చిన్నచిన్నపండ్లు రెండేసి జంటగాపుట్టును. ఈపండ్లను కోతులుతినును గనుక కపిచూత, కపిప్రియ, యనియు గిల్లినయెడల పాలుగారునుగనుక తనుక్షీరియనియు కాయయంతయు రసపూర్ణమై యుండును. గనుక రసాఢ్యయనియు పులుపు తీపి రుచులు కలదిగనుక మధురామ్లకయనియు వర్షకాలమందది పండును గనుక వర్షపాకియనియు మార్గస్థులు తృష్ణానివారణకై దీనిపండ్లను తిందురు. గనుక అథ్వగ భోజ్యయనియు పేర్లుకలిగెను.

దీనిచిగురుటాకు పుల్లగ రుచిగ నుండును. మలబంధమును అగ్నిదీప్తిని కలిగించును. పండుకొంచెము వగరు పులుపు తీపి రుచులతో నుండును. గురుగుణమును ఉష్ణవీర్యమును మధురవిపాకమును కలిగియుండును. రుచిని బుట్టించును. కంఠస్వరమును బాగుచేయును. చక్కగా పక్వమైన అంబాళపుపండు రక్తవృద్ధిని వీర్యవృద్ధిని బలమును ధాతుపుష్టిని తృప్తిని యిచ్చును వాతపిత్త కఫములను ఖండించును. మలబద్ధముజేయును. క్షయను రక్తదోషమును హరించును. పక్వము



గాని పండ్లు కఫపిత్తములజేయును. ఆమవాతమును వాతమును ఆమమును హరింపజేయును.

“ఆమ్రాతకోగురుశ్చోష్ణః” అని నిఘంటు రత్నాకరమునందిది ఉష్ణవీర్యము కలదిగను “దీపనంశీతమధురం” అని ధన్వంతరి నిఘంటువునందు శీతవీర్యముకలదిగను చెప్పబడినది. అనుభవమునందు దీని పండ్లు చలవచేయునవై యున్నవి.

అకాలనిద్ర:—సూర్యోదయ సూర్యాస్తమయ కాలములందు నిద్రించినయెడల దరిద్రముకలుగును. పగటియందు నిద్రించిన వేడిచేయును. ఒడలునొప్పులు, తలనొప్పి, పీనస, ఓకిరింత, వెక్కిళ్ళు, అజీర్ణము కలుగును.

జ్వరముక్తులు ఆహారమును పుచ్చుకొనిన తరువాత పగలు నిద్రించినయెడల జ్వరమువచ్చును. తలనొప్పి, నేత్రములందు దోషము, మెడ, నడుము మొదలగుచోట్ల నొప్పి కలుగును. త్రిదోషములును ప్రకోపించును.

దోషశాంతి; కండ్లకుకలికమువేయుట నస్యముచేయించుట.

అక్కలకర్ర:—దీనిని సంస్కృతమందు ఆకారకరభ, అక్కరకరా, అకరకరా, అకల్లక యనియందురు. హిందీయందు “అకర్ కర్” అందురు. ఇది గుల్మముగ పెరుగును. చామంతిఆకువంటిఆకును బోడతరపు పువ్వువంటి కాయయును గలిగి యుండును. కాయఅంతయు పసుపుపచ్చగను పైనయెర్రని చక్కయునుండును. దీనిపూతలోనే గింజలుండును.

దీనివేరునే అక్కలకర్రయందురు. ఆకుకూడ వేరువలెనే నమిలినయెడల నాలుక చిమచిమలాడును. నోటనీరూరించును.

అక్కలకర్ర కారమును, లఘుగుణమును ఉష్ణవీర్యమును కటువిపాకమును గలిగియుండును. బలమును జలుబును వాపును వాతమును పోగొట్టును దీనిని నోటిలో నుంచుకొని రసమును మ్రింగుచు

న్నయెడల విదాహమును ఒగర్పును దగ్గును ఆపును. అజీర్తిని హరిం
చును. మూత్రమును ఋతురక్తమును జారీజేయును ఇది పొక్కువస్తు
వు. అనగా దీనిని నలియగొట్టిగాని అరగదీసిగాని శరీరమందువేసి కట్టి
నయెడల యెఱ్ఱగావాచి పుండగును దీనిగంధమును సన్నని పుల్లచివర
తగిలించి యెగురుకుశికలకు (నాలుకమొదటిరెండుప్రక్కలనుబుట్టునొక
విధమగువాపు) అంటించినయెడలనవిమానును

అక్కలకర్ర లవంగాలు నేలయుసిరిగ వీనికషాయము తాగిన
పాశితదగ్గులు ఒగర్పు తగ్గును. విరేచనము జేయును. అక్కలకర్ర ప్ర
త్యేక కషాయమును పుక్కిటబట్టిన పుప్పిపన్ను బాధ దంతములు జివ్వ
మశిలాగుట చిగుళ్ళవాపు దలగు ముఖరోగములు కుదురును

ఆకారకరభాది చూర్ణము:—అక్కలకర్ర, శుంఠి, తక్కోలాలు
కుంకుమపూవు. పిప్పళ్ళు, జాజికాయ లవంగాలు, మంచిగంధము ఇవి
ప్రత్యేకము ఒకతులము, నల్లమందు నాలుగుతులములు వీనినెల్ల చూర్ణిం
చి మాషప్రమాణముగ తేనెతో సేవించునెడల వీర్యస్తంభనము ఉత్సా
హము కలుగును.

అక్కుళ్ళుధాన్యము:—వరిధాన్యములలో నిదియొకభేదము. ఇది
6 మాసములకుపండును ఈయన్నము మృదువుగ నుండక కొంచెము
మోటుగనుండును. మిక్కిలి పైత్యము వేడి చేయును. అపథ్యమైనవి.

అకోరిటు:—ఇది యూనాని సంప్రదాయ ద్రవ్యము దీని
కాయలలోని గింజల నుపయోగింతురు. ఈగింజలలోని పప్పు తెల్లగా
కమ్మగానుండును. మిక్కిలి వేడిచేయును. వీర్యవృద్ధిని జ్ఞానశక్తిని
ఆయుష్షును బలమును హెచ్చొందించును, పాశితగింజలలోని పప్పు చేదు
గానుండును. దీనిని తినినజబ్బుచేయును. నాలుకపొక్కును.

దీనికివిరుగుడు రుద్రాక్షగంధము, మాదీఫలము, దానిమ్మరసము.

అగురుచెట్టు:—ఇది అనేకవిధములుగలది. అగురు కృష్ణాగురు
కాష్ఠాగురు దాహాగురు మంగళాగురు మొదలగు పేళ్ళతోనుండు యీ
జాతిలో కృష్ణాగురు మిక్కిలిశ్రేష్ఠమై ఔషధయోగ్యముగ నుండును.



అగురునకు క్రిమిజ, రాజార్హ, వంశిక, వర్ణప్రసాదన, మొదలగుసం
స్కృతనామములు తెల్లఅగురునకును, కృష్ణాగురు, వసుక, మాంగల్య
విశ్వరూపక, శృంగారశీర్ష, కృశకాష్ఠ ధూపార్హ మిశ్రవర్ణ, రాజా
ర్హా, కృమిజగ్ధ మొదలగునామములు కృష్ణాగురునకును, దాహాగురు
వహ్నికాష్ఠ, తైలాగురు, పురమథనవల్లభ అను మొదలగునవి దాహా
గురునకును, మల్లికా, గంధమంగళా మాంగల్యా మొదలగునవి మంగ
ళాగురునకును పేళ్లుగలవు.

సాధారణముగా అగురుచెట్లన్నియు ఆకుపచ్చని వర్ణముగల
మానుగలిగి మిక్కిలిపెద్దదియు చిన్నదియు గాకయుండును. ఆకులుకో
లగాయుండును. దీనిని నరికినచో అమితముగ పాలుగారును. పాలు చ
క్కగూడ సుగంధముగలవి దీనికొమ్మలు మిగుల పెళుసైనవి తెలుపు
నలుపు వర్ణములును మిశ్రవర్ణమును గల పూలను యీచెట్లు పూచు
ను. పూవులకు పరిమళముండదు.

ఇది కారము చేదు రుచులును ఉష్ణవీర్యమును, తీక్ష్ణ లఘుగుణ
ములను కటువిపాకమునుగలది. చర్మమునకు కాంతిగల్గించును పిత్త
మునుచేయును. నేత్ర కర్ణరోగములను కుష్ఠువును శీత వాత కఫ రోగ
ములను హరించును. దీనిని యొడించి ప్రత్యేకముగగాని యితరధూప
ద్రవ్యములతోచేర్చిగాని ధూపమువేసిన యెడల చర్మరోగములు అల
క్ష్మి నశించును.

కృష్ణాగరునకుగూడ పైగుణాదులే కలిగియుండునుగాని కొంచె
ముగ వేడిచేయును దీనిని పానముచేసినచో పిత్తమును హరించునని
కొందరును త్రిదోషహరమని కొందరును అందురు.

కాష్ఠాగరుగూడ కృష్ణాగరుగుణములుగలిగి లేపమునందు మిక్కి
లిగ నుపయోగపడును. రూక్షమైయుండును. కఫహరము. దాహాగరు
కారముగయుండును. వెండ్రుకలుపెరుగుటకును నెరసిన వెండ్రుకలను
నల్లబరచుటకును ఇంద్రలుప్తము (పేనుకొరుకుట) చుండ్రుమొదలగు కే

శదోషములను హరించుటకును దాహాగరు ఉపయోగపడును. మంగ
ళాగరు సుగంధముగ శీతవీర్యముగ యుండును. యోగవాహియైనది.
దీనిపాలనుండి బయలుదేరు జిగురును వాతపు నొప్పులకు పట్టువేయుట
కుపయోగింతురు. కుష్ఠము, వ్రణములు. సర్పి మొదలగు చర్మవ్యాధు
లను శిరోవాతములకును అగరుచెక్కను మరికొన్ని సుగంధ ద్రవ్యము
లను చేర్చి వండిన తైలమును పూసినయెడల సుగుణమునిచ్చును.

అగుబొంగి:—చూ. చిరుబొద్ది.

అగిసిచెట్టు:—దీనికి సంస్కృతమున ఉమ. అతసీ, మదగంధా
మొదలగు నామములుకలవు. హిందీభాషయందు "మసీనా" "తిసీ"
అందురు

ఇది ప్రసిద్ధమైన పెద్దవృక్షము. మధుర, తిక్తరసములును, ఉష్ణ
వీర్యమును, కటువిపాకమును, స్నిగ్ధగుణమును గలది నేత్రములకు శు
క్రమునకు హానిచేయును. త్రిదోషహరము రక్తపిత్తమును తగ్గించును.
దీపనకరము ఆకులను పూవును కాయలనుగూడ కూరవండుకొని తిం
దురు. ఆకుకూర కొద్దిగ విరేచనకారి. కాయకూర కఫమును శూల
ను యకృత్ప్లీహాభివృద్ధిని గుల్మమును వంజురోగమును హరించును.
గురుత్వముచేయును, ఆకుయొక్క స్వరసములో గుల్లసున్నము వేసి మె
త్తగానూరి గవదబిళ్ళలకు పట్టించి పైనదూదిని అంటించినచో నివిశా
గిహరించును. ఆకురసమును శరీరమునకు పూసిన చీడ దురదపోవును.
అవిసెగింజల తైలముతో దీపారాధన చేసిన శత్రునాశనమగును, అవి
సెనూనె, వేపనూనెకలిపి కోడియీకతో కురుపులకు రాచినవి మాను
పట్టును. గింజల కషాయమునందు శర్కరచేర్చి త్రాగిన మూత్ర
...చేయును, మలబద్ధమును పిప్పును,

అగ్నికాపడము:— చూ, స్వేదనము,

అగ్నివేంద్రపుచెట్టు:—ఇదిమబ్బువలె మూరెడెత్తు పెరుగును. దీ
నికాడ రెండంగుళముల పొడవుగలిగి కోసగానుండును. ఆకుతమ్మడిగిం
జవలెనుండును, కాడమెరుపు చెట్టుముదిరినచో ఆకుగూడ మెరుపెక్కు



ను యించుమించుగ. చెట్టుముదిరినపుడు పండిన బాదంఆకురంగున నుం
డును. మెరుపు తెలుపు మిశ్రమమైన రంగుగల చిన్నచిన్నపూల బూ
చును. దీనికాయలు లవంగములవలె యుండును. గాని లవంగమునకు
చివరనుండు పలకలు బొడ్డు ఉండదు. ఈకాయలలో సన్ననిబీజములుం
డును, కాయ నాలుగుపలకలుగలది. నీటియాధారమున పెరుగును. దీని
ఆకుమొదలగువానికి కారము రుచి కలదు. సమూలముగ దీనిని నూరి
గ్రంథులకు సెగగడ్డలకు కట్టిన వానినిహరించును దీనిని తొక్కి తీసిన
రసము పలచగయుండును. ఈరసముతో బియ్యపుపిండి నుడికించి గడ్డ
లకుకట్టిన పక్వముచేసి పగులగొట్టును. దీనిఆకు చూర్ణము రెండుమొద
లు 8 గుంజలెత్తువరకు తేనెతో యిచ్చిన శ్లేష్మముతగ్గును. దీనివేరు చూ
ర్ణమును గవ్వపలుకు సాంబ్రాణి చూర్ణమును సమభాగముగ కలిపి
ఆవుపాలతో త్రాగిన మేహరోగమునశించును. దీనిచిగుళ్ళు 5, మిర్యా
లు 3, కలిపి నూరి ఒకమాత్రగా ఉదయమున నిచ్చిన విషమజ్వరము
కట్టును. దీనిస్వరసముతో మెట్టచోళ్ళనునూరి పట్టువేసిన వాతపు నొ
ప్పులుతగ్గును దీనిఆకును శరీరముపైనకట్టిన పొక్కును.

అజామోదము:— భూమికి జానెడెత్తు లోపుగా పెరుగు చిన్న
మొక్క. దీనిఆకులు పెళుసుగా బూడిదచరచినట్లు తెల్లగనూగుగలిగి
వంకరగయుండును, చెట్టుఅంతయును ఒకవిధమైన సువాసన యుండును.
తరుచు చౌడుగలప్రదేశములలో పెరుగును. గుత్తులు గుత్తులుగ చిన్న
చిన్న తెల్లనిపూవులు పూచును. వీటినుండిపుట్టు గింజలకు అజామోద
వాము అనిపేరు.

దీనిని సంస్కృతమున అజమోదా, ఖరాశ్వా, మయూర, దీప్య
క, బ్రహ్మకుశ, కారవీ, లోచమస్తక అను మొదలగు నామములుకల
వు. హిందీయందు "అజమోదాయన్" అందురు. ఇది కారముగను తీక్ష్ణ
రూక్ష గుణములుకలదిగను ఉష్ణవీర్యముగను కటువిపాకముగను ఉండు
ను. దీపనమును మలబంధమును విదాహమును రుచిని కల్గించును. శూ

లు, ఆధ్మానము అగ్నిమాంద్యము, నేత్రరోగము, కఫవాతములు, ఛర్ది వెక్కిళ్ళు, మూత్రాశయవ్యాధి వీనినిహరించును. వీర్యవృద్ధికరము. అజామోదము ఉప్పుకలిపి నమిలి మింగినయెడల కడుపునొప్పి ఊపిరిగొట్టునొప్పి శూల తగ్గును. ఆమవిరేచనమును నీళ్ళవిరేచనమును ఆపును. అజామోదపువిత్తులను నిమ్మపండ్లరసములో వేసి సైంధవలవణము కలిపి భావనచేసి భద్రపరచుకొని ఉదయమున కొంచెముగ సేవించుచుండిన ఛర్ది, అజీర్ణము తగ్గును. అజామోదము, దుంపరాస్నము, శొంఠి, కలిపి నీళ్ళతోనూరి వడియగట్టి పొంగించిన రసమును చంటిబిడ్డలకుపోసిన కఫము కడుపుబ్బరము తగ్గును.

అటకమామిడి:—దీనికి సంస్కృతమున పునర్నవః అనిపేరు హిందీభాషయందు "సాంఠ్" అందురు. ఇది గలిజేరు జాతిలోనిది. యెరుపు నలుపు, తెలుపురంగుగల పూవులచేనిది మూడువిధములు నేలమీదపాకును. గుండ్రని చిన్నఆకులుండును. గలిజేరు అనగా తెల్లగలిజేరునకును, యెర్రగజ్జేరునకును దీని ఆకులలో భేదముకలదు. గజ్జేరునకు ఆకులు కోలగాయుండును. గాని రసాదులందు గజ్జేరుతో సమమైనది,

అటకమామిడి (యెర్రపూవులది) చేదు రుచిని లఘుగుణమును శీతవీర్యమును కటువిపాకమును గలది రక్తప్రదరము (యెర్రకుసుమ)ను పాండువును పిత్తమును హరించును. దీనివేరును ఒక మిరియమును నీళ్ళతో అరగదీసి యోగంథమును కలికమువేసిన స్త్రీసంగమదోషము తప్పక నివారించును.

నల్లపూవుల అటకమామిడి కారము చేదు రుచులు ఉష్ణవీర్యము గలిగియుండును. హృద్రోగము, పాండువు, శ్వాస, వాతకఫములు, ఉబ్బు వీనిని నివర్తించును. రసాయనము.

తెల్లపూవులదిగూడ ఉష్ణవీర్యముగ తిక్తకషాయరసములు కలిగియుండును.



మూడువిధములైన వానియాకులను కూరవండుకొని తిందురు. ఈకూర అగ్నిమాంద్యమును వాతమును గుల్మమును శూలను ప్లీహరోగమును హరించును.

అటుకులు:—సంస్కృతమున "చిపిట, చిపిటక" అందురు. హిందీయందు "చౌలా, చిఉరా" అందురు. క్రొత్తవరిధాన్యమును ఉడుకబెట్టి వేయించి దంచి చెరిగినయెడల పైయుముక పోయి అటుకులు అగును.

తియ్యని రుచిని గురుగుణమును ఉష్ణవీర్యమును మధురవిపాకమును గలది. వీనిని తినినచో ఆకలినణచును కడుపునొప్పి అజీర్ణము శూల కలిగించును బలమును వీర్యమును వృద్ధిచేయును. మలబంధము కలిగించును.

అడవిఅరటి:—సం. కాష్ట కదళీ, వనకదలీ ధారారంభా అందురు ఇది మామూలు అరటిచెట్టువలెనేయుండును. దీనిపండ్లు తీపిగ శీతవీర్యముగ గురువుగ మధురవిపాకముగ ఉండును. అగ్నిమాంద్యము జేయును. రక్తపిత్తమును హరించును. పచ్చికాయ కఫమును పెంచును. బలమును వీర్యవృద్ధిని కలిగించును.

అడవికంద:—సం. శూరణ, సూరణ, అర్శోఘ్న.

హిం. సూరణ్, జిమీకంద్. కషాయకటురసములను రూక్షగుణమును ఉష్ణవీర్యమును కటువిపాకమును కలది.

ఇది అడవులలోను గ్రామములందును గూడ పెరుగును: గాని అడవికందను ఔషధములలో వాడుదురు. రెండవది సాధారణముగ కూరవండుకొనితిందురు కందచెట్టు మూరెడెత్తు పెరుగును. అడవికందకును కూరకందకును దుంపయందు విశేషభేదముండదు గాని ఆకులు కొంచెము భేదించియుండును. అడవికంద తినిన అమితముగనోరు దురదపుట్టును, మూలవ్యాధులకిది మిగులపథ్యము. రక్తపిత్తము, దద్రు. కృమి, కుష్ఠము, యకృత్ ప్లీహ, గుల్మము అను వ్యాధులు కలవారికి హితమైనది. దీపన పాచనములను కల్గించును కఫహారము.

అడవికంద 16 భా॥ చిత్రమూలము 8 భా॥ శొంఠి 2 భా॥ మిర్యాలు 1 భా॥ వీనినన్నిటిని చూర్ణించి యాచూర్ణమునకు రెట్టింపు శర్కర లేక బెల్లము పాకములోవేసి కలియబెట్టి బలానుసారము సేవించిన రక్తపు పడుమొలలు (రక్తార్శస్సు) కుదురును. అడవికందచూర్ణమును వెనుగాకుకషాయముతో త్రాగిన ఖునురక్తము జారీచేయును. గర్భిణులు అడవికందతినరాదు అడవికంద ఊరకందకన్న నెక్కువ వీర్యముకలది.

అడవికాకర:—సంస్కృతమున దీనికి "వనకట్టిల్లి" యనిపేరు. దీనికాయలు పొట్టివి. తక్కినతీగయంతయు పెద్దకాకరవలెనే యుండును. దీనికాయలు చేదుగయుండును. శీతవీర్యము లఘుగుణము కటువిపాకముగలది. పిత్తరక్తము కామిల, పాండువు, కఫరోగము, వీనిని హరించును.

అడవిగగ్గెర:—సంస్కృతమున అర్జక, సుముఖ, కపిత్థార్జక, కటింజర, వటపత్ర అని నామములు, అడవిగగ్గెర, నల్లగగ్గెర, గగ్గెర యని యిది మూడుతెరగులు. ఇదివృక్షము దీనిఆకు, వేరు, పట్ట, చేదు, ఉష్ణవీర్యము లఘుగుణము కటువిపాకము గలిగియుండును. కఫవాతములను విషమును హరించును. దీనివేరుపట్ట గంధమును కణతలకుపట్టు వేసినతలనొప్పి, ఒంటితలనొప్పి భారము నశించును. గగ్గెరలు మూడును సమానరస వీర్యాదులంగలిగియుండును.

అడవిగోధుమలు:— సం, గవేధుకా, గవేధు, కుంత. (క్షుద్రా). గుంద్రగుత్థ అందురు. మామూలు గోధుమచెట్టు పోలికగ అడవులందు కంచెలలో పుట్టును. అడవిగోధుమలు కొంచెము కారముగ తీపిగ యుండును. గురుగుణమును, ఉష్ణవీర్యమును కటువిపాకమును గలిగియుండును. దీనిని అన్నమువండిగాని రొట్టెచేసిగాని తినిన ఉబ్బురోగము పాండువు కఫము నశించును. శరీరమును కృశింపజేయును స్థూలరోగులకెంతయు హితము.



అడవిచెరకు:—సం. ఆరణ్యేక్షు, వేణునిస్వన, రసాక్షుయనియు, హిం. వనగన్నాయనియు అందురు. ఇది తీగ శీతవీర్యముగ గురుగుణముగ మధురవిపాకముగనుండును. వీర్యవృద్ధిని పుష్టినియిచ్చును శ్లేష్మమును ఆమమును పెంచును. క్షయరోగములకు ఉష్ణతత్వముగలవారికి హితమైనది.

అడవిజీలకర్ర:—చూ. విషకంటకాలు.

అడవితులసి:—సంస్కృతమున అర్జక, [illegible]దతులసీ, వనతులసీ అందురు తెలుపు నలుపు ఆకులభేదముచేనిది రెండువిధములు ఊరతులసికిని దీనికిని భేదమేమియులేదు. గాని దీనిఆకులు కొంచెము మోటుగాఉండును సితార్జకమునకు వైకుంఠ వటపత్ర అనియు, కృష్ణార్జకమునకు కలామాల మాలుక కాలపర్ణక అనియు పేర్లుకలవు. దీనిఆకు కాడ వెన్న కారముగ ఉష్ణవీర్యముగ కటువిపాకముగ రూక్షగుణముగ ఉండును కఫవాతములను రక్తదోషమును కృములను విషమును హరించును అకు పసరు శరీరమునకుపూసిన చీడ దద్రులు నశించును. ఆకురసమునుత్రాగిన హృదయమునకు హితమైనది సులభముగ జీర్ణించును దీపనశక్తిగలది. పిత్తమును హెచ్చించును.

అడవిదమనము:—సంస్కృతమున దమనక, దాంత, మునిపత్ర గంధోత్కట, బ్రహ్మజట అనియు హిందీయందు "దానా, దవనా" అనియు అందురు ఇది క్షుపజాతిలోనిది ఆకులు కోలగా ఉండును ఆకు వలెనుండును గాని దీనియాకులకు [illegible]రాకలదు గరుసుగ నుండును. మిక్కిలిసుగంధముగలది. అగ్నిదమనమని వనదమనమని కొలది భేదములతో యిది రెండువిధములు. రెండుజాతులు అడవులందు పెరుగును మొత్తముమీద దమనము వనదమనము అగ్నిదమనము అని యిది మూడుజాతులుగలది

దమనము తిక్త కటు కషాయరసములు, శీతవీర్యము, లఘుగుణము, కటువిపాకముగలది. దీనిని సేవించిన విషము, కుష్ఠము, రక్తవికారము, క్లేదము, దురద వీనినిహరించును. త్రిదోషహారము.

వనదమనము వీర్యస్తంభనమును చేయును. బలమునిచ్చును. ఆమదోషమును నశింపజేయును. అగ్నిదమనము వేడిచేయును. రూక్షమైనది. అగ్నిదీప్తిని రుచిని వాతకఫములను గుల్మమును ప్లీహను నశింపచేయును. హృదయమునకు హితమైనది,

అడవిద్రాక్ష:—మంచిద్రాక్షతీగవలె అడవులందు బాగుగును. దీనిపండు మధురముగ వగరుగ ఉండును. శీతవీర్యమును గురుగుణము ను మధురవిపాకమును గలది. రక్తవృద్ధిని అగ్నిమాంద్యమును చేయును పిత్తమునణచును.

అడవినాభి:—చూ. పొత్తిగుంప.

అడవిపంది: మాంసము వాతము బలము, కాంతి వీనిని కలిగించును. మాంసమును ధూపము వేసిన జ్వరము భూతబాధ దుష్టవ్రణములు హరించును. అడవిపందిచమురు పాషాణములనుకట్టును అడవిపంది చమురు తేనె సమభాగముగ కలిపి శిశ్నమునకు లేపనము చేయుచున్న యెడల ఆనరములకు బలమును స్తంభనశక్తిని కలిగించును. యీచమురు మర్దనచేయుటచే వాతనొప్పులుతగ్గును.

అడవిపందిమాంసముతో రసగంధకములనుచేర్చి త్రుళ్ళించి అందు బుట్టు పురుగుల రసముతో స్వర్ణాకర్షణక్రియ చేయవచ్చునని వాద గ్రంథములందు చెప్పబడినది, దానివివరములు స్పష్టముగా తెలియవు.

అడవిపసుపు:—సంస్కృతమున శోలీ, వనహారిద్రా, వనార్ద్రికా అనియు హిందీయందు జంగిలీ హాలదీ అనియు దీనికిపేరు. దీనిరుచి కారము చేదు రుచిని కటువిపాకమును ఉష్ణవీర్యమును సూక్ష్మోష్ణ గుణములను గలది. మిక్కిలి వేడిచేయును. అగ్నిదీప్తిని రుచినికలిగించును. కుష్ఠము వాతరక్తము మొదలగువ్యాధుల నణచును.

అడవిపావురము:—దీనిమాంసము తినిన మిక్కిలి వేడిచేయును. ఉష్ణతత్వములవారికి తలనొప్పి తెచ్చును. తేలికగ జీర్ణమగును. దీని రక్తమును పక్షవాతమువలనపడిపోయిన అంగములకుగాచిన సయిమగును



అడవిపిప్పలి:—సంస్కృతమున వనపిప్పలి: సూక్ష్మపిప్పలి అనియు హిందీయందు వనపీపల్ అనియు పేరు.

ఇది కారము రుచి ఉష్ణవీర్యము, తీక్ష్ణగుణము, కటువిపాకము గలది. ఇది పచ్చిదిగనున్నపుడు పిప్పళ్ళయొక్క గుణమునిచ్చును. యెండినతరువాత స్వల్పగుణమునే యిచ్చును: దీని ప్రభావమును గూర్చి "పిప్పలి" చూడుము

అడవిపెసలు:—సంస్కృతమున వనముద్గ కుళీన అందురు. మధురకషాయరసములు గురుగుణము శీతవీర్యము మధురవిపాకము గలవి. వీర్యవృద్ధినిచ్చును, కఫమును పెంచును. అగ్నిమాంద్యమును గల్గించును. దీనికట్టు తాప జ్వరమును దప్పిని హరించును.

అడవిపొట్ల:—సంస్కృతమున పటోల, కర్కశచ్ఛద, అమృతఫల, పాండు, ఫల, బీజగర్భ, కుష్ఠారి అనియు హిందీయందు పరవల్ అందురు. ఆకులపైన నూగుండును. గనుక కర్కశచ్ఛదయనియు విషమయమైన రసముగలిగియుండుటచేతను తీగ యెండినను దీనిపండు యెండిపోకుండుటచేతను అమృతఫలయనియు, దీనికాయయందు తెల్లనిచారలుండునుగనుక పాండుఫలయనియు, కాయనిండ గింజలుండును గాన బీజగర్భయనియు, కుష్ఠమందు విశేష ఫలప్రదముగ నుండునదిగాన కుష్ఠారియనియు పేళ్ళుగలిగెను. ఇదియును మంచిపొట్లను పోలియేయుండును గాని దీనికాయలు నిమ్మపిందెలవలె గుండ్రగ ఉండును. మంచిపొట్లకులకంటె దీనిఆకులుచిన్నవి తెల్లని చిన్నపూవులుపూచును. కాయపండినపుడు యెర్రగా ఉండును.

చేదుపొట్లతీగ కారము చేదు రుచులను ఉష్ణవీర్యము కటువిపాకము సరగుణముగలది మలమును భేదించును. అగ్నిదీప్తినిచ్చును. పిత్తకఫములు కుష్ఠము రక్తవికారము జ్వరము దాహరోగము దప్పి వీటిని హరించును

అడవిప్రత్తి:—సంస్కృతమున భారద్వాజీ, త్రిసన్ధ్యా అందురు చలువ జేయును రుచిని బుట్టించును గాయములను కురుపులను మాన్పును.

**అడవిబచ్చలి:**—సంస్కృతమున పాలంక్యా, క్షురపత్రిక అని యు, హిందీయందు పాలక్ అందురు. ఇది కొంచెము కారముగ మధుర ముగ శీతవీర్యము గురుగుణము మధురవిపాకము గలదిగ ఉండును. మల బద్ధముజేయును. శ్లేష్మము పుట్టించును తృప్తినిచ్చును. పిత్తరక్తము శ్వాస మదము విషము వీనిని దొలగించును.

అడవిమల్లె:—సంస్కృతమున వాసంతీ, గ్రీష్మభవా అనియు హిందీయందు నేవారీయనియు పేరు. ఇది నేపాలదేశమునందు పెద్దవృక్షములుగ పెరుగును. దీనిఆకులు కొంచెము గుండ్రముగ పొడవుగనుండును మామిడిపూవుల గుత్తులవలె నిది పూవుల పూచును పూవులు మంచిపరిమళముగలవి దీనిఆకు చెక్కయు కారము చేదు రుచిని లఘుగుణమును శీతవీర్యమును కటువిపాకమును గలిగియుండును నేత్ర కర్ణ ముఖ రోగములను హరించును.

అడవిమల్లితీగ:—తెగడతీగవలె పాకును దీని వేరు కాడ ఆకు చేదుగ వగరుగ ఉండును. ఉష్ణవీర్యము లఘుగుణముగలది దీనిఆకు రసమును రాచినను వేరును నిమ్మపండురసముతో అరగదీసి రాచినను చర్మరోగములు మానును రూపాయయంత వెడల్పుగల ఆకును తాంబూలముతో దినమునకు మూడుపూటలు నమిలిన దగ్గు ఆయాసము తగ్గును వేరురసము కొలదిగ విరేచనముచేయును

అడవిమాదీఫలపుచెట్టు:—సం వనాఢ్య, గంధాఢ్య దేవభూత నగోద్భవ, రుచక కుళింగక యందురు ఇది పులుపు లఘుగుణము, శీత వీర్యము, ఆమ్లవిపాకముగలదై యుండును. రుచిని అగ్నిదీప్తిని కల్గించును. కంఠము నాలుక, హృదయము వీనిని శోధించును. దీనిరసమునందు సైంధవలవణము జేర్చి నస్యముచేయుంచిన సన్నిపాతము నేత్రజాడ్యము మరేత మొదలైనవి తగ్గును.



దీనిపై చర్మము (లోపలిగుజ్జుసహా) తినిన బలము చలువచేయు ను. వాతమును పిత్తమునుహరించును. గురుత్వముకలది.

దీని కేసరములు లఘుగుణముకలవి. శూల, గుల్మము, ఉదరము వీనినిహరించును. మలబద్ధముజేయును. దీనివిత్తనములు గురువుగ ఉష్ణముగ ఉండును. కృమి శ్లేష్మవాతములు వీనిని సంహరించును. స్త్రీ లుసేవించిన సంతానమునిచ్చును. దీనిపూవులు వాతమును పెంచును. మలబద్ధముచేయును. రక్తపిత్తమును హరించును, లఘువుగఉండును. దీనిరసము శూల, అజీర్ణము. మలబంధము, కఫవాతములు అరుచి, శ్వాస కాసలు వీటినిహరించును.

అడవిమొల్ల:—సం యూథిక, బాలపుష్ప, పుణ్యగంధ, శిఖండి అందురు. చేదు కారము గలది. త్రిదోషహారము. ముఖ, దంత, శిరో నేత్రరోగములందు హితమైనది. దీనిని సమూలముగాని వేరుగాని వాడవచ్చును.

అడవివాయింట: సం వనబర్బరీ దోషక్లేశీ నిద్రాళు శోకహారీ అందురు.

హిం. బర్బరీ అందురు,

అడవితులసియందిది యొకభేదము. కారము రుచి ఉష్ణవీర్యము కటువిపాకముగలది పిశాచబాధను వాంతిని అరికట్టును. మరియు మంచివాయింట గుణములన్నియు నిది గలిగియున్నది.

అడవివాము:—సంస్కృతమున వనయవానియందురు. వాము యొక్క గుణములన్నియు దీనికిగలవు. చూ వాము.

అడవిసెనగ: చూ. గుడదంతి

అడవిసదాప:—సం. మైత్రేయ, తాళపత్రి, మిసి, శాలీన, సితశివ అనియు, హిం. సౌంఫ్ అనియు పేర్లు.

మధురరసము, శీతవీర్యము, గురుగుణము, మధురవిపాకము గల
ది. దుర్నామరోగము క్షయ క్షతక్షీణము వీనిని హరించి బలమును
వీర్యమునువృద్ధిచేయును. త్రిదోషహరము.

అడ్డసరము:—సం. వాసక, వాసిక, సింహముఖి వైద్యమాత
అనియు, హిం. అడూసా, విసోంటా యనియుపేరు.

ఇదిగుల్మజాతివృక్షము. దీనిరెమ్మలు ఒకదానిప్రక్క కొకటి
మొలచి పొదవలెపెరుగును. దీనికొమ్మలు లేతగనున్నపుడు ఆకుపచ్చగ
ను ముదిరినపుడు తెల్లగను ఉండును దీనిఆకులు మామిడాకులవలెపొ
డవుగనుండును గాని వెలుసుగనుండవు. పండుటాకులు పసుపుపచ్చగ
ఉండును. మాఘఫాల్గుణమాసములలో నిదిపుష్పించును అప్పుడు కొ
మ్మలచివర జూలువలె చిన్నచిన్న కోటియాకులు పుట్టి వానిలో తెల్లని
చిన్నపూవులు పూచును. కాయలు కాయవు. దీనియాకులు, వేరు,
పూవు ఔషధములందువాడుదురు.

ఇది చేదు రుచి లఘురూక్షగుణములు శీతవీర్యము కటువిపాక
ము గలది, కఫపిత్తములను హరించి వాతమును పెంచును. జ్వరము
రక్తపిత్తము క్షయ శ్వాస కాసలు స్వరభంగము కుష్ఠము మేహము
దప్పి తాపము వీనినిహరించును. అడ్డసరపు ఆకురసమునందు తేనెనైనా
యుమందు పంచదారజేర్చి యిచ్చిన రక్తప్రదరము, రక్తపిత్తము తక్షణ
ముతగ్గును. అడ్డసరపుపూవులను ఆకులనుచేర్చి దంచి తీసినరసము కా
మలములు, తేనెపావుతులము పంచదార పావుతులముచేర్చి పుచ్చు
కొనిన ఆమ్లపిత్తముతోడను కామిలతోడను కూడిన శ్లేష్మపిత్తజ్వరము
హరించును అడ్డసరపురసము 64 తు॥ పంచదార 32 తు॥ పిప్పలిచూ
ర్ణము 8 తు॥ నేయి 8 తు॥ వీనినెల్లజేర్చి మందాగ్నితో లేహ్యపాకము
వచ్చువరకు వండి దించి చల్లారినవెనుక 32 తు॥ తేనెజేర్చి కలియ గలు
పవలెను. ఇది "వాసావలేహ" మని చెప్పబడును. దీనిని అగ్నిబలము
మొదలుగుబలమువరకు సేవించు చుండిన క్షయ, దగ్గు, శ్వాసకాసలు,



ప్రక్కలయందు గుండెలయందు పోట్లు రక్తపిత్తము జ్వరముహరించును
ఇది ఉత్తమమైన యోగము.

అతిబల:—చూ. బలాచతుష్టయము.

అతిమధురము:—దీనినే యష్టిమధుక మందురు, సంస్కృతము
న మధుయష్టి, యష్టిమధు యష్ట్యాహ్వ. క్లీతక, మధుక మందురు
హిందీయందు ములేఠీయందురు. జలస్థలభేదములచే నిది రెండువిధ
ములు. ఇది గుల్మజాతిచెట్టు. రెండుగజముల యెత్తువరకు పెరుగును.
ఆకు గుండ్రగ చిన్నదిగ మునగఆకంతయుండును. గాని దానిమీద మె
త్తువ చెట్టంతయు నారగానుండును. సన్ననిగుత్తులుగ తెల్లనిపూవులు
పూచును. పూవులకువాసనలేదు. ఆకునలిపిన వెగటు వాసనవచ్చును
దీనిఆకు రంగు నూనెమంగతాకురంగు గలిగి యుండును. యోగులు దీని
యాకులని యోగసిద్ధిపడయుదురు. తీపి రుచి గురుగుణము శీతవీర్యము
మధురవిపాకము గలది. దీనిచూర్ణము లేక కషాయము వీర్యవృద్ధి బ
లము కలిగించును. నేత్రములకుచలువను ప్రసాదమును కేశవృద్ధిని చే
యును. పిత్తము శోష దప్పి ఉబ్బు ఛర్ది విషదోషము క్షయ శ్లేష్మ
రోగములను. దీనిచూర్ణమును నేతితోకలిపి రాచిన పిత్తవ్రణములు త
గ్గును. పాలతోగాని పంచదారతోగాని చూర్ణమును పూటకు అరతు
లం చొ॥ సేవించిన వీర్యమును వృద్ధిచేయును. యష్టిమధుక రసక్రియ
చూర్ణముకన్నను క్వాథముకన్నను నెక్కువపనిచేయును రసక్రియ య
నగా కషాయమును మరల గట్టిపడువరకు కాచిన నది రసక్రియ యన
బడును నీటియష్టిమధుకము మెట్టయష్టిమధుకము రసవీర్యాదులందు
సమానమైనది.

అతివస:—సంస్కృతమందు అతివిష ప్రతివిష శ్వేతవచ విరూ
పా అరుణా మాంద్రీ) అనియు హిందీయందు అతీస్ అనియుపేరు దుం
పలు ప్రధానముగాగల గుల్మజాతి చిన్నమొక్క ఇది కారము చేదు రు
చులు ఉష్ణవీర్యము కటువిపాకము లఘుగుణముగలది. కఫము ఛర్ది

జ్వరము మూలవ్యాధి వ్రణములు ఆమాతిసారము విషమజ్వరము హృద్రోగము కామిల కృమి గ్రహణి పీనస మీట్లను హరించును. పాచన దీపనముల గలిగించును, దీనిగంధమును రాచిన వాపు తగ్గును. చంటి బిడ్డలకు దీనిచూర్ణము లేక రసము కషాయము మిగుల పథ్యముగను ఆరోగ్యకరముగను ఉండును.

అనాసపండు:—సంస్కృతమందు అనంనాస, పారావత[?], కౌతుక సంజ్ఞక అనియు హిందీయందు అనంనాస్ అనియుపేరు. అనా[?] చెట్లు పర్వతములమీదను ఉలపారియ[?] ప్రదేశములందును బాగుగా పెరుగును. కలబంద చెట్లనుపోలిన చిన్న గుబురుచెట్టు. దీని మట్టలకు కంగోరాయుండును. దీని మొవ్వలోనుండి కాయపుట్టును. పచ్చికాయ ఆకుపచ్చగను పండినపుడు మెరుపుగలిసిన పసుపురంగును కలిగియుండును. పండుపై చర్మము గరుసుగనుండును.

అనాసపండు కొంచెము పులుపు తీపి రుచులు శీతవీర్యము, గురుగుణము, మధురవిపాకముగలది. మేహము ఆమము దప్పి అరోచకము శ్రమ మీట్లనుహరించును, పచ్చికాయ కఫపిత్తములను పెంచును. అజీర్తిని వాతమును చేయును.

అనుములు:—సంస్కృతమునందు నిష్పావ రాజశింబీ వల్లకి అనియు హిందీయందు భటవాసు బేటరాసు అనియు పేర్లు ఇది శింబీధాన్యవిశేషము, అనుములు తీపి వగరు రుచులు రూక్ష గురు సరగుణములు ఆమ్లవిపాకముగలది. ఇది మలమూత్రములను జారీచేయును. స్త్రీలకు స్తన్యముపుట్టించును. శ్లేష్మము విషము వాపు తగ్గించును, హృదయమునకు శుక్రమునకు హానిచేయును. గురువైనదిగాన ఆలస్యముగ జీర్ణమగును. విదాహమునుపుట్టించును.

అన్నభేది:—సంస్కృతమున వత్సక, మలీమస, హంసిన[?] అనియు, హిందీయందు కసీస్ అనియుపేరు. ఇది ఖనిజవస్తువు. ఆకుపచ్చ పలుపు[?] తెలుపు రంగులుకలిగి మట్టిగడ్డవలె ఉండును. పుష్పకాసీసము ధాతుకాసీసము అని యిది రెండువిధములు. మొదటిది శ్రేష్ఠము. ఇది



ఉప్పు, పులుపు, వగరు రుచులు, ఉష్ణవీర్యము, అమ్లవిపాకము, సరగుణముగలది. రెండువిధముల అన్నభేదియు బొల్లి నేత్రవ్యాధులు విషదోషము వాతకఫములు క్షయ ఋతుబద్ధము అజీర్ణము మీట్లను హరించును వెంట్రుకలకు నల్లు[?] ఎక్కించును. గుంటగలగరాకు రసముతో నొకజాము స్వేదనము చేసినను నిమ్మపండురసములో 3 దినములు నానబెట్టినను యిది శుద్ధమగును. నిమ్మపండ్ల రసముతో నూరి పుటము వేసిన యెర్రగ సిందూరించును శుద్ధగంధకము శుద్ధకాసీసము రెండును కలిపి నూరి పుటము వేసిన సిందూరించును ఇదియు కాంతకాసీసమనబడును కాంతకాసీసమును యుక్తానుపానములతో సేవించిన నంజు అజీర్ణము అర్శస్సు కామిల పాండువు గుల్మము క్షయ శూల నశించును, రక్తవృద్ధి జేయును. అగ్నిదీప్తినిచ్చును. వలీపలితములు లేకుండ జేయును. కాసీస సిందూరము, వెలిగారము, ముసాంబరము, ఇంగువ వీనిని సమభాగముగ కలబంద రసముతో నూరి శనగగింజంత మాత్రలుచేసి రోజుకు రెండుచొ॥ సేవించిన ఋతుబద్ధదోషము నివర్తించును స్త్రీల రక్తగుల్మము కరుగును.

అన్నము:—వరిఅన్నము శీఘ్రముగ అరుగును. పూర్వదినమున భుజించిన ఆహారము జీర్ణమైనతరువాత భుజించిన తాపము శ్రమ అణచును. సప్తధాతువులకు సంతృప్తిని ప్రసాదమును యిచ్చును అజీర్ణసమయమునను నవజ్వరమునను అన్నము దినిన త్రిదోషములను పెంచును వేడియన్నమును రాత్రిపూట కాచిన ఆవుపాలలో వేసి అందు కొంచెము శొంఠిచూర్ణము చల్లి తోడుపెట్టి తెల్లవారుజామున మాటలాడకుండ తినిన చిరకాలమునుండియున్న పార్శ్వపునొప్పి. తెల్లకుసుమ, దారుణమగు మేహప్రకోపము తగ్గును. బలమును మత్తును కలుగజేయును. వేడియన్నముతో కాపడము పెట్టిన తలబరువు పైత్యపునొప్పి తగ్గును.

అభ్యంగనము:—ప్రతిదినము అభ్యంజనము చేసికొనిన ముసలితనము శ్రమ వాతము హరించి నేత్రప్రసాదము, శరీరపుష్టి, ఆయుర్వృద్ధి చర్మమునందు కాంతి, శరీరపాటవము గలుగును శిరస్సునందు తై

లను, ఘృతము మొదలగు స్నేహద్రవ్యములను అభ్యంజనముచేయుట చేత కేశములకు అభివృద్ధియు కపాలము యింద్రియములు వీనికి తృప్తియు కలుగును. చెవియందు తైలాదులను పోసిన కటిమర్లు పెడతలపెద్దనరము తల చెవి వీనిపోట్లు వీనిని పోగొట్టును. పాదములయందు అభ్యంగముచేసిన సుఖనిద్ర దృష్టినైర్మల్యము దంతపటుత్వము కలుగును పాదములందుబుట్టు సుప్తిశ్రమ స్తంభము సంకోచము పగుళ్ళు కీట్లనుపోగొట్టును కఫరోగులు విరేచన శుద్ధిచేసికొన్నవాడు అజీర్ణరోగి భుజించినవాడు అభ్యంజనము చేసికొనరాదు.

అభ్రకము:—సం. అభ్రక, అభ్ర, వ్యోమ, బహుపత్ర అనియు. హిందీయందు సోనాయనియుపేరు. అభ్రకము ఖనిజవస్తువు. పినాక, నాగ, మండూక వజ్రములని యిది నాలుగువిధములు నాలుగుజాతులలోను తెలుపు యెరుపు నలుపు పసుపు వర్ణభేదములచే ప్రత్యేకముగ నాలుగుతరగతులుకలవు రక్తపీతాభ్రములు స్వర్ణవిద్యయందు శ్వేతాభ్రకము, రజతవిద్యయందు కృష్ణాభ్రకము, ఔషధములందు ఉపయోగించును. ఒకగజములోతునుండి తీసిన యభ్రకము శ్రేష్ఠము వజ్రాభ్రకములో కృష్ణవర్ణముగలదానిని నిప్పులలో యెర్రగా కాల్చి ఆవుపాలు లేక మూత్రమునందు చల్లార్చిన శుద్ధమగును కాల్చినపుడు ధ్వనిలేక మెగురక పొగలేవక యుండునది వజ్రాభ్రమని గుర్తించవలెను' తక్కినవి రోగకారకములుగాన త్యజించవలెను. సక్రమముగ పుటములువేసి సిందూరింపజేసిన కృష్ణాభ్రక సిందూరము మధురకషాయరసములు స్నిగ్ధగుణము, శీతవీర్యము, మధురవిపాకము గలది వాత పిత్త క్షయులనుహరించును. వీర్యము ఆయుష్య బలము కాంతి వీనినిపెంపొందించును. కాల్చి మసిచేసిన వస శొంఠి, మిర్యాలు, కృష్ణాభ్రకసిందూరము యీవస్తులను సమముగ చూర్ణించి తేనె పటికబెల్లము కలిపి సేవించిన దగ్గుతగ్గును మోతాదు చిన్నం. అభ్రకము, వైక్రాంతము సమముగజేర్చి సోపురసముతో నిచ్చిన గర్భిణీస్త్రీలకు ఉపకు జ్వరము అరుచి పిత్తవికారములు తగును అడ్డిగత్తు అభ్రకసిందూ



రమును గ్రుక్కెడు దూసరియాకురసముతో ఉదయమునందు తినిన సెగరోగము నివర్తించును, అభ్రకము తిప్పసత్తు కలిపి తినిన ముఖపాకము (నోరుపూత) మానును అభ్రకము గవ్వపలుకు సాంబ్రాణిచూర్ణము కలిపి తినిన సవామేహమువలన గలిగిన వేడి శుక్లనష్టము అతిమూత్రము తగ్గును కొండపిండివేళ్ళ రసముతో అభ్రకమునిచ్చినమూత్రకృచ్ఛ్ర మూత్రఘాతము నివర్తించును. అభ్రకము సమస్త రోగములను అనుపాన విశేషయుక్తమై హరించును కాయసిద్ధినిచ్చును. రసమును బంధించును. అభ్రకమునుండి తీసిన సత్త్వమును రసమందుజీర్ణింపజేసిన సమస్తసిద్ధులనొసంగును. శుద్ధిజేయబడనిదియు తళుకుగలదియునగు అభ్రకమనేకరోగములు గలుగ జేయును

అమరశిలగంధకము: సం. గంధాశ్మ, దివ్యగంధ, గంధ, గంధకమందురు. అమరశిల కడ్డీ నెల్లి యని మూడువిధముల గంధకము మనకుదొరుకును. నలుపు తెలుపు యెరుపు గంధకములు దొరకును అవి సువర్ణవిద్యయందు కాయసిద్ధియందు ఉపయోగించును.

గంధకము, కటురసము, ఉష్ణవీర్యము గురుగుణము మధురవిపాకముగలది. దురద, కుష్ఠము విసర్పి, దద్రులు, అగ్నిమాంద్యము, ప్లీహ ఆ క్రమనము, క్రిమి మున్నగు రోగములను మాన్పును. ఆమము వెడలించును. విషహరము, పాలఆవిరిని, ఒకగడియవండి కడిగి ఆవునేతిలో బోసిన పరిశుద్ధమగును. మూర్కొండాకు రసముతో గంధమును మెత్తగానూరి శరీరమునకుపూసి యెండలోకూర్చుండిన తామర, కుష్ఠము మున్నగు చర్మరోగము లన్నియు నశించును. శుద్ధగంధకము 6 తులములు త్రిఫలములు, త్రికటుకములు వాయువిడంగాలుయాలకులు ఆకుపత్రి దాల్చినపట్ట శనగలు శుద్ధిచేసిన నల్ల జీడిగింజలు. జీలకర్ర, యీవస్తువులన్నిటి చూర్ణముకలసి 6 తులములు చిత్రమూలం 1 తు॥ వీనినన్నిటినిచేర్చిన నది "షట్పలగంధక చూర్ణ" మనబడును. పూటకు 1, 2, 3, వరహాల యెత్తు తేనె. వెన్న, నేయి, చక్కెర, మున్నగు అనుపానముతో సేవించుచున్న సవాయిరోగము కురుపులు కు

ష్ఠము తామర మొదలగు సకలచర్మరోగములు హరించును. గంధకము ఫిరంగిచెక్క నల్లజీడిగింజలు మసినివిత్తులు సమభాగములుగ చూర్ణించి తెల్లబాడిదచెక్క చిట్టిగారవేరు నిమ్మపండ్లరసము తో మూడు దినములు మర్దించి సెనగలంతమాత్రలుచేసి సేవించిన వాతపునొప్పులు వ్రణములు కుదురును. గంధకము 1 భా॥ ఖిర్యాలు 1 భా॥ త్రిఫలములు 6 భా॥ వీనిని రేలవేరుగంధముతో నూరి శరీరమునకు పూసిన కుష్ఠము కుదురును ఇది సోమదేవసిద్ధుడు చెప్పిన అనుభూత దివ్యయోగము. జిల్లేడు జెముడుపాలతో తెల్లనివస్త్రమును ఏడుసారులు తడిపి యెండించినపిదప ఆగుడ్డకు వెన్నతో నూరిన గంధకమును మందముగా పట్టించి వత్తిచేసి మధ్యను కారుతో పట్టుకొని నిప్పుముట్టించి తలక్రిందుగా పట్టుకొనినచో గంధకతైలపు చుక్కలు క్రిందబడును. ఆతైలమును గాజుపాత్రలో భద్రపరచి బలానుసారము సేవించుచున్న కుష్ఠమునశించును, వీర్యవృద్ధియు బలము అగ్నిదీప్తికలుగును. రసాయనము గంధకమును తెల్లమద్దిచెక్కబూడిదలో పెట్టి మందాగ్నితో ఒకగంట పాకముచేసితీసి దానిని నేలయుసిరిగరసముతో మూడుజాములు మర్దించి యుండజేసి రాసున్నమును పొదిగి యెండించి కొలిమిలో కాల్చినయెడల తెల్లగ భస్మమగును ఇది కుష్ఠాదులకును సర్వాయురోగమునందును చక్కగపని చేయును. మోతాదు పూటకుగురుజెత్తు.

అయస్కాంతసిందూరము:—సం. అయస్కాంత, కాంత, శాస్త్రాలయు, పిత్తాయసమందురు. భ్రామకము, చుంబకము, కరకము, ద్రావకము. రోమకము అని అయిదు విధములు ఏ జాతులలోను పసుపు నలుపు యెరుపు రంగులుకలవియుండును పీత కృష్ణకాంతములు దొరకవు. కాంతము యినుమునాకర్షించును. కాంతము తిక్తరసము ఉష్ణగుణము శీతవీర్యము కటువిపాకము గలది. గుల్మము, ఉదరము అర్శస్సు, కామిల. పాండువు, క్షయ, ఆమవాతము, భగందరము. ఆమ్లపిత్తము, కుష్ఠము, ప్లీహ, శిరోరోగములు మొదలగు సకలరోగములనుహరించును. ఆయువు బలము వీర్యము కాంతి వృద్ధిజేయును.



అయిలారము:—గ్రంధిదినుసుపత్రవు చలువచేయును. స్త్రీల గర్భకోశమునకు చెరుపుగలిగించును. మూత్రమునుజారీచేయును. వాతపునజుకలవారలకు రేవల్చిన్ని అయిలారము కలిపి రసముతీసి యిచ్చిన అమితముగ మూత్రముగావించి నంజును తగ్గించును.

అరటిచెట్టు: సం. కదలీ. సుఫలా, రంభా, మోచ, చర్మణ్వతియనియు, హిందీయందు కేలాయనియు పేరు. ఇందులో అనేక జాతులుకలవు ఇది ప్రసిద్ధమైనదగుటచే స్వరూపాదులు వ్రాయబడలేదు. అరటి సామాన్యగుణాదులు. మధుర కషాయరసములు శీతవీర్యము గురుగుణము మధురవిపాకము గలది. వీర్యమును వృద్ధిజేయును. రక్తవికారము యోనిదోషము పిత్తము అశ్మరి రక్తపిత్తముహరించును

లేతఅరటికాయ మధురకషాయరసములు గలది. దీనినిచూర్ణించియిచ్చిన అతిసారము, గ్రహణి కట్టును. విరేచనబద్ధము వీర్యమున చలవచేయును. ముదిరినఅరటికాయ కూర లేక చూర్ణము దప్పి రక్తపిత్తము నేత్రరోగము ప్రమేహము రక్తాతిసారము మాన్పును. రూక్షగ ఉండును.

అరటిపండు దేహకాంతి బలము కలిగించును. ఆకలిగణచును ఉష్ణతత్వముగలవారికి హితముగనుండును. మూలవ్యాధి, దగ్గు, బుడ్డగలవారు దీనినితినకూడదు అరటిపండులో శంఖపాషాణముకలిపి నూరి ఆముద్దయందు పాదరసమునుపోసి తామ్రసంపుటమునందిడి చీరజేసి కొలిమిలోనుంచిన రసమునుకట్టును. ఆబద్ధరసమును ధరించిన అలక్ష్మి తొలగును. నాదవిద్యయందు నుపయోగించును. దానిని భస్మముచేసిన సకలవ్యాధులను హరింపగలిగియుండును.

అరటియూచ చలువజేయును. పిత్తవ్రణములపై నలియగొట్టి కట్టిన మంటతగ్గును. ఆమమును పెంచును. మూత్రమునుజారీచేయును అరటిడిప్పలలోనినీరులో పంచదారకలిపి త్రాగిన దప్పి నణచును. సెగరోగమును పోగొట్టును. అరటిదుంపరసములో సుద్దకలిపిత్రాగిన తెల్లకుసుమకట్టును. అరటిపువ్వుకూర లేక పచ్చడి వగరుగానుండును. మల

బద్ధము అజీర్తిచేయును: గ్రహణి పిత్తము రక్తాతిసారము మూత్రకృచ్ఛ్ర విస్ఫోటకరోగమును అగ్నిదగ్ధవ్రణమును గలవారికిని అరటిఆకులపై పరుండబెట్టిన తాపముతగ్గును.

[illegible]:—యిది [illegible] ముక్కలను నీళ్ళలోగాని పాలలోగాని వేసి కాచి జావగాజేసి ఆజావను అజీర్ణరోగులు పాలుచాలని చంటిబిడ్డలును పుచ్చుకొనదగియుండును. తేలికగా జీర్ణమగును. విరేచనబద్ధమునువిప్పును.

అలచందలు:—సం. రాజమాష, మహామాష, చపల, శుకుందర అనియు, హిం. లోబ్యాఅనియుపేరు. యిది చిన్నమొక్క. ఒకతొడెమునకు విడివిడిగ మూడుఆకులుండును. సన్నని నాలుగంగుళములు పొడవుగల కాయలుకాచును. యీగింజలకు బొబ్బరలనియు నామాంతరము కలదు.

అలచందలు వగరు తీపి రుచులు సరరూక్షగుణములు మధుర విపాకము ఉష్ణవీర్యము గలది. రుచిని స్త్రీలస్తన్యమును బలమును కలిగించును. తృప్తినిచ్చును మలమూత్రములను గావించును. కఫవాతములను ఆమమును పెంచును. అలచందపప్పు (వండినది) రుచిగా వగరుగా రూక్షగా గురువుగా నుండును. వాతమును స్తన్యమును పుట్టించును, మలబద్ధముజేయును.

అల్లము:—సం. ఆర్ద్రిక, శృంగబేర, కటుభద్ర అనియు. హిం. అదరక్ అనియు పేరు. యిది పసుపుమొదలైన మొక్కలజాతిలో చేరినది, ఆకుకూడ దూసనంటి వాసనగలది కారము రుచి రూక్ష తీక్ష్ణగుణములు మధురవిపాకము ఉష్ణవీర్యము కలది. యిది మలమును భేదించును. అగ్నిదీప్తి, రుచి, వీర్యవృద్ధి వీటినికలిగించును. అగ్నిమాంద్యము, కఫము, వాతము, శూల. ఛర్ది, రక్తదోషము వీనినిపోగొట్టును.

సైంధవలవణమును కలిపిన కాంజికమునందు అల్లమును ఊరబెట్టితినినను మిరియాలు అల్లము సైంధవలవణము నిమ్మపండ్ల రసమున ఊరనిచ్చి తినినను కడుపుబ్బరము శూల శ్వాసకాసలు మూత్రాగ



బద్ధము హరించును. అల్లపుస్వరసమును పొంగించి తేనెకలిపి త్రాగిన కఫ్ఫ దగ్గు హరించును. అల్లమును సూదితో పొడిచి వుప్పునీటిలో వుడకబెట్టి పంచదారలోవేసి పాకముబట్టిన మురబ్బాఅగును. ఇదిసమస్త [illegible]

అల్లిచెట్టు:—యిది పొగడచెట్టువలె ఉండును. యిది సామాన్యజాతిచెట్టు. సువాసన నీలిరంగుగల జాజిపుష్పములవంటి పూవులపూచును. దీనిపండు తియ్యగా నల్లగాఉండును. పండు కుంకుడుగింజయొక్క ఆకృతిగలది. వర్షకాలమందిది పూచును. ఆకులు వేరు వగరుగ ఉండును, ఆకు వేరు యొక్కరసము లేక కషాయము నీళ్ళవిరేచనముల కట్టును. జలుబుచేయును. తెల్లకుసుమనుహరించును.

అవగూడచెట్టు:—దీనిని ఉరువుడుచెట్టు అనియు వాడుదురు. దీనిపండు యెఱ్ఱగా నిమ్మకాయవలెవుండును. కాయలోనిగుంజు పచ్చగను గింజలు నల్లగను గుంజు తియ్యగను ఉండును. దీని చక్క తొక్కి కట్టిన నాభియందలి వాతము హరించును. చక్క రసమును నశ్యముచేసిన పీనసరోగము హరించును. చక్కరసమున తాంబూలపుతమ్మ రసమును కలిపి చెవిలోపోసిన కురుపులుమానును.

అశోకము:—సం. అశోక, శోకనాశ, కర్ణపూరక, కంకేళి, పిండపుష్ప అనియు. హిం. అశోక్ అనియుపేరు. దీనిపట్ట వేరు చేదువగరు రుచులు శీతవీర్యము గురుగుణము కటువిపాకము కలది. దీనిరసము లేక కషాయము లేక చూర్ణము సేవించిన విరిగినయెముకలు అతికికొనును. శరీరకాంతిని మలబద్ధమును కలిగించును. పిత్తము దాహము గుల్మము శూల అజీర్ణ మున్నగురోగములను ఖండించును. ప్రదరరోగములందు ప్రధానముగపనిచేయును అశోకవృక్షము రెండువిధములు. ఒకటి సామాఫలపుచెట్టువలె ఉండును. పూవులు నారింజపండు రంగుగ మాఘ ఫాల్గుణమాసములలో పూచును, రెండవది మామిడిఆకువంటి యాకులుకలది. కొంచెముపసుపు వర్ణముగల తెల్లనిపూవులుపూచును ఊతకాయలవంటి దీనికాయలు పచ్చిగనున్నపుడు యెఱ్ఱగను పండినపుడు

వాతె నలుపుగను ఉండును ఇవి తినుటకర్హముకావు. దీనిని నరమామిడిచెట్టు అని ఊహించదగియున్నది. నరమామిడిచెట్టు కూడ ప్రదర వ్యాధులయందుత్తమముగపనిచేయును. దీనిరసము ప్రత్యేకముగ నిచ్చిన వాంతిజేయును గనుక యోగములలోఁజేర్చి వాడదగును.

అశ్వమూత్రము:—అనగా ఆడు గుర్రపు మూత్రము. కారము తీక్ష్ణగుణము ఉష్ణవీర్యము కటువిపాకముకలది. ఛర్ది, కాస, కఫము, క్రిమి, కుష్ఠము, వాతము హరించును. జఠరదీప్తినిచ్చును.

అష్టకవర్గు:—ఋద్ధి, వృద్ధి, కాకోళి, క్షీరకాకోళి, మేద మహామేద, జీవకము, ఋషభకము, ఈయెనిమిదింటియొక్క కూటమికి అష్టకవర్గమని పేరు. ఇవియన్నియు ప్రస్తుతము దొరకవు మేద మహామేదల స్థానమున పిల్లిపీచర జీవక ఋషభకముల స్థానమున నేలగుమ్ముడు కాకోళి క్షీరకాకోళుల స్థానమున పెన్నేరు ఋద్ధి వృద్ధుల స్థానమున నేలతాడి అను వస్తువులను ప్రతినిధిగ వాడవచ్చును మొత్తముమీద ప్రతినిధివస్తువులుగాని యష్టకవర్గముగాని వీర్యము కాంతి బలము కలిగించునవై యున్నవి.

ఆకాశగరుడి:—దీనిని మురుదొండ అందురు. ఇది తీగ దీని ఆకు మందముగను గబ్బువాసనగను ముడిచికొనిఉండును పసుపుచాయగల పూవును యెఱ్ఱని జంటపండ్లను ఉండును. పాలుయివ్వనిపశువు [illegible] రుగాచినయెడల దూడనుమరుగును పాలిచ్చును. దీనిపసరు కరిగిన తగరములోవేసిన తగరము భస్మమగును. దీనిదుంపను నూరి కట్టిన గడ్డలు పగులును.

ఆకాశవల్లి:—చూ. పాచితీగ.

ఆకాశమాంసి:—ఇది జటామాంసిలో భేదము. చలవచేయును. శోఫవ్రణములు నరములయందలి బలహీనము సొలెపురుగు మొదలగు వాని విషము వీనినిహరించును.

ఆకుజెముడుచెట్టు:—చూ. జెముడుచెట్టు



ఆకుపత్రి:— సం. తేజపత్రము, గంధజాత, పత్రక, పాకరంజన అనియు హిం. తేజపాత్ అనియు పేరు. రావిఆకులంత వెడల్పు గలిగి కొంచెము కోలగనుండును. ఇది లవంగపుతీగ యొక్క ఆకు. మంచిసువాసనగలది. కొంచెము చేదు తీపి రుచులును ఉష్ణవీర్యమును లఘుగుణమును కటువిపాకమును కలది. కఫవాతములు విషము వస్తిదోషము దురద అర్శస్సు ఓకిరింత అరుచి పీనస వీనిని హరించును. దీనికషాయమును పంచదారకలిపి యిచ్చిన యెక్కిళ్ళు కట్టును. శొంఠిచూర్ణముచేర్చియిచ్చిన పొత్తికడుపులోని నొప్పి హరించును. వస, ఆకుపత్రి చూర్ణములను నస్యముచేసిన పార్శ్వశూలల నశించును. దీనితో సోపుకలిపి తినిన వీర్యపటుత్వముకలుగును.

ఆగాకర:—సం. మహాజాలి, విషఘ్ని, ఘోనఖి, కర్కోటకీయనియు, హిం. "తొరయీ" అనియుపేరు. ఇదితీగ, దీనికాయ నిమ్మకాయలంత పెద్దవి. పనసకాయమీది చర్మమువలె దీనిచర్మమునకు గరుసు ముండ్లుండును.

ఆగాకరకాయ వగరు తీపి రుచులు గురుగుణము, ఉష్ణవీర్యము, మధురవిపాకముగలది. ఈకాయకూర దీపన పాచనములు గల్గించును. వెండ్రుకలను బుద్ధిని వృద్ధిజేయును.

ఆగాకరాకుకూర కఫమును పిత్తమును హరించును. పుర్వుల కూర కిలాసకుష్ఠము అనుదాని పోగొట్టును.

ఆటగడధాన్యము:—ఈధాన్యము ఆరుమాసములకు పండునది యగుటచే శీఘ్రముగ జీర్ణముగాదు వేడిచేయును.

ఆడాలు:—సం. చంద్రశూర, చర్మహంత్రి, వాసుపుష్ప అనియు హిం. "హాలోహాలిమ్" అనియు పేరు. ఈగింజలు యెఱ్ఱగ గుండ్రముగనుండును.

ఇవిచేదు ఉష్ణగుణము కటువిపాకము ఉష్ణవీర్యముగలవి. ఎక్కిళ్ళు వాతశ్లేష్మాతిసార రోగములు వాతరక్తము శూల గుల్మము చర్మరోగములు నేత్రరోగములు వీనిని హరింపజేయును.

పాలతోనూరి కవ్వకు దెబ్బలు తగిలినచోట పట్టువేసిన నొప్పి హరించును. గడ్డకట్టిన రక్తమును కరిగించును గుల్మమును హరించు స్వభావము కలదియగుటచే గర్భవతులకు యిచ్చిన గర్భము హానిచేయును. నీళ్ళతో గాని నిమ్మపండ్లరసముతో గాని నూరి శరీరమునకు నలుగు పెట్టిన చర్మరోగములు నశించి శరీరకాంతి కలుగును గాయము తగిలిన వారికి వీనిచూర్ణము పాలలో కలిపి యిచ్చిన మేలు కలుగును. బలము పుష్టి యిచ్చును.

ఆదిత్యభక్తి:—సం. ఆదిత్యభక్త, సువర్చల, సురసంభవ అనియు, హిం. హూరహుజ్, సోచలీ అనియు పేరు.

ఇది రెండుగజముల యెత్తు పెరిగెడి చెట్టు. పసుపు తెలుపు వర్ణముగల పూవుల పూచును, కేసరములు యెరుపుగ నుండును. ఆకు గుండ్రగ కొనదేరి గరుసుగ ఆకుపచ్చగ యుండును. సూర్యకాంతచెట్టు అనియు దీనికి పేరు కలదు.

ఇది చేదు కారము ఉప్పదనము రుచులు శీతవీర్యము రూక్ష సర గురుగుణములు మధురవిపాకముగలది. ఆకురసమును శరీరమునకు పూసిన దురద చీడ కుష్ఠము మున్నగు చర్మరోగములు కుదురును. లోపలకు పుచ్చుకొనిన చలిజ్వరము తగ్గును. భూతబాధలు నశించును.

ఆదొండ:—చూ. ఆరదొండ.

ఆనబ:—సం. తుంబీ, అలాబు అనియు, హిం. తోంబీ లంబా గామతోరయీ అనియు పేరు. ఇది తీగగుమ్మడివలె పెద్దతీగ బారును. దీనిని సొరతీగ యనియు పిలుతురు, ఇది తియ్యసొర చేదుసొర యని రెండుజాతులు. తీయసొరలో కాయలు పొడుగు పొట్టి భేదముచే రెండువిధములు. రెంటికిని గుణములు సమానము, చేదుసొరకు తీగ గింజలు ప్రధానము మంచిసొరకు కాయప్రధానము. సొరకాయ తీపి గురుగుణము శీతవీర్యము మధురవిపాకము గలది. బలము, పుష్టి, రుచి మలబద్ధము, వాతము, కఫము, చేయును. పిత్తమును హరించును. దీనిగిం



జలలోని పప్పును నేతిలో వేయించి తినిన వీర్యవృద్ధి వీర్యస్తంభన కలుగును యూనానీసంప్రదాయమున వీర్యవృద్ధికర యోగములలో విశేషముగ వాడుక చేయుదురు. మంచి సొరగింజలకన్న చేదు సొరగింజలు బలమైనవి. చూ చేదుసొర.

ఆముదపుచెట్టు:—సం. ఏరండ, పంచాంగుళ, వ్యాఘ్రపుచ్ఛ, ఉరుబూక. త్రిపుటీఫల అనియు, హిం. అండీ, ఐరైండ అనియు పేరు. ఆముదపుచెట్టు ప్రసిద్ధము. ఇది చిట్టాముదము పెద్దాముదము అని రెండువిధములు. చిట్టాముదమునకు ఆకులు కాయలు చిన్నవి. పెద్దాముదమునకు పెద్దవి. గుణము సమానముకాని చిట్టాముదము మంచిది. వీట్లలో పూవుల యెరుపు తెలుపు భేదములును గలవు.

వగరు చేదు రుచులు గురుతీక్ష్ణ గుణములు. ఉష్ణవీర్యము, మధురవిపాకముగలది. ఆముదపుఆకులను శిరస్సునకు గట్టిన చమటపట్టి మేహావాతమువలన గలిగిన తలపోటు నొప్పి తగ్గును. ఆకురసము త్రాగిన మూత్రకృచ్ఛ్ర, వాతము, కఫము, వస్తి, శూల హరించును. పిత్తరోగములను వృద్ధిచేయును.

ఆముదపువేరు రసము చూర్ణము లేక కషాయము శూలను వాతకఫములను సంహరించును.

ఆముదపులేతకాయలు కూరవండుకొని తినిన రక్తగ్రహణి జిగటవిరేచనములు కట్టును.

ఆముదపు పూవు వాతకఫములను గుల్మ, శూల, గుదరోగములను హరించును.

ఆముదపుపండు గుజ్జు మిక్కిలి వేడిచేయును. అగ్నిదీప్తిని, గుల్మ శూల వాత యకృత్ ప్లీహా ఉదర మూలరోగములను ఖండించును

ఆముదపు తైలము అనగా ఆముదము గాఢవిరేచనము చేయును. లోపల నరములను మెత్తపరచును రక్తగ్రహణి జిగట విరోచనములను తగ్గించును, కడుపులోని వాతమును నులిపురుగులను హరించు

ను· చట్టలు నడుము శిరస్సు మొదలగుచోట్ల మర్దనచేసిన [illegible] ఊపిరిగొట్టునొప్పి మున్నగు నొప్పులు హరించును. జ్వరము మూర్ఛ మున్నగురోగులకు ఆముదమునీయరాదు. మశూచికపు జ్వరము రావడముతోనే ఆముదమును త్రాగించి శరీరమంతట ఆముదమును పూసిన మశూచికము తేలిపోవును. మిక్కిలి హితముగనుండును.

ఆరదొండ:—సం. ఆర్జట, ఆర్తగళ. బహుకంటక, గ్రంథిపర్ణ అందురు. ఇది తీగ కాయ కోలగ పండినపుడు యెఱ్ఱగ నుండును. దీని కాయలు చేదుగనుండును. పచ్చికాయకూర వ్రణరోగులకు హితము. పిత్తము మలబద్ధముచేయును. వాతశ్లేష్మములను హరించును. ఆరదొండవేరు నలియగొట్టి కట్టినయెడల అడ్డగఱ్ఱలు బిళ్లలు హరించును. చాలసేపుంచినయెడల పొక్కును గనుక సహించగలిగినంత సేపుంచి వెంటనే తీసివేసి కొబ్బరినూనెచమరవలెను. గుల్మములకు పగిలిన దుష్టవ్రణములకుగూడ కట్టవచ్చును. ఆరదొండచిగురు మిర్యాలు సమముగ కలిపి నూరి కుంకుడుకాయంతమాత్రచొ॥ ఉదయ సాయంత్రములందు సేవించిన అశ్మిమూత్రముతగ్గును.

ఆరికలు:—సం. కోద్రవ, కోరదూష, మదనాగ్రక అనియు హిం. "కోదో" అనియు పేరు. తృణధాన్యవిశేషము. ఇవి తీపి చేదు రుచి శీతవీర్యము ఉష్ణగుణము మధురవిపాకము కలది. పిత్తకఫములను హరించి వాతమును మలబద్ధమును చేయును. వీటికి ఆర్భ్యలని పేరు.

ఆరుద్రపురుగులు:—ఇవి ఆరుద్రకార్తిలో పుట్టును. ఎఱ్ఱని మొకమల్‌బట్టవంటి మృదువైన రంగుగలిగియుండును. వీటికే ఇంద్రగోపపురుగులని పేరు వీనిని దినమునకు ఒకటిచొప్పున హెచ్చించుచు పదిరల ఒక్కొక్కటి తగ్గించుచు తినినయెడల వీర్యపుష్టి వీర్యస్తంభన చేయును. ఆరుద్రపురుగులు గోరోజనము సాంబ్రాణి కలిపి నూరి పెసరగింజలవలె మాత్రలుచేసి చంటిబిడ్డలకు వాడినయెడల క్రిమి దగ్గుపడిసెము ఉదర పొట్ట నశించును. దీనిని స్వర్ణాకర్షణ విద్యయందు రసరంజనమున కుపయోగింతురు.



ఆరెచెట్టు:—సం. ధాతకీ, అగ్నిజ్వాలా, అశ్మంతక, వాలుకాపర్ణ, తామ్రపుష్పి అనియు, హిం. ధాయ్ అనియు అందురు. ఇది అరణ్యములలో పెరుగు పెద్దచెట్టు. నేలతంగేడు ఆకువంటి చిన్నఆకుగలది, కాని దీనియాకులు రెండాకులు జంటగా గుండ్రముగా అంటుకొని యుండును. దీనికాయలు పీకాయలవలె నుండును. దీనిపూవు ముఖ్యకముగా ఔషధములలో నుపయోగింతురు.

ఇది చేదు వగరు రుచి శీతవీర్యము లఘుగుణము కటువిపాకముగలది. దీనిచక్కరసము రక్తపిత్తము క్రిమి విషము విసర్పి అతిసారము దప్పి నశింపచేయును మదమును పుట్టించును. గర్భవతులకు ఆరోగ్యకరము. ఆరెపూవుల చూర్ణమును మంచితీర్థముతో నిచ్చిన రక్తగ్రహ కట్టును. దీనిపూవులను ఆసవారిష్టములందు చేర్చిన యడల ఆకషాయములు చెడిపోక నిలువయుండి వీర్యవత్తరములగును. పూవుల రసము కఫము పిత్తము విసర్పి ఉబ్బులు పాండువులను హరించును.

ఆలుబకరా:—సం ఆరుకా, వీరసేన, భల్లూక అనియు, హిం. ఆలుబఖారా అనియు పేరు: ఇది వేపఈనెలలో ఒకఆకుయొక్క ఆకృతిగలయాకు అయిదురేకలుగల చిన్నపూవు గుండ్రనిపండు కలిగియుండును.

ఇది వగరు పులుపు రుచులు ఉష్ణవీర్యము గురుగుణము ఆమ్లవిపాకముకలది. కఫమును పిత్తమును హరించును. మలబద్ధమును అగ్నిదీప్తిని కలిగించును. నోటియందు రుచిబుట్టించును. మేహము, గుల్మము, అర్శస్సు, ఈరోగులకు హితము. జ్వరము పడిలేచినవారికి నోటియందు అరుచి పోవుటకు దీనినుపయోగించవచ్చును.

ఆవచెట్టు:—సం. సర్షప, కటుస్నేహ, భూతిఘ్న అనియు, హిం. సరసోఅనియు పేరు. ఇది కారము చేదు రుచులు తీక్ష్ణ ఉష్ణగుణములు ఉష్ణవీర్యము కటువిపాకము కలది అగ్నిదీప్తి వాతకఫములు, దురద కుష్ఠము శూల క్రిమి గ్రహపీడ వీటిని హరించి పిత్తమును రక్తపిత్తమును కలిగించును. ఆవాలునూరి రాచిన యడల కరపాద శీతల

మునశించును. ఉడికించి గుండెలకు పట్టువేసినయెడల శ్లేష్మము కరుగు ను. వెన్నుకుపట్టువేసినయెడల చలిజ్వరము తగ్గును. విశేషముగ శరీ రమునందుంచినయెడల పొత్తికూను ఆవఆకుకూర తేలికగ జీర్ణమగును. త్రిదోషహరము. గ్రహణిని మూలవ్యాధిని హరించును. మలమూ త్రములను బంధించును. ఆగింజలనుండి తీసిన తైలమును కుష్ఠవ్రణము లకురాచి బావంచాల చూర్ణమును చల్లినయెడల అవి మానును. శరీరమునకుపూసిన అన్నివిధములగు చర్మరోగములు హరించును. చె విలోవేసిన పోటుహరించును మర్దనచేయుటచే నరములలోని వాతపు నొప్పులు హరించి సత్తువకలిగించును. మిక్కిలిగ శైత్యము చేయును. గింజలను పొగవేసిన భూతబాధ నివర్తియగును.

ఆవాలలో మెరుపు నలుపు తెలుపు రంగులుగలమూడుభేదము లుండును. ఇంచుమించుగమూడునుసమానగుణములుగలవిగానెయున్నవి.

ఆవు:—ఉదయమున గోవును సందర్శించినయెడల అలక్ష్మిపా పము తొలగును. ఆవుపాలు మధురము, శీతవీర్యము, గురుగుణము, మ ధురవిపాకము కలవి. భ్రమ శ్రమ విషము కఫము వీనిని హరించి, శు క్రము బలము కాంతి కలుగజేయును సగమునీళ్ళుపోసి నీరు ఇగురు వరకు కాచిన పాలు సులభముగ జీర్ణించుటంజేసి చంటిబిడ్డలకు వా డదగియుండును.

ఆవుపెరుగు పవిత్రమైనది. శీతలముగ స్నిగ్ధముగ మధురముగ బలకరముగనుండును. అరుచిని వాతమును హరించును. మలబద్ధము చేయును.

ఆవుచల్ల త్రిదోషహరము. అగ్నిదీప్తిని రుచిని అర్శస్సును ఉ దరరోగములను హరించును.

ఆవువెన్న వీర్యము కాంతి బలము జఠరదీప్తి వీనిని కలిగించును. వాతపిత్తములను రక్తదోషమును క్షయ అర్శోరోగములను నశింప జే యును. బాలురకు వృద్ధులకు మిక్కిలి హితకరమైనది విశేషముగబా లురకమృతసమానమునది.



ఆవునెయ్యి బుద్ధి కాంతి జ్ఞాపకశక్తి బలము పుష్టి కలిగించును. వాతశ్లేష్మములు శ్రమ పిత్తము వీనిని హరించును. మధుర విపాకము కలది. దేహస్థైర్యము మొదలగు ననేక సుగుణములను కలిగించునదై యున్నది.

గోమూత్రము ఉప్పు వగరు గుణములు ఉష్ణవీర్యము తీక్ష్ణగుణము కటువిపాకము కలది. లోపలకుతాగిన దారుణ విరేచనము చేయును. వాతము క్రిమి గుల్మము అనాహము ఉన్మాదము దురద శూలము ఖ నేత్రరోగములు ఆమవాతము వాతము మూత్రకృచ్ఛ శ్వాసకాసలు హరించును. శరీరమును శుష్కింపజేయును.

ఆవురుగడి:—చూ. వట్టివేళ్ళు.

ఇంగిలీకము:—సం హంసపాద, హింగుళ, రక్తపారద, దరద అనియు, హిం సింగరఫ్ అనియు పేరు. ఇది శుకతుండము, హంసపాక ము అని రెండువిధములు. తెల్లనిరేఖలు చిగురుటాకు రంగుకలిగినది హంసపాకము. ఇంగిలీకము సర్వదోషములనుహరించును.

సాంబ్రాణి చూర్ణములో ఇంగిలీకపు ముక్కను పెట్టి హారతిక ర్పూరములో తగులపెట్టి తీసి దానిని నిమ్మపండులోపెట్టి పుటపాకము చేయవలెను. దానినిచూర్ణించి అడ్డిగెత్తుమొదలు చిన్నమువరకు తేనె వెన్న అనుపానముతోనిచ్చిన పిత్తజ్వరము ఉమ్మకు కామిలపాండువుహ రించును. రక్తవృద్ధి వీర్యవృద్ధి కలుగును ఇంగిలీకమును బొమ్మజెము డుపండులోపెట్టి పుటపాకముచేసి తీసి దానిని తమలపాకురసముతో అ రగదీసి యిచ్చిన కఫముతగ్గును. మూడుతులములయెత్తు ఇంగిలీకమును శ్వేతాభ్రకపురేకులోచుట్టి ఒకకుండలో పెట్టి ముప్పదితులములముల మునగపాలరసము ముప్పదితులముల కామంచిఆకు రసమును చురకా యిచ్చిన యింగిలీకముకట్టును. దానిని అనుపానవిశేషములతో సన్నిపా తము శ్వాసకాసలు చలి జ్వరము మొదలగువానియందు వాడినఅమో ఘఫలప్రదము.

ఇంగువ: సం, హింగు రామఠ, బాహ్లీక, జంతుఘ్న, సూప ధూపన అనియు హిం. హింగ్ అనియు పేరు. ఇదియొక చెట్టు జిగురు ఇంగువ కారము లఘు సర తీక్ష్ణగుణములు ఉష్ణవీర్యము కటువిపాకము కలది. దీపనపాచనములను కలిగించును. కఫవాతములు శూల గుల్మము అజీర్ణము మలబద్ధము వీనిని తొలగించును. ఇంగువను పుప్పిపంటిలో పెట్టిన బాధతగ్గును. సూతికావాతమును హరించును. రాకుండ చేయును. ప్రసవించిన స్త్రీలకు దుష్టరక్తమును వెడలింపజేయును స్త్రీల గర్భకోశమున కెంతయు హితమైనది. ఇంగువ వేపవిత్తులు సమముగ నూరి కందిగింజంతమాత్రను తినిన శూల అజీర్ణ విరేచనములు తగ్గును. అయిదుభాగములు పొంగించిన యింగువ ఒకభాగము నల్లమందు కలిపి నూరి కందిగింజంతమాత్రలుచేసి గంటకొక్క మాత్రచొప్పున దాల్చిన చెక్కకషాయముతో నిచ్చిన రక్తగ్రహణి జిగటవిరేచనములు కట్టును. ఇంగువ మునాగ్రబము నూరి కుంకుమగింజంతమాత్ర యిచ్చిన కడుపులోని ఎలికపాములు చచ్చును. ఇంగువను సీతాఫలపు ఆకురసముతో అరుగ దీసి పుండుపై వేసిన నారి కురుపులోని పురుగుచచ్చును. ఇంగువ హారతికర్పూరము రసకర్పూరము మిరపగింజలు [illegible] కందిగింజంతమాత్రలుచేసి యిచ్చిన కలరా కుదురును. గర్భిణీ స్త్రీలు దీనిని తినకూడదు.

ఇంగువపత్రి: —సం. హింగుపత్రి, త్వక్పత్రి, బాష్పికా అనియు హిం. కరబనీ అనియుపేరు. ఇది కారము ఉష్ణవీర్యము తీక్ష్ణ గుణము కటువిపాకము కలది.

రుచిని పుట్టించును. పాచన దీపనములచేయును. హృదయమును వస్తిని శుభ్రపరచును. కఫము గుల్మము వాతము అర్శస్సు వీనిని జయించును.

ఇండుపగింజలు: —సం. కతక, ఛేదనీయ, తోయప్రసాదక, చక్షుష్య అనియు, హిం. పానీపసారీ అనియు పేరు. దీనిగంధము చేదు లఘుగుణము శీతవీర్యము కటువిపాకముకలది.



మేహశాంతి వీర్యవృద్ధి పిత్తము చేయును దీనిగంధము కండ్లలో వేసిన కళ్ళమెరుపు కామిలతగ్గును. దీనిచూర్ణము శర్కరతో చేర్చి ఉదయమున ఆవుపాలతో త్రాగిన శుక్లనష్టముకట్టును. దీనిగంధము బుర్దనీళ్ళలో వేసిన బుర్దవిరుగును.

ఇత్తడి: —సం. పిత్తళ ఆరకూట, కపిలోహ రీతి అనియు హి. పీతల్ అనియు పేరు. ఇది మిశ్రలోహము. ఇది రీతి, కాకతుండియని రెండువిధములు. కాల్చి కాంజికములో ముంచిన యెర్రగనుండునదిరీతి. నల్లబడునది కాకతుండియని తెలియవలెను.

రీతి తిక్తలవణరసములు రూక్షగుణము శీతవీర్యము కటువిపాకముగలది. జంతువాతము రక్తపిత్తము కుష్ఠము హరించును. దీని రీతగౌషధములలో జేర్చిన ఉష్ణవీర్యముగలది యగును. ఇత్తడిని యెర్రగ కాల్చి పసుపుకలిపిన వావిలిరసమునందు 5 సారులుముంచిన శుద్ధమగును. అశుద్ధమగు యిత్తడిని సేవించిన అనేకరోగములను కలిగించును. మరియు వారితరమగునటుల భస్మముచేయక యుపయోగింపరాదు. పరిశుద్ధమైన యిత్తడి భస్మము శ్వాసకాసలు కుష్ఠము క్రిమి [illegible] వ్యాధులందు ఉత్తమముగ పనిచేయును. మణిశిలను నిమ్మపండ్ల రసముతో నూరి ఇత్తడి రేకులకుపట్టించి పుటవేయవలెను యిట్లు 8 పుటములువేసిన చక్కనిభస్మమగును.

ఇత్తడిభస్మము కాంతభస్మము, అభ్రకభస్మము ఇవి సమభాగములుగను మూడింటికిసమంమిర్యాలు వాయువిడంగములు అనువాని చూర్ణమునుచేర్చిన నిది పిత్తలరసాయనమనబడును. దీనిని నిమ్మప్రమాణము మోదుగమాడలు అజామోదము చిత్రమూలము నల్లజీడిగింజలు పువ్వులు [illegible] పానముతో సేవించిన జంతువాతము కుష్ఠము నశించును. విశేషముగ శ్వేతకుష్ఠము (బొల్లి) నందు పనిచేయును దీపనపాచనములు గల్గించును.

[illegible] —[illegible] ముద్దడ, కృష్ణలోహ అందురు. ఇది మృదు కుంఠ కడార అని మూడువిధములు. ఇది చేదు గుణి రూక్షగుణము

ఉష్ణవీర్యము కటువిపాకము గలది. శోధనమారణములు చేసిన ఇనుపభస్మము లేక సిందూరము కఫవాతములు శూల మూలరోగము మేహము కామిల పాండువు గుల్మము ఆమవాతము జఠరదోషము శోఫ సినిని హరింప జేయును. శుద్ధరక్తమును పుట్టించును. కోష్ఠమును శోధించును.

అపరిశుద్ధమైన యినుపభస్మమును సేవించిన ఆయువు బలము కాంతి హరించును. హృదయపీడ నిస్సత్త్వము యేర్పడును.

కుందేటిరక్తమును ఇనుపరేకులకు రాచుచు మూడుసార్లు కాల్చిన శుద్ధమగును. యిట్టి యినుమునుయొక్క రాపాడితో అన్నమును కలిపి త్రిఫలకషాయముతో నూరి బిళ్ళచేసి పుటమువేయవలెను. యిట్లు ఐదుపుటములువేసిన మంచిభస్మమగును.

ఇప్పచెట్టు:—సం. మధూక, మధుపుష్ప, మధుష్ఠీల అనియు, హిం. మహుఆ అనియుపేరు. ఇది పెద్దవృక్షము. దీనిఆకులు లోలుగాకులవలెనుండును. దీనిపూవులు పొగడపూవుల పోలికగను తెలుగ వర్ణముగను తీపిగ నుండును ఇది చేదు వగరు రుచులు మధురవిపాకము శీతవీర్యము గురుగుణము గలది దీనిచక్కరసము కఫవాతము ను పిత్తము దాహము వ్రణము వీనిని పోగొట్టును వీర్యవృద్ధిని బలమును యిచ్చును.

దీనిపూవులు తీపి గురుగుణము శీతవీర్యము మధురవిపాకము గలవి. వీర్యవృద్ధినిచ్చును. పైత్యము జేయును. శ్వాసకాసలను క్షయను హరించును.

ఇప్పకాయ మధురము శీతవీర్యము గురుగుణము మధురవిపాకముగలది. వాతపైత్యములు దప్పి శ్వాసకాసలు క్షతక్షయ వీనిని పోగొట్టును. వీర్యవృద్ధిచేయును. చక్కగపక్వమైన పండు బలమునిచ్చును. పిత్తమును వాతమును హరించును.

ఇరుగుపచెట్టు:—సం. శింశుప, కృష్ణసార. యుగపత్రిక అనియు హిం. సీసమ్ అనియుపేరు. ఇదిపెద్దవృక్షము. ఒకతొడిమకు మూడు



ఆకులు విడిగనుండును. ఆకులు యించుమించుగ కానుగు ఆకులను పోలియుండును. తెలుపు నలుపు పూవులభేదము చేనిది రెండువిధములు.

యిది కటుతిక్తకషాయరసములు ఉష్ణవీర్యము రూక్షగుణము కటువిపాకముకలది. దీనిమాను చెక్కరసము లేక కషాయము శోఫ కుష్ఠము, శ్విత్రము జీర్ణజ్వరము ఛర్ది క్రిమి వ్రణము మేదోరోగము వస్తిశూల వ్రణములు వీనిని హరించును గర్భపాతముచేయును. నల్లయిరుగుడుచెట్టు శీతవీర్యముకలది వాతపిత్తజ్వరములు ఛర్ది హిక్క వీనిని జయించును. దీనికి యిగురుపచెట్టనియు పేరు.

ఇఱ్ఱిమాంసము:— నల్లని ఇఱ్ఱిమాంసము, క్షయ, మూలవ్యాధి పాండు అరోచకము శ్వాసకాసలు కలవారలకు మిక్కిలి పథ్యము. సులభముగా జీర్ణమగును. త్రిదోషహరమైనది. ఎఱ్ఱని యిఱ్ఱిమాంసము బలమును మలబద్ధమును కలుగజేయును. జ్వరితులు అగ్నిమాంద్యము కలవారు తినినయెడల అతిసారమును కలిగించును.

ఇలివిందచెట్టు:—యిది పెద్దవృక్షము. యిలివిందపండు తీపి రుచి గలది, వేడిచేయును. శ్లేష్మమును వాతములను హరించును. మలమూత్రముల బంధించును. విశేషముగతినిన కడుపులో నులిపురుగుల పుట్టించును.

ఇసుక: సం. వాలుకా, సికతా యందురు వేసవికాలములందు రాత్రి ఇసుకతిన్నెలపై బరుండిన తాపమును హరించి సౌఖ్యమునిచ్చును. ఇసుకను వేయించి గుడ్డలోపోసి కాపడముపెట్టిన వాతపునొప్పులు వ్రణాపుగడ్డలు తగ్గిపోవును.

ఇసుపగోలుగింజలు: సం. ఈషద్గోల, స్నిగ్ధబీజ స్నిగ్ధజీరక యనియు, హిం. ఈసబోలుఅనియు పేరు. ఈగింజలు వగరు తీపి రుచులు పిచ్ఛిలగుణము శీతవీర్యము మధురవిపాకముగలది యిది చిన్నమొక్క ఇది పూర్వపుగ్రంథములయందు కానబడక మోరేశ్వరకృతవైద్యామృతమునందు గనబడుచున్నది. యిది యూనానీ సంప్రదాయము నుండి తీసుకొనబడిన ద్రవ్యము రక్తాతిసారమును రక్తపిత్తమును కఫ

పిత్తములను హరించును. వాతమును వీర్యవృద్ధిని జేయును. దీని శీతక షాయమునందు తాటికలకండచేర్చి త్రాగిన శెగరోగము కాక దగ్గు తగ్గును. మూత్రమును జారీచేయును. దీనిచూర్ణమున తాటిబెల్లం చేర్చి త్రొక్కి తినిన నీళ్ళవిరేచనములు (గహణి పేగులలోని పుండ్లు మానును. ఈగింజలచూర్ణమును నల్లపుమ్మెత్త రసముపోసి నూరిమి చి గళిగారుచు శెలలువేయు వ్రణములకుకట్టిన మానుపట్టును.

ఇక్షుదర్భ:—సం. సుదర్భ పత్రాలు తృణపత్రిక అందురు. యిది కొంచెము వగరు తీపి రసములు స్నిగ్ధగుణము శీతవీర్యము మధు రవిపాకము గలది. (దీనివేరుకషాయము) కఫపిత్తములను హరించును మి చిని తృప్తి యిచ్చును.

ఈడెపండు:—సం. క్షైనతిక, పాగేవతి, శ్వేతపుష్ప త్రిందుక అం దురు. ఇది కమలాఫలపుచెట్టులో భేదము. కాయచిన్నది చెట్టంతయు కమలాఫలమును పోలియుండును. కొంచెము పులుపు తీపి రసములు, శీతవీర్యము ఉష్ణ గురుగుణములు మధురవిపాకముగలది. వాతపిత్తము ను దప్పిని అణచును. బలమును కలిగించును. రుచిని వీర్యవృద్ధి కూ డ కలిగించును. శ్లేష్మమును పెంచును.

ఈతచెట్టు:—సం. పరూషక గిరిపీలు, రోషణ అనియు హిం. ఖర్జూరమనియు పిలుతురు. ఇది పెద్దఈత చిట్టీత అని రెండువిధములు.

చిట్టీతకాయ పులుపు వగరు లఘుగుణము మధురవిపాకము క లది. ఆమమును పిత్తమును కలిగించును. చక్కగా పక్వమైనపండు తి య్యగానుండును. బలమును మలబద్ధమును సంతోషమును కలిగించును పిత్తము దాహము జ్వరము క్షయ వీటినిహరించును.

పెద్ద ఈతకల్లు:—మధురరసము శీతవీర్యము స్నిగ్ధగుణము ఆమ్ల విపాకముకలది. తెల్లవారకమునుపు 5, 10 తు॥ కు మించకుండ త్రాగిన కాక దగ్గులు శెగరోగములు వ్రణములు తగ్గును. కాంతి బలము కలు గును. ఎక్కువత్రాగిన మిగుల చెరుపుచేయును. గీతప్రారంభమున తీసిన కల్లు ఆమవికారముజేయును.



ఈతబుర్రగుంజు అనగా మొవ్వలోని లేతదైనగుంజు తెల్లగా తీ పిగా వగరుగానుండును. వాతమునుజేయును కీళ్ళలోని నొప్పి విడగొ ట్టును. కొందరికి మోపులు పుట్టును. దీనిని నలియగొట్టి వరిబీజము నకు కట్టిన తగ్గిపోవును. నమిలి పుక్కిటబట్టిన నోరుపు మానును.

ఈతసారాయి కఫమును మేదోరోగమును పోగొట్టును. వాత పైత్యములజేయును.

ఈశ్వరి:—సం. నాగదమన విషాపహా నాగపుష్పి, నాగస్ త్రి, మహాయోగేశ్వరి అనియు, హిం. నాగదాన్ అనియు పేరు. తీగ జాతిలోని చిన్నచెట్టు యిది తెలుపు నలుపు పుష్ప భేదముచే రెండు రకములు. తెల్లది శ్రేష్టము. దీనివేరు తీగెకు కారము చేదు రుచు లు తీక్ష్ణగుణము ఉష్ణవీర్యము కటువిపాకము గలదు.

యిది తేలు పాము జెర్రి సాలిపురుగు మొదలగువాని విషములు మొల్లి విస్ఫోటము వ్రణము వీనినిహరించును. విరేచనము చేయును. విరేచనములు కట్టును. ఋతురక్తముజారీ చేయును గర్భిణీస్త్రీ కిచ్చిన గర్భము పడును. 3 ఈశ్వరి ఆకులు 3 దుష్టుపయిగుర్లు 5 మిరియ ములు నూరి పెరుగుతో యిచ్చిన 3 దినములకు చలి జ్వరమునుకట్టును.

ఉక్కు:— అనగా తీక్ష్ణలోహము. ఇది ఖరము సారము హృ న్నాళము తారావట్టము నాశిరము కాలలోహము అనిలోహము 6 వి ధములు. ఉక్కు చేదు వగరు తీపి రుచులు సర గురు రూక్ష గుణము లు శీత వీర్యము మధురవిపాకము గలది యౌవనమును నిలుపును. బల ము నేత్రప్రసాదమును కాంతిని కలిగించును. క్రొత్తరక్తమును పు ట్టించును. కఫము పిత్తము విషము శూల ఉబ్బు అర్శస్సు ప్లీహ పాం డువు మేదోరోగము మేహము క్రిమి కుష్ఠము అనురోగములను హరిం పజేయును. ఇనుమునువలె దీనినికూడ శుద్ధిచేసి చూర్ణించి రసగంధక ములుచేర్చి జిల్లేడుపాలతో 20 పుటములువేసిన లోహము చక్కగ సిం దూరించును. యిట్లు శోధనమారణములు చేయక లోహమును సేవిం చరాదు. సేవించిన దోషములనుపుట్టించును.

ఉచ్చింతచెట్టు:—సం. క్షుద్ర బృహతియందురు దీనిని ఉచ్చింతయనియు చెప్పుదురు. దీనివేరు ఆకు పూవు కాయ చేదు రుచి ఉష్ణవీర్యము రూక్షగుణము కటువిపాకము కలది. ఉస్తివేరును నేతిలోగాని ఆముదములోగాని వేసి కాచి చంటిబిడ్డలకు త్రాగించిన దగ్గు పడిసెం శ్లేష్మము తగ్గును. విరేచనము చేయును. ఉస్తిఆకును పప్పులోవేసిగాని ఊరకగాని కూరచేసి తినిన శ్వాసకాసలు అర్శస్సు క్రిములు వీనిని నశింపజేయును. ఉస్తికాయలు (పచ్చివి) కూరవండుకొని తిందురు. దీని గింజలను మాత్రము విడచి పైకాయనుమాత్రమే తినవలెను మిక్కిలి వేడిని వీర్యవృద్ధిని జఠరదీప్తిని యిచ్చును. విదాహమును కలిగించును. ఉస్తిపండులోని గింజలను చూర్ణించి సమముగా [illegible]చూర్ణము కలిపి తేనెతో నాకించిన చంటిపిల్లల దగ్గులు హరించును అట్లే ఉస్తిపూవులు మూడుమిరియములు కలిపి నూరి ఒకమాత్రచేసి తినిన శూల దగ్గు హరించును.

ఇదితీగ నేలముష్కజాతిలోనిది దీని ఆకులు పూవులు ఇంచుమించుగ నేలములగఆకును పూవును పోలియుండును. చెట్టుయును కాయయొక్క తొడిమెయును ముళ్ళుండును. నీలిరంగుపూవులుపూచును.

ఉత్తరేణి:—సం. అపామార్గ ధామార్గ ఖరమంజరి అనియు, హిం. చిర్చిర అనియుపేరు ఇది ప్రసిద్ధమైనచిన్నచెట్టు ఇది చేదు కారము రుచులు సరతీక్ష్ణగుణములు ఉష్ణవీర్యము కటువిపాకము కలది. క్షారమే ప్రధానముగాగలవస్తువు. పిత్తము కఫము ఉబ్బు ఉదరరోగము చర్మరోగము శూల పిటకపోగొట్టును. మూత్రమును గావించును. వీర్యవృద్ధిని దేహపుష్టిని చేయును ఉత్తరేణిని సమూలము కాల్చినబూడిద 1 భాగము, జీలకర్ర 2 భాగములు వీనిని కలిపి నిమ్మపండ్లరసములో భావనచేసి ఉదయ సాయంకాలములందు సేవించిన తేనుపు కడుపుబ్బరము అజీర్ణపు నొప్పి తగ్గును. ఉత్తరేణి ఆకురసమును జొన్నకలిలోపోసి త్రాగిన మూత్రబద్ధమును తీక్ష్ణము పోవును. ఉత్తరేణిక్షారమును ఆముదములోకలిపి వ్రణములపై పట్టిన పక్వమై పగులును ఇది పొక్కవస్తువ. ఉత్తరేణి క్షారముతో వంధారమును చేర్చి యిచ్చిన ఉబ్బురోగము హరించును మరియు తాటిబెల్లములో పొదిగి తినిన శూల నివర్తించును. ఉత్తరేణి విత్తులు బియ్యమును పాలతో ఉడికించి పంచదారకలిపి ప్రతిదినయమున పుచ్చుకొనిన యెడల అమితవీర్యవృద్ధి సంభోగశక్తి కలుగును. ఉత్తరేణివేరు రసములో నాల్గవవంతు నువ్వులనూనెచేర్చి కాచి వడియకట్టి చెవిలోపోసిన చెవిలోని కురుపులు చీముకారుట పురుగులుపడుట నివర్తించును. ఉత్తరేణిఆకులు అడ్డసరపుఆకులు నల్లఉమ్మెత్తఆకులను యెండబెట్టి చూర్ణించి నిప్పులపైవేసి దాని పొగపట్టినయెడల ఉబ్బసపుదగ్గు ఆయాసము తగ్గును. దీని ఆకురసముతో [illegible]ను ఉడికించి బోదకాలుకు పట్టువేసినయెడల వాపుతీయును. ఉత్తరేణి వేర్లను తేలుకుట్టినచోట పైవేసిన తేలు బాధహరించును అటులేక తొమ్మిది ఉత్తరేణి ఆకులను గరిటలో వేసి నువ్వులనూనెతో మగ్గించి నూరి ప్రాతఃకాలమున మ్రింగినయెడల మూడుదినములకు అతిమూత్రముతగ్గును. ఆవ్యాధిసంబంధమైన ఆకలి దప్పులుఅణగును. దీనిని కల్పోక్తప్రకారము సేవించిన కాయసిద్ధినిచ్చును. దీని క్షారమును కరిగించిన తగరములోవేసి మర్దించిన తగరము సత్తు భస్మమగును. ఈమూలికను వశ్యవిద్యయందును హేమవిద్యయందును యెక్కువగ ఉపయోగింతురు.



ఉదకము:— ఆకాశోదకము బడలికను పోగొట్టు హృదయమునకు బుద్ధికి వికాసము కలుగచేయును. షడ్రసములు శీతవీర్యము లఘుగుణము కలది.

వర్షము కురియునపుడు భూమిపై పడకముందు వస్త్రాదులచే గ్రహింపబడినది గాంగోదకమనంబడును. ఇయ్యది అశ్వయుజ మాసమునందుమాత్రమే పథ్యకారిగనుండును. సూర్య చంద్ర కిరణ వాయు సంబంధముగలయుదకము స్రవించిన పల్లమునందలి జలము గాత్రప్రదేశమందలి జలము నడియపోయుబడిన జలము త్రాగిన హృదయతృప్తి సప్తధాతుసంతర్పణము కలుగజేయును. వర్షఋతువునందు నిష్టతక్క—

సమ్ఋతువులయందు వర్షించిన దివ్యోదకమును పానముచేయకూడదు. హిమవత్పర్వతము మలయపర్వతము మొదలగువానియందుపుట్టి రాళ్లకు కొట్టబడి కలకబారి మరల తేరి వేగముగ ప్రవహించు నదీజలము మిక్కిలి పథ్యము.

నూతినీరు మధురముగ లఘువుగ త్రిదోషహరముగ నుండును. ఉప్పని నూతినీరు కఫవాతములను పోగొట్టును. దీపనముచేయును. పిత్తమును పోగొట్టును.

కొలనులలోని నీరు బలకరముగ కషాయ మధుర రసములుగ లఘువుగ నుండును. పెద్ద కోనేరులు నడబావులలోని నీరు మధురముగ పిత్తహారిగ దీపనకరముగ కొంచెము గురువుగ నుండును. ఉప్పగా క్షారముగనుండు దిగుడుబావినీరు త్రిదోషహరము

స్వల్పమైన జఠరాగ్ని గుల్మము పాండువు ఉదరరోగము అతిసారము అర్శస్సు గ్రహణి యీరోగములు కలవారును వమనవిరేచనములకు ఔషధము సేవించినవారును జలపానము చేయకూడదు

భోజనమధ్యమందు జలపానముచేసిన ధాతుసామ్యమును అంతమందుచేసిన స్థూలరోగమును మొదటనే చేసిన కృశత్వమును చేయును. ఆహారముయొక్క చివరను చేయబడిన జలపానము ఆమాశయమందు కఫమును వృద్ధిచేసి శరీరస్థౌల్యమును కలిగించును. ఆదియందు చేసిన జలపానము జఠరాగ్నిని చల్లార్చును.

చల్లనినీళ్లు మద్యపానమువలన కలిగినరోగము బడలిక మూర్ఛ వాంతి చెమట భ్రమ దప్పి ఉష్ణము తాపము పిత్తరక్తము విషము వీటిని పోగొట్టును. వాతాది దోషములును జఠరాగ్నియు నొకతీరుగనుండక మారుచుండువారికిని వ్యాధివలన క్షీణించినవారికి దుర్బలులకును శీతోదకము పథ్యము కానిది.

ఉష్ణోదకము దీపనపాచనములు గలిగించునది. కంఠమునకు హితకరము తేలికగనుండును. మూత్రశుద్ధిచేయును. హిధ్మ ఆధ్మానము వాతశ్లేష్మరోగములు నవజ్వరము శ్వాసకాసలు అజీర్ణము పార్శ్వశూలయీరోగములు కలిగియున్నపుడును వమన విరేచనములు శోధనము సేవించినపుడును ఉష్ణోదకపానము మిగుల పథ్యము. కాగి చల్లారిన ఉదకము శ్లేష్మమునుచేయక మిగుల లఘువుగ నుండును. వాతపిత్తము పిత్తశ్లేష్మము సన్నిపాతమునను నీరోగములలో దేనియందైనను పిత్తాధిక్యము కలిగియున్నపుడు కాగి చల్లార్చిన నీరు త్రాగవలెను. కాగి చల్లార్చిన పాచినీరు త్రిదోషములను వృద్ధిచేయును.



పానముచేయబడిన అన్యప్రదేశజలము జీర్ణము కాకుండినపుడు మరియొకచోటనుండు జలము త్రాగకూడదు.

మంచునీరు వాతరక్తమును అధికముచేయును: దురద దప్పి తాపము పిత్తరక్తము కుష్ఠు ప్రమేహము వీనిని హరించును. గ్రీష్మఋతువునందు మిగుల హితకరము.

చెట్లు మేఘములు మొదలగువాని ఆవరణములేకయుండు తటాకము మొదలగువానియందు పగలు సూర్యకిరణములచే కాగి రాత్రి చంద్రకిరణములచే చల్లబడి అగస్త్యోదయమైన తరువాత కలకబారక పరిశుద్ధమైయుండు ఆశ్వయుజ కార్తికమాసములయందలి జలము హంసోదకమనబడును. ఇది రసాది సేవనమునందు మిక్కిలిపథ్యము. త్రిదోషహరము రుచిని బలమును కాంతిని యిచ్చును. విషమును హరించును. అమృతసమానమైనది.

ఉద్భిల్లవణము: సం. "ఔద్భిద" అనియు, హిం. "రేహాగనా" అనియుపేరు. కటు తిక్త లవణరసములు తీక్ష్ణగుణము శీతవీర్యము కటువిపాకముకలది. ఔద్భిదము అనగా భూమిని బ్రద్దలుచేసికొని బైటకువచ్చిన చౌడు, ఇది లవణ సాధారణ ప్రభావము గలిగియున్నది, చూ. సైంధవలవణము.

ఉద్వర్తనము:—అనగా పెసరపిండి మొదలగువానితో శరీరమునకు నలుగుపెట్టుకొనుట. దీనివలన కఫమును మేదస్సును హరించును. అవయవపటుత్వమును చర్మమునందు కాంతి కలుగజేయును. రోమకూపములందు లణగి బైలువెడలని స్వేదమలమును పోగొట్టును.

ఉప్పిచెట్టు:—సం. లవణా గ్రీష్మజా అందురు. ఇది గజంయెత్తు పెరుగు ముండ్లపొద చెట్టంతయు అంగుళము అరంగుళము పొడవుగా వాడియైన ముండ్లను గంగరేగుఆకంత ఆకును గలిగియుండును ఇది తెల్లఉప్పి నల్లఉప్పి అని రెండువిధములు.

దీనివేరు ఆకు చేదు రుచి ఉష్ణవీర్యము రూక్షగుణము కటువిపాకముగలది. చిన్నంయెత్తువేరు చూర్ణమును తేనెతో యిచ్చిన వాంతి కాస ఉబ్బసము శమించును. ఆకురసమున యవక్షారముగాని త్రిఫల చూర్ణముగాని కలిపి యిచ్చిన వాతపునంజు హరించును. శరీరమును ఆర్చివేయును. 5 నల్లఉప్పియాకులు 5 మిర్యాలు కలిపి నూరి 5 మాత్రలుచేసి పూటకు ఒకటి యూరెకలకు యిచ్చిన మావి వెడలించును స్త్రీల రుతురక్తము జారీచేయును. నల్లఉప్పివేరుచెక్క 1 తు॥ తుంగముస్తలు 2 తు॥ యీ రెంటిని చూర్ణించి చూర్ణమంతయు తడియునంత చందినీఅత్తరుకలిపి ఒకరాత్రిపూట పైచూర్ణమంతయు తినిపించిన యెడల పచ్చసెగ తప్పక నివారించును. మందుపుచ్చుకొనిన రాత్రి భోజనము చేయరాదు. మరుచటియుదయమున ఉశిరిగపచ్చడి మజ్జిగఅన్నము మాత్రమే తినవలెను. మూడవదినమునుండి యిచ్ఛాపథ్యముగ 10 దినములు గమనించవలెను.

ఉప్పు:—చూడు సముద్రలవణము.

ఉమ్మెత్త:—సం. ఉన్మత్త, మదన, కనక, ధుస్తూర అనియు, హిం. ధత్తూర్ అనియు పేరు. తెలుపు పలుపు నలుపు పూవుల భేదముచే మూడువిధములు. పచ్చపూలది హేమవిద్యయందుపయోగించును, ఇది దొరకుటఅరుదు తక్కినవిదొరకును. యీ రెండును సమానప్రభావముకలవియేగాని నల్లఉమ్మెత్త శ్రేష్టము.

ఉమ్మెత్త కషాయ మధుర తిక్తరసములు ఉష్ణవీర్యము గురుగుణము, కటువిపాకముగలది మదము వర్ణము అగ్ని వాతము వీటిని గలుగజేయును. జ్వరము కుష్ఠము వ్రణములు కఫము దురద కృమి విషము వీనినిహరించును.



ఉమ్మెత్తాకురసమునందు సైంధవలవణము చేర్చి వంటికిపూసిన దురద తామర చీడ తగ్గును. ఆకును ఆముదముతో వెచ్చజేసి గడ్డలపై వేసికట్టిన నవిహరించును. బియ్యపుపిండిలో ఆకురసమును చేర్చి ఉడికించి గడ్డలకుకట్టిన నవిపగులును. దీని సమూల చూర్ణము యొక్క పొగపీల్చిన ఉబ్బసపుదగ్గు తగ్గును. మతిభ్రమమునుచేయును. దీనిపూవులు కంటికి తగిలిన కండ్లకలకవచ్చును. గింజలు చలిజ్వరమును ఆపును. క్రమముగ పుచ్చుకొనిన కుష్ఠమునుహరించును. ఉమ్మెత్తగింజలు గంజాయి జాజికాయ మూడును తేనెతోనూరి కుంకుడుగింజంత మాత్రను మ్రింగి పాలుద్రాగిన వీర్యస్తంభనముచేయును. మలబద్ధము పిత్తనుచేయును. హెచ్చుగానుపయోగించిన ఉన్మాదము చిత్తభ్రమ వాంతి మరణము వీనినిగల్గించును. ఉమ్మెత్త గలిజేరు వావిలి గుంటగలగర వీనియాకులను నేతితోవెచ్చజేసి బోదకాలునకు కట్టిన వాపుతగ్గును. ఉమ్మెత్త గింజలనుండి తీసిన తైలము మర్దనముచేసిన నరములకు పటుత్వమునిచ్చును, వాతపునొప్పులు తగ్గును. లింగమునకీతైలము మర్దించినయెడల దానికి స్తంభనమును బలమును కలుగును. దీనివేరు గంధమును తేలుకుట్టినచోట మందముగ పట్టించి గుడ్డపొగవేసిన బాధతగ్గును. ఆకురసమునందు రాసున్నమును కలిపి పచ్చిగవదబిళ్ళలకుపట్టువేసి దూదిఅంటించిన నవి హరించును.

ఉలవలు:—సం. తామ్రబీజ, కుళుత్థ, కాలవృంజ అనియు, హి. కులథీ అనియుపేరు. తెలుపు యెరుపు నలుపు రంగుల భేదముచే నివి మూడువిధములు. నల్లవిమంచివి. ఉలవలు వగరు రుచి ఉష్ణవీర్యము రూక్షగుణము కటువిపాకము గలది. వాతకఫములు అశ్మరి మేదోరోగము శ్వాసకాసలు ప్రమేహము వీనిని శమింపచేయును. మలబద్ధము పిత్తరక్తము విదాహము వీనినికల్గించును. శరీరమును ఆర్చును. నల్లఉలవలకషాయమును త్రాగించిన ప్రసవించిన స్త్రీల మైలరక్తమును వెడలించును. రుతురక్తమును మూత్రమును జారీచేయును.

ఉబ్బవకట్టు వాతమునకు అనులోమగతిని గలిగించును. గుల్మము శూల ప్రమేహాది అనురోగములను ఖండించును.

ఉలిమిడిచెట్టు: సం. వరుణ, బహుపుష్ప, తిక్తశాక, కుమారక అనియు, హిం. వరనావిలి అనియు పేరు. ఇది కషాయ మధుర తిక్తరసములు, ఉష్ణవీర్యము, లఘురూక్షగుణములు, కటువిపాకము గలది. ఇది పెద్దవృక్షము దీనిఆకులు కోలగ పెద్ద కంగోరాగలిగి యుండును. కాయలు నిమ్మకాయలంత పెద్దవిగ గుండ్రగ పక్వమైనపుడు యెఱ్ఱగనుండును. దీనిఆకు లేక చెక్కరసము లేక కషాయము మేహరోగమును శిరోదోషమును త్రిదోషములను హరించును. దీనిఆకురసమునందు సురాకారమునుకలిపి యిచ్చిన మూత్రము జారీఅగును సెగరోగముతగ్గును. రక్తదోషమును శీతవాతమును విద్రధిని వాతమును సహరించును. మానుచెక్కరసమునందు పల్లేరువేరుచూర్ణముకలిపి యిచ్చిన అశ్మరీరోగము హరించును. దీనిఆకులను ఆముదముతో వెచ్చచేసి కట్టిన వాతపు నొప్పులు హరించును. చాలసేపుంచిన పొక్కిపుండు అగును దీనిఆకు కూరవండి తినిన వాతము వలన కలిగిన కలకనొప్పులు తగ్గును మానుచెక్క రసముతో వెట్టదోళ్లపునూనె పట్టువేసిన మేహవాతపునొప్పులు శమించును.

ఉశిరిగచెట్టు:—సం. ఆమలకీ. ధాత్రి. అనియు. హిం. ఆమలా యనియు పేరు. మానుచెక్కరసము అతిసారమును సెగరోగమును కట్టును. వ్రణములను కడిగిన నవిమాను పట్టును. తులసిరసమునందు కవిరిచూర్ణమును చేర్చియిచ్చిన కుసుమరోగము రక్తప్రదరము శమించును.

ఉశిరిగపండ్లు పులుపు వగరు కొంచెముచేదు రుచులు. శీతవీర్యము లఘు గుణము మధురవిపాకము గలవి. చైత్రమాసమునందు కోయబడిన ఉశిరిగపండ్లు ప్రశస్తమైనవి. వీర్యవృద్ధిని రుచిని, కలిగించి జఠరవహ్ని ఘనమును రాకుండ జేయును. వెంట్రుకలకు నలుపెక్కించును. రక్తపిత్తము ప్రమేహము భగ్న ఆధ్మానము, వాతము, శోష క్షయ, హీని హ



చును. ఉశిరికపండు పుల్లనిదికనుక వాతమును శీతవీర్య మధురరసముకలదిగనుక పిత్తమును కషాయ రసము రూక్షగుణము గలదిగనుక శ్లేష్మమును హరించును.

ఉశిరిగపండ్ల రసములో యవక్షారము కలిపి ప్రాతస్సాయంకాలములందు యిచ్చిన మోహాసంబు తగ్గును. నేత్రములకు చలువచేయును ఉశిరిగసరుగున నానబెట్టి రుబ్బి ప్రతిదినము స్నానము చేయునపుడు రుద్దుకొనిన శిరస్సుపోటు తలనొప్పి తగ్గును. కండ్లకు ప్రసాదమును వెండ్రుకలకు వృద్ధిని కలిగించును. ఉశిరిగపప్పు తామరపూవులు చెంగల్వకోష్టు వరికెలాలు మర్రియూడల చిగురు వీనిని చూర్ణించి తేనెతోనూరి గుటికలుచేసి బుగ్గనుంచుకొనిన విశేషముగుదప్పి ముఖశోష నశించును.

ఊడుగుచెట్టు:—సం. అంకోల, దీర్ఘమూల నికోచక, పీతసార తామ్రఫల అనియు, హిం. ఢేరా, ఠేరా, యనియు పేరు

ఇది సాధారణమైనచెట్టు. దీనియాకులు సన్నముగా రెండుమూడుఅంగుళముల పొడవుగనుండును. తెల్లనిపూవులుపూచును. దీనిపచ్చికాయలు నల్లగను పండినపుడు యెఱ్ఱగను ఈతకాయంత ఆకారము గలవిగను ఉండును.

దీనివేరుచక్క వగరు చేదు రుచులు తీక్ష్ణ స్నిగ్ధ లఘుగుణములును ఉష్ణవీర్యమును కటువిపాకమును గలది. చక్కరసము విషదోషము, కఫము, వాతశూల, శోథ, క్రిమి, విసర్ప రోగములను హరించును. పిల్లి, యెలుక, తేలు, పాము మున్నగువాని విషములను తొలగించును. వ్యాధి బలాబలములనెరిగి చిన్నముమొనలు అరతులమునెత్తు వరకు దీనిచూర్ణము, జేడెత్తుమొనలు తులమువరకు రసమును వాడవచ్చును రసముగాని చక్కచూర్ణముగాని వాంతిని కలిగించును. వేరుచూర్ణముతో సమముగ మహిసాక్షినికలిపి కుంకుడుగింజలంత మాత్రలు చేసి సవాయిమచ్చలు పుండ్లు మొదలగు రోగములు కలవారల కియ్యవలెను. చక్కరసమున పంచదారచేర్చి యిచ్చిన శూల కడుపునొప్పి

తగ్గును. ముసుగు ఊడుగువేరులో రాగిరేకును చుట్టి చీరజేసి పుటము వేసిన తెల్లని రాగిభస్మమగును.

ఊడుగుపండ్లు తీపి రుచి గురుగుణము శీతవీర్యము మధురవిపాకి కలిగినవి. బలము వీర్యవృద్ధి కఫము వీనిని కలిగించును. విరేచనము చేయును. వాత పిత్త క్షయ దాహ రోగములను ఖండించును.

ఊడుగుగింజలనుండి తీయబడిన తైలము హేమవిద్యయందును జాలవిద్యయందును మిగుల నుపయోగకరము. ఊడుగు తైలములో పసుపు కలిపి శరీరమునకు పూసిన తామర చీడ మొదలగు చర్మరోగములు నశించును. ఊడుగునూనెలో మామిడి, తోట మున్నగు విత్తులను నానబెట్టి యెండించి వానిని భూమిలో పాతి నీళ్ళు చల్లిన తక్షణము మొక్కలు మొలచునట్లు చేయును.

ఊడుగువిత్తులనుండి తైలము తీయువిధము:— నెల్లి వేళ్ళను నలియగొట్టి కాంజికముతో ... చేసి అందు ఊడుగుగింజల చూర్ణము కూడి ... కొద్దిగా కాచినయెడల గింజలయందలి తైలము పైకి తేలును దానిని భద్రముగ స్వీకరించవలెను.

ఊరబిచ్చుక:— సం. కలవింక అందురు. ఇది మధురరసము స్నిగ్ధగుణము ఉష్ణవీర్యము మధురవిపాకము గలది. అమిత వీర్యవృద్ధిని సంభోగశక్తిని బలమును కలిగించును వాతరోగములను హరించి శ్లేష్మమును వృద్ధిని పొందించును.

మగ ఊరబిచ్చుకలు పది, ఆవునేతిలో వేయించి ... 5 తు॥ ... కాయ. జాపత్రి, నేలతాడిగడ్డ పచ్చకర్పూరము, గసగసాలు ... పూవు, నేలగుమ్మడి మర్రిపాల మొగ్గ అను వస్తువులు ప్రత్యేకము ఒక తులము ... గ్రుడ్లలోని సొన 3 తు॥ నేయి 20 తు॥ చక్కెర 30 తు॥ తేనె 15 తు॥ యీ వస్తువులన్నిటిచే లేహ్యము ... చేసి ... తులములు ... ఉదయ సాయంత్రములందు సేవించుచు ఆవుపాలు అనుపానముగా ...



చుండునెడల మూడుమాసములకు సపూనము కూడ ... వీర్యపటుత్వము వీర్యవృద్ధి సంభోగశక్తి కలుగును. వీర్యనష్టము, శీఘ్రస్ఖలనము, సంభోగసమయమున పురుషావయవము మెత్తబడుట నీరసము మున్నగు బాధలు తొలగును.

ఊరబిచ్చుక గ్రుడ్లు ... నీరు హరించును పక్షవాతము గలవారికి హితకరమైనది.

ఊషలవణము: సం. ఊషల, భూరిపత్ర. సుత్ణ అందురు. ఇది బలము చేయును రుచికరము పశువులకు సర్వదా హితమైనది.

ఋద్ధి:— చూ. అష్టవర్గ.

ఋషభకము:— చూ. అష్టవర్గ.

ఎండ్రకాయ: పీతయనియు దీనిని వాడుదురు. నీళ్ళలో కలుగులలోనుండు ఒకవిధమగు పురుగు. దీనిమాంసము స్వాదురసము ఉష్ణవీర్యము గురుగుణము మధురవిపాకము గలది. మిగుల వీర్యవృద్ధిని బలమును కఫమును కలిగించును. ఎక్కిళ్ళను ఆపును. వాతమును బోగొట్టును. ఎండ్రకాయయుండు కలుగులోని నీళ్ళు కూడ ఎక్కిళ్ళను ఆపును.

ఎద్దునాలుకచెట్టు:— సం. గోజిహ్వా, దర్వీక, గోభి, ఖరపత్ర అనియు, హిం. గోజియా యనియు పేరు ఇది చిన్నమొక్క. ఆకు ముమ్మారు అంగుళము వెడల్పు నాలుగు అంగుళముల పొడవుగ ... గరుకుగా నుండును. మొవ్వులోనుండి సన్నని కాడలు బైలువెడలి బాగా పుష్పములు గల గుత్తులు చిన్నపువ్వులు పూచును.

దీని ఆకు చూర్ణము లేక రసము వగరు చేదు రుచులు శీతవీర్యము లఘుగుణము కటువిపాకము గలది. వాతమును పెంచును. కఫ పిత్తములను ప్రమేహములు కాస వీనిని హరించును. వ్రణములను శోధించును మూత్రమును జారీచేయును.

ఎఱ్ఱ వావుధాన్యము:— యీధాన్యము నల్లగాను బియ్యము ఎఱ్ఱగాను ఉండును. ... ప్రమేహహరము. బలము వీర్యము మ

లమూత్రమాంద్యము గలిగించును. గురుత్వముగలది. ఎరడాపు గంజ వైద్యోపయోగమగు భస్మములు చేయుటయందును వాదవిద్యయందు ను గూడ ఉపయోగించును.

ఎర్రఆముదపుచెట్టు:—సం. రక్తఏరండ, రక్తోరువూక అందురు. ఇది వగరు చేదు రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగల ది. రక్తదోషము పాండు భ్రమ అరోచకము అసు రోగములందు పని చేయును. మరియు తెల్లాముదపుచెట్టుయొక్క గుణములన్నిటిని కలిగి యుండును. వాదవిద్యయందుమాత్రము దీనినే ఉపయోగింతురు. కీ... గురు గుల్మము వస్తిశూల కఫము క్రిమి మొదలగువాటిని హరించును. చిగుళ్ళను వెచ్చజేసి బుడ్డకుకట్టిన వాపు హరించును. పూవులను కూర వండుకొని తినిన వాతకఫములను మూత్రకృచ్ఛ్రను నశింపజేయును. దీని పండు రక్తపిత్తమును వృద్ధిచేయును. అగ్నిదీప్తినిచ్చును. మలమును వె డలించును. గుల్మప్లీహాదిరోగములను సంహరించును.

ఎఱ్ఱచిత్రమూలము:—మె చిత్రమూలము, నల్ల చిత్రమూల ము అను రెండును తెల్లచిత్రమూలముయొక్క అన్నిగుణములను కలి యున్నవి. గాని దానికన్న మిగుల శీఘ్రముగను చురుకుగను పనిచేయు ను. మెఱచిత్రమూలము దేహమును స్థూలముగజేయును. కుష్ఠమును హరించును. రసబాధమునకును రసరంజనమునకును పనికివచ్చును. లో హములందు వేధకు ఉపయోగించును. నల్లచిత్రమూలమును క్రమప్ర కారము సేవించిన వెండ్రుకలు నల్లబడును. ఆవులకున సనచూపినను పా లలోవేసినను పాలునల్లబడును. నలుపు మెఱుపు చిత్రమూలము వాద విద్యయందు విశేషముగ ఉపయుక్తములు. చూ. చిత్రమూలము.

ఎఱ్ఱకలువ:—సం. రక్తోత్పల, కోకనద, కల్హార అందురు. ఇది చెరువులలోను నీటిగుంటలలోను ఉండుపుష్పజాతితీగ. దీనిఆకులు తామ రాకువలె వెడల్పుగానుండును. ఇదిమెరుపు. తెలుపు నలుపు పు ... భేదముచేత మూడువిధములు.



యెఱ్ఱకలువదుంప రసములేక చూర్ణము చేదు రుచి, శీతవీర్య ము గురుగుణము కటువిపాకముగలది. వేడిని చల్లార్చును. పిత్తశ్లేష్మ ములు విదాహము రక్తగ్రహణి కుసుమరోగములు తలత్రిప్పు ... హ రించును. మూత్రమునుజారీచేయును జలుబుచేయును.

యెఱ్ఱకలువపూవులను ధరించిన తాపశమనగును చూర్ణమును తి నిన పిత్తముశమించును. తెల్లకుసుమ తగ్గును.

ఎఱ్ఱగుమ్మడికాయ:—అనగా మంచిగుమ్మడికాయ ... నుండును త్రిదోషములను ... పాండురోగములను ... చ్చును. మిగుల అపథ్యము ....

ఎఱ్ఱగురివెంద:—సం. రక్తకా. కాకజంఘ, శిఖండికా, కాకదీ అనియు. హిం. చోటలీఅనియు పేరు. ఇది తీగ. దీనిఆకులు చింతాకు లవలె నుండును. పూవులు తెల్లగ గుత్తులుగ పూచి కాయలుకాచును. గింజలు యెఱ్ఱగను తొడిమవద్ద నలుపుగను ఉండును. గింజలయొక్క మెఱుపు తెలుపు నలుపు భేదములచేత నిది మూడువిధములు.

ఇది చేదు వగరు రుచి ఉష్ణవీర్యము గురుగుణము కటువిపాకము కలది. వేరుచూర్ణమును లేక రసమును త్రాగిన కుష్ఠము దురద వ్ర ణములు రక్తార్శస్స (రక్తముపడు మూలవ్యాధి) గ్రహణులు నశించు ను మిక్కిలి వేడిని స్తైత్యమును చేయును. ఉత్తరానక్షత్రముగల ఆది వారమున తెల్లగురుగింజముస దీనివేరును త్రవ్వి తీసి దానిని ... లోనుంచి ధరించిన గ్రహబాధ తొలగును.

గింజలోనిపప్పును తక్కెడాకురసముతో అరుగదీసి ... మునందు పొంగించిన వెలిగారమును కలిపి ముద్దకుపట్టించి పట్టువేసిన ... డగ్రలు బిళ్ళలు నెత్తుగుగడ్డలు అణగిపోవును

గింజలనుండి తీసిన తైలమును రాచిన ఇంద్రలుప్తము (జేనకొ రుకుట) నశించును. గురుజాత్తైలమును శిశ్నమునకు పూసి ... చేసి యెడల దానికిబలముకలుగును.

గురివెందగింజ గంధమును కంటిచుట్టును కణతలకును పట్టువేసిన వాతసంబంధమైన కండ్లయెరుపు పోటు తలనొప్పి మున్నగు బాధలు తగ్గును. గింజలచూర్ణమును పంచదారకలిపి పాలతో త్రాగిన వీర్యముచిక్కబడును. వీర్యము స్తంభించును ఇంద్రియనష్టము కట్టును గురివెందలలో తెల్లది ఎర్రది ఔషధములందును నల్లది వాదమునందును ఉపయోగకరము. తెల్లది శ్రేష్ఠము

ఎర్రతెగడ:— చూ. తెగడ.

ఎర్రమునగచెట్టు:— సం. రక్తశిగ్రు. విష్ణుగుప్త, తామ్రమజ అందురు. చక్కరసము ముక్కు చెవులు తల వీనియందు పుట్టు పోటును హరించును. మునగచెట్టుయొక్క గుణములన్నియు దీనికిగలవు.

ఎలుకచెవికూర:— సం. మూషకపర్ణి, భూమిచరి, ద్రవంతి, శంబరిఅనియు, హిం. మూసాకానీ అనియు పేరు. ఇది నేలమీదపాకెడు తీగ. దీనిఆకులు ఎలుకచెవులవలె చిన్నవిగనుండును. కాడ సన్నముగనుండును. ముదిరిన దీనియాకులు కొంచెమెర్రబారును.

ఇది చేదు వగరు రుచులు లఘుగుణము, కటువిపాకము, శీతవీర్యముగలది. పిత్తము, పాండువు, క్రిమి, భగందరము, కఫ మూత్రకృచ్ఛ్రరోగములు, శ్వాసకాసలు, ఎలుకవిషము, అతిమూత్రము, కడుపుబ్బరము, శూల, శిరోరోగము వీనిని హరించును. యోనిదోషములందును అతిమూత్రములందును చక్కగా పనిచేయును మిక్కిలి పథ్యమైనది. అభ్యాసవశముచే దేహమును లోహతుల్యముగ చేయును దీనిసమూలరసమునుగాని కూరవండుకొనిగాని తినవచ్చును.

ఎలుకమాంసము:— కారము, రుచి, ఉష్ణవీర్యము, కటువిపాకము, గురుగుణము కలది. కఫ పిత్తములను పోగొట్టును. బలమును కలిగించును.

ఏడాకులఅరటి:— సం. సప్తపర్ణి, సుపర్ణక గుచ్ఛపుష్ప మునిచ్ఛద అనియు, హిం. సతవన్ సతోనాఅనియు పేరు ఇది పెద్దవృక్ష



ము. ఒకతొడిమెకు ఏడాకులుండును. నిమ్మకాయలకంటె కొంచెము చిన్నవియైన వంకరయగు కాయలుకాచును.

ఇది చేదు వగరు రుచులు సర స్నిగ్ధములు ఉష్ణవీర్యము కటువిపాకముకలది. శ్వాస కుష్ఠము, గుల్మము వీనినిహరించును. దీపనకారి.

ఏనుగమూత్రము:— చేదుగా ఉప్పగా ఉండును. విరేచనము చేయును. వాతహరము, కఫమును ప్రకోపింప చేయును. ఏనుగమూత్ర క్షారము మండలకుష్ఠును నశింపచేయును.

ఏనుగులద్దెను అరికాళ్ళకు కట్టినను లేక తొక్కినను కాలు తిమ్మెరలు మంటలు హరించును. ఏనుగుచర్మమును పొగవేసినను మూలవ్యాధి బాధ తగ్గును, ఏనుగుచర్మము యొక్క మసి నల్లవావిలివేరు రసముతో కలిపి రాచినయెడల బొల్లిపోవును.

ఏనుగుపాలు:— తీపి, రుచి, గురుగుణము, శీతవీర్యము, మధుర విపాకముకలది. వీర్యమును బలమును కలిగించును. నేత్రములకు హితమైనది. వయస్సును స్థిరపరచును.

ఏనుగుపెరుగు:— వగరు, రుచి, ఉష్ణవీర్యము, లఘుగుణము, కటువిపాకము కలది. ఇది మలుగులలోనినొప్పి, వాతబలాసకము వీనిని హరించును. అగ్నిదీప్తి, బలము, వీర్యము వీనినికలిగించును.

ఏనుగుమాంసము: బలమును శ్లేష్మ వాతములను వేడిని చేయును.

ఏనుగుచల్ల:— వగరు, గురుగుణము, ఉష్ణవీర్యము కలది. అగ్నిమాంద్యమును, తేజస్సును కలిగించును. కఫవాతములను హరించును.

ఏనుగువెన్న:— వగరు, చేదు, లఘుగుణముకలది. అగ్నిదీప్తిని మలబద్ధమునుచేయును. క్రిమిని పిత్త కఫములను హరించును

ఏనుగునెయ్యి:— చేదు వగరు రుచులు లఘుగుణము కలది అగ్నిదీప్తినికలిగించును. కుష్ఠము, క్రిమి కఫపిత్తములు విషము, రక్తవికారము వీనినిహరించును. మలమూత్రబద్ధముచేయును.

ఏనుగతుమ్మి:— సం. ద్రోణి, ద్రోణిపుష్పి, ఫలేపుష్ప, కుంభయోని అనియు, హిం. గూమా, గోమా అనియు పేరు. దీనిసమూలరసము స్వాదు, రుచి రూక్షగుణము, ఉష్ణవీర్యము మధురవిపాకము కలది. కఫము, ఆమదోషము, కామిల, వాపు, తమకశ్వాస, (ఉబ్బసము దగ్గు) వీనినిహరించును దీనిపుష్పములను మిరియములను సమభాగములుగతీసి నూరి కుంకుడుగింజంత మాత్రలుచేసి ఋతుసమయమైన దినములలో ప్రాతస్సాయంకాలముల యందు సేవించిన స్త్రీల ఋతుశూల నివర్తించును. ఇందుకుపథ్యము పాలు అన్నము.

ఏనుగుపల్లేరు:— చూ. పెద్దపల్లేరు.

ఏపిచెట్టు:— సం. సాల, అశ్వకర్ణిక, సర్జ, జలదాశన అనియు, హిం. సఖుయా అనియు పేరు. ఇది పెద్దవృక్షము. దీనిఆకులుమిక్కిలి పెద్దవియై కొన తేలియుండును.

దీనిచెక్క, ఆకు, వేరు, రసము, చేదు, కారము, రుచులు గాను స్నిగ్ధగుణములు, ఉష్ణవీర్యము, కటువిపాకముకలది. ప్రదరము, కుష్ఠము మేహము, ఉరఃక్షతము, నురద, విషదోషము, వాతరోగము వీనిని హరించును.

ఏపిపండు తీపి, రూక్షగుణము, శీతవీర్యము, మధురవిపాకముకలది. ఆధ్మానము, శూల, పిత్తము, రక్తదోషము, దప్పి, తాపము, క్షుత్క్షయము వీనిని హరించును. మలబద్ధమును వాతమును కలుగజేయును.

ఏపిబంక:— సం. రాళ, సాలనిర్యాస, సర్జరస, గుగ్గులుధూప, విరూప, వహ్నివల్లభ అనియు. హిం. రాల్ అనియుపేరు. ఏపిజిగురు, తిక్తకషాయరసములు శీతవీర్యము, గురుగుణము, కటువిపాకముకలవి. దీనినిసేవించిన రక్తదోషము, జ్వరము, శూల, అతిసారము తగ్గును. దీనిని వెచ్చచేసిగాని మలాముతయారుచేసిగాని బెణుకునొప్పులు వ్రణములుగలచోట్ల వేసిన నివారించును. దీనిధూపమువలన గృహబాధలు నశించును విసర్పము విపాదిక, స్వేదజన్య మయిన ఇతరవ్యాధులు కుష



రును. దీనిని పూసిన యెడల అగ్నిదగ్ధవ్రణములు (కాలినపుండ్లు) మానును. లోపలకు తినిన మలబద్ధము చేయును. కొబ్బరితో తయారుచేసిన తైలమును పూసిన కుష్ఠము తామర మున్నగు చర్మరోగములు మానును.

ఏరకాస్పణము:— సం. ఏరక, గుంద్రమూల, గుంద్ర అనియు, హిం. మోథీత్రిణ్ అనియు పేరు. ఇది గడ్డిదినుసులోనిది. నీళ్ళలో పెరుగును. దీనిఆకులు పొడవుగానుండును. ఇది చలవచేయును. వీర్యమును వృద్ధిపరచును. మూత్రకృచ్ఛ్రము, అశ్మరి, తాపము, పిత్తము, రక్తవికారము వీనినిహరింపచేయును. వాతప్రకోపమును గలుగజేయును.

ఏలకులు.— సం. ఏలా అనియు, హిం. ఇలాయచి అనియుపేరు. ఇవి పెద్దవి చిన్నవి అనియు రెండువిధములు. పెద్ద ఏలకుకాయ ఆల్బహారాకాయయంత యుండును. చిన్నవి వేపకాయలంతయుండును. పెద్ద యేలకులకు స్థూలైల, బహుళ, త్రిపుట, త్రిదివోద్భవ అనియు చిన్నయేలకులకు వయస్థ, సూక్ష్మైల, త్రుటి, ద్రావిడి అనియు, సంస్కృతనామములు. పెద్దయేలకులు కారము, రుచి, రూక్షగుణము, ఉష్ణవీర్యము, కటువిపాకము కలదు. రక్తపిత్తము వాంతి అశ్వరి, తృష్ణ. ఓకిలింత శ్లేష్మరోగములు, కుసుమరోగము, సెగరోగము, వికారము వీనిని నివారించును. నేతిసీళ్ళతో పై మూలకకాయలను (చర్మముసహా) నూరి తీసినరసమును త్రాగిన అజీర్ణవిరేచనము కట్టును. మూలకచూర్ణమును సురాకారము కలిపి తినిన మూత్రము సాఫీఅగును. బొంగురు పోయిన గొంతుక శుభ్రపరచును తేటను తెచ్చును. శుక్రమును పలచనజేసి సంభోగశక్తిని తగ్గించును.

ఏలకులనుండితీసిన అర్కము మేహము పిత్తము శూల వాంతి రక్తపిత్తము వీనినివారించును.

చిన్నయేలకులుగూడ రసవీర్యాదులందు పెద్దయేలకులతో పోలియుండును. శ్వాసకాసలు కఫము అర్శస్సు క్షయ విషదోషము వస్తి కంఠము వీనియందలినొప్పి వీనినిహరించును గర్భపాతముచేయును.

ఒంటె: — వుష్ట్రి, క్రమేళక అని అందురు. ఒంటెమాంసము మలబద్ధమును వాతమును మాంద్యమును కలిగించును వేడిచేయును.

ఒంటెపాలు వుప్పు తీపి రుచి రూక్షగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. జఠరదీప్తినిచ్చును. వాతము కఫము కృమి ఉదరము ఉబ్బు కుష్ఠము అనాహము మొదలగువాటిని హరించును.

ఒంటెపెరుగు కారము చేదు రుచులు గురుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముకలది. వాతము అర్శస్సు కుష్ఠము కృమి యీ మొదలగు వాటిని హరించును. పైత్యముచేయును.

ఒంటెచల్ల చేదుగావుండును. గురుగుణముగలది. పీనస శ్వాస కాసలు వీనియందు హితము. మిక్కిలిదోషయుక్తమైనది.

ఒంటెవెన్న చలవజేయును. తేలికయైనది అగ్నిదీప్తినియిచ్చును. వ్రణములను కృములను హరించును.

ఒంటెనెయ్యి. కారము చేదు రుచులు ఉష్ణవీర్యము లఘుగుణము కటువిపాకముకలది. విషము కృమి కుష్టు గుల్మము ఉదరరోగము వీనినిపోగొట్టును. అగ్నిదీప్తినిచ్చును. వాంతిచేయును. బలమును బుద్ధిని పెంచును. ఆయాసము నిచ్చును మూత్రదోషమును కఫమును పోగొట్టును.

ఒంటెమూత్రము కారము రుచి ఉష్ణవీర్యము రూక్షగుణము కటువిపాకముగలది. కుష్ఠము ఉదరము ఉన్మాదము శోష అర్శస్సు కృమి వాతము యీరోగములయందు శ్రేష్ఠముగ పనిచేయును.

ఒంటెలద్దె అప్పుడువేసినదానిని తెచ్చి పిండి తీసినరసము శ్వాస పోగొట్టును వాతవ్యాధులయందు హితమైనది దీనిని కాల్చి తీసిన క్షారము మూత్రకృఛ్రి మూత్రఘాతము కృమిని హరించును.

ఒంటెరెక్క తొడుగ: — దీనిఆకు నూరి మజ్జిగలోకల్పి త్రాగిన స్త్రీలకు స్తన్యము (చనుబాలు, కలుగును.

ఒడ్డిచెట్టు: — సం. మేషశృంగి, చక్షురవాహాల, మేషవిషాణికా విషాణి అనియు హిం. మేఢా శింగీ అనియుపేర్లు. ఇది పెద్దవృక్షము



పర్వతములందుపుట్టును. పువ్వు ఎఱ్ఱగాను, పండు గుండ్రముగా పొడుపుగావుండును. యిది చేదు వగరు రుచులు రూక్షగుణము శీతవీర్యము కటువిపాకము గలది తాపము పిత్తము కఫము తిమిరము శ్వాసవ్రణము కృమి అర్శస్సు శూల హృద్రోగము వాపు కుష్టము వాతము వీనిని హరించును.

దీనిపండు చేదు రుచి ఉష్ణవీర్యము కటువిపాకము గలది. చొక్క రసముయొక్క గుణములను గలిగియుండును. విరేచనకరమైనది.

ఓకచెట్టు: — కరమర్ద, [illegible], కృష్ణపాకఫల, వనాలయా అనియు, హిం. కరోదా అనియుపేరు. దీనివేరురసముచే వ్రణమును కడిగిన పురుగులు చచ్చును మానునట్టును దీనివేరు రసమునందు లేక గంధమునందు మిరియపు చూర్ణము హారతి కర్పూరము కల్పిరాచిన చీడ, గజ్జి, తామర పోవును. యిది ఫలప్రదానమైన పొదవంటి చెట్టు దీని ఆకులు పెళుసుగా గుండ్రముగా నుండును. కాయలు గుండ్రముగా కోలగా వుండును. కొన్ని పచ్చికాయలుమీద ఎఱ్ఱని చారలుండును కాయలు పండిన నల్లగాఉండును. పండ్లలోని రసము ఎఱ్ఱగానుండును. కాయలో చాలగింజలుండును.

పచ్చికాయ పులుపు వగరు రుచులు గురుగుణము ఉష్ణవీర్యము ఆమ్లవిపాకముకలది, దీనిని తినిన విరేచనబద్ధము గొంతుకనొప్పి పిత్తము వాతముచేయును. దప్పికను దగ్గును రక్తపిత్తమును పుట్టించును.

పండినది తీపి రుచి లఘుగుణము శీతవీర్యము మధురవిపాకము కలది. రక్తపిత్తము విషము వాతము వీనిని హరించును. త్రిదోషములను సమస్థితికి తెచ్చును. యెండిన వాకపండ్లు వరుగు పండ్లగుణములను గలిగియుండును.

ఓమము: — సం. యవాని, దీప్యక, యవాగ్రజా, భూతదంబక అనియు, హిం. అజమాస్ అనియు పేర్లు. వాముచెట్లు చాడుగా పొ

లములలో నేలమీద పాకెడు చిన్న చెట్లుగనున్నవి. కొన్నిచోట్ల జానెడెత్తువరకు పెరుగును. దీనిశిఖరములయందు గుత్తులు గుత్తులుగా చిన్న పువ్వులుపూచి క్రమముగా పువ్వులలో గింజలేర్పడును.

వాము కారము రుచి లఘు తీక్ష్ణగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముకలది. శుక్రము శూల వాత శ్లేష్మములు ఉదరము అనాహము గుల్మము ప్లీహ కృమి వీనినిహరించును. పిత్తము జేయును. అగ్నిదీప్తినిచ్చును. వీర్యపుష్టి స్తంభనము జేయును. దీనిని ఆకులలోగాని కాగితములలోగాని చుట్టి పొకపీల్చిన తలయందలి శైత్యభారము కఫము దగ్గు తగ్గును. దీనిరసమున పంచదారచేర్చి త్రాగిన తాంబూలము తినుటచే గలిగిన గుండెనొప్పితగ్గును. శొంఠి వాము కలిపి చూర్ణించి సైంధవలవణముజేర్చి పుచ్చుకొనిన అజీర్ణము అజీర్ణవిరేచనములు తగ్గును. మిరియాలు వాము మాడ్చి నీరుపోసి ఆపై నీటినితేర్చి యిచ్చిన కలరావ్యాధితగ్గును. కడుపులోని పురుగులనుచంపును. నశ్యమునకు బాగుచేయును. ఋతురక్తమును వెడలించును. దీనిరసమున గుంటగలగరాకు రసము కలిపి యిచ్చిన వుబ్బురోగముతగ్గును. సైంధవలవణయుక్త వామును నిమ్మ మాదీఫలము మొదలగు ఆమ్లవస్తురసములయందు భావనచేసి ప్రతిపుదయము పుచ్చుకొనుచుండిన అన్నహితవు ఆకలి వీర్యవృద్ధికలుగును. పిత్తవికారములుతగ్గును. రక్తపిత్త రక్తమును పుట్టించును. వాము వుప్పు కలిపి త్రాగి వేడినీరుత్రాగిన కడుపు ఉబ్బరము నొప్పి తగ్గును. విస్తారముగ తినిన చలిజ్వరము తలనొప్పి కలుగును. వామును మాడ్చి తీసిన క్షారము మిక్కిలి వేడిచేయును. గర్భిణీస్త్రీల సహజమునొప్పికి దీనిని 2 గురిగింజలయెత్తు మొదలు చిన్నంవరకు యిచ్చిన సహజమగును. వాము, దుంపరాష్ట్రము, కళింగరాష్ట్రము, శొంఠి, సన్న తొక్క గసముతీసి పొంగించి పాలురసపోసిన దగ్గు పడిశము జ్వరము తగ్గును. విరేచనము చేయును. శుద్ధిచేసిన వంగపు రేకులను వాములో కలియ గలిపి మూటకట్టి పుటమువేసిన తగరము భస్మమగును. సత్తు కరగించి వాము కొంచెము కొంచెముకావేయుచూ గంటెతోరుద్దిన తెల్లనిభస్మమగును.



వాము అరకు చేయువిధము వామును నాలుగుదినములు నీళ్ళలో నానబెట్టి అర్కయంత్రమునుండి తీసిన ఆవము అజీర్ణము కడుపునొప్పి నీళ్ళవిరేచనములు వీనికి బాగుగాపనిచేయును.

వాముఆకును కూరచేసుకొని తినిన వాత శ్లేష్మములు హరించును. వేడి శైత్యము జఠరదీప్తికలుగును.

కంకుష్ఠము:— సం. కంకుష్ఠ, కాలుకాష్ఠ, విరంగ అనియు, హిం. కంకుష్ట అనియుపేరు. హిమవత్పర్వతప్రాంత భూములందు కంకుష్ఠము అను ఒకధాతువుపుట్టును. ఇది నాళికము రేణుకము అని రెండువిధములు. నాళికము పచ్చగ బరువుగ స్నిగ్ధముగనుండును. రేణుకము శ్యామపీతవర్ణములు కలిగియుండును. నాళికముమంచిది. అప్పుడుపుట్టిన ఏనుగుపిల్ల మలమును కూడ కంకుష్ఠమనిచెప్పుదురు.

కంకుష్ఠము చేదు కారము రుచులు ఉష్ణవీర్యము లఘుగుణము కటువిపాకము గలిగియుండును. వ్రణ, ఉదావర్త, శూల, గుల్మ, ప్లీహ. గుదరోగములను పోగొట్టును, కంకుష్ఠమును శొంఠికషాయములో మూడుసారులు భావనచేసిన శుద్ధమగును. దీనిని యవప్రమాణము సేవించిన తక్షణము గాఢవిరేచనముచేసి ఆమదోషమును హరించును. దీనిని తాంబూలముతో కలిపి సేవించిన యెడల తక్షణమే గాఢవిరేచనముచేసి చంపును. ఇందుకు విరుగుడు, తుమ్మవేరుచక్క కషాయమందు జీలకర్ర పొంగించిన వెలిగారము కలిపి త్రాగుచుండవలెను.

కంచు:— సం. కాంస్య, ఘోష, అసుర అనియు, హిం. కాంసా అనియుపేరు. యెనిమిదిభాగములు రాగి, రెండుభాగములు తగరము కలిపి కరిగించిన నది కంచులోహ మనబడును. తీక్ష్ణమైన ధ్వని మృదుత్వము నునుపుకొంచెము నలుపుకలసిన తెలుపువర్ణము కాల్చిన పుడు యెర్రనిరంగుగలదిగనుండు కంచు శ్రేష్ఠము యిట్టికంచును కాల్చి గోమూత్రములో ముంచిన శుద్ధమగును. కంచుతో గంధక తాళకములను చేర్చి అయిదుపుటములు వేసిన భస్మమగును. కంచుభస్మము తామ్ర వంగముల కూడికవలన యేర్పడిన లోహమగుటచే ఆ రెండులోహ

ముల గుణములను కలిగియుండుటయగాక కొన్ని విశేషములను గూడ కలిగియుండును. ఇది వగరు చేదు రుచులు ఉష్ణవీర్యము, విశద, సర, గురు, రూక్షగుణములు, కటువిపాకముగలది. లేఖనకారి. నేత్రములకు హితమైనది కఫపిత్తములను హరించును. కంచుభస్మమును సేవించునపుడు నేయిని భుజింపరాదు. అపరిశుద్ధమును, మారణ చేయబడనదియునగు కంచును సేవించిన వాంతి, దాహము మొదలగు అనేకవ్యాధులను పుట్టించి చంపును..

కంద:—సం. ఓల్ల, అర్శోఘ్న అందురు. గ్రామములలోను పొలములందును వేసి పండించు ఊరకందగూడ అడవికందయొక్క గుణములను కలిగియుండును. గాని అడవికందకున్నంత దురద దీనికుండదు. అంతచురుకుగను పనిచేయదు. జఠరశక్తిని నేత్రములకు చలువను బలమును పుష్టిని వీర్యవృద్ధిని కలిగించును. మూలరోగమును వాతకఫములను హరించును. గురుత్వముగనుండును. మేహవ్యాధులుకలవారలకు అహితమైనది.

కందులు:—సం. ఆఢకీ, తువరీ, మృత్స్నా, వృత్తబీజ అనియు, హిం. అడహార్ అనియుపేరు. మెట్టచేలలో విశేషముగ పైరగును. కందిచెట్లలో అనేకభేదములుకలవు. చిన్నకంది, పెద్దకంది, కొండకంది తెల్లకంది, నల్లకంది మొదలగు భేదములుకలవు. ఈచెట్లు మూడుమొదలు అయిదుఅడుగుల యెత్తువరకు పెరుగును. కాయలుచిన్నవి. సన్నముగ ఒకఅంగుళముమొదలు రెండంగుళముల పొడవుగనుండును. కందిగింజలు పైపొట్టుతీసి చేసినపప్పును ఉడకబెట్టి తిందురు.

కందిపప్పు కొంచెముతీపి, వగరు రుచులు శీతవీర్యము గురు రూక్షగుణములు మధుర విపాకము గలది. కఫ, పిత్త, జ్వర, విష రక్తవికార గుల్మములను హరించును. అలస్యముగ జీర్ణమగును. బలమును వీర్యమును కాంతిని యిచ్చును. మలబద్ధమును చేయును. నేయి కలిపి తినిన వాతమును గలిగించును. దేహమును నలుపువర్ణముగ మార్చును. దీ



నిని సరిగాని ఉడికించిగాని పూతపూసిన కఫపిత్త జనిత వికారములను హరించును.

బియ్యము కందిపప్పు కలిపి వండిన యన్నము అనగా పులగము వాతమును హరించి పిత్తమును వృద్ధిచేయును. దప్పిని వేడినికలిగించును.

ఉడికిన కందిపప్పు నుండి వార్చిన కట్టు నీళ్ళలో జీలకర్ర మొదలగు వానినిజేర్చి తాలింపుపెట్టిన కందికట్టు రుచిగనుండును. తేలికగ జీర్ణమగును. జ్వరితులకును మందాగ్ని కలవారలకును హితము, పాండువు మేహవ్యాధి కలవారికి పథ్యమైనది.

చింతపండు పులుసు వేసి కాచిన కందిపప్పుచారు మిక్కిలి గురుత్వమును శ్లేష్మమును కడుపుబ్బరమును కలిగించును.

కంపిల్లము:—ఇది సౌరాష్ట్ర దేశమునందు గనులలోబుట్టు నొకవిధమగు ధాతువు ఇటుక పొడివలె యెర్రనై తళుకులు గలిగియుండును.

పిత్తవ్రణములు, ఆధ్మానము మలబంధము, శ్లేష్మము, ఉదరము క్రిమి గుల్మము, మూలవ్యాధి ఆమదోషము, జ్వరము శూల వీనినిహరించును.

కంపిల్లకము:—సం. కాంపిల్య, కర్కశ, రక్తాంగ అనియు, హిం కబీలా. కంబీలా అనియుపేరు ఇది పర్వతపు దేశములందుపుట్టు వృక్షము మేడిఆకులవంటి ఆకులును రేగుపండ్లవంటి చిన్నకాయలును ఉండును

దీనిచక్క ఆకురసము చేదు, రుచి, ఉష్ణవీర్యము, లఘుగుణము కటు విపాకముగలది. చక్కచూర్ణమును తిన్నను కషాయముచేత కడిగినను వ్రణములు మానును. కఫమును హరించును. విరేచనము చేయును. వ్రణ, గుల్మ ఉదర, ఆధ్మాన, కాస. పిత్త, ప్రమేహ, అనాహ, మూత్రాఘాత, అశ్మరీ వ్యాధులనుహరించును.

కక్కుపాల:—పాలతీగలలో నిదియొకభేదము. కాడగిల్లిన దీనినుండి పాలుగారును. సమూలకషాయమునందు మహిసాక్షిని కలిపి ఉదయ సాయంకాలములందు త్రాగించిన సెగసవాయిలు కుదురును. ర

క్తము శుభ్రపరచును. దీనిరసమును శరీరమునకుపూసిన చర్మరోగములు మానును.

కచోరము:—సం. కచూర, వేధ్య, ద్రావిడ, శఠీ అనియు హిం. కచూర్ అనియుపేరు. ఇది దుంపయే ప్రధానముగాగల గుల్మము పసుపుచెట్టువలెనుండును. ఆకులకుగూడ దుంప వాసనయుండును. కచ్చూరము, చేదు కారము రుచులు లఘుగుణము, ఉష్ణవీర్యము కటువిపాకముగలది అగ్నిదీప్తిని కలిగించును శ్వాసకాసలు, గుల్మము, వాతకఫములు కృమి వీనినిహరించును. కచ్చూరపుగంథమును కణతలకుపట్టు వేసిన నొప్పితగ్గును. కచ్చూరపుచూర్ణములోగాని కషాయములోగాని పొంగించినరసములోగాని తేనెచేర్చి పుచ్చుకొనిన శ్లేష్మము దగ్గ తక్షణముతగ్గును. వీర్యస్తంభనము, వీర్యవృద్ధి కలిగించును. మూత్రరోగము నుతగ్గును. సెగరోగమును మాన్పును. త్రిదోషహారమైనది. పచ్చికచూరపుముద్దలో శాస్త్రీయముగ వంగమును కలిపిపెట్టి జీరజేసి పుటము వేసిన సప చక్కగా భస్మమగును. ఆభస్మమును వీర్యనష్టము దగ్గు మున్నగువానియందు వాడనగును.

కటుకరోహిణి:—సం తిక్తా, చక్రాంగి. శకులాదని, కటుకా అనియు. హిం. నొబకీ అనియుపేరు. ఇది తెలుపు నలుపు భేదముచే రెండువిధములు. చిన్నగుల్మము దీనిఆకులు పొడవుగ కంగోరా గలిగియుండును. ఆకులుగూడ మిక్కిలిచేదుగలవి. దీనివేళ్ళను ఔషధముగ వాడుదురు.

దీనిరసము లేక కషాయము చూర్ణము చేదు రుచి రూక్ష హిమ లఘుగుణములు ఉష్ణవీర్యము కటువిపాకము గలది. దారుణవిరేచనముచేయును. అగ్నిదీప్తినిచ్చును. రక్త వికారములు, శ్వాస కఫము. దాహము, జ్వరము అరుచి, ప్రమేహము. కుష్ఠము, విషమజ్వరము పాండు, కామిల, పొలుసు, తేలు మున్నగువాని విషములు హృద్రోగము వీనినిహరించును. కటుకరోహిణిని గుంటగలగరాకు రసముతో 7 దినములునూరించి సెనగలంతమాత్రలుచేసి అల్లపురసముతో నిచ్చిన



చలిజ్వరము తగ్గును. కటుకరోహిణి రసమందు సదాపాకుచూర్ణమును కలిపి యిచ్చిన రుతురక్తము వెడలును. కటుకరోహిణినివేసి కాచిన తైలమునుపూసిన పక్షవాతపు నొప్పులు వాతనొప్పులు కుదురును కటుకరోహిణిని చిట్టిసాగనార రసముతో కలిపి గుండెలకు పట్టువేసిన గుండెలు పీకుట నొప్పి తగ్గును. కఫము కరుగును. ఆయాసము తగ్గును. నల్ల కటుకరోహిణికంటె తెల్లనిది చురుకుగపనిచేయును గానిమోతాదుయెక్కువైన వాంతి, భ్రమ, మూర్ఛ మొదలగు వికారముల గల్గించి చంపును.

కట్ఫలము:—సం. కట్ఫల, కుంభీ, కుముదికా, కైటర్య అనియు హిం కాయఫల్ అనియు పేరు. ఇదివృక్షజాతిలోనిది దీనికాయ కర్జూరపు కాయవలె పొడవుగ నున్నగ నుండును. దీనిచక్క మందముగనుండును. చక్కను కాయనుగూడ ఔషధములలో వాడుదురు.

చక్కలేక కాయ వగరు చేదు, కారము రుచులు, ఉష్ణవీర్యము లఘుగుణము, కటువిపాకము గలది. దారుణమైన దాహరోగము ముఖరోగము గుల్మము, కాస, అర్శస్సు, ఆమశూల, ప్రమేహము అగ్నిమాంద్యము గ్రహణి వీట్లను నశింప జేయును. తుమ్ములను పుట్టించును. దీనికి కాయఫలమనియు గుమ్ముడురేగు అనియు పేరులుగలవు.

కట్లపిత్తులు:—సం. కృష్ణబీజ అనియు హి. కాలాదానా అనియు పేరు. ఇదితీగ జాతిలోనిది దీనిఆకులు ఒక తొడిమెకు మూడుఆకులుగ మొలచును చిన్నపూవులుపూచును. గింజలు నల్లగ చిన్నవిగనుండును. కట్లపిత్తులు జిగటగనుండును. విరేచనకరము. తలపోటు నొప్పి మున్నగు శిరోవ్యాధులు జ్వరము ఉదావర్తము కఫము అనాహము అను వ్యాధులందు ముఖ్యముగ వాడదగి యుండును

కడిమిచెట్టు: సం. కదంబ. నీప, హరిప్రియ, ప్రావృషేణ్య అనియు హిం. కదమకా పేడ్ అనియుపేరు కడిమిచెట్లలో కదంబము భూమికదంబము, ధారాకదంబము, రాజకదంబము ధూళికదంబము అని చాలభేదములు కలవు రాజకదంబము పెద్దవృక్షము దీనిపూవులు మిక్కిలి సువాసనగలవి. గుండ్రముగ చిన్నవిగనుండును

కదంబవృక్షముయొక్క చెక్కరసము లేక కషాయము ఆమ్లరసము తప్ప తక్కిన అయిదు రసములు గురుగుణము శీతవీర్యము మధురవిపాకముకలది. శుక్రవృద్ధి మలబద్ధము కాంతి కలిగించును. స్తన్యము (చనుబాలు) పడునట్లుచేయును. యోనిదోషము, రక్తవికారము, మూత్రకృచ్ఛ్ర, వాతపిత్తకఫములు, వ్రణము, దాహరోగము, విషదోషము వీనిని హరించును.

కడిమిచిగురు వగరు రుచి శీతవీర్యము లఘుగుణము మధురవిపాకముగలది అరోచకము రక్తపిత్తము అతిసారము వీనినిజయించును.

దీని దోరకాయలు మధురరసము, గురుగుణము, ఉష్ణవీర్యము, మధురవిపాకముగలవి. కఫమును పెంచును. బలము వీర్యము కాంతి వీటినికలిగించును. చక్కగా పక్వమైన కడిమిపండు త్రిదోషహరమైనది.

రాజకదంబము పులుపు వగరు తీపిరుచులు శీతవీర్యము గురుగుణము మధురవిపాకము కలది. విషము రక్త వికారము పిత్తకఫములు వీనినిహరించును. పండు మధురము రుచి శీతవీర్యము గురుగుణము మధురవిపాకముగలది. పిత్తమును రక్తదోషమును హరించును.

ధారాకదంబము చేదు వగరు రుచులు శీతవీర్యము కటువిపాకము కలది. వీర్యమును కాంతిని కల్గించును. వాపు విషము పిత్తకఫ వ్రణములు వాతము వీనినిహరించును.

ధూళీకదంబము చేదు కారము వగరు రుచులు శీతవీర్యము కటువిపాకము గురుగుణముకలది. మరియు ధారాకదంబముయొక్క గుణములన్నియు భూమికదంబ ధారాకదంబములకు గలిగియున్నవి.

కడుగు:—బియ్యముకడిగిన నీళ్ళకు కడుగుఅనిపేరు. ఈనీళ్ళలో పంచదారచేర్చి త్రాగిన మూత్రము జారిఅగును. నీరు చురుకు కట్టును. చలవచేయును. తాపము, దప్పి తగ్గును. మెక్కపై త్రాగిన జలుబుచేయును. మొండెదెబ్బతగిలినవారికి సెగరోగులకు హితమైనది.

కత్తిమానుచెట్లు: చూడు. భ్రామరచెవులుచెట్లు.



కత్తిరివావిలిచెట్లు:—వావిలిచెట్లలో నిదియొకభేదము చేదు కారము రుచులు కలది. కఫవాతములు, క్షయ, శూల, దురద, కుష్ఠము మొదలగువాటిని నశింపచేయును.

కతీరాగోదు: బాదాంచెట్టుయొక్క జిగురునకే కతీరాగోదు అనిపేరు ఇది తెల్లగ చేదుగనుండును రక్తశుద్ధిని వీర్యవృద్ధిని కలిగించును. పొత్తికడుపులో నొప్పిబుట్టించును. గాయములకువేసిన నవిమానును. యూనానీసంప్రదాయమునందిది విశేషముగ వాడుకచేయుదురు,

కత్తురిణము:—సం. కత్తురిణ. రోహిష, దేవజగ్ధ అనియు, హి. గంధేజఘాస్ అనియుపేరు గడ్డిదినుసులో చేరినది, గరికవలెనే యుండును దీనిఆకుఅంతయు పరిమళముగలిగియుండును. నమిలినచో ముఖమంతయు పరిమళభరితమగును.

ఇది వగరు చేదు రుచులు కటువిపాకము ఉష్ణవీర్యము రూక్షగుణముకలది. హృద్రోగము కంఠరోగములు పిత్తరక్తము కఫము శ్వాస జ్వరము మొదలగువానిని హరించును. దంతములను గట్టిపరచును. శస్త్రములు శల్యములు మొదలగువానిచే గలిగిన నరుకులను వ్రణములను మాన్పును. బాలగ్రహదోషములను నశింపచేయును.

కన్యాకోమలి:—దుంపప్రధానమైన యొక తీగజాతిచెట్టు. గరప భూములలోపెరుగును. దీనిదుంప చేదు వగరు రుచులు స్నిగ్ధగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. త్రిదోషములను ఖండించును. వీర్యనష్టము తాపము దప్పి మొదలగువానిని పోగొట్టును. కన్యాకోమలిదుంపను మేకపాలలోవేసి త్రొక్కి తీసినరసమును 4 లేక 5 తులముల రసమును ప్రతియుదయమున 9 రోజులవరకు పుచ్చుకొనిన వీర్యనష్టమును కట్టును. అమితబలమును వీర్యస్తంభనమును కలుగజేయును.

కఫరి:— సం. ఖర్పర, రసక, ఖర్పరికాతుత్థ అనియు, హిం. ఖాపరియా అనియుపేరు, ఇదియొక ఖనిజవస్తువు ఒకమతమున దర్దురము కారవేల్లకము అని యిదిరెండువిధములుగను. మృత్తికా, కఫరి, గుడకఫరి పాషాణ కఫరియని మరియొక మతమున మూడువిధములుగను

చెప్పబడినది. దర్దురమునకు పొరలుండును. కారవేల్లకమున కుండవు. మృత్తికాకఘరి పసుపుపచ్చగనుండును. గుడకఘరి బెల్లమువలెను, పాషాణకఘరి రాయివలెనుండును. ఔషధములందు దర్దుర కారవేల్లకములను మృత్తికాఘరిని వాదమునందును వాడుక చేయుదురు. కఘరి కొబ్బరిముక్కవలెనుండును. ఇంగిలీకమునకువలె విరుగగొట్టినచోట కాంతిగల పొగరములుండును. ఇది శ్రేష్ఠమైనది. దర్దురము సత్వపాతనమునకును కారవేల్లకము ఔషధయోగములం జేర్చుటకును ఉపయోగింపవలెను. కఘరి కఫపిత్త వికారములు మేహము నేత్రరోగములు క్షయ జీర్ణజ్వరము వీనినిహరించును. జీర్ణజ్వరహరమైన ఔషధయోగములలో బహుళముగ కఘరి చెప్పబడుచున్నది.

కఘరి 8 తులములు, మిర్యాలు 4 తు॥ ఇంగిలీకము 3 తు॥ ముత్యం 2 తు॥ సువర్ణము 1 తు॥ చేర్చి వీనిని పాలనుండి తీసిన వెన్నతోను నిమ్మపండ్లరసముతోను మర్దించి మిరియమంత మాత్రలుచేసి జీర్ణజ్వరములందు నాశనగును. ఇదియస్వర్ణమాల్య వసంత రసమన బరగును.

కఘరిని చేమపార రసమందు ఉడికించిన శుద్ధమగును. క్రమప్రకారముచేసిన దీనిభస్మముకూడ పైవ్యాధులనుఖండించును

కమలాఫలము:—సం. కురుంబ, కులపాలక అనియు. హిం. మీఠానీంబూ అనియుపేరు. నిమ్మచెట్లలోభేదము. దీనికాయ నారింజకాయంతయుండును. ఈచెట్టు నిమ్మచెట్టుయొక్క సమస్తాకారములుకలది. కమలాఫలము బాగుగాపండినది, తీపి రుచి శీతవీర్యము గురుగుణము మధురవిపాకము గలది. చలువజేయును. మేహము పిత్తము దాహము వాంతి వీనిని హరించును. దప్పినణచును. బాగుగాపండనికాయ పుల్లగనుండును. కఫమును పెంచును.

కమ్మరేగు:—సం. లకుచ, క్షుద్రపనస, నికుచ అనియు, హిం. బడహల్ అనియు పేరు. రేగుచెట్లలోభేదము. దీనిదోరపండ్లు పుల్లగతియ్యగనుండును. ఉష్ణవీర్యము గురుగుణము అమ్లవిపాకముగలది. మల



బద్ధముచేయును దోషత్రయమును పెంచును. రక్తమును పుట్టించును. జఠరమునకు శుక్రమునకు చెరుపుచేయును బాగుగా పండినపండు తీపి కొంచెము పులుపు రుచులు కలిగియుండును. వాతపిత్తములను హరించును. అగ్నిదీప్తిని కఫమును పెంచును, మలబద్ధము చేయును. వీర్యవృద్ధిని రుచిని పుట్టించును.

కమ్మరాకు:— తమలపాకులలో నిదియొకభేదము. తమలపాకు కన్న నిది మిక్కిలికారము వెగటు పెళుసుదనము కలది అలవాటులేనివారు దీనిని తినిన వికారమెట్టును. తలదిమ్మెక్కును. పిత్తమును జఠరాగ్నిని వృద్ధిచేయును. క్రిములనుచంపును.

కరక్కాయ:—సం. హారీతకీ, అభయా, పథ్యా హైమవతి అనియు. హిం. హరడ్ అనియుపేరు. కరకచెట్టు పెద్దవృక్షము. ఆకులు మందముగ పెళుసుగ నుండును. విజయ, రోహిణి, పూతన, అమృత, అభయ, జీవంతి, చేతకి అని కరక్కాయలు ఏడువిధములుగ నుండును. విజయాకరక్కాయ సొరకాయయొక్క గుండ్రనవంటి గుండ్రగయుండును రోహిణి కరక్కాయ గుండ్రగనుండును. పూతనకరక్కాయ చిన్నదిగ చిన్నబీజముకలదిగ నుండును. అమృతకరక్కాయకు బీజముచిన్నదిగను కండ మిక్కిలి మందముగనుండును. అభయకు అయిదు రేఖలుండును. జీవంతి బంగారువర్ణముకలది. చేతకికి మూడు రేఖలుండును.

విజయ సర్వరోగములందును రోహిణి వ్రణరోపణమునందును, పూతన లేప విధియందును అమృత శోధనమునందును, అభయ నేత్రరోగములందును జీవంతి సర్వరోగములందును చేతకి చూర్ణయోగములందును వాడదగియుండును చేతకియను కరక్కాయ తెలుపు నలుపు భేదముచేత రెండువిధములు. తెల్లచేతకి కరక్కాయ ఆరుఅంగుళములు పొడవుగను నల్లచేతకికరక్కాయ ఒకఅంగుళము పొడవుగను ఉండును. పైభేదములలో కొన్ని స్పర్శమాత్రమునను కొన్ని దృష్టిమాత్రమునను కొన్ని వాసనచూచినంతమాత్రమునను కొన్నితినినను విరేచనముచేయు

స్వభావము కలవిగ నుండును. అన్నిటిలో విజయాకరక్కాయ మిగుల శ్రేష్ఠమైనది.

కరక్కాయయందు లవణరసముతక్క తక్కినరుచులును రూక్ష ఉష్ణగుణములును ఉష్ణవీర్యమును మధురవిపాకమును కలవు. మలమును వెడలించును. నేత్రములకుహితమైనది. ఆయువును బలమును వీర్యమును తేజస్సును బుద్ధి వైశద్యమును ఆరోగ్యమును కలిగించును. క్రమముగ సేవించిన జరామరణములను ఖండించును. మరియు శ్వాసకాసలు, ప్రమేహము, అర్శస్సు, కుష్ఠము, నంజు ఉదరము, కృమి, గ్రహణి, మలబద్ధము, విషమజ్వరము, గుల్మము, ఆధ్మానము, దప్పి ఛర్ది, హిక్క, దురద, కామిల, శూల ప్లీహ, యకృత్, అశ్మరి, మూత్రకృచ్ఛ్ర, మూత్రాఘాతము మున్నగు సకలవ్యాధులనుహరించును.

పులుపుకలది గనుక వాతమును మధురతిక్త రసములు కలది గనుక పిత్తమును రూక్షగుణము కషాయరసము కలది గనుక కఫమును హరించును.

కరక్కాయ కండయందు మధురరసము, స్నాయువులందు అమ్లరసము, తొడిమయందు చేదు, చర్మమందు కారము, గింజయందు వగరు యిట్లు అయిదురుచులును కరక్కాయయందున్నది.

ఒకభాగము ద్రాక్షపండు, రెండుభాగములు కరక్కాయ చేర్చి చూర్ణించి దానికాయంతయుండలుచేసి సేవించుచున్న ఇరువది పిత్తవికారములు శమించును. భోజనమునకు ముందు వెనుక మధ్యయందును, జీర్ణావస్థయందును, అజీర్ణమందును, జీర్ణాజీర్ణస్థితియందును కరక్కాయ పథ్యముగనుండును.

దశమూలములు. దూలగొండి, శంఖపుష్పి, కచోరము, ముస్తవపులగము, గజపిప్పళ్ళు, ఉత్తరేణి, మోడి, చిత్రమూలం, గంటుభారంగి, పుష్కరమూలము యివి ప్రత్యేకము 2 పలములు, యవలు ఒకఆఢకము, కరక్కాయలు 100, (నూరు) వీనినెల్ల జాగ్రతపరచి యవలు కరక్కాయలు గాక తక్కినవస్తువులను నలియగొట్టి యొక భాండమందుంచి అందు అయిదు ఆఢకముల ఉదకమునుపోసి యవలను కరక్కాయలను మూటగట్టి యాభాండములోవేసి నాల్గవవంతు నీరు మిగులువరకుకాచి మూటను బైటకుతీసి కషాయమును వడియగట్టి యాకషాయములో పై కరక్కాయలను బెల్లము ఒకతుల, పిప్పలిచూర్ణము నేయి నూనె అనునవి ప్రత్యేకమొక కుడవము యీ యన్నిటిని ఒక భాండమందుంచి గుడపాక సంప్రదాయానుసారముగ వండి దించి చల్లారినతర్వాత ఒకకుడవము తేనెజేర్చి భద్రపరచి ప్రతిదినము రెండు కరక్కాయలను తినుచున్న కాస క్షయ ఎక్కిళ్ళు విషమజ్వరము గ్రహణి మూలవ్యాధి హృద్రోగము మున్నగురోగములు శమించును. ఇదియ అగస్త్య హరీతకియనబరగును.



వాకుడుసమూలము ఒకతులాప్రమాణముగ నలియగొట్టి ద్రోణప్రమాణ జలమునందువేసి 100 కరక్కాయలు అందువేసి 4 వ వంతు నీరుమిగులునట్లు కాచి వడియగట్టి ఆకషాయమునందు 100 పలముల బెల్లము పై కరక్కాయలు వేసి పాకముపట్టుచు త్రికటుకములు 6 పలములు, తేనె 6 ప॥ చాతుర్జాతకములు ప్రత్యేకము పలము చూర్ణించి పైపాకమున కలియగల్పి బలానుసారముగ సేవించిన ద్విదోష త్రిదోషజన్యమగు కాసలు పీనస క్షత క్షయము శ్వాస మొదలగు వ్యాధులు నశించును. ఇదియ వ్యాఘ్రీ హరీతకి యనబడును.

కరక్కాయచూర్ణమును వేడినీళ్ళలో వేసి కొంచెముసేపుంచి యానీటిని వడియగట్టి యిచ్చిన గన్నేరువిషము నాభివిషము వీనిని విరుచును. కరక్కాయనీళ్ళతో వ్రణములను కడిగిన నవిమానును. కరక్కాయగింజలోని పప్పును నీళ్ళతోఅరగదీసి కండ్లయందంజనముచేసిన కండ్లమెరుపు నీరుగారుట దురద తగ్గును. కరక్కాయ గంధమునందు నల్లమందుకలిపి కంటిచుట్టు పట్టువేసిన నేత్రములవాపు పోటు హరించును. కరక్కాయ కషాయమునందు తేనెజేర్చి యిచ్చిన పొడిదగ్గుతగ్గును

కరక్కాయచిప్పలు 4 శేర్లు, సైంధవలవణం 6 తు॥ యాలకులు, లవంగాలు, దాల్చినచక్క, ఆకుపత్రి, శొంఠి పిప్పళ్ళు, మిర్యాలు,

తానికాయలు ఉశిరిగపప్పు యివి ప్రత్యేకము ఒకతులము వీనినన్నిటిని చేర్చి గుంటగలగర, నిమ్మపండ్లు, మాదీఫలము, నారింజపండ్లు, దానిమ్మ పండ్లులనువానిరసములతో ఇరువదియొక్క దినములు భావనచేసి ప్రతిది నము కొంచెము కొంచెము సేవించుచున్న సమస్తఅజీర్ణములు పిత్తవికా రము శ్వాస ఛర్ది నశించును. అగ్నిదీప్తికలుగును. కడుపులోని వాతము వెడలించును. అన్నహితముకలిగించును.

కిరకపిందెలు అనగా జంగిలీహరడాలు నల్లగ వగరుగ పెద్దమే లకులవలెనుండును. విరేచనముచేయును. అగ్నిదీప్తినిచ్చును.

కరకపూవు రససిందూరము కలిపి మాత్రజేసి మేకపాలతో యి చ్చిన జిగటవిరేచనములుతగ్గును. కరకపూవును ప్రత్యేకముగ దినిన మ లబద్ధముచేయును.

ఆయాసపడినవారు గర్భిణులు వీర్యనష్టముచేత కృశించినవారు నవజ్వరితులు కరకకాయను తినకూడదు.

కరవీరము:—సం. కరవీర, అశ్వమారక, శతకుంభ అనియు, హిం కనేర్ అనియుపేరు. అయిదారు అడుగులయెత్తువరకు పెరుగు చి న్నచెట్టు, ఇది తెలుపు నలుపు పసుపు పాటలవర్ణము యెరుపు పువ్వు లభేదముచే అయిదువిధములు. యెర్రపువ్వులకరవీరమునకు సంస్కృత మున చండాల లగుడ అని పేరు. వీనిఆకు సన్నముగ నాలుగంగుళములు పొడవుగనుండును. వీనిలో ఒంటిరేకుపూవులు, ముద్దపూవులు పూచు నవి కలవు. చామంతిపూవులకన్న రెట్టింపు పెద్దవిగ గుండ్రగనుండును.

ఇది కారము చేదు వగరు రుచులు. ఉష్ణవీర్యము, తీక్ష్ణగుణ ము, కటువిపాకముగలది. ఇది విషతుల్యమైనది. ప్రమాదవశమున హె చ్చుమోతాదుగతినిన చంపును. మేహము, క్రిమి, కుష్ఠము, వ్రణము, అర్శస్సు నేత్రరోగములు మున్నగువానిని హరించును.

యెర్రగన్నేరు శోథసమందును పాటలవర్ణముగల కరవీరము శిరో వ్యాధియందును విశేషఫలప్రదము. మొత్తముమీద అన్నియు సమాన గుణములుకలవి.



గన్నేరువేళ్ళు నేపాలపువేళ్ళు తెగడ చేదు బీరపండు వీనినినూరి కల్కముచేసి దానికి నాలుగురెట్లు నువ్వులనూనె, నూనెకు నాలుగురె ట్లు నీళ్ళు యేకముచేసి తైలపక్వముగ కాచి వడియగట్టి యాతైలము ను వెండ్రుకలకు రాచిన నవి రాలిపోవును. ఇదియె కరవీరాది తైల మనబడును.

కరివేపచెట్టు:—సం. కైడర్య, మహానింబ, రామణ, గిరినింబ అనియు హిం. మీఠానీమ్, బరసంగ్ అనియుపేరు. కరివేపచెట్టు సా ధారణముగా దొడ్లలోవేసి పెంచు కొద్దిపాటివృక్షము. దీనిఆకులు వేపా కులవలెనే యుండునుగాని అంతపెద్దవికావు. ఆకులకు కంగోరాయుండ దు. ఆకులందు సువాసనకలదు. దీనికాయలు ఆకుపచ్చగను పండినపు డు నల్లగను తీపిగను ఉండును. పండ్లు పుస్తికాయలవలె గుండ్రగఉండును

కరివేపఆకు మానుచెక్క వేరుచెక్క చేదు కారము వగరు రు చులు శీతవీర్యము లఘుగుణము, కటువిపాకముకలది. దాహము, అ ర్శస్సు క్రిమి, శూల, విషము, శోఫ. దురద, భూతబాధ వీనిని హరిం చును. కరివేపాకు మిర్యాలు ఉప్పు వీనిసమముగ కలిపి నూరి కుంకుడు కాయంతమాత్ర తినిన అజీర్ణము అజీర్ణవిరేచనములు శూల క్రిములు నశించును. కలరావ్యాధియందు గంటకొకటి చొప్పున 5, 6 మాత్రలు వాడిన వ్యాధి నివర్తించును. కరివేపపండ్లు దప్పిని రక్తపిత్తమును పోగొట్టును.

కరిధూపము:—అనగా పొయ్యిగలచోట గోగపైకిపోయి యిం టివాసములకు పట్టును. ఇదియె కరిధూపమందురు. దీనిని భద్రపరచి వస్త్రగాలితముచేసి తేనెతోనాకిన తత్క్షణము అజీర్తినితగ్గించును వేడి చేయును. పాదరసమునందువేసి మర్దించినపాదరస దోషములను కొన్ని టిని పోగొట్టును.

కరిబూజాపండు:—సం. కర్బూజా, షడ్భుజా అనియు, హిం. ఖర్బూజా అనియుపేరు. ఇది దోసజాతిలోనిది. కాయ కొంచెము సువా సనగలిగియుండును.

ఇది మధురరసము, శీతవీర్యము, లఘుగుణము, మధురవిపాకముకలది. జీర్ణశక్తి, బలము, వీర్యవృద్ధి కలిగించును. త్రిదోషములను సమస్థితికిదెచ్చును. మూత్రమునుజారిచేయును. అశ్మరీరోగమును హరించును. భోజనానంతరమున అన్నము జీర్ణమగుసమయమునందు దీనిని తినవలెను. దీనిగింజలుకూడమూత్రమును జారీచేయును. బలమునిచ్చును

కర్కాటకశృంగి:—సం. కర్కటశృంగికా, శృంగి, కాసవినాశిని అనియు, హిం. కాకడాశింగీ అనియుపేరు. దీనిఆకులు ఊడుగు ఆకులవలె నుండును. కొమ్మల నడుమ గుత్తులుగ కాయలు పూవులు బయలుదేరును.

ఇది చేదు వగరు రుచులు గురుగుణము, ఉష్ణవీర్యము, కటువిపాకముకలది. వాతము, ఎక్కిళ్ళు, అతిసారము, శ్వాసకాసలు, రక్తదోషము, పిత్తము, వాంతి, విషము, అరుచి వీనినిపోగొట్టును

కర్పూరము:—సం. హిమాంశు, సితాభ్రిక, రేణుసార, ఘనసార అనియు, హిం. కపూర్ అనియుపేరు. ఇదియొక వృక్షమునుండి పుట్టుసారము, కర్పూరవృక్షము, శీతలప్రదేశములందు పెరుగును. దీని సర్వాంగములును సువాసన గలిగియుండును. కర్పూరమును వెలిగించి దేవునకు నీరాజనమిత్తురు గాన హారతికర్పూరమనియు దీనిని పిలుతురు. పక్వము (వంటచేయబడినది) అపక్వము (వంటచేయబడనిది) అనియిది రెండు తెరగులు. అపక్వముశ్రేష్ఠము,

కర్పూరము మధుర తిక్త రసములు. లఘుగుణము, శీతవీర్యము, కటువిపాకముగలది. దీనిని చందనముతో చేర్చి శరీరమునకుపూసిన దాహ (మంట) రోగముశమించును. లవంగాలు ఒకభాగము, అక్కలకర్ర ఒకభా॥ కర్పూరము రెండుభా॥ కలిపి తేనెతో నూరి కుంకుడు గింజంతమాత్రలుచేసి ఒకటి రెండు మాత్రలు చల్లనినీళ్ళతో పుచ్చుకొనిన దప్పినణచును. రుచిబుట్టించును. తాంబూలముతో కర్పూరమును తినిన ముఖదుర్గంధము నణచును. దంతములకు బలముకలుగును. పుప్పిపంటిబాధ శమించును. నిద్రదెచ్చును, అమితముగాదినిన శుక్రమేహ



మును కలిగించును. శతపుత్రాభ్రిక సిందూరముతో కర్పూరమును సమానముగ కలిపి యిచ్చిన సెగరోగము నివర్తించును. నల్లమందు ఇంగువ కర్పూరము మూటిని సమముగకలిపి పెసరగింజలంతమాత్రలుచేసి సేవించిన కృములు గ్రహణి ఉబ్బసము నశించును. వర్షోదకములో హారతికర్పూరచూర్ణమును కలిపి కంట్లోవేసిన వేడివలనగల్గు కండ్లనుంట మెరుపు తగ్గును.

కర్పూరపుచెట్టునుండియు కర్పూరమునుండియు గూడ తైలము తీయుదురు. కర్పూరతైలమును గుండెలకురాచుటచేతను వేడినీళ్ళలోవేసి యానీటను గుడ్డనుముంచి పిడిచి యాగుడ్డతో కాపడము పెట్టుటచేతను గుండెలలోనొప్పి వగర్పు తగ్గును.

ప్రసన్నయను సారాయి 400 తు॥ కర్పూరము 32 తు॥ సన్నమొలకులు, తుంగముస్తలు, శొంఠి, వాము, వాయువిడంగాలు. ఇవి ప్రత్యేకము 4 తు॥ వీనినన్నిటిని నొక భాండమునవేసి చీరజేసి ఒకమాసము నిల్వయుంచి పిదప తీసి వడియగట్టిన నది కర్పూరాసవ మనబడును. దీనిని తులముమొదలు నాలుగుతులములవరకు వాడవచ్చును. దీనివలన విషూచి లేక కలరావ్యాధి తప్పకనశించును. మరియు నితరములగు అజీర్ణములు శూల తగ్గును.

కర్పూరశిలాజితు:—సం. శైలజ, శిలాజిత్, శైలసంభవ అనియు హిం. శిలాజీత్ అనియుపేరు, గోమూత్రశిలాజితు కర్పూరశిలాజితు అని శిలాజితు రెండువిధములు. కర్పూరశిలాజితు తెల్లగ యిసుకవలెనుండును. కర్పూరశిలాజితుభస్మము మధురరసము, శీతవీర్యము, గురుగుణము, మధురవిపాకముగలది. మూత్రకృఛ్రి అశ్మరి మేహము కామిల పాండువు అనురోగములను పోగొట్టును. కర్పూరశిలాజిత్తు రాతినార యీరెంటిని సమభాగముగ గ్రహించి దొండాకుపసరులో పదిదినములు నానబెట్టి రాసున్నముపోదిగి పుటమువేసిన తెల్లగభస్మమగును దీనిని పంచదారతోయిచ్చిన ఉడుకుదగ్గులు అత్యుష్ణము తగ్గును మూ

త్రముగావించును. శిలాజితుభస్మమును వెన్నలో కలిపి తినిన తెల్లకుసుమ శుక్లనష్టము కట్టును.

కర్పూరశిలాజితును ఏలకుల కషాయముతో ఉడికించినను కలబందగుజ్జులో మూడుదినములు నానబెట్టినను శుద్ధమగును. సున్నము కవచమిచ్చి పుటమువేసిన భస్మమగును. భస్మపు మోతాదు 4 మొదలు 8 గుంజలెత్తువరకు.

కర్పూరశిలాజితు అనుపేరుతో నాపరాళ్ళవంటి తెల్లనిరాళ్ళుకూడదొరుకును. ఇది కర్పూరశిలాజితు మాత్రముకాదు. గాని యీరాళ్ళుకూడ పైగుణములు కొలదిగ గలిగి యున్నవి. చూ. గోమూత్ర శిలాజితు.

కలకండ:—ఖండశర్కర అందురు, దీనిని పటికిబెల్లమనియు తవరాజమనియుకూడ వాడుదురు. ఇది మధురరసము, గురుగుణము, శీతవీర్యము, మధురవిపాకముగలది. వాతము, ఉబ్బుదగ్గు, సెగరోగము, మూత్రకృచ్ఛ్ర, ఉన్మాదము మొదలగు రోగములందు హితకరము. యెక్కువగతినిన కడుపులో సులపుసగును పుట్టించును. ఆగలిమందగించును. విరేచనబద్ధముచేయును.

కలబంద:—సం. సహా, ఘృతకుమారీ, దీర్ఘపత్రిక, అఫలా అనియు హిం. ఘీవారపాఠా అనియు పేరు. కలబంద అనునదియొక గుల్మము. మందమైనమట్టలును మట్టలలో మదపువాసనగల గుజ్జును ఉండును. కాయ ఆకు వెన్ను మొదలైనవి లేవు. సర్వాంగ సారమైన మూలిక.

కలబంద చేదు రుచి శీతవీర్యము గురుగుణము కటువిపాకము కలది. బలమును వీర్యమును కలిగించును. వాతము విషము మూత్రకృచ్ఛ్ర జ్వరము మున్నగురోగములను హరించును. కలబంద మట్టలను కుమ్ములోపెట్టి ఉడికించి పై చర్మమునుతీసివేసి లోనిగుంజులో పంచదార గలిపి తినిన సెగరోగము మూత్రము వచ్చునపుడు మంట మూత్రము బొట్లుగపడుట తగ్గును. కొద్దిగ విరేచనముచేయును. కలబంద మట్టను



కుమ్ములో ఉడికించి మధ్యకుచీల్చి కట్టుకటిన కపుకుదెబ్బ నొప్పి తగ్గును. కలబందగుంజులో పసుపు వాముకలిపి ప్రాతః కాలమందు యిచ్చిన ప్లీహ యకృత్ వృద్ధులు మానును.

కలబంద వేరు రసము నాగము (సీసము) భస్మముచేయుటకు ఉపయోగించును. వేరు చూర్ణము లేక రసమునందు ఆవుపాలుకలిపి పుచ్చుకొనిన రక్త ప్రదరము తగ్గును. పంచదార కలిపి త్రాగిన మూత్రము జారీచేయును. చలవచేయును. కలబందరసము పారదమందలి సప్త దోషమును పోగొట్టును.

కలిగొట్టు:—సం. పాటల, కాలవృంత, కర్బురా, అమోఘ అనియు హిం. పాడలి, పాఢల్ కర్ పాఢర్ అనియుపేరు. ఇదిపెద్ద వృక్షము మూలము (వేరు) ప్రధానముగాగలది. దీనికాయలు పొడవుగ రేలకాయలవలె నుండును. రేలకాయకంటె నాలుగైదు రెట్లు లావుండును. ఆకులు చిన్నమర్రియాకులవలెనుండును. దీనికాయలు సన్నని పొడవగు తొడిమయుండును. నలుపు తెలుపు పూవుల భేదముచేత నిది రెండు విధములు.

దీనివేరు చేదు రుచి ఉష్ణవీర్యము గురుగుణము కటువిపాకము గలది వాపు, శ్వాస, ఛర్ది, సన్నిపాతములు, ఆధ్మానము, వీనిని పోగొట్టును.

దీనిపుష్పములు తీపి వగరు రుచులు శీతవీర్యము గురుగుణము మధురవిపాకముకలవి. రక్తదోషము, దాహము, కఫము, పిత్తాతిసారము, పిత్తము వీనినిబోగొట్టును. వీర్యవృద్ధిని కాంతిని కల్గించును.

కలిగొట్టుపండు గింజలు చేదు వగరు రుచులు గురుగుణము శీతవీర్యము కటువిపాకముకలవి. మూత్రకృచ్ఛ్ర రక్తపిత్తము యెక్కిళ్ళు వాతము వీనినిహరించును

కలిగోటుగింజలు:—సం, వనకుళుత్థయనియు, హిం, చిమడ్ అనియుపేరు. కలిగోటుతీగ ఉలవతీగవలెనే యుండును. గాని కాయలు ఆకులు మాత్రము దానికన్నచిన్నవి. అడవి యులవలనే కలికోటు

గింజలు కలకోటుగింజలు అందురు. ఇవి నల్లగనుండును. పైపొట్టు తీసిన కలకోటుగింజల చూర్ణము చేదు కారము రుచులు, శీతవీర్యము కటువిపాకము స్నిగ్ధగుణము కలది. మలమూత్రములను జారీచేయును. మూలవ్యాధి కఫ శూల ఎక్కిళ్ళు దురద నేత్రవ్యాధులు వీనిని పోగొట్టును. ఈగింజల గంధమునుగాని చూర్ణమునుగాని కండ్లలో వేసిన కండ్లకలక మెరుపు పోటు నీరుగారుట మొదలగు కంటిరోగములుపోవును. శిశువులకు వచ్చు నేత్రవ్యాధులందు విశేషముగ వాడదగియుండును

కలి:—సం. కాంజిక, ఆరనాళ అందురు. ఒకకుండలో గంజి నీళ్ళుకలిపి పోసి అందు గుప్పెడుకంది గింజలు మూటగట్టివేసి మూతబెట్టి మూడునాలుగురోజులుంచిన నది పులియును. దీనికే కలియని పేరు.

ఇది పులుపు కారము రుచి ఉష్ణవీర్యము సరగుణము అమ్లవిపాకముకలది. ఒంటితలనొప్పి, క్షయ, శూల, అజీర్ణము, దప్పి, తాపము వీనినణచును. అన్నహితమును కలిగించును. ఒడదెబ్బతీర్చును.

కలిలో ఉప్పు కారము వేసి పొగిచినచారు లక్కిచారు అందురు. ఇది మిక్కిలి వేడిచేయును. జఠరదీప్తినిచ్చును. గుండెలలో నొప్పిపుట్టించును. శుక్ర స్తంభనము చేయును.

కలింగరాష్నము:—సం. కులంజ, గంధమూల, తీక్ష్ణమూల. కులుంజన అనియు, హిం. కులీంజన్ అనియుపేరు. ఇదియొకదుంపజాతి గుల్మము. పసుపు మొక్కయొక్క సర్వాకారములనుకలది. దీనిసర్వాంగములకును సువాసనగలదు. బాగుగా ముదిరినచెట్టుయొక్క మధ్యను ఒక పెద్దపూవుపూచి అనాసకాయవలె యెర్రని రంగుగలిగి గుండ్రనైనయొక కాయకాచును. దీనివేరును కలింగరాష్నమందురు. దీనిలో దుంపరాష్నము కళింగరాష్నము-అని. రెండుభేదములు కలవు. దుంపరాష్నపు దుంపలు కలింగరాష్నమునకంటె కొంచెములావుగనుండును. కలింగరాష్నము కొంచెము యెర్రగను దుంపరాష్నము తెల్లగనుఉండును.

కళింగరాష్నము కారము చేదు రుచులు ఉష్ణవీర్యము సరగుణము కటువిపాకము గలది. కంఠస్వరమును బాగుచేయును. అగ్నిదీప్తిని



రుచిని కల్గించును. ముఖరోగములను మాన్పును. కఫకాస, వాతకఫములు వీనిని జయించును.

కలివెచెట్టు:—సం. కరమర్ద, కరామ్ల అనియు, హిం. కరౌందా యనియుపేరు. అడవిలోనుండు పెద్దవృక్షము. దీని పచ్చికాయలు యెర్రగ పండ్లు నల్లగ నుండును.

కలివెపండు పులుపు తీపి రుచులు గురుగుణము ఉష్ణవీర్యము మధురవిపాకము గలది. పచ్చికాయలు రక్తపిత్తమును కఫమును పెంచును పండినది పిత్తవాతములను హరించును.

కలుగారినుగు:—సం. త్రాయమాణా, సుభద్రాణీ, త్రాయంతి, బలభద్రికా అనియు, హిం. త్రాయమాన్ అనియుపేరు. ఇదిపెద్ద వృక్షము. దీనిచెక్క వేరు ఆకు వీనిరసము లేక చూర్ణము తీపి వగరు రుచులు సరగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. పిత్తము ఛర్ది జ్వరము గుల్మము కఫము విషము శూల భ్రమ రక్తవికారము క్షయ ఆయాసము దప్పి హృద్రోగము రక్తపిత్తము దుర్నామరోగము వీనిని జయించును. త్రిదోషహరమైనది.

కలువ:—సం. కైరవ చంద్రకాంత గంధసోమ అనియు, హిం. కోయీ, ఒఘోలా, బబూలా అనియుపేరు. నీళ్ళలో మొలచెడు పూవుజాతి తీగ దీనిఆకు వెడల్పుగనుండును. కాడ నీటిలోను ఆకులు నీళ్ళమీదను తేలియుండును. ఎరుపు తెలుపు నలుపు పూవులభేదముచేనిది మూడువిధములు.

తెల్లకలువపూవు చేదు రుచి పిచ్ఛిల స్నిగ్ధగుణములు, శీతవీర్యము మధురవిపాకముగలది. కఫము రక్తదోషము తాపము శ్రమ పిత్తము మొదలగువాటిని శమింపచేయును.

కలువగింజలు మధురరసము రూక్ష గురుగుణములు శీతవీర్యము మధురవిపాకముగలవి. చూడు. నల్లకలువ ఎర్రకలువ

కల్లు:—ఈత, తాటి, కొబ్బరి మున్నగు చెట్లనుండి తీయబడిన కల్లు సాధారణముగా మధురరసము, శీతవీర్యము, గురుగుణము అమ్లవి

పాకము గలిగియుండును. మలమూత్రములను జారీచేయును. బలము ఉత్సాహము జఠరదీప్తి మత్తు కాంతి చలువ వీనినికల్గించును. ప్రొద్దెక్కినతరువాత పులిసినకల్లుత్రాగిన మతిభ్రమ అజీర్ణము కలరా రక్తపిత్తము మొదలగువ్యాధులను కలిగించును. సూర్యోదయమునకు పూర్వము తియ్యగానుండునపుడు కొలదిగా త్రాగిన కల్లు ఆరోగ్యకరము.

కవిరి:—సం. ఖాదిర, ఖైరసార అందురు. కాచు అనియు దీనిని వాడుదురు చండ్రచెట్టునుండి తయారుచేయబడు గ్రంధిదినుసు. తెలుపు నలుపు భేదముచే నిది రెండువిధములు.

కాచు వగరు రుచి శీతవీర్యము రూక్షగుణము కటువిపాకము కలది. కర్ణనేత్రరోగములు గ్రహణి కుష్ఠము చర్మరోగములు సెగరోగము శూల కాస వీనినిహరించును. విరేచనబద్ధముచేయును. నీళ్ళవిరేచనములను కట్టును. తెల్లకాచు మహిసాక్షి రెండును సమభాగముగచేర్చి మామిడిచెక్క రసముతో మూడుదినములు మర్దించి కుంకుడుగింజలంత మాత్రలుచేసి యిచ్చిన తెల్లకుసుమ కట్టును. నల్లకాచు కాసీసము వెలిగారము మహిసాక్షి వీనిని సమభాగముగ తేనెతోనూరి కుంకుడుకాయంత మాత్రలుచేసి ఉదయములందు మాత్రము సేవించుచున్న బుతుబద్ధమును విప్పును. కాచు రసకర్పూరము కలిపి చూర్ణించి సవాయిపుండ్లపైచల్లిన నవి మానుపట్టును. సంభోగ సమయమున లింగమునెయొక్క అడుగునన్నుండు నరము తెగిన పుండునకు రాచిన అది సంగుమగును. మ్రియూడలకషాయములో కాచు చూర్ణమును కలిపి పుక్కిటబట్టిన నోటిపూతతగ్గును. సీమసున్నము కాచు కలిపి చూర్ణించి దంతధావనముచేసిన దంతములవెంట పడు రక్తము కట్టును. చిగురువాపు తగ్గును. చిగుళ్ళుగట్టిపడును. నల్లమందు కాచు కలిపి కందిగింజలవలె మాత్రలుచేసి యిచ్చిన నీళ్ళవిరేచనములు కట్టును. జాజికాయ కాచు కలిపి చూర్ణించి పంచదారతోయిచ్చిన పురాణకాసలు శమించును. [illegible] కాచును నూరి పట్టువేసినచో వేడివలన ఉబ్బినకాలు చేతులు సమస్థితికివచ్చును. విశేషముగతినిన మూత్రమును బంధించును.



అశ్మరిని కలుగజేయును. నులివెచ్చని నీళ్ళలో కవిరిచూర్ణము వేసి వడియగట్టి కంటిలోవేసిన పుసి మంట మసక మెరుపు తగ్గును. చెవిలో పోసిన చెవిపోటు చెవుడు తగ్గును.

కసివెంద చెట్టు:—సం కాసమర్ద, అరిమర్ద, కాసారి, కర్కశ, కాలంకత అనియు, హిం. కసోండీ యనియు పేరు. ఇది చిన్న చెట్టు. భూమిపైని యించుమించు ముప్పావు గజము వరకు పెరుగును. దీనిసర్వాంగములకును వెగటు వాసనగలదు. దీనికాయలు సన్నముగ పొడవుగ పెసరకాయలవలెనుండును. పసుపు పచ్చని పూవుపూచును. ఆకులు కొంచెము కోలగ మొనదేలక గుండ్రముగనుండును.

కసివెందఆకు చేక వేగురసము చేదు తీపి రుచులు ఉష్ణవీర్యము రూక్షగుణము కటువిపాకముగలది ప్రధానముగా కాసరోగమును హరించును గాన కాస మర్ద కాసారియని దీనికిపేరుకలిగెను. మరియు అజీర్ణము పిత్తము కంఠరోగము వీనిని జయించును. అగ్నిదీప్తినిచ్చును. ఆకులను ఆముదము కలిపి వెచ్చజేసి కండ్లకు కట్టిన నేత్రరోగములుమానును ఆకురసము శరీరమునకుపూసిన చిడుము గజ్జి నశించును. ఆకును నూరి యాముద్దలో పసుపుకలిపి కట్టుకట్టిన గాయములు వ్రణములు మానును. ఆకురసమును అయిదారు చుక్కలు పంచదారమీద వేసి పుచ్చుకొనిన కళ్ళిదగ్గు తగ్గును. యెక్కువగతినిన వాంతిజేయును.

కసివెందవేరును నిమ్మపండ్లరసములో అరగదీసి రాచిన తామర నశించును. విత్తులకుగూడ యీగుణముకలదు. కసివెంద విత్తులను చూర్ణించి పాలతోత్రాగిన అతిమూత్రము కట్టును, కసివెందాకురసములో నాల్గవవంతు నూనెవేసి రసము యిగురువరకు కాచి వడియగట్టి యాతైలమును మర్దనచేసిన పక్షవాతపునొప్పులు వాతపునొప్పులు బెణుకు నొప్పులు తగ్గును.

కసివెందకాయలు లేతవిగ నుండునప్పుడు కూరవండుకొని తినిన శ్వాసకాసలు వాతము హరించును. మిక్కిలివేడిచేయును.

పాకము గలిగియుండును. మలమూత్రములను జారీచేయును. బలము ఉత్సాహము జఠరదీప్తి మత్తు కాంతి చలువ వీనినికల్గించును. ప్రొద్దెక్కినతరువాత పులిసినకల్లుత్రాగిన మతిభ్రమ అజీర్ణము కలరా రక్తపిత్తము మొదలగువ్యాధులను కలిగించును. సూర్యోదయమునకు పూర్వము తియ్యగానుండునపుడు కొలదిగా త్రాగిన కల్లు ఆరోగ్యకరము.

కవిరి: —సం. ఖాదిర, ఖైరసారఅందురు. కాచు అనియు దీనిని వాడుదుము చండ్రచెట్టునుండి తయారుచేయబడు గ్రంధిదినుసు. తెలుపు నలుపు భేదముచే నిది రెండువిధములు.

కాచు వగరు రుచి శీతవీర్యము రూక్షగుణము కటువిపాకము కలది. కర్ణనేత్రరోగములు గ్రహణి కుష్ఠము చర్మరోగములు సెగరోగము శూల కాస వీనినిహరించును. విరేచనబద్ధముచేయును. నీళ్ళవిరేచనములను కట్టును. తెల్లకాచు మహిసాక్షి రెండును సమభాగముగచేర్చి మామిడిచెక్క రసముతో మూడుదినములు మర్దించి కుంకుడుగింజలంత మాత్రలుచేసి యిచ్చిన తెల్లకుసుమ కట్టును. నల్లకాచు కాసీసము వెలిగారము మహిసాక్షి వీనిని సమభాగముగ తేనెతోనూరి కుంకుడుకాయంత మాత్రలుచేసి ఉదయములందు మాత్రము సేవించుచున్న ఋతుబన్ధమును విప్పును. కాచు రసకర్పూరము కలిపి చూర్ణించి సవాయిపుండ్లపై చల్లిన నవి మానుపట్టును. సంభోగ సమయమున లింగముయొక్క అడుగునన్నుండు నరము తెగిన పుండునకు రాచిన అది నయమగును. మర్రియూడలకషాయములో కాచు చూర్ణమును కలిపి పుక్కిటబట్టిన నోటిపూతతగ్గును. సీమసున్నము కాచు కలిపి చూర్ణించి దంతధావనముచేసిన దంతములవెంట పడు రక్తము కట్టును. చిగురువాపు తగ్గును. చిగుళ్ళుగట్టిపడును. నల్లమందు కాచు కలిపి కందిగింజలవలె మాత్రలుచేసి యిచ్చిన నీళ్ళవిరేచనములు కట్టును. జాజికాయ కాచు కలిపి చూర్ణించి పంచదారతోయిచ్చిన పురాణకాసలు శమించును. [illegible] కాచును నూరి పట్టువేసినచో వేడివలన ఉబ్బినకాలు చేతులు సమస్థితికి వచ్చును. విశేషముగతినిన మూత్రమును బంధించును. అశ్మరిని కలుగజేయును. నులివెచ్చని నీళ్ళలో కవిరిచూర్ణము వేసి వడియగట్టి కంటిలోవేసిన పుసి మంట నసక మెరుపు తగ్గును. చెవిలో పోసిన చెవిపోటు చెవుడు తగ్గును.



కసివెందచెట్టు:—సం కాసమర్ద, అరిమర్ద, కాసారి, కర్కశ, కాలంకత అనియు, హిం. కసౌంది యనియు పేరు. ఇది చిన్నచెట్టు. భూమిపైని యించుమించు మూడు గజము వరకు పెరుగును. దీనిసర్వాంగములకును వెగటు వాసనగలదు. దీనికాయలు సన్నముగ పొడవుగ పెసరకాయలవలె నుండును. పసుపు పచ్చని పూవుపూచును. ఆకులు కొంచెము కోలగ మొనదేలక గుండ్రముగనుండును.

కసివెందఆకు కేక వేగరసము చేదు తీపి రుచులు ఉష్ణవీర్యము రూక్షగుణము కటువిపాకముగలది ప్రధానముగా కాసరోగమును హరించును గాన కాసమర్ద కాసారియని దీనికిపేరుకలిగెను. మరియు అజీర్ణము పిత్తము కంఠరోగము వీనిని జయించును. అగ్నిదీప్తినిచ్చును. ఆకుల ఆముదము కలిపి వెచ్చజేసి కండ్లకు కట్టిన నేత్రరోగములుమానును. ఆకురసము శరీరమునకుపూసిన చిడుము గజ్జి నశించును. ఆకును నూరి యాముద్దలో పసుపుకలిపి కట్టుకట్టిన గాయములు వ్రణములు మానును. ఆకురసమును అయిదారు చుక్కలు పంచదారమీద వేసి పుచ్చుకొనిన కళ్ళిదగ్గు తగ్గును. యెక్కువగతినిన వాంతిజేయును.

కసివెందవేరును నిమ్మపండ్లరసముతో అరగదీసి రాచిన తామర నశించును. విత్తులకుగూడ యీగుణముకలదు. కసివెంద విత్తులను చూర్ణించి పాలతోత్రాగిన అతిమూత్రము కట్టును, కసివెందాకురసములో నాల్గవవంతు నూనెవేసి రసము యిగురువరకు కాచి వడియగట్టి యీతైలమును మర్దనచేసిన పక్షవాతపునొప్పులు వాతపునొప్పులు బెణుకు నొప్పులు తగ్గును.

కసివెందకాయలు లేతవిగ నుండునప్పుడు కూరవండుకొని తినిన శ్వాసకాసలు వాతము హరించును. మిక్కిలివేడిచేయును.

కసివెందాకు కూరచేసికొని తినిన వాతకఫములు కృమి శ్వాస కాసలు సవాయిరోగము తగ్గును. అమిత పిత్తప్రకోపమును కల్గించును తలదిమ్ము తెచ్చును.

కస్తూరి:—సం. మృగమద, మృగనాభి, కస్తూరి, గంధధూళి అనియు హిం. కస్తూరి అనియు పేరు. కస్తూరీమృగమను లేడివంటిదొక జంతువుయొక్క నాభినికోసి తీసిన నందు కస్తూరి యుండునని కొందరందురు. ఆమృగము యెదబోవుతరిని ఋతుకాలమున దానినాభినుండి యొకవిధమగు ద్రవముకారుచు అది పరుండురాళ్ళ కంటుకొనియుండగా ఆటవికులు దానిని తీసుకొనివచ్చి పల్లెలందును పట్టణములందును విక్రయింతురని కొందరును, మరికొందరు మరికొన్నివిధములుగను కస్తూరి పుట్టుకనుగురించి చెప్పుదురు. యెట్లైనను యిది కస్తూరిమృగమువలన బుట్టును. ఈకస్తూరి ఖారిక, తిలక, కుళుత్థ, పిండ, నాయిక అని అయిదువిధములు. ఖారిక చూర్ణాకారముగను, తిలక నువ్వుగింజలవలెను కుళుత్థ ఉలవగింజలవలెను, పిండ అంతకన్న కొంచెము పెద్దరవ్వలుగను, నాయిక దీనికన్న పెద్దరవలుగలదిగను ఉండును. కస్తూరి సాధారణముగా నలుపు పసుపు కలసిన రంగుకలదిగను మిగులపరిమళము కలదిగను ఉండును. కామరూప, నేపాల, కాశ్మీర దేశములందు కస్తూరి తరచు దొరకును క్రమముగా మొదటిదానికన్న రెండవది దానికన్న మూడవది అధమమైనది. చమురు పొగవాసనగలిగి నిప్పుపై వేసిన నిశ్శేషముగ మొదటనే కాలిపోవునదియు నూరిన మెత్తల రూక్షగ (విరవిరలాడునదిగ) నుండునదియునగు కస్తూరి మంచిదికాదు,

కస్తూరి కారము చేదు రుచులు ఉష్ణవీర్యము గురుగుణము కటువిపాకముగలది. వీర్యవృద్ధిని వీర్యస్తంభనమును ఆరోగ్యమును లక్ష్మిని యిచ్చును. కుష్ఠము ముఖరోగము దౌర్గంధ్యము ఛర్ది శోష విషము కఫము వీనినిబోగొట్టును. శరీరమునకు శీఘ్రముగ వేడినిచ్చును. నేత్రరోగమును వాతవ్యాధులను హరించును. మితిమీరి దీనిని సేవించిన పిత్తమును మలబద్ధమును చేయును. సన్నిపాతము జలుబు దగ్గు పడిసెము వీని



యందు విశేషముగ వాడుక చేయునగును. పసిబిడ్డలకు కస్తూరి రసకర్పూరము సమముగకలిపి ఆవగింజలవంటి మాత్రలుచేసి యిచ్చిన జలుబు అజీర్ణము ప్రక్కలువెచ్చబడుట ముసముస లాడుచుండుట మొదలగునవి తగ్గును. కస్తూరి అనేక యోగములందు ప్రధానముగచేర్చబడును.

కస్తూరిపసుపు:—సం. దార్వీభేద. ఆమ్రగంధ, సురభిదారు అనియు, హిం: కపూర్ హాలదీ, ఆంబియాహాలదీ అనియు పేరు: ఇది పసుపుజాతిలో భేదము. దీని సర్వాంగములును మామిడిచెట్టుయొక్క వాసనగల్గియుండును. ఇదియు దుంపయే ప్రధానముగాగలది.

దీనిదుంప తీపి చేదు రుచులు సర లఘుగుణములు శీతవీర్యము కటువిపాకము గలది: పిత్తము, దురద, వ్రణము, కాస, రొక్కెళ్ళు, విషము శ్వాస, జ్వరము వీనిని పోగొట్టును. దీని చూర్ణమును నీళ్ళతోతడిపి ముఖమునకు పూసుకొనిన సౌభాగ్యము కాంతి యిచ్చును. వెలిగారముకలిపిన నిమ్మపండ్లరసములో యీదుంపను నానబెట్టి యెండించిన సురసి కుంకుమ తయారగును. దానిని తేనెతో చిన్నంమొదలు రెండుచిన్నములవరకు తినిన కళ్ళెదగ్గు తగ్గును. యీకుంకుమను నల్లమందును కలిపి పెసరగింజంతమాత్ర మింగిన నీళ్ళవిరేచనములు కట్టును. నరమూత్రములోకలిపి తాగించిన తాచుపాము విషము హరించును.

కస్తూరిపసుపు దుంపను అరగదీసి యీగంధమును నరుకు గాయముచుట్టు పట్టించిన వాపుతగ్గును.

కస్తూరిబెండ:—సం. లతాకస్తూరి అనియు, హిం. ముష్కదానా యనియుపేరు ఇదియొక చిన్నచెట్టుచెక్క. దక్షిణదేశమందీచెట్టు కలదని నిఘంటువులలో నుండుటయుగాని కానవచ్చుటలేదు. ద్రవిడదేశమున "కశేకస్తూరి" యనిపేరు. దీనిని లతాకస్తూరియనియు ప్రసిద్ధముగ వాడుదురు.

ఇది చేదు తీపి రుచులు లఘుగుణము శీతవీర్యము కటువిపాకమును గల్గుది. మిక్కిలి తీక్ష్ణమైనది. నేత్రరోగములు కఫవాతములు దప్పి

ముఖరోగములు వాంతి దుర్గంధము మదము వీనిని బోగొట్టును, నోట గారుచొల్లును ఆపును.

కాంచనపుచెట్టు:—కాంచనార, కాంచన, కనకప్రభ అనియు హిం. కచనార్ అనియుపేరు. ఇదివృక్షజాతిలోనిది దీనికి రెండాకులు జంటగ గుండ్రడగ నుండును. కాయలు బద్దలువలె పలచక పొడవుగనుండును. తెలుపు యెరుపు పసుపు పూవుల భేదముచేతనిది మూడువిధములు. దేవకాంచన వృక్షమని దీనికి వాడుక కలదు.

కాంచనము వగరు, రుచి, రూక్షగుణము. శీతవీర్యము, మధుర విపాకముకలది. శ్వాస కాసలు రక్తపిత్తము ప్రదరము వ్రణములు మూత్రకృచ్ఛ్ర శోష గుదభ్రంశము దాహము కఫము వీని నశింపచేయును. మలబద్ధము కలిగించును. దేవకాంచనపు చక్కరసమందు లేక కషాయమందు తేనెచేర్చియిచ్చిన క్షయమహరించును. గ్రహణికట్టును. చక్కచూర్ణమును గాయముపైనచల్లిన నవిమానును. పచ్చ దేవకాంచనపు చక్కచూర్ణమున తాటికలకండ కలిపితినిన సెగరోగమును యెర్రకాంచనపు చక్క చూర్ణమును తేనెతోయిచ్చిన రక్తప్రదరమును తగును.

దేవకాంచనపుపట్ట 10 పలములు, త్రిఫలములు 6 ప॥ త్రికటుకములు 3 ప॥ ఉలిమిడిపట్ట 1ప॥ లవంగాలు, యేలకులు, జాపత్రి యివి ప్రత్యేకమొక కర్షము పైయన్నిటి చూర్ణమునకు సమముగ మహిసాక్షి యీయన్నిటినికలిపి పాకముబట్టి కుంకుడుగింజలంత మాత్రలుచేసి సేవించిన గండమాల, అపచి, అర్బుదము, గ్రంధులు, వ్రణము, గుల్మము, కుష్ఠము, భగందరము నివర్తించును. ఇదియె కాంచనార గుగ్గులు అని చెప్పబడును. మూడువిధములగు కాంచనపుచెట్లును సమానగుణములుకలవి

కాండ్రేగుచెట్టు:—సం. వికంకత, స్రువావృక్ష, కంటకి అనియు హిం. కంటాయీ, కింకిణీ, వంజ అనియుపేరు. అరణ్యములలో పెరుగువృక్షము. బలుసుఆకులవంటి ఆకులుండును. చెట్టంతయు ముండ్లుండును దీనిపచ్చికాయలు యెర్రగను పండినవినల్లగనుమధురముగనుండును



కాండ్రేగుఆకు లేక వేరుచక్క రసమునందు శొంఠిచూర్ణముచేర్చి యిచ్చిన గ్రహణితగ్గును. పసుపుకలిపియిచ్చిన పాము విషము తొలగును.

కాండ్రేగుపండు కొంచెము పులుపు తీపిరుచులు శీతవీర్యము లఘుగుణము మధురవిపాకముగలది. అగ్నిదీప్తిని, జీర్ణశక్తిని కల్గించును. కామల పిత్తము దాహము శోష వీనినిహరించును.

కాంతలోహము:— సం. అయస్కాంత, కృష్ణాయస, లోహకాంతిక అనిపేరు. భ్రామకము, చుంబకము, కర్షకము, ద్రావకము, రోమకము అనికాంతము అయిదువిధములు. భ్రామకాది కాంతములు ప్రత్యేకము పసుపు నలుపు యెరుపు రంగులతో భేదించియుండును. పీత కాంతము రసవాదమునందును, కృష్ణకాంతము రసాయనమునందున్ను, రక్తకాంతము రసబంధమందును ఉపయుక్తము. ద్రావకము శ్రేష్ఠము, భ్రామక చుంబక కాంతములు ఔషధయోగములంజేర్పదగియుండును.

కాంతము చేదు రుచి ఉష్ణ రూక్షగుణములు శీతవీర్యము మధుర విపాకముగలది. మేహము త్రిదోషవికారములు, మూలవ్యాధి గుల్మ ప్లీహ యకృత్తులు క్షయ పాండువు ఉదరరోగము జ్వరము కృమి స్థౌల్యము కఫము మొదలగు అనేకరోగములను హరించును. ఉక్కునందున్న సమస్తగుణములును దీనియందుగూడ గలవు. ఇది సర్వలోహములలో నుత్తమమైనది ఆయారోగములకనుకూలములగు అనుపానములతో సర్వరోగములందును దీనిని వాడవచ్చును. లోహమునువలె దీనిని శోధన మారణములజేయవచ్చును

కాకర:—సం. కారవేల్లి, బృహద్వల్లి, కారవేల్ల అనియు, హిం. కరేలాఅనియుపేరు, కాకర తీగజాతిలోనిది. దీనిలో అనేక జాతులుకలవు. దీనిఆకులు చీల్పులు కలిగి షుమారు మూడంగుళముల వెడల్పు కలిగియుండును. పువ్వులు పసుపు పచ్చగ నుండును పెద్దకాకర కాయలు గొగ్గులుగలిగి పొడవుగను పొట్టికాయలు గుండ్రముగను ఉండును. పొట్టికాయలు పొడుగుకాయలకంటె చేదుయెక్కువగనుండును.

పొడుగు కాకరాకు చేదు రుచి ఉష్ణవీర్యము, రూక్షగుణము, కటువిపాకముగలది. దీనిరసము కండ్లలోవేసిన దోషజ్వరము మగత తలనొప్పితగ్గును. కాకరాకుకూర తినిన కడుపులోని నులుపురుగుచచ్చును. జ్వరము క్షయ కడుపుబ్బరము తగ్గును. శుక్రమునకు చెరుపుచేయును

కాకరకాయ చేదు రుచి లఘుగుణము శీతవీర్యము కటువిపాకము కలది. జ్వరము కఫము పాండువు మేహము కృమి వీనిని నశింపచేయును. వేడిచేయును.

పొట్టికాకరకాయ జ్వరము చర్మరోగములు వాతకఫములు క్రిములు వీనినిహరించును. త్రిదోషహరము వేడిచేయును.

కాకిచెరకు:—చూ. చెఱకు.

కాకిదొండ:—సం. కాకనాసా, కాకాంగి, కాకతుండ అనియు, హిం. కౌఆఠోడీ అనియుపేరు. ఇది తీగ. దొండతీగలలో అనేకభేదములుకలవు. దీనికాయలు పండినపుడు యెఱ్ఱగ గుండ్రగ సిమ్మకాయలంత పెద్దవిగ నుండును.

కాకిదొండాకు రసము చేదు రుచి ఉష్ణవీర్యము, రూక్షగుణము, కటువిపాకముకలది. మూలవ్యాధి, కఫము, అజీర్ణము వీనినిజయించును.

కాకిదొండగింజలలోని పప్పు వగరు తీపిరుచులు స్నిగ్ధగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. పిత్తము వాంతి అజీర్ణము అపస్మారము విషము వీటినిహరించును. కాకిదొండగింజల చూర్ణమును తేనెతోయిచ్చిన తక్షణము వాంతి యెక్కిళ్ళు కట్టును

కాకిమాంసము:—ఉప్పదనము, గురుగుణము, ఉష్ణవీర్యము, మధురవిపాకముకలది. త్రిదోషములను ప్రకోపింపజేయును.

కాకిమారేడు:—సం. లక్ష్మీశ్రీఫల. గంధగర్భ అని పేరు. మారేడుయొక్క గుణములన్నియు దీనికిగలవు. చూ మారేడు.

కాకోళి:—సం. కాకోలి, వయస్థ, శుక్ల అనిపేరు. ఇది ప్రస్తుతము దొరుకుటలేదు, ఇది మధుర తిక్తరసములు గురుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. క్షయ పిత్తము రక్తదోషము రక్తపిత్తము



దాహము జ్వరము మొదలగురోగములను హరించును. కఫమును వీర్యవృద్ధిని బలమును కాంతిని కలిగించును.

కాచనిపాలు:—కఫమును పెంచును. గురుత్వముగ నుండును. చనుబాలుతప్ప తక్కిన అన్నిపాలను కాచి త్రాగవలెను.

కాచలవణము:—సం. కాచ, త్రికూట, పాక్య అనియు. హిం. కాచియానోన్ అనియుపేరు. కాచలవణము ఉప్పదనము గురుగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. దీపనశక్తి నిచ్చును. రక్తపిత్తకరము. చూ. పంచలవణములు.

కాటుకగింజలు:—వీనిని దోరగావేయించి చూర్ణముచేసి వేడినీళ్ళతో త్రాగిన చక్కగా విరేచనముచేయును. శ్లేష్మము హరించును.

కానుగుచెట్టు:—సం. కరంజ. నక్తమాల, పూతిక, చైదర్య కలిమార అనియు, హిం. కరంజ అనియుపేరు. ఇది పెద్దవృక్షము. దీని సర్వాంగములకును వెగటు వాసనకలదు వేసవికాలమందిది చిగురుపట్టి పూచును. పూత తెలుపు నలుపు రంగులుకలది. కాయలుకొంచెము వంకరగ బల్లపరుపుగ మోనుగమాడలంత వెడల్పుగలవిగ నుండును. ఒకతొడిమకు అయిదుఆకులు కొనదేరి గుండ్రగనుండును. మహాకరంజ, పూతికరంజ, కరంజ ఘృతకరంజ, గుచ్ఛకరంజ మొదలగు భేదములు యేడుగలవు. ఇంచుమించుగ స్వరూపాదులన్నిటికిని సమానములు

కానుగచెక్క క్షారము చేదు రుచులు ఉష్ణవీర్యము రూక్షగుణము కటువిపాకముగలది. ఉదావర్తము, వాతము, యోనిదోషము, వాతము, గుల్మము, మూలరోగము, కృమి, కుష్ఠము, వ్రణము మొదలగురోగములను హరించును. కానుగుఆకులను నూరి కట్టుగట్టిన వ్రణమునందలి పురుగులుచచ్చును వ్రణముమానును. ఆకురసమందు మిరియాలచూర్ణముకలిపి పూసిన గజ్జి చిడుము మానును. ఆకురసమును తెల్లజొన్నకలిలో వేసియిచ్చిన సెగరోగమునశించును.

కానుగుగింజలలోని పప్పును నిమ్మపండ్లరసముతో అరగదీసి గాచిన తామర హరించును. పప్పుచూర్ణమును తినిన కుష్ఠము సవాయిపుండ్లు మానును. గానుగువేరుచక్కరసము 4 భాగములు, నూనె 1 భా॥ నూనెకు 8 వ వంతు పసుపు, పసుపుతోసమానము మైలతుత్థము వీని నన్నిటినిచేర్చి రసముయిగురువరకుకాచి వడియగట్టిరాచిన సెలలువేయు మొండికురుపులు మానును. వేరురసముతోగాని కషాయముతోగాని భగందరము సవాయిపుండ్లు మొదలగువాట్లను చక్కగా కడిగిన నవి వెంటనే మానుపట్టును.

కానుగుపూవులు మిర్యాలు సమముగ కలిపి నూరి కుంకుడుగింజలంతమాత్రలుచేసి నేరేడుచక్క కషాయముతో తినిన అతిమూత్రము తగ్గును.

కానుగుచిగుళ్ళను ఆముదముతో చేర్చి వెచ్చజేసి నూరి కట్టిన మూలవ్యాధి బాధ తగ్గును. కానుగు పుడకతో దంతధావనము చేసిన పండ్లు గట్టిపడును.

కానుగుచెక్కను కాల్చి మసిచేసి యామసిని తెల్లజిల్లేడుపాలతో తడిపి బిళ్ళచేసి యెండించి కొలిమిలో యెర్రగ కాల్చి యాభస్మమును అడ్డిగెత్తుమొదలు చిన్నమువరకు తమలపాకులోపెట్టి నమిలినను. లవంగాలరసముతో కలిపి పుచ్చుకొనినను శ్లేష్మమునుకోయును. కళ్ళి తెగిపడును. ఆయాసముతగ్గును.

కానుగుగింజలనుండి తీసిన తైలము చేదు రుచి ఉష్ణవీర్యము తీక్షణగుణము కటువిపాకముకలది. కృములను హరింపచేయును. దేహమునకుపూసిన గజ్జి చిడ వ్రణములు దద్దురులు తామర మొదలగు చర్మరోగములు నశించును. శరీరకాంతినిచ్చును. యీతైలమును మర్దన చేసిన మేహవాతపునొప్పులు తగ్గును.

కాఫీ:—ఇది విదేశీయమైన చెట్టు. వేయించిన కాఫీగింజల పానీయ కషాయమునందు పాలు చక్కెర గలిపి పుచ్చుకొనిన ఆకలి నశించును. మూత్రముజారీచేయును. చురుకు పుట్టించును. మాంద్యమును



విడగొట్టును. కొద్దిగ మత్తుచేయును. జలుబునుహరించును. అలవాటుగ ప్రతిదినము సేవించుచుండిన అతిమూత్రము మధుమేహము అగ్నిమాంద్యము ఇంద్రియనష్టము వీనిని గలుగజేయును.

కాబేజీపూవు:—సం. పుష్పగోభి, స్వాదుశాక, మధ్యపుష్ప బృహద్దల అనియు, హిం. ఫూల్‌గోభి అనియుపేరు. ఇది ప్రస్తుతము దక్షిణదేశమున పెరుగునట్టి పుష్పశాకము, గుల్మజాతిలోచేరును. ఆకుపచ్చ తెలుపు వర్ణముగలిగి సూర్యగుమ్మడికాయంత ఆకారముగలదిగ గుండ్రగనుండును, ఆకులు పొరలు పొరలుగ చుట్టుకొని ఊడవలె నుండును. పుష్పగోభి, పత్రిగోభి. గ్రంథిగోభి యని యిందు మూడుజాతులుకలవు.

పుష్పగోభి తీపి రుచి గురుగుణము శీతవీర్యము మధురవిపాకము గలది. మలబద్ధము బలము అగ్నిమాంద్యము కలుగజేయును.

పత్రగోభియు గ్రంథిగోభియు మధురరసము సర గురుగుణములు శీతవీర్యము మధురవిపాకముగలవి. మగుల బలమును కఫమును అగ్నిమాంద్యమును కలిగించును.

కామంచిచెట్టు:—సం. కాకమాచీ, వాయసి, ఘనాఘన అనియు, హిం. మకోయ, కబైయా అనియుపేరు. కామంచిచెట్టు భూమిపై గజములోపుగా పెరుగును దీనికాయలు గుండ్రగ శనగలంత ఆకృతిగలవిగ ముత్యములవలె నుండును పచ్చికాయలు ఆకుపచ్చగను పండినపుడు పగడపురంగుగను ఉండును. చెట్టుఅంతయు ఇంచుమించుగ మిరపచెట్టు ఆకారముగలది. పూవులు తెల్లగనుఉండును.

కామంచి కారము చేదు రుచులు ఉష్ణవీర్యము సర లఘు రూక్షగుణములు కటువిపాకముగలది. త్రిదోషహరము. కంఠస్వరమును బాగుచేయును. వాపు కుష్ఠము అర్శస్సు జ్వరము మేహము ఎక్కిళ్ళు ఛర్ది హృద్రోగము కఫ శూల దురద శ్వాసకాసలు వీనినిహరించును. ఆకురసమును చెవిలోపోసిన పోటుతగ్గును. చెవిలోనుంచి చీముకారుట పుగుగులుపడుట తగ్గును చెవిలో పురుగులుచచ్చును. నేత్రములకు హి

తకరము ఆకును కూరవండుకొని తినిన కడుపులోని నులిపురుగులు చచ్చును. నంజుతగ్గును. అగ్నిదీప్తినిచ్చును. వీర్యవృద్ధి కలిగించును. కామంచిపండ్లకు కాయలకుగూడ యీగుణములుగలవు.

కామంచికసవు:—అనగా కత్తృణము. చూ. కత్తృణము.

కాయఫలము:—చూ. కట్ఫలము.

కాయము:—త్రికటుకములు, వోడి, వెల్లుల్లి, కటుకరోహిణి, బెల్లము, నేయి మొదలగు వస్తువులతో తయారుచేయబడిన యొక విధమగు చూర్ణము. బాలింతల గర్భశైత్యమును బోగొట్టును. శరీరమును ఆర్చును. ఆకలి బుట్టించును. జీర్ణశక్తి నిచ్చును. శూలను హరించును.

కారుకోడిమాంసము:—అడవికోడిని కారుకోడిలని వాడుదురు. దీనిమాంసము స్వల్పపథ్యమైనది. మధురరసము గురుగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. వీర్యవృద్ధిని శ్లేష్మమును కలిగించును పిత్తవాతములను హరించును.

కారుచిక్కుడు:—సం. కోలశింబీ, సూకరపాదిక అనియు హిం గోజియాసేమ్ అనియుపేరు. కారుచిక్కుడుకాయ మధురరసము గురుగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. బలమును పిత్త కఫమును పెంచును ఆలస్యముగ అరుగును. వీర్యవృద్ధిని అగ్నిమాంద్యమును కలిగించును రుచికరమైనది

కారుపెసర:—సం. ముద్గపర్ణి, క్షుద్రసహా, మార్జారగంధిక, శూర్పపర్ణి అనియు హిం మూక్ముగాని యనియుపేరు. ఇది సాధారణముగ పెసరచెట్టువలె నుండును. తీగబారికదు. క్షుపము. చెట్టంతట కొలదిగ నూగుండును. మంచిపెసరకన్న దీనికాయలు గింజలు ఆకులు చిన్నవి. గింజలు చేదుగ నుండును. చెట్టు బూడిదచల్లినట్టు తెలుపుగ నుండును. సమూలముగ దీనినౌషధములంవాడుదురు.

ఇది మధుర తిక్త రసములు గురు రూక్ష గుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. దాహజ్వరమును కృములను హరించును.



కఫమును శుక్రమును వృద్ధిచేయును. గ్రహణి అర్శస్సు అతిసారము వీనిని జయించును.

కారుమినుముచెట్టు:—సం. మాషపర్ణి, కృష్ణవృంత, పాండులోమశ, హయపుచ్ఛి, సింహపుచ్ఛిక అనియు, హిం. మషవన్ అనియుపేరు చిన్నక్షుపము. చెట్టంతయు తెల్లని నూగుతో నిండియుండును. మినపచెట్టునకు దీనికి విశేషభేదమిదియే. కాయయు గింజలును మినుములకన్న చిన్నవి. సమూలముగ దీనినౌషధములం జేర్పదగును.

ఇది చేదు రుచి రూక్షగుణము శీతవీర్యము కటువిపాకము గలది. శుక్రవృద్ధి బలము కాంతి పుష్టి కలిగించును. స్తన్యమును వెద్రుకలను వృద్ధిచేయును. వాతపిత్తములను హరించును. కఫమును పెంచును. రక్తపిత్తము క్షయ కాస శోష దాహము వీనిని హరించును.

కారుమునగచెట్టు:—సం. వనశిగ్రు, మురంగి, ముఖభంగ అనియు, హిం. వనసౌజిన్ అనియుపేరు. మంచిమునగచెట్టుయొక్క సర్వాకారములను కలది.

కారుమునగచెక్క కారము రుచి తీక్ష్ణగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. ప్లీహ గుల్మము అష్టవిధశూలలు శ్వాసకాసలు పీనస వాపు వీనినిశమింపచేయును. గర్భపాతమునుకల్గించును.

కారుమునగకాయ చేదుగనుండును. సంభోగశక్తి హెచ్చించును. శ్వాసకాసలు శోష మూలవ్యాధి వీనినినశింపచేయును.

కారుమునగపూవును కూరవండుకొని తినిన కఫప్రకోపము నణచును. వేడిచేయును. కండ్లుతిరుగును. పిత్తమునుహెచ్చించును.

కావిరాయి:—సం. గైరిక, రక్తధాతు, సురంగధాతు, గిరేయక అనియు, హిం. గైరిక యనియుపేరు. గైరికము స్వర్ణగైరికము పాషాణగైరికము అని రెండువిధములు. స్వర్ణగైరికము మిక్కిలి యెఱ్ఱగ స్నిగ్ధముగ దట్టముగ నుండును. పాషాణ గైరికము కఠినముగ తా

మ్రవర్ణము కలదిగ నుండును. ఇది పర్వతములందు పుట్టు ఒకవిధమైన రాయి. పాషాణగైరికము గుణహీనమైనది.

గైరికము వగరు రుచి స్నిగ్ధగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. నేత్రరోగములు రక్తపిత్తము హిక్క వమనము విషదోషము వీనినిహరించును. శుద్ధిచేసిన గైరికచూర్ణమును పంచదారతో తినిన రక్తప్రదరము కట్టును. మూత్రమువెంటపడు సుద్ధకట్టుతగ్గును. అమితముగాతినిన మలబద్ధము అగ్నిమాంద్యముచేయును. మోతాదు రెండుమొదలు 4 గుంజలెత్తువరకు.

కింకిరాతవృక్షము:—సం. కింకిరాతి, పీతభద్ర, విప్రలంభి అనియు, హిం. కింకిరాత్ అనియు పేరు. బంగారువన్నెగల పచ్చనిపూవులు పూయు పుష్పజాతిగుల్మము.

కింకిరాతపుష్పము చేదు వగరు రుచులు లఘుగుణము శీతవీర్యము కటువిపాకముగలది. విషము క్రిమి శోథ శ్లేష్మము కుష్ఠము వీనిని జయించును. కర్ణరోగములను పోగొట్టును.

కిక్కిసగడ్డి:—సం. నల, పోటగల శూన్యమధ్య. ధమన అనియు, హిం. నరసల్ అనియు పేరు. నలము దేవనళము అని దీనిలో రెండుజాతులుకలవు. వెదురుపొదవలె నదులు చెరువులుమున్నగువాని యొడ్లయందు మొలచును. దీనిఆకులు వెన్ను చెరుకు ఆకును వెన్నును పోలియుండును. చెరకుగడకంటె యిది మూడురెట్లు పొడవుగ పెరుగును. కిక్కిసగడలమధ్య వెదురునకువలె బోలుండును, నళముకన్న దేవనళము మంచిది. రసకర్మయందిది ఉపయుక్తము.

కిక్కిసగడ్డి లేక గడలు తీపి వగరు చేదు రుచులు గురు ఉష్ణగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. వీర్యవృద్ధిని బలమును కలిగించును. మూత్రమును జారీచేయును. తాపము రక్తదోషము యోనిరోగము శూల పిత్తము విసర్పము వీనిని హరింపచేయును.

కిసిమిస్ పండు:—వృక్షజాతిలో చేరినది ద్రాక్షతీగకును కిసిమిస్ తీగకు భేదమేమియులేదు కిసిమిస్ పండులో గింజలుండవు.



కిస్‌మిస్ పండు తీపి రుచి ఉష్ణగుణము శీతవీర్యము మధురవిపాకముకలది. దప్పి మేహము దగ్గు మూలవ్యాధి వీనిని పోగొట్టును. బలము వీర్యవృద్ధి కలిగించును. ద్రాక్షపండు యొక్క గుణముల నన్నిటిని కలిగియుండును.

కుంకుడుచెట్టు:—సం. అరిష్ట, ఫేనిల, కృష్ణపర్ణ, అర్థసాధన అనియు, హిం. రీఠా అనియుపేరు. ఇది పెద్దవృక్షము. ఆకు కొంచెము కోలగ గుండ్రగ నుండును కాయలు గుండ్రగ చిన్నవిగను పూవులు తెల్లగను గుత్తులుగను ఉండును కాయలను నీళ్ళతో నూరిన నురుగు వచ్చును.

కుంకుడుకాయలు చేదు కారము రుచులు తీక్ష్ణ గురుగుణములు ఉష్ణవీర్యము కటువిపాకము గలది. త్రిదోషములను హరించును. గర్భపాతమును వాంతినిచేయును. కుంకుడుకాయను చనుబాలతో అరగదీసి ముక్కులోబోసినయెడల పార్శ్వపునొప్పి మాయమగును. రోగి స్త్రీఅయినయెడల మగబిడ్డగల స్త్రీపాలును, పురుషుడైన యెడల ఆడుపిల్లగల తల్లిపాలును అరగదీయుట కుపయోగించవలయును. నాభి మొదలగు విషములను తినిన వారలకు వాంతిచేయుటకు దీని రసమును 4, 5 తులములయెత్తువరకు త్రాగించవచ్చును.

కుంకుడుకాయ సహాయమున అనేక పాషాణములను భస్మము చేయవచ్చును. కుంకుడుకాయపులుసుతో తలరుద్దుకొనిన కొందరకు తలనొప్పిపుట్టును. కొందరకు తలనొప్పికుదురును. కుంకుడుఆకును కొద్దిగావెచ్చజేసి తలకుగట్టిన శిరోవాతము హరించును.

కుంకుమపూవు:—సం. కాశ్మీరజ, కుంకుమ, బాహ్లీక అనియు హిం. కేసర్ అనియుపేరు. కాశ్మీరదేశమునందును, హీరానీదేశమునందు పుట్టు సుగంధద్రవ్యము, తామరపూవులోని కేసరములవలె యెఱ్ఱగ తెల్లగనుండును. యీ కేసరము చేతితోనలిపిన రంగుచెడక యుండెనేని యది మంచిదని గుర్తించవలెను. కొందరు గడ్డికి రంగువేసి దగా

చేయుదురు. కృత్రిమ కేసరమునకు చమురుండదు. మంచి కుంకుమపువ్వు స్నిగ్ధముగానుండును.

ఇది కటు తిక్తరసములు ఉష్ణవీర్యము లఘుగుణము కటువిపాకము గలది. వాతకఫములు కాస కంఠరోగము తలనొప్పి విషదోషము వీనినిహరించును శరీరకాంతినిచ్చును.

ధాతుపుష్టి, వీర్యవృద్ధి, వీర్యస్తంభనము, సంతోషము, ఆయువు, జ్ఞాపకశక్తి, రక్తవృద్ధి వీనిని కలిగించును. ఊర్ధ్వజత్రుగ (కన్ను ముక్కు చెవులు మొదలగువానిలోబుట్టెడు) రోగములను మాన్పును. రేలవేరు కుంకుమపువ్వు కలిపి నీళ్ళతో నూరి రాచినయెడల శోభి బొల్లి ముఖముపై లేచెడు మొటిమలు మానును. 5 మిరియములు 5 గుంజ లెత్తు కుంకుమపువ్వు కలిపి నూరి నీళ్ళతో కలిపి స్త్రీ ప్రసవించిన వెంటనే యిచ్చిన మైలరక్తమును వెడలించును గర్భమును శోధించును. జ్వరము[illegible]జేయును. చిల్లగింజగంధములో కుంకుమపువ్వునుకలిపి న[illegible] కంటిచుట్టు పట్టువేసిన నేత్రరోగములుమానును.

కుందురుష్కము:— చూ. ఫిరంగిసాంబ్రాణి.

కుందేలుమాంసము:— సం. శశ అందురు. కుందేలును చెవులపిల్లియనియు వాడుదురు. దీనిమాంసము మధురరసము, స్నిగ్ధగుణము, ఉష్ణవీర్యము, మధురవిపాకముగలది. అగ్నిదీప్తిని, వీర్యవృద్ధిని, బలమును వేడిమి కలిగించును. జ్వరము పాండువు క్షయ కాస గుదరోగము అతిసారమ్ము అన్న రోగములుకలవారలకు మిక్కిలి పథ్యముగనుండును.

కుక్కగొడుగు:— సం. సంస్వేదజ, భూమిచ్ఛత్ర, శిలీంధ్రిక అనియు, హిం. సాంపకీ ఛత్రీ, ఛత్తోనా, ఛాతా యనియు పేరు. కుక్కగొడుగు అనునది గొడుగుయొక్క ఆకారము గలదిగ భూమిపై బెత్తెడు ఎత్తున పెరుగునట్టి మొక్క. దీనికిఆకులుండవు. దుర్వాసనగనుండును. సాధారణముగనిది మిక్కిలి మెత్తగనుండును. దీనిలో కొన్ని అరచేతి ఆకారముగామొలచును. అట్టిదానిని "మొండిచేయి" అందురు. మొండిచేయి మొలచినయింటిలో కాపురముండక కొంతకాలము విడచి పెట్టుదురు. కుక్కగొడుగులను కొందరు కూరవండుకొని తిందురు. సాధారణముగా శ్మశానములు పశువులసాలలు ఊముకబూడిదపోసిన చోటులు వీనియందు కుక్కగొడుగులు మొలచును.



ఇది మధురరసము పిచ్ఛిల గురుగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. ఛర్ది జ్వరము అతిసారము శ్లేష్మము వీనినిపుట్టించును. మిగుల దోషయుక్తమైనది బలమునుకలుగజేయును

కుక్కగొడుగులు ఒకానొకచోట తెలుపు ఎరుపు నలుపు రంగులుగగూడ నుండును. నల్లది మధురరసము గురుగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముకలది ఎర్రనిది తక్కిన రెంటికన్న స్వల్ప దోషములు కలది

కుక్కతులసి: తులసియొక్క గుణములను కలిగి యుండును. చూ. తులసి.

కుక్కపొగాకు:— ఇది తడిగల సర్వప్రదేశములందును దొరకును ఇది పొగతరముయొక్క వాసనను రూపమును గలది. గాని దీనికి పూతయుండదు. పొగతరపుఆకుకన్న దీనిఆకు వెడల్పు పొడవు ఎక్కువగ నుండును.

దీనిరసమునందు మిరియాలచూర్ణము కలిపి జ్వరము విడిచినవెంటనేగాని, ఉదయమునగాని యిచ్చిన వరుసజ్వరముమానును. మోతాదు అరతులము దీని సమూలకషాయము లేక రసము వాతపు నంజును హరించును. ఆకునునూరి కట్టిన కుళ్ళు వ్రణములుమానును. దీనిని వాదమునందు మిక్కిలి ప్రశంసింతురు. దీనిరసముతో నూరుచు 20 పుటములువేసిన అభ్రకము సిందూరించును.

కుక్కమాంసము:— మిక్కిలి వేడి చేయును. వాతమును హరించును.

కుక్కవాయింట:— చూ. వాయింట.

కుకుందరము:— సం. కుకుందర, తామ్రచూడ అనియు, హిం. కుకురౌందా అనియుపేరు. ఇది క్షుపము. నిలువుగపెరుగును. దీనిగూ

కులు తమలపాకులవలెనుండును. కోడిపుంజు జుట్టువంటి యెఱ్ఱనిజడయొకటి చివళ్ళ లేచును. సీతామ్మవారిజడలని దీనిని చెప్పుదురు.

ఇది కటు తిక్తరసములు. ఉష్ణవీర్యము, రూక్షగుణము, కటువిపాకముకలది. రక్తదోషము, కఫము, దాహము, దప్పి వీనిని హరించును. దీనిపచ్చివేరును నోటనుంచుకొనిన ముఖదోషము హరించును.

కుచందనము:—సం. తామ్రాభ, తామ్రసార, రక్తచందన, కుచందన, పతంగ అనియు, హిం. లాల్ చందన్ అనియు పేరు. పెద్ద వృక్షము. యెఱ్ఱగనుండును.

ఇది తీపి చేదు రుచులు శీతవీర్యము గురుగుణము కటువిపాకము కలది. పైకి పూతపూయుటకు దీనిగంధము మిగుల నుపయోగకరము. నేత్రములకు హితకరము. ఛర్ది రక్తపిత్తము కుష్ఠము దప్పి జ్వరము వ్రణములు విషదోషము వీనినిహరించును. దీనిగంధములో హారతికర్పూరముచేర్చి రాచిన సర్పి, చిడుము, కాలినపుండ్లు మొదలగు చర్మరోగములు నశించును. మేహవాతపునొప్పులు కీళ్ళనొప్పులుహరించును.

కుప్పింటచెట్టు:—మూర్కొండచెట్టు జాతిలోనిది. రెండును సమానాకారములు గలవి. కుప్పింటాకులు కొలదిగ కోలగా నుండు. మూర్కొండచెట్టు యొక్క రస గుణ వీర్య విపాకములం గలది. చూ. మూర్కొండచెట్టు.

కురంజవాము:—సం. పారసీక యవానీ ఖరపుష్పక అనియు, హిం. ఖురాసానీ అనియు పేరు. వాములోభేదము. చిన్నచెట్టు జానెడెత్తు పెరుగును. చెట్టు పరిమళముగ నుండును. పూవులు తెల్లగ గుత్తులుగ పూచును.

కురంజివాము చేదు కారము రుచులు తీక్ష్ణగుణము ఉష్ణవీర్యము కటువిపాకముకలది. త్రిదోషాజీర్ణములు, కృమి, శూల, ఆమదోషము వీనినిపోగొట్టును. మరియు వాముయొక్క గుణముల నన్నిటిని కలిగియుండును. చూ. వాము.



కురసానివాము:—సం. తురుష్క, మదకారిణి, కుశోరాఖ్య, తీవ్ర అనియు, హిం. ఖురాసానిఅనియు పేరు. ఇది కారము రుచి రూక్ష గురు గుణములు ఉష్ణవీర్యము కటువిపాకముకలది. వాముయొక్క గుణములన్నియు దీనియందుకలవు. విశేషముగనిది మదమును చేయును. రుచినిబుట్టించును. కఫమునుఆర్చివేయును. కృములను చంపును. నిద్రను పట్టించును. చూ. వాము.

కురువేరు:—సం. వాలక, వారిద, హ్రీబేర అనియు, హిం. వాళ్ళ, గంధవాలా అనియుపేరు. కురువేరు చేదు తీపి రుచులు లఘుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. కఫపిత్తములు, ఛర్ది, దప్పి, కుష్ఠము అతిసారము జ్వరము, శ్వాస, అరుచి వ్రణ, వీసర్ప హృద్రోగ, రక్తదోష, రక్తపిత్త తాపములు వీనిని నశింపచేయును.

కుశదర్భ:—సం. కుశ, బర్హిః, సూచ్యగ్ర, యజ్ఞభూషణ అనియు, హిం. కుశా. దాభ్, డాభ్ అనియుపేరు. దర్భయనునది గడ్డిదినుసుపొద. చీపురుపొదవలె పెరుగును శరత్కాలమున నిది పూచును. పూత తెల్లగనుండును. వేరును ఔషధములలో నుపయోగించవలెను.

ఇది తీపి వగరు రుచులు గురుగుణము, శీతవీర్యము, మధురవిపాకముకలది. మూత్రకృచ్ఛ్ర, అశ్మరి, దప్పి మూత్రపుసంచిలోని దోషము, పిత్తము, దాహము, శ్రమ ఋతుదోషము వీనిని నివర్తింపజేయును. గర్భమునునిలుపును. సంరక్షించును.

కుసుంబాచెట్టు:—సం. కుసుంభ, వహ్నిశిఖ, గ్రామ్యకుంకుమ అనియు, హిం. కుసుమ అనియుపేరు. కుసుంబాచెట్టు పెద్దవృక్షము. కుసుమచెట్టనియు దీనికివాడుకగలదు.

కుసుమఆకు తీపి కారము రుచులు ఉష్ణవీర్యము రూక్ష గురు సర గుణములు. మధురవిపాకముగలది. అగ్నిదీప్తినిచ్చును. కఫము మేహరోగము వీనినిజయించును. మల మూత్రములను తగ్గించును. పైత్యము చేయును.

కుసుమచెక్క వాతము, మూత్రకృచ్ఛ్రము, రక్తపిత్తము, కఫము, వీనిని హరించును. కుసుమపువ్వు చేదు రుచి రూక్ష లఘుగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది వెండ్రుకలను నల్లబడజేయును. త్రిదోషములహరించును. మలమునుభేదించును.

కుసుమగింజలనుండి తీసిన తైలమును మర్దనచేసిన పక్షఘాతము వాతపునొప్పులు హరించును. చర్మరోగములుమానును. లోపలకుత్రాగిన అగ్నిమాంద్యమును కఫపిత్తములను కలిగించును.

కూతుకుబుడమ:—సం. ఏలవాలుక, ఐలేయ, హరివాలుక అనియు, హిం. ఏలువాఅనియుపేరు. ఇదితీగ. తీగఅంతట నూగుండును. దీనికాయలు పచ్చివి ఆకుపచ్చగను పండినపుడు పగడమువలె యెర్రగను శనగగింజంత ప్రమాణముగ నుండును. దోసఆకును బోలిన దీనియాకు చిన్నదిగనుండును పూవుపచ్చగనుండును.

కూతుకుబుడమ వగరు రుచి లఘుగుణము శీతవీర్యము కటువిపాకముగలది. కఫము మూర్ఛ, వాతము, తాపము, జ్వరము, మదవిషము, వ్రణము, ఛర్ది హృద్రోగము, దప్పి, పిత్తరక్తము, కృమి, కుష్ఠము, అరుచి వీనినిజయించును. కొద్దిగ విరేచనముచేయును. దీని యాకులను పెసరపిండితో కలిపి అట్లుపోసి ప్రాతఃకాలమున దినుచున్న పిత్తము మేహము తగ్గును అన్నహితము కలిగించును. ఆకుకూర క్షయ రోగులకు హితమైనది.

కిరసనాయిలు:—కిరసనాయిలు అనునది విదేశీయమైన నూనెటిలోనుండి తీయుదురు. దీనిని లోపలకు కొంచెము కొంచెముగ త్రాగిన కుష్ఠమునశించును. ఔషధములకు సాధ్యముగాని దారుణశూలలు తగ్గును శరీరమునకు పూసిన చర్మరోగములు నశించును. దీనిపొగ కండ్లకుతగిలిన మసక మొదలగు రోగములుపుట్టును. కిరసనాయిలు త్రాగువారు తులం మొదలు క్రమముగా 8 తులములయెత్తువరకు, త్రాగుటకలవాటుచేసుకొనవలెను. సుఖవిరేచనకారి త్రాగిన వాంతిచేయును. పిత్తమునకు హా



చ్చించును. తలత్రిప్పు వికారము కలిగించును. చంపును. తెల్లకిరసనాయిలు మంచిది.

కొంగమాంసము:—సం. బక, క్రౌంచ అందురు కొంగమాంసము క్రిమిహరము, శరీరకాంతి, బలము కలిగించును. కొంగకొవ్వును నువ్వులనూనెలోవేసి కాచి వడియగట్టి చెవిలోపోసిన చెవుపోటు తగ్గును. కొంగమాంసము అనేక రోగములను కలిగించును. అపథ్యమైనది.

కొండఅరటిపండు:—సం. శ్రీకదలి, గురురంభ పర్వతమోచ అందురు. కొండఅరటిపండు మధురరసము, గురుగుణము, శీతవీర్యము మధురవిపాకముగలది బలమును శుక్రమును వృద్ధిచేయును. దప్పి పిత్తము తాపము శోష వీనినిశమింపచేయును, ఆలస్యముగజీర్ణమగును.

కొండకసివెందచెట్టు: సం యాస, అధికంటక, దూరమూల దీర్ఘమూల మరుద్భవ అనియు, హిం. జవాసా, దులాహ అనియు పేరు కొండకసివిందకు ములుకసివెంద తీటకసివెంద అని వాడుకపేర్లు కలవు. మరుభూములందు పెరుగును. చెట్టంతట పెడలముండ్లవంటిముండ్లును, ముండ్లప్రక్క ఆకులునుండును. పెద్ద డొంకగపాకును. ఇది ఇంచుమించుగ దూలగొండిచెట్టుయొక్క ఆకారముగలది ఆకులు దూలగొండి ఆకులవలెనే యుండునుగాని అంతకన్న పెద్దవి. ముండ్లునూ గుండును. వర్షకాలముయొక్క ఆరంభమునందుపూచి వర్షకాలాంతమునకు కాయలుకాచి పండును పిదప చెట్టు తనంతటా తగులబడిపోవును.

కొండకసివెందవేరు లేక ఆకురసము తీపి వగరు చేదు రుచులు లఘు సర గుణములు శీతవీర్యము మధుర విపాకముకలది. కఫము మేదస్సు భ్రమ పిత్తరక్తము కుష్ఠము కాస దప్పి విసర్పి వాతరక్తము వాంతి జ్వరము వీనినిహరించును. జఠరదీప్తిని బలమును కలిగించును. వేరుచెక్కచూర్ణము తెల్లజిల్లేడుపూవులరసముతో 7 దినములు మర్దించి కుంకుడుగింజలంత మాత్రలుచేసి జ్వరము విడిచినతరువాత గంటకొక మాత్ర చొ॥ న మాత్రలువరకు తినిన చలిజ్వరము మన్యపుజ్వరము ?గు

ను. ఒకగ్రుక్కెడువేరు రసమును త్రాగిన అజీర్ణ విరేచనములు కడుపు బ్బరము తగ్గును.

కొండగొర్రెమాంసము:— అడవులలోనుండు జంతువు. గొర్రె వలెనేయుండును. దీనిమాంసము మధురరసము గురుగుణము ఉష్ణవీర్య ము మధురవిపాకముకలది. వాతము దగ్గు ఆయాసము వీనినిహరించును.

కొండగోగుచెట్టు:— సం. కింకిరాత, పీతక, పీతభద్ర అనియు, హిం. కింకిరాత్ అనియు పేరు. గోగుచెట్టువలెనేయుండును. చెట్టు అంత యు యెర్రగానుండును. ఆకుమాత్రము ఆకుపచ్చరంగు కలిసిన యెరు పుగనుండును. కాయ పూవుగూడ యెర్రగనుండును. షుమారుగజము లావుయెత్తు పెరుగును.

ఆకు వగరు చేదు రుచులు లఘుగుణము శీతవీర్యము కటువిపాక కముగలది. విరేచనకరము. విషము క్రిమి శోథ శ్లేష్మము చెవుడు కు ష్ఠము దప్పి రక్తదోషము మేహము వీనినిహరించును. సంజురోగుల మిగుల పథ్యమైనది.

కొండమామిడికాయ— సం. వనామ్రి అందురు. ఈచెట్టు మా మిడిచెట్టువలెనేయుండును. గాని ఆకులు కాయలు మాత్రముగిడసబారి నట్లు చిన్నవిగనుండును.

కొండమామిడికాయ చేదు వగరు రుచులు రూక్షగుణము ఉష్ణ వీర్యము కటువిపాకముకలది. కఫపిత్తములను వృద్ధిచేయును. వాతము అతిసారము కుష్ఠము విసర్పము వీనినిహరించును.

కొడిశచెట్టు:— సం. కుటజ, వత్సక, గిరిమల్లి అనియు, హిం. కు డా, కొరేయా అనియుపేరు. కొడిశచెట్టు అరణ్యములో విశేషముగ పెరుగు పెద్దచెట్టు. చెట్టుబెరడు తెల్లగనుండును. చెక్కరసము యెర్ర గ చిక్కగ జిగటగనుండును. కొడిశకాయలు జంటగపుట్టును. కొడిశ గింజలు గోధుమలవలె నుండునుగాని అంతకన్న పెద్దవి. ఆకులు గుండ్ర ముగనుండును. ఆకు వెనకవైపు తెల్లగ ఉండును. దీనిపువ్వులను



యింగ్లీషుకప్పులకు వాసములుగ నుపయోగింతురు తెల్లకొడిశ, నల్లకొడిశ అని పూవులభేదముచే రెండువిధములు

కొడిశచక్క కారము వగరు రుచులు రూక్షగుణము శీతవీర్య ము కటువిపాకముకలది. అర్శస్సు, అతిసారము, పిత్తరక్తము, కఫము దప్పి, ప్లీహరోగము వీనినిజయించును

తెల్లకొడిశచక్క కారము చేదు వగరు రుచులు రూక్షగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. రక్తదోషము కుష్ఠము అతిసారము పిత్తార్శస్సు కఫము దప్పి కృమి జ్వరము ఆమదోషము వీనిని హరించును.

4 పలముల పచ్చి కొడిశపాల పట్టను బియ్యపు కడుగుతో నూరి ముద్దచేసి నేరేడాకులలోచుట్టి దారముతోకట్టి దానికి గోధుమపిండి లే పనముచేసి పైనమన్నుబూసి యెండించి పిడకలలో యెర్రగ కాల్చి తీసి చల్లార్చి విడదీసి కొడిశముద్దను గుడ్డలోచుట్టి పిండినరసమునందు తేనెవే సి త్రాగిన దుస్తరమైన యతిసార రోగము నశించును. ఇదియు కుటజ పుటపాకమనబడును.

కొడిశవేరుపట్ట 100 పలములు, ద్రాక్షపండు 50 ప॥ ఇప్పపూ వు, గుమ్ముడువేరు ప్రత్యేకము 10 ప॥ వీనిని నలియగొట్టి 4 ద్రోణము లనీటిలోవేసి 4 వ వంతు మిగులునట్లు కాచి వడియగట్టి యందు ఆరె పూవుచూర్ణము 20 ప॥ బెల్లము 100 ప॥ వేసి కుండకుచేర చేసి మాస ము నిల్వయుంచవలెను. ఇదియు కుటజారిష్టమనబడును. దీనిని సేవించి న సకలజ్వరములు నశించును. అగ్నిదీప్తినిచ్చును.

కొడిశపట్ట 100 ప॥ నలియగొట్టి ద్రోణప్రమాణజలములోవేసి 4 వ పాలు మిగులునట్లుకాచి వడియగట్టి అందు ముస్తగుండామర, ఆరె పూలు, మారేడువేరు, విషబొద్దిముంప, బూరుగుజిగురు, తుంగముస్త లు అతివస వీనిని ప్రత్యేకము పలముచొ॥ చూర్ణించివేసి గరిటెకు అం టుకొనువరకు కాచి నీరు మేకపాలు మొదలగువానితో సేవించిన నలుపు పసుపు మున్నగువర్ణములుగలిగి వేదనతోగూడిన దారుణ అతి

సారములు స్త్రీల తెల్లకుసుమ యెఱ్ఱకుసుమ మూలవ్యాధులు రక్తగ్రహణి హరించును.

కొడిశపూవు చేదు వగరు రుచులు లఘుగుణము శీతవీర్యము కటువిపాకముగలది. పిత్తాతిసారము రక్తదోషము కఫము కృమి వీనిని హరించును. కొడిశకాయకును యివేగుణములు.

కొడిశపాలగింజలు:—సం, ఇంద్రయవ, శక్రాహ్వ, వత్సక అందురు. చేదు వగరు రుచులు గురుగుణము శీతవీర్యము కటువిపాకముగలవి. జ్వరము అతిసారము రక్తార్శస్సు కృమి విసర్పము కుష్ఠము వీనిని నశింపచేయును. కొడిశచూర్ణము చిన్నము మొదలు 2 చిన్నములవరకు తేనెతోగాని శీతోదకముతోగాని యిచ్చిన రక్తగ్రహణికట్టును.

కొత్తిమిరిచెట్టు:—సం ధన్యాక, కుస్తుంబురు అనియు. హిం. ధనియా అనియుపేరు. చిన్నచెట్టు. జానెడెత్తు పెరుగును. చెట్టు నల్లివాసనగలది. తెల్లనిపూవులు గుత్తులుగ పూచును.

ఇది కారము చేదు తీపి రుచులు ఉష్ణవీర్యము, సర లఘు గుణములు, కటువిపాకము కలది. త్రిదోషహరము. జఠరదీప్తిని పిత్త కఫ శాంతిని కలుగజేయును. నేతితోవెచ్చజేసి కండ్లపైనకట్టిన నేత్రరోగములుమానును. కండ్లకు చలువచేయును. కొత్తిమిరిచెట్టును భోజనపదార్థములలో కలిపి తినవలెను. ప్రత్యేకముగతినిన మిగులపైత్యించును.

కొబ్బరికాయ:—సం నారికేళ, విశ్వామిత్రప్రియ అందురు. లేతకొబ్బరికాయ గుజ్జు తీపి వగరు రుచి స్నిగ్ధ గురుగుణములు శీతవీర్యము మధురవిపాకముకలది. మేహశాంతి పైత్యమును శ్లేష్మము వీనిని కలిగించును.

ముదురుకొబ్బరికాయ ఉష్ణవీర్యముగలది. వీర్యవృద్ధిని శ్లేష్మమును దేహపుష్టిని కాంతిని కలుగజేయును మూత్రమును యెక్కువ చేయును. కొబ్బరినికోరి ఆముదముతోవెచ్చజేసికట్టినవ బీజపువాపుతగ్గును కొబ్బరికోరులో పంచదారకలిపి తినిన కడుపులోబుట్టు వ్రణములు మానును. ముఖదుర్గంధమును బోగొట్టును. అధికముగతినిన ఆకలి మందగిపచేయును. కడుపునొప్పిపుట్టును. మలబద్ధము చేయును. నులిపురుగులనుపుట్టించును. తలత్రిప్పును. నుస్సదగ్గునుపుట్టించును.



కొబ్బరికాయనీరు మధురరసము లఘుగుణము, శీతవీర్యము మధురవిపాకముగలది. దప్పి, పిత్తము, వాతము వీనిని హరించును. దీపనకారి, మూత్రమునుశుద్ధిచేయును. మూత్రపుచురుకును పోగొట్టును. కడుపులోబుట్టు పైత్యపుమంటను ఆపును. శిలాజిత్తు భస్మమును కలిపిన కొబ్బరినీరుత్రాగిన మూత్రాఘాతము మూత్రకృచ్ఛ్ర నయమగును. హెచ్చుగత్రాగిన జలుబుచేయును. శిరోభారముదెచ్చును. క్షయరోగులు అలసటజెందినవారు ఒడదెబ్బతగిలినవారు వీరికి కొబ్బరికాయనీరు మిగుల హితకరము. సంభోగానంతరము వెంటనే కొబ్బరినీరు త్రాగిన నీరసముతగ్గును. బలమును ఉత్సాహమును యిచ్చును.

గ్రహణి అగ్నిమాంద్యము శ్వాసకాసలు నంజు మున్నగు రోగములుకలవారు కొబ్బరికాయనీరుత్రాగరాదు.

కొబ్బరిని నలియగొట్టి తీసినపాలలో కిస్మిస్, ద్రాక్ష, బాదంపప్పు కుంకుమపూవు కస్తూరి పంచదార కలిపి యిగురు వరకునుకాచినది నారికేళహల్వా అగును. మిక్కిలి రుచిగనుండును. వీర్యవృద్ధిని బలమును సంభోగశక్తిని కాంతిని కలిగించును. హెచ్చుగతినిన నులిపురుగును కఫమును పుట్టించును. కొబ్బరిపాలు నభ్యంగము చేసిన కేశములు పెరుగును. వెండ్రుకలు రాలిపోక నిలుచును నల్లబడును, చుండ్రుచచ్చును దేహకాంతి చిత్తప్రసాదము కలుగును. నిద్రదెచ్చును ఉత్సాహముగ నుండును.

కొబ్బరి కురిడీ పిత్త శ్లేష్మములను వీర్యవృద్ధిని బలమును కలిగించును పటికిబెల్లముతో కలిపి నమిలిన నోటిపూత తగ్గును.

కొబ్బరిపూవు అనగా కొబ్బరి వెన్నురసము వగరు రుచి గురుగుణము శీతవీర్యము మధుర విపాకము గలది కొబ్బరిపూవు రసమునందు కలకండ చూర్ణము చేర్చి యిచ్చిన తెల్లకుసుమ కట్టును. నీళ్లవిరేచనములు రక్తగ్రహణి హరించును. ఆసనము వెంటపడు రక్తమును ఆపు

ను రక్తవాంతిని కట్టును. ముక్కులోబోసిన ముక్కుపెదిరినపుడు స్రవించురక్తమును వెంటనే ఆపుచేయును లోపలకుత్రాగిన మలబద్ధమును గురుత్వమును కలిగించును.

కొబ్బరిపూవు అనగా మొక్కమొలచిన కొబ్బరి కాయలోని గుజ్జు తెల్లగా మృదువుగ స్నిగ్ధముగ నుండును. రక్తపిత్తమును హరించును. మూత్రమును జారీచేయును. కఫమును పెంచును. జలుబు చేయును ఉష్ణతత్వము కలవారలకు హితము.

కొబ్బరినూనె నూతనమైనది సువాసన గలిగి నేయివలెనుండును వీర్యవృద్ధిని బలమును కలిగించును. పిత్తమును పెంచును. అభ్యంగనముచేసుకొనిన మెదడునకును కండ్లకును చలువచేయును వేడివలన పుట్టిన తలనొప్పి దిమ్ము తగ్గించును. పుక్కిటబట్టిన దంతములుగట్టిపడును. నోటిపూతతగ్గును. చిగురు వాపు మానును. ప్రతిదినము తలవెంట్రుకలకు చమురుచున్న కేశములునలుపెక్కి పెరుగును. నొత్తబమను పుండ్లపైనరాచిన వెంటనే మానుపట్టును.

కొమ్ముపెసలు:— బలమును ఆమమును శ్లేష్మమును పెంచును

కొయ్యతోటకూర:— ఉప్పునీళ్ళఆధారమున విశేషముగ పెరుగునట్టి తోటకూర జాతిలోనిచెట్టు ఇది యెర్రగనుండును. ఆకుకూడ కొంచెము మెరుపుకలసిన ఆకుపచ్చరంగుకలది.

వగరు రుచి ఉష్ణవీర్యము రూక్షగుణము మధురవిపాకము గలది. నంజు స్థౌల్యము వాతము అజీర్ణము బాలింతరోగములు కలవారలకుహితముగనుండును. పిత్తమును హెచ్చించును. ఉష్ణతత్వము కలవారలకు అహితముగనుండును. పిత్తమునుహెచ్చించును ఉష్ణతత్వముకలవారలకు శూలలను తలనొప్పిని పుట్టించును. దీనిని కూరవండుకొనియు పులుసుచేసియు తిందురు.

కొర్రలు:— సం కంగు, చీనక పీతతండుల అనియు, హిం. కంగనీఅనియుపేరు తృణధాన్యవిశేషము. కొర్రలు నువ్వులవలె చిన్న



విగనుండును. ఎరుపు, పసుపు, తెలుపు, నలుపు రంగులచే నాలుగు రకములు. ఒకదానికన్న నొకటిమంచిది.

వగరు తీపి రుచులు రూక్ష గురుగుణములు ఉష్ణవీర్యము మధురపాకముగలవి కొర్రఅన్నము జఠరాగ్నిని పెంచును. కఫమును హరించును. తృప్తిని కలిగించును.

కొర్రగంజి శరీరమునకు వేడిపుట్టించును. సులభముగజీర్ణమగును. జ్వరితులకు పథ్యముగనుండును. త్రిదోషహరము. విరిగినయెముకలను అతుకుకొనజేయును. గర్భపాతమైన స్త్రీలకిది ప్రాణప్రదమైనది. శరీరపుష్టినిచ్చును.

కోకిలమాంసము:— సం. కోకిల, పరపుష్ట, పరభృత, అందురు. కోకిల కాకివంటియొకపక్షి. వసంతకాలమున దిది మనోహరముగ కూయును. కూతయె కాకికిని దీనికిని భేదము.

కోకిలమాంసము అగ్నిదీప్తిని మలబద్ధమును కలిగించును. నేత్రములకు హితమైనది. క్షయ కాస వీనినిహరించును కోకిల చేమకట్టిని వశ్యక్రియలందు యోగింతురు. మరియు సారాయిలో మూడుదినములు నానబెట్టి కందిగింజంత మాత్రను మ్రింగిన అజీర్ణ విరేచనము కలరా తగ్గును.

కోడి:— సం. చరణాయుధ, కుక్కుట, తామ్రచూడ అందురు. ఆడుకోడికి పెట్టయనియు, మగకోడికి పుంజుఅనియు, వాడుకపేర్లు. పెట్టమాంసము మధురరసము స్నిగ్ధ గురుగుణములు ఉష్ణవీర్యము కటువిపాకము కలది. శరీరపుష్టిని, వీర్యస్తంభనమును, శరీరమునకువేడిమిని చురుకును కలిగించును. వాత శ్లేష్మములను హరించును. నేత్రములకు హితమైనది. కోడిమాంసపుశొరువా వాతజ్వరితులకు మేలుచేయును. కోడిపిల్లల మాంసరసమును పాలతీవపిల్లలకిచ్చిన మంచి పుష్టికలుగజేయును. ముసలకోడిమాంసము వీర్యహీనమై రూక్షగనుండి కఫపిత్తములను పెంచును.

పుంజుమాంసము కాసరోగులకు హితమైనది. కాంతి బలము వీర్యము బుద్ధి వికాసము వీనినికలిగించును. పెట్టకోడిమాంసమైనను ఉష్ణతత్వముగలవారికి జబ్బుచేయును.

కోడిగ్రుడ్లు మధురరసము స్నిగ్ధ గురు గుణములు ఉష్ణవీర్యము మధురవిపాకముగలవి. బలకరమైన వస్తువులలో కోడిగ్రుడ్లు శ్రేష్ఠమైనది. కోడిగ్రుడ్డు సొనను కాచినపాలలో వేసి కలిపి ప్రాతఃకాలమునందు త్రాగుచున్న పుష్టి బలము శుక్రము వృద్ధియగును. శుక్లనష్టము కట్టును. సగము ఉడికినగ్రుడ్డులో మిరియపుచూర్ణము కలిపి తినిన అమిత వ్యాయామమువలన అలసిపోయిన గుండెలుగలవారలకును క్షయరోగులకును గుండెదడగలవారికిని మేలుచేయును. నేతితో వేయించిన సొనయందు పిప్పలిచూర్ణము సైంధవలవణము కలిపి తినిన శరీరమంతట మంచిరక్తమును పుట్టించును. సులభముగ జీర్ణముకాదు. రక్తమోక్షణము చేయించుకొన్నవారికిని, గాయములు తగిలినవారికిని, రక్తపిత్తరోగులకును, కోడిగ్రుడ్డులోని తెల్లసొన హితమైనది. పచ్చసొనలో పసుపుకలిపి తినిన సర్పవిషముహరించును. కోడిగ్రుడ్డు యెక్కువ ఉడికినకొలది ఆలస్యముగ జీర్ణమగును. కోడిగ్రుడ్లను అమితముగా దినిన వాతశ్లేష్మములను పెంచును. అజీర్ణమును కడుపునొప్పి శూల అగ్నిమాంద్యము మొదలగు రోగములను కలిగించును.

కోతిపాలు:—సం. కపి, శాఖాట, వానర అనియు, హిం. బందర్ అనియుపేరు. కోతిపాలు క్షారముగనుండును. కాసశ్వాసలు సన్యాసరోగము. వీనినిహరించును.

కోరింతచెట్టు:—సాధారణమైన వృక్షము. చెట్టునకు చిన్నముండ్లుండును. ఆకు వేప చేదు గుణకలది. కూరవండుకొని తినిన ఉష్ణము చేయును. కఫమునుహరించును. సంజురోగులకు హితము. వేరు ఒలియగొట్టి పుటపాకముచేసి పిండినరసము కోరింతదగ్గును కట్టును. చిత్రమూలమును వేరు రసముతో నూరి మిరియముగింజంత మాత్రచేసి యిచ్చిన



కోరింతదగ్గుకట్టును. యీచెట్టు నారతో త్రాడుపేని ఆదివార గురువారములందు కంఠమునకుకట్టిన కోరింతదగ్గును నిల్పును.

కోలజెముడు:—చూ. బొమ్మచెముడు.

కోలపొన్న:—సం. పృశ్నిపర్ణి, పృథక్పర్ణి, చిత్రపర్ణి అనియు హిం. పిఠవన్, పిఠోనీ, డావడా, డౌలా అనియు పేరు. గజమెత్తులోపుగ పెరుగును. క్షుపము ప్రతితొడిమకు మూడుఆకులు విడివిడిగనుండును. సాధారణముగ దీనియాకును అడవియులవఆకుతో పోల్చవచ్చును. కొమ్మలచివర ద్రాక్షగుత్తివలె సన్నని వెన్ను బయలుదేరును. గ్రంథములలో చెప్పబడినందున దీనివేరుమాత్రమే ఔషధయోగ్యముగ స్వీకరింప దగియున్నను సర్వదేశములందు సమూలముగ వాడుక చేయుచున్నారు.

కోలపొన్న మధురరసము సరగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముకలది. తాపము, జ్వరము రక్తాతిసారము, దప్పి, ఛర్ది, వీనిని హరించును.

కోవిలదుంప:—సం. కశేరు, గుడకంద, క్షుద్రముస్త అనియు హిం. కసేరూ అనియుపేరు, నమ్మదుంప యని దీనికి వాడుకకలదు. తుంగముస్తలవలెనుండును. గాని అంతకన్నచిన్నవి. గనుకనే దీనికి క్షుద్రముస్త యనిపేరు కలిగెను. పెద్ద చిన్న భేదముచే నిందు రెండుజాతులున్నవి. ఇది మధురరసము, గురుగుణము, శీతవీర్యము, మధుర విపాకముకలది. పిత్తరక్తము దాహము నేత్రరోగములు వీని జయించును. శుక్రము, వాతశ్లేష్మములు స్తన్యము (చనుబాలు) వీనిని కలిగించును. మలబద్ధమును చేయును.

కోష్టు:—సం. కుష్ఠ, వ్యాధి, వ్యాప్య అనియు, హిం. కుట్ అనియుపేరు. చెంగల్వకోష్టు అనియు దీనికి వాడుక పేరుకలదు. ఇది కటుతిక్తరసములు ఉష్ణవీర్యము లఘుగుణము కటువిపాకముగలది. వీర్యవృద్ధి కాంతి కలిగించును. వాతకఫములు కుష్ఠు విషము విసర్పి దురద

దద్రుములు తామర రక్తవికారములు దగ్గు ఛర్ది దప్పి వీనిని హరించును. దీనిని అరగదీసి పట్టువేసినయెడల వాతపునొప్పులు నయమగును.

కృష్ణతులసి:— సం. కృష్ణా కృష్ణతులసీ, కరాలక అనియు, హిం. తులసి అనియుపేరు. తులసి క్షుపము, గుండ్రగ కొంచెము కోలగ మృదువైన ఆకులుండును. కృష్ణతులసి లక్ష్మీతులసి యని రెండువిధములు. కృష్ణతులసియాకులు నల్లగను, లక్ష్మీతులసియాకులు ఆకుపచ్చగను ఉండును. తక్కినవి సమానము. వీనిశిఖలందు వెన్నుబుట్టును ఇందు సన్నని పువ్వులును నల్లగనుండు చిన్నబీజములును ఉండును తులసి మంచిపరిమళముకలది. గృహస్థులు పరమపూజ్యముగ నెంచి గృహములందువేసి పెంచి పూజింతురు.

తులసి కారము వగరు చేదు రుచి ఉష్ణవీర్యము లఘుగుణము కటువిపాకముగలది. తాపము పిత్తమునుచేయును. వాతకఫములు శ్వాసకాసలు కృమి ఛర్ది దుర్గంధము కుష్ఠము పార్శ్వశూల విషము మూత్రకృచ్ఛ రక్తదోషము భూతబాధ శూల జ్వరము ఎక్కిళ్ళు వీనిని హరించును. రసము పుక్కిటపట్టిన రసమును తినుటవలన గలిగిన నోటిలో నిపుండ్లుమానును లేదా ఆకునమలవచ్చును ఆకురసమందు తేనెచేర్చి యిచ్చిన దగ్గు ఎగరొప్పు పిల్లికూతలు తగ్గును. జ్వరమునశించును, జఠరదీప్తినిచ్చును. విరేచనముచేయును చంటిబిడ్డలకు వారమునకొకసారి తులసిరసములో పొంగించిన అల్లరసమును కలిపియిచ్చిన అగ్నిమాంద్యము ఊసరపొట్ట కడుపునొప్పి ఉబ్బరము రాకుండజేయును. తగ్గించును తులసివేరు చూర్ణము, సుద్ద, అనగా తెల్లనిమన్ను రెండును సమముగ కలిపి పూటకు అణాయెత్తు పుచ్చుకొనుచున్న తెల్లకుసుమ కట్టును. 9 తులసిఆకు ౨, ౫ మిరియములు 3 లవంగపూవులు, 1 వెల్లుల్లిగర్భము వీనిని కల్కముగానూరి మాత్రచేసి జ్వరమువిడచినవెంటనే యిచ్చునెడల మన్యపుజ్వరమును చలిజ్వరమును నిలిపివేయును. ఆకునూరి కట్టుకట్టిన వ్రణములలోని పురుగులుచచ్చిపోవును.

కృష్ణాగురు:— చూ. అగురుచెట్టు.



కృష్ణబీజములు:— సం. కృష్ణబీజ శ్యామబీజ అనియు, హిం. కాలాదానా అనియుపేరు. కాటుకగింజలని వీనినివాడుదురు. సర స్నిగ్ధములుకలవి. శోథ, ఉదరము, జ్వరము, మలబద్ధము, శిరోరోగములు వీనినిపోగొట్టును. ఉదావర్తము కఫము అనాహము అను వ్యాధులందు వాడదగినవి. ఈగింజలను నేపాలపుగింజలకు బదులుగ చాలమంది వాడుకచేయుదురు. నేపాలమువలె దారుణవిరేచనము చేయును. గాని తైక్ష్ణ్యము మొదలగు దుర్గుణములులేవు. అలోపతి సంప్రదాయమునను యిది విరేచనౌషధముగ వాడుదురు.

ఖర్జూరము:— సం. ఖర్జూర, ముద్గరిక అనియు హిం. ఖజూర్ అనియుపేరు ఈతచెట్టును బోలియుండును ఈతకాయలకన్న ఖర్జూరపు కాయలు పెద్దవి ఇదియొకభేదము గ్రామ్య ఖర్జూరము, పిండఖర్జూరము ఖర్జూరము అని యిది మూడువిధములు.

మూడువిధములగు ఖర్జూరపుకాయలును తీపి రుచి శీతవీర్యము మధుర విపాకము గలవి. పుష్టి, తృప్తి, మలబద్ధము బలము వీనిని కలిగించును. వాంతి, వాతకఫములు, రక్తపిత్త, జ్వరము అభిఘాతమువలన దప్పి ఖేదము మూర్ఛ మొదలగు రోగములను హరించును. పండని ఖర్జూరపుకాయ సాధారణముగ త్రిదోషములను ప్రకోపింప చేయును. పక్వమైనది త్రిదోషశాంతిని కలిగించును.

ఖర్జూరపుకల్లు మదము తైక్ష్ణ్యము కలిగించును. వాతశ్లేష్మమును శమింపచేయును. రుచిగనుండును. అగ్నిదీప్తి బలము, వీర్యవృద్ధి, వీనిని కలుగజేయును.

ఖర్జూరపు సారాయము ద్రాక్ష సారాయముకన్న అల్పగుణములుగలది. వాతముచేయును. గురువుగనుండును.

ఖర్జూరపు పువ్వులరసమును త్రాగిన రక్తపిత్తము తెల్లకుసుమ అతిసారము నీళ్ళవిరేచనము రక్తగ్రహణి అమిత ఋతురక్తస్రావము వీనిని హరింపజేయును.

ఖర్జూరాసవము వేడిని తగ్గించును. మూత్రమును శుద్ధిపరచును. జీర్ణముచేయును. అమితమైన దప్పి నికట్టును

ముద్దఖర్జూరపుపండు దాహము రక్తపిత్తము దప్పి శ్వాసకాసలు శ్రమ విషము మున్నగువానిని పోగొట్టును. అగ్నిమాంద్యమును బలమును శుక్రమును కలిగించును.

గంగరావిచెట్టు:— సం. బ్రహ్మదారు, తూదీ అనియు హిం. సహతూత్ అనియు పేరు గంగరావి పెద్దవృక్షము. పూరసి పువ్వులు పూచును. ప్రసిద్ధమైనది.

చెక్క తీపి వగరు రుచులు స్నిగ్ధగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. కుష్ఠ మేహ విషములను హరించును. చెక్కరసముతోగాని కషాయముతోగాని వ్రణములు కడిగిన నవి మానుపట్టును.

ఆకులను తలకుకట్టినయెడల శిరోవాతమువలన గలిగిన తలపోటు తగ్గును. మేహవాతపుకొప్పులు వాతపుకొప్పులు కీళ్ళకొప్పులు మొదలగువానికి ఆయాకును తొక్కి కట్టగట్టిన తగ్గును. ఈవృక్షము వాదవిద్యయందు మిగుల నుపయోగకరము.

గంగరావిపండు పండినది తీపి రుచి గురుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. పచ్చికాయ గురు సర గుణములు అమ్లవిపాకమును ఉష్ణవీర్యము గలిగి రక్తపిత్తమును కల్గించునదైయుండును

గంగరేగు:— సం. రాజబదరి అందురు దీనికాయలు రేగుపండ్లకంటెపెద్దవి. పులుపు తీపి రుచులు స్నిగ్ధ గురుగుణములు శీతవీర్యము అమ్లవిపాకముగలది. శ్లేష్మమును పెంచును. వాతహరము. మరియు రేగుపండ్ల గుణములన్నియు దీనియందుగలవు.

గంగసిందూరము:— సం. నాగజ, సిందూర, సంధ్యారుణ, శివాసియు, హిం. సిందూర్ అనియు పేరు సీసము చేయబడు సిందూరము అపరిశుద్ధమైన లోహముతో చేయబడినందున యిది విషతుల్యమైనది. ఆలయ నేడు విగ్రహములకు నూనెలో కలిపి పూయుదురు. గీనితో గోపురములకు స్తంభస్థలములందు చిత్రములు వేయుదురు. రేలక పడను



హరింతురు. సిందూరమును ఆవ వేప కొబ్బరి నువ్వులు మొదలగునూనెలలో కలిపి రాచిన వ్రణములు కుష్ఠము దురద సర్పి వీనిని హరింపచేయును. విరిగినయెముకల నతుకుకొనజేయును. వ్రణములను శోధించును. మానున్పును.

గంజాయి:— సం. భంగ విజయ అనియు, హిం. భాంగ్ అనియు పేరు. గంజాయి బంతిచెట్టువలెనుండును గంజాయిమొక్క రెండు గజములయెత్తువరకు పెరుగును. పూవులు గుత్తులుగపూచును. దీనికి కళ్ళియని పేరు. దీనినే ఔషధములందు వాడదగును లేతమొక్కలను మేకలు తినివేయును.

గంజాయి చేదు రుచి లఘు తీక్ష్ణగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముకలది. మత్తు ఉత్సాహము అగ్నిదీప్తి చురుకు దేహపుష్టి బలము వీర్యస్తంభనము జ్ఞాపకశక్తి ఏకాగ్రత కామవికారము అతిసారము అజీర్ణము శ్వాస కాసలు వాతశ్లేష్మములు నంజు మొదలగు రోగములను పోగొట్టును పైత్యముచేయును. హెచ్చుగసేవించిన మతిభ్రమ తలత్రిప్పు మలమూత్రబంధము చేయును. రక్తక్షీణము వీర్యనాశనము వీనినికలిగించును. దీపన పాచనములను కలిగింతును. నిద్రదెచ్చును. పచ్చిఆకురసమును రాచిన ఇంద్రలుప్తము (పేనుకొరుకుడు) నశించును. చుండ్రు చచ్చును. వ్రణములలోని పురుగులుచచ్చును. మానుపట్టును.

గంజాయి 5 భాగములు, సురాకారము 1 భా॥ పొగాకు 2 భా॥ నల్లయుమ్మెత్త సమూలచూర్ణము 3 భా॥ వీనిని చక్కగా యెండించి చూర్ణించి నిప్పుపైవేసి పొగపీల్చిన ఉబ్బసపుదగ్గు ఆయాసము తక్షణము నివర్తించును.

కుంకుమపూవు జాజికాయ జాపత్రి లవంగాలు గసగసాలు నల్లమందు మరాటామొగ్గలు యాలకాయ ఇవి ప్రత్యేక మొక భాగము వీటికిసమము గంజాయి స్వీకరించి గంజాయి కుంకుమపూవు సన్నిమందు గాక తక్కినవి నేతితో దోరగావేయించి చూర్ణముచేసి తక్కినవి

కూడ కలిపి తేనెతో మర్దించి కుంకుడుగింజంత మాత్రలుచేసి రాత్రిపూట ఒకమాత్రను మింగి పాలుద్రాగిన వీర్యస్తంభనము, సంభోగశక్తి వీర్యవృద్ధి, ఉత్సాహము కలిగించును.

పచ్చిఆకు రసమును చెవిలో బోసిన చెవిలో చీము పోటు పురుగులు నశించును.

గంజాయి జాజికాయ గసాలు మరాటీమొగ్గ యాలకాయలు లవంగాలు వీనిని నలియగొట్టి పాలలోవేసి కాచి వడి కట్టి శర్కరకలిపి త్రాగిన సెగరోగము అగ్నిమాంద్యము అజీర్ణ విరేచనములు నశించును. నిద్ర మత్తు ఏకాగ్రత కలిగించును. దీనికి భంగు అనిపేరు.

చిలుములోవేసి మొండుగంజాయిని పీల్చిన వీర్యము నశింపజేయును. రొమ్ములనుఆర్చును. పిచ్చిపుట్టించును. చురుకు ఏకాగ్రత కలుగును. గంజాయిని పలువిధముల లేహ్యములలోవేసి సేవింతురు. కల్పము ననుసరించి సేవించిన కాయసిద్ధినొసగును.

గంజి:— వేడిగనున్న వరిఅన్నపుగంజి మొండదెబ్బ వలన గలిగిన ఆయాసమును తీర్చును, తృప్తినిచ్చును, దప్పినణచును, మూత్రమును జారీచేయును, బలమును వీర్యమును కాంతిని కలిగించును. ధాతుసామ్యమును గలుగజేయును. గురుత్వముగనుండును. బియ్యము సగము ఉడికినపుడు వార్చిన గంజికి చిట్టుడుకు నీళ్ళని పేరు. ఇవి త్వరగ జీర్ణమగును. నీరస పడినవారికిని బలహీనులకును చంటి పిల్లలకును హితమైనఆహారము.

గంటుభారంగి:— సం. భారంగీ బ్రాహ్మణీ పద్మభృంగజఅనియు, హిం. భారంగి యనియుపేరు. ఇది తిక్తకషాయరసములు, లఘురూక్ష గుణములు, ఉష్ణవీర్యము కటువిపాకము గలది. దీపనము గల్గించును. గుల్మము, శోథ, కాస, కఫము, ఎక్కిళ్ళు, శ్వాస పీనస, జ్వరము, వాతము వీనిని హరించును కొద్దిగ విరేచనకారి.

భారంగిఆకు జ్వరము, దాహము, ఎక్కిళ్ళు, త్రిదోష వికారములు వీనిని నశింపచేయును.



గంటెన:— సం. అపరాజిత, ఆస్ఫోత, గిరికర్ణి గవాక్షు అనియు హిం. కోయల్ అనియుపేరు. ఇదితీగ. డొంకలయందు బహుళముగ ప్రాకును తెలుపు నలుపు పూవుల భేదముచేత రెండువిధములు. దీనిఆకులు చిన్నవిగ ఒకతొడిమకు ఏడు లేక అయిదు ఆకులు విడివిడిగ నుండును. పూవులు చిన్నవి కాయ అలచందకాయవలె పొడవుగ సన్నముగ నుండును. కాయకొంచెము బద్దవాటుగ నుండును.
నల్లగంటెనకు సంస్కృతమున నీలపుష్పి, వ్యక్తగంధ అనిపేరు.

తెల్లగంటెన కటుతిక్త కషాయరసములు, సరగుణము, శీతవీర్యముగలది. బుద్ధివైశద్యమును నేత్రప్రసాదమును గలిగించును. తలనొప్పి. దాహము కుష్టు, శూల, ఆమదోషము, పిత్తము, శోథ, క్రిములు, వ్రణము, కఫము, గ్రహపీడ, సర్వవిషము వీనిని నశింపచేయును.

నల్లగంటెన తిక్తరసము, స్నిగ్ధగుణము, శీతవీర్యము, కటువిపాకము గలది. వాతము పిత్తజ్వరము దాహము, భ్రమ, పిశాచబాధ, రక్తాతిసారము. ఉన్మాదము, మదము, శ్వాస కాసలు, కుష్ఠము, క్షయ, క్రిమి మొదలగు రోగములను హరించును. తెల్లగంటెన నల్లగంటెనలు రెండును ఇంచుమించు సమాన రసవీర్యాదులం గల్గియుండును.

గంటెనవేరురసము. పావుశేరు, మునగచెక్కరసము పావుశేరు గాడిదమూత్రము అర్ధశేరు, నరమూత్రము పావుశేరు, గోమూత్రము పావుశేరు, కాచులేక కవిరి పావుతులము లవంగాలు పావుతులము నల్లమందు పావుతులము వీని నొకమట్టి పాత్రలోబోసి 15 దినములువరకు ప్రతిదినము కొంచెము కొంచెముగ వెచ్చబెట్టుచు 15 వ దినమున పూర్తిగ యిగురువరకు కాచి యీరస క్రియను గుంజెత్తు మొదలు 2 గుంజలెత్తు వరకు తమలపాకు రసముతో రెండుపూటల వాడిన ఉబ్బసపు దగ్గు తగ్గును. ఇట్లు వారముదినములు వాడవలసి యుండును.

గంటెన రసమును పొంగించి తేనెకలిపి త్రాగిన దారుణమగు వాత కఫములు తగ్గును. గంటెన వేరును అరగదీసిన గంధమును పాముకరచినచోట రాచి కొంచెము కండ్లలో కలికమువేసి కుంకుడు గింజంత

మ్రింగించిన యెడల పామువిషము తగ్గును. గింజలకు గూడ యీప్రభావముకలదు. గింజలచూర్ణము చిన్నం మొదలు 6 గుంజలెత్తువరకు గోమూత్రముతో ప్రతిదినము ఉదయముల నిచ్చుచున్న వాతనంజు తగ్గును. గంటెనకు దింతెనయనియు వాడుక కలదు.

గంధఫిరోజా:—సం. శ్రీవాస సరళనిర్యాస అనియు, హిం. గంధఫిరోజా, చంద్రస్ అనియుపేరు. ఇదిసరళ దేవదారు జిగురు, ఆకుపచ్చ పసుపుపచ్చ రంగులు కలసిన రంగుగలదిగ నుండును.

కటుతిక్త కషాయరసములు ఉష్ణవీర్యము, సరగుణము, మధురవిపాకము గలది. వాతము, శిరోనేత్రరోగములు, కఫము, దౌర్గంధ్యము యోనిదోషములు, దురద, వ్రణములు, యోనిరోగములు, అజీర్ణము ఆధ్మానము వీనిని హరించును. కంఠస్వరమును బాగుచేయును. పిత్తమును ప్రకోపింప జేయును. కాంతి వీర్యవృద్ధి కలిగించును. గ్రహపీడను తొలగించును.

గంధఫిరోజాయందు రక్తపాషాణమునుకలిపి అడ్డసరలు మొండివ్రణములు సెగగడ్డలు మానని పాతదెబ్బవాపులు మొదలగు వానికి పట్టీవేసిన అణగగొట్టును. లేదా వెంటనే పక్వపరచును. 4 చిన్నముల గంధఫిరోజాను మర్రిపాలతోకలిపి ప్రాతఃకాలమున త్రాగిన సెగరోగము నివర్తించును.

గంధకచోర:—సం. షడ్గ్రంథా, గంధమూలి అనియు, హిం. కపూర్ కచారి అనియుపేరు. కచోరములలో భేదము.

కటుతిక్త కషాయరసములు లఘు తీక్షణగుణములు శీతవీర్యము కటువిపాకముగలది. కొద్దిగ పిత్తమును హెచ్చించును. శ్వాస కాసలు జ్వరము, శూల, హిక్క, గుల్మము. రక్తవికారము, వాతము. అరుచి, దుర్గంధము, వ్రణము, మూర్ఛ, ఛర్ది, హిక్మ మున్నగు రోగములను హరించును.

గంధకద్రుతి:—శుద్ధి జేసిన గంధమునకు 16 వ భాగము త్రికటుకచూర్ణమును చేర్చి రెంటిని కలిపి మూరెడు వెడల్పు నిడివిగల గుడ్డ



పైన ఆచూర్ణమును చల్లి ఆగుడ్డను చాపవలె చుట్టచుట్టి దారంతో బిగియగట్టి ఒక జాముపరకు మంచినూనెలో నానబెట్టి పిదప ఆవత్తిని పట్టుకారుతో మధ్య పట్టుకొని వత్తికొనను నిప్పుముట్టించిన యెడల వత్తిలోనుండు గంధకము కరిగి బొట్టుబొట్టుగా క్రిందపడును. దానిని పింగాణీలోగాని గాజుపాత్రలో గాని భద్రపరచవలెను. ఇదియు గంధద్రుతి యనబడును.

ఇది గంధకముయొక్క రసవీర్యాదులం గలిగియుండును. మూడుచుక్కలు ద్రుతిని తమలపాకులలోవేసి అందు వల్లప్రమాణము శుద్ధ రసభస్మమును కలిపి ఆకుతోసహా మ్రింగునెడల దీపనముకలుగును. క్షయ పాండువు శ్వాస కాసలు శూల గ్రహణి ఆమదోషము నశించును. లఘుత్వమునిచ్చును.

ఇలాయితీ గంధకద్రుతి పుల్లనిరుచి తీక్షణగుణము ఉష్ణవీర్యము అమ్లవిపాకముగలది. రసదోషము పిత్తము గుల్మము శూల అజీర్ణము వీనిని హరింపచేయును.

గంధకద్రుతి 6 తులములు, మూతి వెడల్పుగల సీసాలోపోసి 30 తు॥ ల శర్కరఅందుచేర్చి వెనురుపుడకతో కలియబెట్టి 30 తు॥ తేనె, సెనగపులుసు 6 తు॥ మాదీఫలరసము 15 తు॥ చేర్చి బిరడావేయుచుకొని ప్రతియుదయమున బేడెత్తుచొ॥ సేవించిన సమస్త పైత్యవికారములు నశించును.

గంధకద్రుతిని నీళ్ళుకలపకుండ పుచ్చుకొనినయెడల చంపును. శరీరముమీదపడిన కాలిపోవును. గనుక ఒకతులము గంధకద్రుతిలో 11 తులములనీళ్ళు కలిపి వాడునది.

గంధకము:—చూ. అమరశిల గంధకము.

గంధమాంసి:—సం గంధమాంసి, కేశి అందురు జటామాంసిలో భేదము, చేదురుచి. లఘుగుణము. శీతవీర్యము, కటువిపాకము కలది,

కఫము కంఠరోగము, రక్తపిత్తము, విషము, భూతజ్వరము వీనిని హరించును.

గచ్చచెట్టు:— సం. కుబేరాక్షి, క్రకచిక తిణగచ్చిక, అనియు హిం. కరంజువా అనియు పేరు. గచ్చచెట్టు పొదవలె పెరుగును. పొలముల యొక్క ఆవరణలకొరకు చుట్టు వేయుదురు. చెట్టంతయు చిన్న చిన్న ముండ్లతో నిండియుండును. ఆకులు దిరిసెన ఆకులవలె నుండును. గాని అంతకన్న మిక్కిలి చిన్నవి. దీనికాయలు మామిడిటెంక ఆకారముగ ముండ్లు గలిగియుండును. కాయలోని గింజనున్నగ గట్టిపెంకు గలిగి యుండును. గచ్చగింజలో విషరూపమైన పప్పుండును.

గచ్చవేరు కారము, వగరు రుచులు, లఘుగుణము, ఉష్ణవీర్యము, కటువిపాకము గలది. వాతము కుష్ఠము, అగ్నిమాంద్యము వీనిని హరించును. ఋతురక్తమును జారీచేయును.

గచ్చఆకులు లేతవి చేదురుచి, ఉష్ణవీర్యము, లఘుగుణము. కటువిపాకము కలది. శ్లేష్మము, కృమి. శూల జ్వరము వీనిని హరించును. ఆకులను ఆముదముతో వెచ్చజేసి నూరికట్టుగట్టిన వరిబీజము బుడ్డ వీని వాపు తగ్గును.

గచ్చకాయలోని పప్పు చేదు కారము, వగరు రుచులు లఘు సర తీక్ష్ణగుణములు, ఉష్ణవీర్యము, కటువిపాకము గలది. శూల, జ్వరము. ఆహికజ్వరము కృమి మలబద్ధము గుల్మము ఉబ్బసము మొదలగు రోగములనుహరించును, వాంతిచేయును, మోతాదు హెచ్చైనయెడల వికారపెట్టి చంపును. గచ్చకాయ గంధమును రాచి గుడ్డపూగవేసిన యెడల తేలు జెర్రి తేనెటీగ మొదలగు వాని విషములు హరించును. గచ్చపప్పు (ఆముదముతో వేయించినది) 4 భాగములు మోదుగుమాడ 3 భాగములు శుద్ధిచేసిన నేపాలములు 2 భాగములు వేపగింజలపప్పు 1 భాగము, వీనినన్నితేనెతో నూరి కందిగింజంత మాత్రలుచేసి ఒకటి రెండు మూడువరకు దేవదారు చెక్కరసము లేక వాయువిడంగాల రసముతో నిచ్చిన పలికపాములు నులిపురుగులు జాతు జ్వరము నశించును.

రసగంధకములు నాభి. నేపాలములు, గచ్చపప్పు ఇంగిలీకము వీ సమభాగములుగ గ్రహించి గుంటగలగర అల్లము రసములతో



మర్దించి శనగలంత మాత్రలుచేసి యుక్తమగు అనుపానముతో వాడినచలిజ్వరము జాతువాతము శూల అగ్నిమాంద్యము మొదలగునవి తగ్గును ఇదియ కృమి ఘాతి గరుడాస్త్రమునబడును. గచ్చపప్పును కోడిగ్రుడ్డు సొనతో అరగదీసి బుడ్డకును, వరిబీజమునకు పట్టువేసిన శీఘ్రముగ వాపు పోటు తగ్గును.

గచ్చపప్పులోనుండి పాతాళ యంత్రసహాయమున తీసిన తైలమును మర్దనచేసిన పక్షవాతము వాతపునొప్పులు ఆమవాతపునొప్పులు తగ్గును నరములలోని నీరులాగును. గచ్చకాయ, పెంకులమసి పోగడచెక్క కానుగువేరుపట్ట వీనినిచూర్ణించి దంతధావనముచేసిన చిగుళ్ళు గట్టిపడును పండ్లవెంటకారునట్టి చీము నెత్తురు కట్టును.

గజనిమ్మ:— సం. బృహజ్జంబీర అనియు, హిం. బడాజంబీర్ అనియు పేరు. చేదు పులుపు వగరు రుచులు సరగుణము ఉష్ణవీర్యము కటువిపాకముకలది. పిత్తకఫములను హరించును. దీపనపాచనములం గలిగించును. నిమ్మపండ్లయొక్క ప్రభావముల నన్నిటిని కలిగియుండును. పక్వముగాని గజనిమ్మపండు ఆలస్యముగను, పక్వమైనది శీఘ్రముగను జీర్ణమగును. కొంచెము ఉష్ణవీర్యముగలది. కొంచెము గురుత్వము గలది. కొంచెము అపథ్యము అయియుండును. గజనిమ్మ, ఆరుకము వీరసేనము వీర వీరారుకము అని నామభేదములు కలదిగనుండును.

గజపిప్పళ్ళు:— సం. కపివల్లి, కోలవల్లి, శ్రేయసీ, గజకృష్ణ అనియు. హిం. గజపీపల్ అనియు పేరు చవ్యముయొక్క పండ్లనే గజపిప్పళ్ళు అందురు. పిప్పళ్ళకంటె ఇవి పెద్దవిగనుక పెద్దపిప్పళ్ళు అందురు.

కారము రుచి రూక్ష తీక్ష్ణగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలవి. అతిసారము శ్వాస కంఠరోగములు కృమి శ్లేష్మము అగ్నిమాంద్యము వాతబలాసకము వీనినిజయించును. అగ్నిదీప్తినిచ్చును. మలమును శోధించును.

గడ్డిదవనము:— సం. చోరక, చండా, కితవ తస్కరఅందురు.

కచోరపు గుల్మములలో నిదియొక భేదము. సుగంధ ద్రవ్యము దుంప ప్రధానమైనది.

తీపి చేదు రుచులు తీక్ష్ణ లఘుగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముకలది. వాతవికారము, దురద, కుష్ఠము, కఫము, చర్మరోగములు, విషము, వ్రణము, మేదస్సు, రక్తదోషము, ముఖ, నాసికా రోగములు, క్రిమి, అజీర్ణము దుర్గంధము అలక్ష్మి వీటిని నశింపచేయును.

గన్నేరుచెట్టు:—సం. చండాతక అనియు, హిం. కనేర్ అనియు పేరు సాధారణమైనచెట్టు. దీనిని పెద్దగన్నేరు అందురు. పొగాకు ఆవలెనుండు ఆకులును, 5 రేకులు మధ్య పసుపురంగు గలిగిన తెల్లపువ్వులును గలది. దీనికొమ్మలు మిక్కిలి పెళుసైనవి. దీనినుండి అమితముగ పాలుగారును. కొమ్మనరికిపాతినను బ్రతుకును. మాను సున్నగనుండక కర్కశముగనుండును. దేవాలయములందును పుష్పవనములందును వీటినిపెంచెదరు. గన్నేరుచెట్లలో పచ్చగన్నేరు, తెల్లగన్నేరు, పెద్దగన్నేరు, వాడగన్నేరు, ఎర్రగన్నేరు, ఒంటిరేకగన్నేరు, ముద్దగన్నేరు మొదలగు అనేకజాతులు భేదములు కలవు. ప్రత్యేక ప్రత్యేకముగ వానిలక్షణములాయా శీర్షికలందు చూచునది. గన్నేరు చెట్లన్నియు విషసమానములు.

పెద్దగన్నేరు వగరు చేదు కారము రుచులు తీక్ష్ణగుణము ఉష్ణవీర్యము కటువిపాకముకలది. చెక్కనునూరి పసుపుకలిపి కట్టుకట్టిన కణుతులు సెగగడ్డలు అడ్డుగర్రలు అణగిపోవును. వేరు చెక్క, ఆకు, పూవు అను నాల్గింటిని తొక్కినముద్దను 4 రెట్ల నూనెలోవేసి నూనెకు నాలుగురెట్లు నీళ్ళుపోసి నీరుయిగురువరకు కాచి వడియగట్టిన తైలమును రాచిన దద్దుమలు పొడలు నుచ్చులు కుష్ఠు వ్రణములు మొదలగు చర్మరోగములుమానును. కరవీరముయొక్క ఇతరగుణములును దీనికి కలవు. చూ. కరవీరము



గబ్బిలము:—చీకటియిండ్లలో వాసములను, చూరులను, ఆశ్రయించుకొనియుండు ఒకజంతువు పక్షియొక్కయు మృగముయొక్కయు ఆకారములను రెంటిని కలిగియుండును, గబ్బిలములుగలచోట మిగుల దుర్వాసనగనుండును.

గబ్బిలపుపెంటను పొగవేసిన యెడల గ్రహబాధ తగ్గును. నూరి కొబ్బరినూనెలోకలిపి శరీరమునకుపూసిన చర్మరోగములు హరించును. గబ్బిలపుపెంటవేసి కాచి వడియగట్టిన నువ్వులనూనెను చెవిలో వేసిన పోటుతగ్గును.

గబ్బిలపుమాంసమును కొంతమంది తిందురు. దీనివలన బహుమూత్రవ్యాధితగ్గును. సన్నాయిరోగులకు పథ్యమైనది.

దీనిరక్తమును ఒకరాగిపళ్ళెమునకు దట్టముగారాచి ఆముదము దీపముపైన బోర్లించి ఆరుబట్టిన కాటుకను కండ్లలోబెట్టిన నేత్రవ్యాధులు కొన్నికుదురును.

గబ్బిలపుక్రొవ్వులో తేనెకలిపి మర్దనచేసినయెడల కీళ్ళు నడుము మొదలగువానిలోని వాతనొప్పులు హరించును.

గబ్బిలమునుచంపి ఇనుపతీగకుకట్టి వ్రేలాడగట్టి క్రింద మంటబెట్టి కాలుచుండగా దానిమసిని యెప్పటికప్పుడు ఒకపాత్రలో దులుపుకొనుచుండవలెను. ఇట్లు గబ్బిలముఅంతయు కాలిపోవువరకు దానిమసిని జాగ్రత్తపరచి ప్రాతకు చిన్నమొదలు రెండుచిన్నములవరకు దినమునకు మూడు లేక రెండుపర్యాయములు తేనెతో నాకుచున్న యెడల పురాణకాస ఆయాసము కఫము గుండెబరువు మొదలగు కఫవికారములు ఉబ్బసము తగ్గును.

గరళము:—సం. సర్పవిష. గరళ అందురు. త్రాచుపాముయొక్క కోరలయందుండును కొత్తగాపట్టుకొనిన తక్షణము పిండినత్రాచుపాము విషము బంగారువన్నెగలిగి యుండును. నిప్పుపైవేసిన కముడువాసనవచ్చును దీనిని యేయౌషధముతోనైన కలిపి వాడదగియుండును. నరుకు మున్నగువానియందు తగిలినచో వెంటనే శరీరమందంతట

ను పాముకరచినట్లు విషము వ్యాపించి చంపును. —న రక్తగ్రహణి విద్రధి మున్నగు గర్భాశయవ్రణములు నోటిపూత మున్నగు వ్యాధిగ్రస్తులకు దీనిని వాడజనదు

గరళము దారుణమైన వేడిచేయును. సన్నిపాతము వాతము శ్లేష్మము సాధారణ జ్వరములు సర్వాంగశీతలము మున్నగు వానిని జయించును

రసము విషము గంధకము గరళము సమభాగములుగ కలిపి హంసపాదియాకురసముతో నూరి గురివెందలంతమాత్రలుచేసి చనుబాలతో సేవించవలెను సన్నిపాతమునందును సర్వాంగశీతలము నందును వాడదగును ఇదియు సింహప్రతీపాలనమనబడును. పెరుగు నేయి మొదలగు వస్తువులతో హితముగ భుజించు స్వస్థులు కల్పప్రకారము సేవించిన కాయసిద్ధి నిచ్చును.

గరిక:—సం. దూర్వా, శష్ప, శాద్వలఅనియు, హిం దూబ్ అనియుపేరు. గరిక తెల్లగరిక, నల్లగరిక, గండగరిక అని మూడు విధములు. నల్లగరికకు సంస్కృతమున నీలదూర్వా, హరిత, శతపర్వ, అనియు, తెల్లగరికకు శ్వేతదూర్వా, శతవీర్యా, గండాలి. శకులాక్షి. అనియు, గండగరికకు గండదూర్వా, గండాలి, తీవ్ర అనియుపేరు. గరిక అనునది నేలబారికుగడ్డి. దీనిని పశువులు చక్కగా మేయును. శివునికి ప్రీతికరమైన పూజాద్రవ్యము సన్నని ఆకులుగలది. దీనికి వాసన యేమియునుండదు. పూవు కాయ లేదు. గరికయొక్క వేళ్ళను ఔషధముగ వాడదగున

గరికలు మూడును సాధారణముగ వగరు తీపి రుచులు శీతవీర్యము లఘుగుణము మధురవిపాకముగలది,

నల్లగరిక పిత్తము దప్పి అరోచకము వాంతి దాహము మూర్ఛ గ్రహబాధ అతిసారము శ్లేష్మము రక్తపిత్తము దురద మొదలగు చర్మరోగములు శ్రమ అనువ్యాధులను హరించును.



తెల్లగరిక తిక్త మధురకషాయరసములు శీతవీర్యముగలది. కాస విసర్పము వీనినిహరించును.

గండదూర్వ తిక్తకషాయ మధురరసములు శీతవీర్యము లఘుగుణము కటువిపాకముగలది. వాతమునుహెచ్చించును. దప్పి తాపము [illegible]లాపకము కుష్ఠము పిత్తజ్వరము వీనినిహరించును.

గలిజేరు: సం. పునర్నవ, శ్వేతమూల వృశ్చీర అనియు, హిం గదహపురేనా విషఖపరా నియుపేరు గలిజేరు నేలమీద పారుకు చిన్నతీగ. ఇది తెలుపు నలుపు యెరుపు పూవులభేదముచేత మూడువిధములు. గలిజేరుఆకులు ఎటకమామిడి ఆకును పోలియుండును. గాని ఆకుగుండ్రగనుండక కొంచెముకోలగనుండును

గలిజేరు కారము చేదు వగరు రుచులు ఉష్ణవీర్యము సర రూక్ష గుణములు కటువిపాకముగలది కఫము విషము కాస హృద్రోగము శూల పాండువు శోఫ వాతవ్యాధి బుడ్డ వాపు దుర్నామరోగము అర్శస్సు వీనినివిసంహరించును.

గలిజేరునుండి క్షారపాకవిధానమున దీసిన క్షారము మండూరముతో కలిపి యిచ్చిన ఉబ్బురోగమునశించును. గలిజేరుఆకును వెచ్చచేసి బుడ్డకు జలోదరకాలునకు గట్టిన వాపు హరించును. ఆకురసమునందు మిరియాలచూర్ణముచేర్చి యిచ్చిన కళ్ళకలకతగ్గును. విరేచనముచేయును. రుచిపుట్టించును. దీపనపాచనముల కలిగించును గలిజేరు సమూలచూర్ణమును పూటకు రెండుచిన్నములు తాటిబెల్లముతో కలిపి తినుచున్న మూలవ్యాధి, రక్తతెరపత్గిర రక్తముపడ్డును. ఆకునుకూర పచ్చడి చేసికొనియు ప్రతిదినము తినుచున్న నంజురోగులకు హితకరముగ నుండును. శరీరము నందలినీరును ఆర్చును. తెల్లగలిజేరు రసముతో నవాసాగరము మొదలగు కొన్ని యుప్పులుకట్టును. భస్మములగును. పంచలవణములను గలిజేరు రసములో 10 దినములు నానబెట్టి పుటమువేసి ఆయువ్వు ప్రతి యుదయమునను ఉష్ణోదకముతో కలిపి త్రాగిన మేహానంజతగ్గును. కల్ప ప్రకారము దీనిని సేవించిన జరామరణములను రాకుండ

జేయును. వేరు గంధములో మిరియపుగంధమును గూడ చేర్చి కలికము వేసినయెడల స్త్రీసంగమదోషము నివర్తించును. ప్రత్యేకముగ వేరును నేతితో అరగదీసి కండ్లకు కలికము వేసిన కంటిలోనిపూవులు నశించును. ప్రతియుదయమునను 9 లేతయాకులను నమిలి మ్రింగుచున్న మొదల 40 దినములకు కుష్ఠము నశించును. తేనెతో గలిజేరువేరు నరగదీసి కండ్లయందంజనము వేసిన కంటివెంట నీరుగారుట మెరుపుతగ్గును. గుంటగలగరాకురసములో అరగదీసి అంజనముచేసిన కంటిదురద తగ్గును. నీళ్ళతో అరగదీసి వేసిన తిమిరము హరించును. జలము లేక గోమయరసముతో పిప్పలిని తెల్లగలిజేరు వేరును అరగదీసి అంజనముచేసి స్త్రీరోజీకటినశించును.

సమూలరసమందు కొంచెము పంచదార జేర్చి పుచ్చుకొనిన గ్తప్రదరము కట్టును. ఎర్రగలిజేరు తిక్తరసము సరగుణము ఉష్ణవీర్యము కటువిపాకముకలది. నల్లగలిజేరు కటుతిక్తరసములు కలది. అలవాటుగ గలిజేరుకూరను తినుచున్న కఫము వాతము అగ్నిమాంద్యము గుల్మము ప్లీహ శూల మొదలగురోగములు నివర్తించును.

గలిజేరు తిప్పతీగ దేవదారు కరక్కాయ శొంఠి వీనికషాయమున గుగ్గులుచూర్ణమును గోమూత్రమును గలిపి సేవించిన శోఫోదరములునశించును. గలిజేరు ఉలిమిడిపట్టి వీనికషాయమునుత్రాగిన అంతర్విద్రధి హరించును. మూడువిధములగు గలిజేరులు సమాన ప్రభావముకలవి. తెల్లదిశ్రేష్ఠము.

గసగసచెట్టు:—సం. ఖసఖస అనియు. హిం. ఖస్‌ఖస్ అనియు పేరు. పోస్తుచెట్టుయొక్క గింజలకు గసగసాలుఅనిపేరు. మిక్కిలిచిన్నవిగ తెల్లగనుండును. పోస్తుచెట్లనుండి నల్లమందునుతయారుచేయుదురు.

గసగసాలపండుపై బెరడు తిక్తకషాయరసములు లఘు రూక్షగుణములు శీతవీర్యము కటువిపాకముకలది. నీళ్ళవిరేచనములను కట్టును. వాతము హెచ్చును. కఫకాసనుహరించును. మదము మత్తు రుచి ధాతుక్షోభణము వీనినికలిగించును.



గసగసాలు తీపి వగరు రుచులు గురుగుణము శీతవీర్యము మధురవిపాకముగలవి. వీర్యవృద్ధి కఫము మలబద్ధము కాంతి బలము వీనిని కలిగించును. గసగసాలరసములో తేనెకలిపి త్రాగిన నీళ్ళవిరేచనము లంగట్టును. గసాలను వీర్యవర్ధకమగు వస్తువులతో చేర్చి తినిన బలమును రక్తవృద్ధిని కలిగించును. అమితముగదినిన వీర్యమును శోషింపచేయును. కొద్దిగ మత్తునుకలిగించును.

గాజరగడ్డలు:—సం. గాజర, గృంజన, నారంగవర్ణ అనియు, హిం. గర్జర్ అనియుపేరు. దుంపయే ప్రధానమగు శాకము చిన్నమొక్క దీనియాకులు చిల్లులుగలవిగనుండును. దీనిపూవులు మనోహరముగ గుత్తులు గుత్తులుగ పూచును. దుంప నారింజపండు వర్ణము గలిగియుండును.

తీపి కారము చేదు రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. దీపనముగల్గించును. మలబద్ధముచేయును రక్తపిత్తము అర్శస్సు గ్రహణి కఫవాతములు ఆధ్మానము క్రిమి శూల దప్పి దాహము గుల్మము దుర్గంధము వీనినిహరించును. గాజరగడ్డలను ముక్కలుగాతరిగి ఉప్పుకలిపిన నీళ్ళలో బాగుగా నుడకబెట్టి నీళ్ళుపారబోసి ముక్కలను పంచదారలోవేసి పొయ్యిమీద వండవలెను. కొలదిపాకము వచ్చినతరువాత సీసాలో భద్రపరుచునది. పంచదారలోపాకముపట్టుటకుగాను కరుపోయనక్కరలేదు.. దుంపలోనుండునీరుచాలును. ఇదియ గాజరగడ్డమురబ్బాఅందురు. ఇది సెగరోగము మూత్రబద్ధము అశ్మరిగలవారలకు హితము. మూత్రమునజారీచేయును. వీర్యవృద్ధి బలము వీనినిగలిగించును. లింగమునకు దార్ఢ్యమును బిగువునుకలిగించును.

గాజరగింజలకుగూడ దుంపయొక్క గుణములుకలవు. గాజరగింజలను ఆవునేతితో వేయించి చూర్ణించి బాదంపప్పుతో కలిపి తినిపంచదారకలిపిన పాలుత్రాగుచున్న అమితవీర్యవృద్ధి సంభోగశక్తి గలుగును రాత్రిపూట సేవించనగును.

గాడిదగడప:— ఇదియొకతీగ. నలుపుగలసిన ఆకుపచ్చరంగు గలది. దీనికాయలు లేతబుడముకాయలంత యుండును. మూడుపక్షములుగలవి. ఆకు గరుకుగనుండును. పశువులకీతీగ నెక్కువగ నుపయోగింతురు. అడవులందును కంచెలయందును విశేషముగ పెరుగును.

చేదు రుచి రూక్షగుణము కటువిపాకము ఉష్ణవీర్యము గలది. విరేచనముచేయును. క్రిమి చర్మరోగములు వాతము జ్వరము వీనినిహరించును. ఆకురసమందు హారతికర్పూరము మిర్యాలచూర్ణముకలిపి రాచినయెడల తామర దురద గజ్జిమొదలగు చర్మరోగములుమానును. ఆకులకు మంచినూనెపూసి వెచ్చజేసి రసమును చెవిలో పిండిన చెవిలోని కురుపుమానును. నాభికికట్టుగట్టిన విరేచనముచేయును. నలుపురుగు ఏలికపాములు చచ్చిపోవును. స్త్రీలు బహిష్ఠులైనపుడు ఉదయము ౧ టలంచమాత్రము గుక్కెడు పసరు త్రాగిన ఋతుశూల నివర్తించును. ఋతురక్తము జారీచేయును. గాడిదగడపాకు సున్నము ఆవాలు కలిపి నూరి వెన్నునకుపట్టువేసిన చలిజ్వరము ఆహికజ్వరము తగ్గును. ఒకతులము ఆకురసమును ఒకతులము ఆముదములో కలిపి యిచ్చిన స్త్రీలు సుఖముగ ప్రసవింతురు. 3 ఆకులు, 3 మిర్యాలు కలిపి నూరి మూడు మాత్రలుచేసి గంటకొకటిచొ॥ యిచ్చిన కడుపునొప్పితో కూడిన విరేచనములుతగ్గును పామువిషము క్రిములు నశించును.

గాడిద:— సం. ఖర, కాసర, గర్ధభ అనియు, హిం. ఊంటని అనియుపేరు. గాడిదమూత్రము కారము రుచి తీక్షణ రూక్షగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. కఫము దాహము వాతరోగములు క్రిమి కుష్ఠము ఉదరము ఉన్మాదము శోష అర్శస్సు వీనినిజయించును.

గాడిదలద్దె సూతికావాతమును హరించును. ప్రసవస్త్రీల మైల రక్తమును వెడలించును. కడుపునొప్పి శూల వీనినిమాన్పును.

గాడిదపాలుతీపి రుచి రూక్షగుణము అమ్లవిపాకము ఉష్ణవీర్యముగలది బలము రుచి బుద్ధిమాంద్యము వీనిని కలిగించును. శ్వాస



కాసలు కఫవాతములు వీనినినశింపచేయును. బాలురకు పోసిన దగ్గు పాల ఉబ్బసము మొదలగునవితగ్గును.

గాడిదపెరుగు తీపి పులుపు రుచులు లఘు రూక్షగుణములు ఉష్ణవీర్యము అమ్లవిపాకము గలది. వాతదోషమును హరించును. దీపన పాచనముల గల్గించును. గాడిద మజ్జిగయు పెరుగుయొక్క రసవిపాకాదులను గలిగి యుండును.

గాడిదవెన్న వగరు రుచి, లఘు సర గుణములు ఉష్ణవీర్యము మధుర విపాకము గలది కఫవాతములు, మూత్రదోషము, వీనిని హరించును.

గాడిదనేయి వగరు రుచి, లఘుగుణము ఉష్ణవీర్యము, మధురవిపాకముగలది. బుద్ధిబలము అగ్నిదీప్తి. శ్రమ వీనిని కలిగించును. వాంతి చేయును. మూత్రదోషమును కఫమును హరించు.

గాయపాకు:- చూ. పత్రబీజము.

గారచెట్టు: సం. ఇంగుదీ, అంగారవృక్ష, తాపసద్రుమ అనియు, హిం. హింగోట్ అనియుపేరు. గారచెట్టు పెద్దవృక్షము. దీనికాయలు గుండ్రగ బల్లపరుపుగ షుమారు రెండంగుళముల వలయముగలదిగనుండును. కాయపైపొరకు మిక్కిలిగట్టిగనుండును. గారకాయలోని పలుకును తీసివైచి అందు తిరుచూర్ణము నస్యము (పొగాకుపొడి) వేసికొందురు. చెట్టునకుముండ్లుండును. పువ్వులు నిమ్మపువ్వులను పోలి గుండ్రగ పొడవుగ పూచును. చెక్క మదవాసనగనుండును. రోటిలో రుబ్బిన నురుగువచ్చును.

దీనివేరు లేక చెక్క కారము చేదు రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. క్రిమి వాతము విషము శూల బొల్లి కుష్ఠము వ్రణము కఫము గ్రహపీడ అనువానిని నివర్తింపచేయును.

గారపువ్వు తీపి చేదు రుచులు స్నిగ్ధగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. వాతకఫములను నశింపచేయును

గారపండుగుజ్జు చేదు తీపి రుచులు ఉష్ణవీర్యము కటువిపాకము గలది. వాతకఫహరము.

గారకాయలనుండి తీసిన తైలము కారము రుచి సరగుణము కటువిపాకము శీతవీర్యముకలది. పుష్టి కాంతి బలము శ్లేష్మము వీనిని పెంచును. పైత్యమునుహరించును. విరేచనకరము.

గిరిమల్లి:—సం. కుటజ, శక్రాహ్వ, వరతిక్త అనియు, హిం. కుడాఅనియు పేరు పెద్దవృక్షము. దీనిఆకులు కోలగ పెళుసుగ నుండును. కాయపొడవుగ వంకరగ కొడవలివలె నుండును తెల్లనిపూవులు పూచును. పూవులు సువాసనగలవి

కారము వగరు రుచులు లఘు రూక్షగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలవి. అర్శస్సు అతిసారము పిత్తరక్తము కఫము దప్పి వీనిని హరించును

గిరిమల్లెపూవు తిక్తకషాయరసములు లఘుగుణము శీతవీర్యము కటువిపాకముగలది. దీపనమును వాతమును గల్గించును. కఫము పిత్తరక్తము కుష్ఠము అతిసారము కృమి వీనినిజయించును.

గిరిమల్లెగింజలు కూరవండుకొనితినిన ఆమవాతము కఫము రక్తాతిసారము కుష్ఠము కృమి వీనినిహరింపచేయును. రుచిబుట్టించును.

గిలిగిచ్చ:—సం. ఘంటారవ, శణపుష్పిక అనియు, హిం. ఝునఝునియా శణహులీ అనియుపేరు. ఇది చేలగట్లను పెరుగును. దీనికాయలు రెండంగుళముల పొడవుగ బొటనవ్రేలిలావుననుండును. యెండినతరువాత దీనికాయలలోని గింజలు గలగలలాడుచు వినోదముగనుండును తెల్లనిపూవులుపూచును.

ఇది కటు తిక్తరసములు, సరగుణము, ఉష్ణవీర్యము, కటువిపాకము గలది. వాంతిని చేయును. కఫవాతములు అజీర్ణ జ్వరదోషము, రక్తదోషము, ముఖకంఠరోగములు సన్నిపాతములు మొదలగు వాటిని ఖండించును.



దీనిలో చిన్నకాయలుకాచునది జనుముఅనిపేరు. జనుము పశువులకు మేతగానుపయోగింతురు. గిలిగిచ్చ నుపయోగింపరు. జనపకాడలను ఊరబెట్టిగాని యెండించిగాని నారతీయుదురు. యిదిగట్టిగ నుండును. జనపచెట్టునకును గిలిగిచ్చయొక్క రసవీర్యాదులు కలిగియుండును.

గుంటకలగర:—సం. భృంగ, మార్కవ భృంగరాజ అనియు, హిం, భాంగరా అనియుపేరు. గుంటగలగర నీటిప్రదేశములందు విశేషముగ మొలచు చిన్నమొక్క. గుంటగలగర ప్రసిద్ధమైనది. ఇది పసుపు నలుపు తెలుపు పూవులభేదముచేత మూడువిధములు. పచ్చగుంటగలగరకు స్వర్ణభృంగ, హరివాస, అనియు, నల్లగుంటగలగరకు మహాభృంగ, నీలభృంగ అనియు, సంస్కృతమున పేర్లు. సమూలముగ వాడదగును. సర్వాంగసారమైన మూలిక.

గుంటగర చేదు రుచి రూక్ష తీక్ష్ణగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది కఫము శోఫ, విషము, నంజు, వాతము జ్వరము, కుష్ఠము, నేత్ర శిరోవ్యాధులు, దంతవ్యాధులు, కాస, అంత్రవృద్ధి, కృమి, ఆమవాతము, హృద్రోగము, చర్మరోగములు వీనిని హరించును.

౫ తులముల గుంటగలగర రసములో అరతులం ఉప్పుకలిపి ప్రాతఃకాలములందు పుచ్చుకొనుచున్న ౫ దినములకు నంజు పూర్తిగ తీసివేయును. మలమూత్రములగావించును. గుంటగలగరరసమందు మిర్యాలచూర్ణముకలిపి త్రాగిన చలిజ్వరము తగ్గును. కలగరరసముతో పండ్లుతోముకొనిన చిగుళ్ళు గట్టిపడును. దంతముల తీపుతగ్గును. రసము తిన్నంమున కలిగిన నోటిలోనిపుండునుమాన్పును. రసముత్రాగిన కంఠస్వరమును బాగుచేయును. కృములుచచ్చిపోవును. దీపన పాచనములు కలుగును. ఆకు కూరచేసుకొనియు పచ్చడిచేసుకొనియు ప్రతిదినము తినుచున్న సకల అజీర్ణదోషములు నివర్తించును, వేడిచేయును. కొంచెము పైత్యించును. నేత్రములకు నలుపెక్కించును. గుంటగలగర రసము 4 శేర్లు, ఉశిరిగపండ్లరసము 2 శేర్లు, కొబ్బరిపాలు 2 శేర్లు, ఆవు

నేయి 2 శేర్లు కలిపి రసములు యిగురువరకు కాచి వడియగట్టిన ఘృతము తలకు అభ్యంజనముచేసిన సకలశిరోవ్యాధులు నయమగును. వెంట్రుకలు నల్లబడును. నేత్రనైర్మల్యము బుద్ధివికాసముకలుగును. మరియును. ఆకును వెచ్చజేసి కట్టుకట్టిన బోదకాలు బుడ్డ వరిబీజము వీనివాపు భర్రున తగ్గుతగ్గును ఆకునునూరి యాముద్దను చీలమండలవరకు పాదమునకు పొదిగి కట్టు కట్టిన యెడల రసపుపట్లు నయమగును. రసము క్రిందికిదిగిపోవును.

పచ్చగుంటగలగరయు నల్లగుంటగలగరయు వాదవిద్యయందును రసాయనప్రక్రియయందును మిక్కిలిగ నుపయోగించును. తెల్లగుంటగలగరయొక్క గుణములుగూడనుండును.

గుగ్గిలము:—సం. గంధరాజ, కణగుగ్గులు. వంశపీత అనియు, హిం. గంధరాజ్ అనియు పేరు. గుగ్గిలపుచెట్టుయొక్క బంకకు గుగ్గిలము అనిపేరు గుగ్గిలము ముక్కలుముక్కలుగ పచ్చగ మెరుపునాకుగనుండును. పరిమళముగలది. దీనిపొగ దేవతారాధనయందు ప్రశస్తముగ నుపయోగింతురు. రసవీర్యాదులందు మహిసాక్షికి సమముగ నుండును. దీనిని నీళ్ళలోవేసి పాకముపట్టి అందు రక్తపాషాణమునుగాని వత్సనాభగంధమునుగాని చేర్చి కలియగలిపి పట్టువేసిన దుష్టవ్రణములు సెగగడ్డలు అష్ఠగ్రరలు సవాయిబిళ్ళలు మొదలగునవిహరించును. రక్తముపడు మూలవ్యాధికి గుదమున దీనిపొగబట్టిన తీపు తగ్గును. పాపుతులా చూర్ణమును గిద్దెడుపాలలోకలిపి త్రాగిన మేహవాతపునొప్పులు పుసపాయువమున లేచు చిన్నచిన్నపొక్కులు పొత్తనొప్పులుతగ్గును. పిల్లిపీచరరసములో రెండుచిన్నముల గుగ్గిలమునుకలిపి ప్రాతఃకాలములందిచ్చుచుండిన స్త్రీలకు స్తన్యము (చనుబాలు) వృద్ధియగును. మంచినూలము పటికిబెల్లము ముగ్గిపాలు యివి ప్రత్యేకము బేడెత్తు చొప్పన ప్రతిదినము ఉదయకాలములందు పుచ్చుకొనుచుండునెడల దంతలూటీ ఆసనగంధమూలములన్నిగు కూర్చర మైనపుంస్త్వ మానును. వీర్యవృద్ధి బలము అగ్నిదీప్తి కలుగును. 40 దినములు సేవించవలసి యుండును. అడ్డసరము



రసములో చిన్నం గుగ్గిలపు చూర్ణమును చేర్చి దినమునకు రెండుసార్లు పుచ్చుకొనిన పురాణ కాసలు నెమ్మదించును. ఆయాసము తగ్గును. గుగ్గిలము సున్నము వీనిని నీళ్ళతోనూరి గొంతునకు పూసిన గొంతునొప్పి తగ్గును.

గుండాశినీతృణము:—సం. గుండాశినీ, గుండాల గుచ్ఛమూలికా అందురు. తృణవిశేషము. కారము తీపి, చేదు, రుచులు, ఉష్ణవీర్యము, సరగుణము, కటువిపాకము గలది. పిత్త దాహ శ్రమలను క్రిమిదోషమును హరించును. దీనిని పశువులు తినిన వెంటనే పశువులు చచ్చిపోవును.

గుత్తిబీర:— సం. లఘుకోశాతకి గ్రామ్య సప్తపుత్రి అనియు హిం. సతపుతీ తోరయం అనియు పేరు. బీర తీగలలో భేదము రూపము సమానము. ఇది ఏడేసి కాయలు గుత్తులుగ కాచును.

చేదు రుచి స్నిగ్ధగుణము శీతవీర్యము, కటువిపాకము గలది. పిత్తము, విషము, కాస, జ్వరము. వాతము అను వానిని హరించును.

గుమ్మడికాయ:—(పచ్చని) సం. పీతకూష్మాండ అనియు హిం భిలియా అనియు పేరు. గుమ్మడికాయ పెద్దదిగ పండినపుడు పసుపు పచ్చగ నుండును. ఆకులు పెద్దవి. గరగర లాడుచుండును. కాయలోని గింజలను పైచర్మము వలచి లోనిపప్పును తిందురు. ఇదికమ్మగ నుండును పచ్చని పూవులును పూచును.

గుమ్మడికాయ తీపి రుచి, గురుగుణము, శీతవీర్యము మధురవిపాకముగలది. అగ్నిమాంద్యమును పిత్తమును కలిగించును. గొంతు నొప్పి చేయును కంఠస్వరమును పాడుచేయును, శ్లేష్మమునుహరించును. వీర్యవృద్ధి, బలము, కలిగించును. లేతగుమ్మడికాయ అనేక రోగములను కలిగించును అపథ్య మైనది.

గుమ్మపాలు:—అప్పుడు పితికిచల్లారకుండ వెచ్చగనుండు ఆవుపాలు మిక్కిలి బలము. ఆయువు, కాంతి, వీర్యవృద్ధి, దేహపుష్టి, వీనిని కలుగజేయును. బాలురకు చిక్కిపోయిన వారికి 5. తొలి ధారలు ఉద

యములందు త్రాగుచున్న క్రొత్త రక్తముపట్టి దేహమునకు పుష్టిని ధాతు సంతర్పణమును గల్గించును. అగ్నిదీప్తినిచ్చును. తాపమును నశింపజేయును. మూడు లేక అయిదు మిరియములను రాత్రిపూట మజ్జిగలో నానవేసి ఉదయమున మెత్తగానూరి దానిని గుమ్మపాలలో కలిపి త్రాగిన జీర్ణజ్వరము కామిలు రక్తతెరప యివి నశించును. చల్లాగిన గుమ్మపాలువ్యాధి హేతువుగనుండును.

గుమ్మడిరేగు:—చూ. కట్ఫలము.

గుమ్ముడుచెట్టు:—సం. గంభారి, కాశ్మరి, సర్వతోభద్ర అనియు, హిం. కుంభేర్ అనియుపేరు. దశమూలములలో చేరినది. పెద్ద వృక్షము. పచ్చనిపూవులుపూచును. ఇంచుమించుగ రావియాకులను పోలిన ఆకులుండును. పండ్లు పసుపుపచ్చగ నుండును. మాను తెల్లగ నుండును యీచెట్టునరికిన పాలుగారును.

మధురకషాయ తిక్తరసములు గురుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. దీపనపాచనముల గలిగించును. మలమునుభేదించును. పవిత్రమైనది. భ్రమ శోష దప్పి, శూల అర్శస్సు విషము దాహము జ్వరము వీనినిహరించును.

గుమ్ముడుపండు తీపి వగరు పులుపు రుచులు శీతవీర్యము స్నిగ్ధగుణము మధురవిపాకముగలది. తాపము, దప్పి, వాత, రక్తము, పిత్తము క్షత క్షయము వీనినిజయించును. విరేచనబద్ధముచేయును. కేశములను పెరుగునట్లుచేయును. రసాయనముగనుండును.

దీనిఆకు వాత శ్లేష్మములు, శోష, మేహము, కృమి, వీనిని ఖండించును.

గుమ్ముడుపూవు మధుర కషాయ తిక్తరసములు శీతవీర్యము గురుగుణము మధురవిపాకము గలది. వాతమును శుక్రమును వృద్ధిజేయును. పిత్తరక్తము రక్తదోషము వీనినిహరించును.

దీనివేరు మిక్కిలి ఉష్ణమైనది. మనుష్యులకు అహితమైనది.



గురివెంద:— సం. గుంజ, గుంజిక, కాకజంఘ అనియు, హిం. ఘుంఘుచీఅనియుపేరు. గురివెంద తీగప్రాకును. గింజలయొక్క యెరుపు తెలుపు నలుపు భేదముచేత మూడువిధములు. యెరుపు తెలుపు గింజలు బహుళముగదొరకును. నల్లవి అరుదుగ దొరకును. గురివెంద ఆకులు చింతాకులవలె నుండును. ఆకులు నమలిన తీయగ నుండును పూవులు అనుము లేక అలచందపూవులవలె నుండును. గుత్తులుగపూచును. యెర్రగురివెందగింజలయొక్క ముఖమున నల్లనిరంగుండును. తక్కినభాగము యెరుపుగనుండును తెలుపు నలుపు గుంజలకు రెండురంగులుండవు, యెర్రగురివెందకు రక్తికయనియు, తెల్లగుంజలకు శ్వేతకాంభోజిఅనియు, నల్లవాటికి నీలగుంజ కృష్ణగుంజ అనియు, సంస్కృతనామములు.

గురివెంద మధురతిక్త కషాయరసములు ఉష్ణవీర్యము స్నిగ్ధలఘుగుణములు మధురవిపాకముగలది.

గురివెందవేరు శూలను, ఆకు విషమును హరించును. గురివెంద గింజలు చర్మరోగము నేత్రరోగములు పిత్తము ఇంద్రలుప్తము (పేనుకొరుకుట) వ్రణము కృమి రాక్షసగ్రహపీడలు దురద కుష్ఠము కఫము జ్వరము ముఖరోగ శిరోరోగములు వాతము భ్రమ శ్వాస దప్పి మేహము మందాగ్ని వీనిని నశింపచేయును. వాంతికరమైనది.

గురివెందగింజలు తక్కెడాకు పసరుతో అరగదీసి యాగంధము నందు కొద్దిగ పొంగించిన వెలిగారమును కలిపి గుడ్డకుపట్టించి పట్టీవేసిన అడ్డుగర్రలు బిళ్ళలు హరించిపోవును.

గురివెందపప్పును చూర్ణించి ఆవుపాలలో కలిపి వుడికించి పంచదారకలిపి తినిన వీర్యవృద్ధి వీర్యస్తంభనము కలుగును. కుంకుడుకాయ నురుగుతో అరగదీసి కణతలకు పట్టువేసిన తలనొప్పిహరించును. మూడుగురివిందగింజలలోని పప్పును తినిన మనిషినిచంపును. గురివింద ఆకు రసములో బెల్లమువేసి నూరి వ్రాసిన వాపుహరించును.

గురుపంచమూలములు:—మారేడు, తక్కెడ, దుందిలము, కలిగొట్టు, గుమ్ముడు రేగు వీనివేళ్ళయొక్క సముదాయమును గురు పంచమూలములని పేరు. మధురతిక్త కషాయరసములు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముకలవి. అగ్నిదీప్తినిచ్చును. కఫవాతములను శ్వాసకాసలను హరించును.

గుర్రము:- సం. అశ్వ, వాజి అనియు, హిం. ఘోడా అనియు పేరు. గుర్రపుమూత్రము కారము వుప్పు రుచులు ఉష్ణవీర్యము తీక్ష్ణగుణము కటువిపాకముగలది. కఫము దారుణ వాతరోగములు ఉన్మాదము వీనినిహరించును.

గుర్రపులద్దె రసమును తాగిన శూల దగ్గు హరించును. నశ్యముచేయించిన ముక్కువెంట రక్తముపడుట మానును.

గుర్రపుపాలు తీపి పులుపు వుప్పు రుచులు రూక్ష లఘు గుణములు ఉష్ణవీర్యము ఆమ్లవిపాకము కలవి. శోష వాతము వీనిని హరింప చేయును.

గుర్రపుపెరుగు మధుర కషాయరసములు రూక్షగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముకలది. కఫము మూర్ఛ నేత్రరోగము వీనిని హరించును కొద్దిగా వాతముచేయును.

గుర్రపుమజ్జిగ కారము పులుపు రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము ఆమ్లవిపాకముకలది. పిత్తము దుర్గంధము రక్తదోషము గలుగజేయును. దీపనకారి కఫవాతహరము అపథ్యము.

గుర్రపువెన్న వగరు చేదు రుచులు స్నిగ్ధగుణము ఉష్ణవీర్యము కటువిపాకము గలది. కఫవాతములను హరించును. నేత్రములకు జబ్బుచేయును.

గుర్రపునెయ్యి శరీరమునకు వేడిబుట్టించును. సులభముగ జీర్ణమగును. విషము, నేత్రరోగము, దాహము, వీనిని హరించును. తృప్తినిచ్చును.



గుల్కందు:— గులాబి పూవులను బాగుగా నెండించి పటికబెల్లపు చూర్ణమునుకలిపి ఊరనిత్తురు. ఇదియు గులఖందు అనబడును. కొందిగ విరేచనము చేయును. మేహము, పిత్తము వీనిని హరించును. ధాతుపుష్టిని తృప్తిని ఆనందమును కలిగించును.

గులాబిపూవు: కొద్ది విరేచనకారి మూత్రపు చుసకము. పిత్తమును, మేహమును హరించును. ఉడుకు దగ్గును ఆపును. విశేషముగా దినిన జలుబు చేయును.

గుల్లసున్నము: నీటిలోనుండు ఒక విధమగు పురుగులయొక్క అస్థిపంజమును యెర్రగాకాల్చి తడిపిన సున్నమగును. ఇదితాంబూలములో తినిన యెర్రబడును. వేడిచేయును. సున్నమును జిల్లేడు పాలతో తడిపి యెండించికాల్చి యాసున్నమును, 4 గుంజలెత్తు 3 తమలపాకులతో చుట్టి నమలిమింగవలెను ఇట్లు దినమునకు మూడుసారులుతినిన దగ్గు ఆయాసము తగ్గును. ప్రత్యేకముగ తినిన నోరుపుండుచేయును. రక్కిసముండ్లు గ్రుచ్చుకొనినచోట సున్నమును పూసిన బాధతగ్గును. ముండ్లు బైటకువచ్చును. కొంతుకకుబాచిన గొంతునొప్పితీయును.

గువ్వగుత్తిక: సం. విద్రుమలత, నళిక అనియు, హిం. నళిఅనియు పేరు. ఇదిసుగంధద్రవ్యము. ఇది పగడపుతీగవలెనుండును. కారము చేదు రుచులు తీక్ష్ణసర లఘుగుణములు శీ వీర్యము కటువిపాకముగలది. నేత్రములకుహితమైనది. వాతపిత్తములు రక్తపితము క్రిమివిషము కఫవాతములు ఉదరము శూల అశ్మరి మూత్రకృచ్ఛ రక్తదోషము దప్పి దురద కుష్ఠము జ్వరము వ్రణము దుష్నామరోగము వీనిని హరింపచేయును.

గువ్వపిట్టమాంసము:—కొంచెము ఉష్ణగనుండును. గురుత్వము చేయును. సర్వదోషములను ప్రకోపింపజేయును.

గెద్దమాంసము: పుష్టి బలము వీర్యము వీనిని వృద్ధిచేయును నేత్రములకు హితమైనది. క్షయ రోగులకు పథ్యము. ఆలస్యముగ జీర్ణమగును.

గేదె:—సం. మహిషఅనియు, హిం. భైంస్ అనియుపేరు. గేదెమూత్రము కారము చేదు ఉప్పు రుచులు రూక్షగుణము కటువిపాకము ఉష్ణవీర్యము గలది. వాతమును శమింపచేయును. పిత్తమును హెచ్చించును. కుష్ఠము, అర్శస్సు, పాండువు, ఉదరము, శూల వీనిని హరింపచేయును.

గేదెపేడ గజ్జికురుపులకు కట్టిన వడిలి మానుపట్టును. కాలినపుండ్లకు గేదెపేడరసమును చమిరిన త్వరలో మెండిపోవును.

గేదెపాలు మధురరసము గురు స్నిగ్ధగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. నిద్రదెచ్చును. వాతము కఫము బలము పుష్టి వీర్యవృద్ధి బలము వీనినివృద్ధిచేయును. శ్రమనుపోగొట్టును.

గేదెపెరుగు తీపి రుచి గురు స్నిగ్ధ పిచ్ఛిలగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది శ్లేష్మము వాత రక్తదోషము వీనినికలిగించును. పిత్తమునుఖండించును. అగ్నిమాంద్యమును చేయును. లేగడి గేదె పెరుగు త్రిదోషములను పెంచును. అపథ్యమైనది.

గేదెమజ్జిగ కఫము శోఫ గల్గించును. ప్లీహ అర్శస్సు గ్రహణి అతిసారము అను రోగములుకలవారలకు పథ్యము చలువచేయును. వాతమును పెంచును.

గేదెవెన్న తీపి వగరు రుచులు గురుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. దాహము పిత్తము శ్రమ వీనిని హరించును. వీర్యము బలము మేదస్సు పుష్టి గలుగజేయును.

గేదెనెయి మధురరసము గురుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది సుఖము కాంతి బలము వీర్యము గలుగ జేయును. వాతశ్లేష్మములు దుర్నామరోగము గ్రహణి అగ్నిదీప్తి నేత్రరోగములు అనువానిని హరించును

గొంతెమగోరు:—సం. ప్రసారణి, రాజబలా, కంటభరా అనియు, హిం. పసరన్ అనియుపేరు. గొంతెమగోరుయొక్క స్వరూపమును సన్నిర్ణయముగ చెప్పుట కవకాశములులేవు. వాడుకయందు సీతా



మ్మవారికాడనే గొంతెమగోరుగా వాడుచున్నారు. ఇది భూమిపై ప్రాకులాడు సన్ననితీగ తెల్లనిపూవులును వెత్తురుచెట్టు ఆకువలెనుండు ఆకులును గుండ్రగ కామంచికాయవలెనుండు కాయలును గలిగియుండును

గొంతెమగోరు చేదు రుచి గురుసరగుణములు ఉష్ణవీర్యము వాతము వాతరక్తము కఫము వీనినిహరించును. శుక్రము బలము గలుగజేయును విరేచనకరమైనది. గేజీకటిని అర్శస్సును వాపును హరింపచేయును. విరిగినయెముకల నతుకుకొనజేయును.

గొడ్డుగాకర:—సం. వంధ్యాకర్కోటకి, నాగారి, యోగేశ్వరి అనియు హిం బాంఝ్‌కకోడా అనియు పేరు. కాకరతీగవలెనే యుండును పూతపూసి రాలిపోవునుగాని కాయదు. దీనికి వేరుండదు. దుంపయుండును.

గొడ్డుగాకరదుంప కారము చేదు రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. కఫము, నాభి మొదలగు స్థావరవిషములు ఎలుక, పాము, తేలు మొదలగు జంగమవిషము, విసర్ప నేత్ర శిరోరోగములు వ్రణము కాస రక్తదోషము వీనినిహరించును. అమావాస్యా ఆదివారమున ఉదయము నియమముతో మాటలాడకుండ దుంపను త్రవ్వి తీసి భద్రపరచి పాముకరచినచోట రాచి రెండుచిన్నముల చూర్ణమును మంచినీరుతో త్రాగించిన సర్పవిషము నశించును. దుంపచూర్ణమును వసచూర్ణమును కలిపి నస్యముచేసిన ఒంటి తలనొప్పి యితర శిరోవ్యాధులు నశించును దుంపను తేనెతో అరగదీసి నేత్రములందంజనముచేసిన కొన్ని నేత్రరోగములు మానును దుంపచూర్ణమును ప్రతియుదయమునను నియమపూర్వకముగ బ్రతికినదూడగల ఆవుపాలతో బలానుసారము సేవించు స్త్రీలకు గర్భదోషములు నివర్తించి సంతానవతను కలిగించును. చూర్ణమును వ్రణములపై చల్లిన నవి వెంటనే మానుపట్టును. క్రమప్రకారము తీసి జాగ్రత్త పరచిన దుంప ముక్కను తాయతులోనుంచి ధరించిన గ్రహపీడతొలగును.

గొబ్బిచెట్టు:—సం. కోకిలాక్ష, తూలకంటక అందురు. ఇదినీళ్ళవారపెరుగు చిన్నమొక్క. వాడిగల ముండ్లు చెట్లంతట నుండును. సన్నని పొడవైన ఆకులుండవు. తెలుపు నలుపు పూవులభేదముచే నిది రెండువిధములు తెల్లగొబ్బి శ్రేష్ఠము.

ఆకు చేదు వగరు రుచులు రూక్షగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది కూరవండుకొని తినిన ఉబ్బురోగులకు హితముగనుండును. శరీరమునందలి నీరునార్చును. అగ్నిదీప్తినిచ్చును.

వేరు కషాయము లేక రసము వగరు కారము చేదు రుచులు శీతవీర్యము లఘుగుణము కటువిపాకముగలది. పంచదారకలిపి త్రాగిన మూత్రకృచ్ఛ్ర మూత్రాఘాతము నశించును.

గింజలు మధుర కషాయ తిక్తరసములు స్నిగ్ధగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలవి. అమితవీర్యవృద్ధి మేహశాంతి సంభోగశక్తి గలుగజేయును. గింజలచూర్ణమును పాలతో ఉడకబెట్టి పటికిబెల్లము కలిపి ప్రతిప్రాతఃకాలమున 10 దినములు తినిన శుక్లనష్టముకట్టును. పలచనైన వీర్యము గట్టిపడును శీఘ్రస్ఖలనము నాపును. గొబ్బివిత్తులు దూలగొండవిత్తులు పల్లేరువిత్తులు యీమూటి చూర్ణమును ఆవుపాలతో ఉడకబెట్టి పంచదారకలిపి సేవించినను పైగుణములనిచ్చును, క్రొత్త రక్తమును బుట్టించును. వీర్యస్తంభనము అగ్నిమాంద్యము గలుగజేయును.

గొర్రె:—సం. అవి అనియు హిం. భేడ్ అనియుపేరు. గొర్రెమూత్రము కారము ఉప్పు రుచులు తీక్ష్ణగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. వాతము దుర్నామరోగము శూల ఉదరము కుష్ఠము మేహము వీనినిజయించును. గొర్రెమూత్రమునందు పసుపుకలిపి త్రాగించిన కలరానివర్తించును

గొర్రెపేడ పొగవేసిన గ్రహబాధ వాతవ్యాధులునయమగును.

గొర్రెపాలు తీపి ఉప్పు రుచులు స్నిగ్ధగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలవి. అశ్మరిని హరించును. సంతృప్తి శుక్రము పిత్త



కఫములు గలిగించును వాతకాస వాతజ్వరములందు పథ్యముగ నుండును. కాచకుండ గొర్రెపాలను త్రాగరాదు

గొర్రెపెరుగు మధురకషాయ రసములు రూక్షగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. మిగుల దోషయుక్తమైనది వాతకఫము పాండువు దుర్నామరోగము గలుగజేయును. నేత్రములకు హితమైనది. దీపనకారి.

గొర్రెమజ్జిగ, కారము పులుపు రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము ఆమ్లవిపాకముగలది దుర్గంధముగనుండును. జఠరదీప్తి పిత్తము రక్తదోషము గలుగజేయును కఫవాతములను హరించును. లేఖనకారి అపథ్యమైనది.

గొర్రెవెన్న మధురకషాయరసములు లఘు సర గుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. యోనిశూల కఫవాతములు శోష అర్శస్సు ఉదరము జఠరరోగము అను రోగములందు పథ్యము క్రిమి జ్వరము దురద వాంతి అరుచి గలుగజేయును.

గొర్రెనేయి సులభముగ జీర్ణమగును. క్రొత్తగకాచబడినగొర్రెనేయి పిత్తమును హెచ్చించును. ప్రాతది యోనిదోషము కఫవాతములు శోష కంపవాతము అనురోగములందు హితముగనుండును.

గొలిమిడిచెట్టు:—సం. కోకిలాక్ష, కాకేక్షు, ఇక్షుగంధ అనియు; హిం. తాల్మఖానా, కైలామూ యనియుపేరు. ఇది గొబ్బిజాతిలోనిది గొబ్బిచెట్టునకుగల గుణములన్నియు దీనియందుగలవు. చూ. గొబ్బిచెట్టు.

గొలుగుచెట్టు: సం. పీలు, శీతసహ, స్రంసి, గుడఫల అనియు హిం. పీలు అనియుపేరు. గొలుగుచెట్టు అరణ్యములలో పెరుగును. చిన్నచెట్టు దీనిపండ్లు పండినప్పుడు కామంచికాయలంత ప్రమాణముగ పగడమువలె యెఱ్ఱగనుండును. చెట్టునకంతకును ఒక వాసనగలదు పండు వగటుగ తీపిగనుండును.

గోలుగుపండు కటు కషాయ మధురామ్ల రసములు స్నిగ్ధ తీక్ష్ణ సరిగుణములు ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. రక్త పిత్త విదాహములను గలిగించును. అర్శస్సు గుల్మము కఫము వాతరక్తము ప్లీహ నాహము ఉదరము విషబాధ వీనిని హరింపచేయును.

గోగుచెట్లు:— సం. పీలుఅందురు. దీనిలో దేశవాళీగోగు పుల్లగోగు ఘనాసరిగోగు యెర్రగోగు మున్నగు అనేకభేదములు కలవు. మెట్టచేలలో పెరిగిన పుల్లగోంగూర శ్రేష్టమైనది. సన్ననికాడవలె పొడవుగ మొలచును. భూమియొక్క బలమునుబట్టి గజం మొదలు 5 గజములయెత్తువరకు పెరుగును. ఆకులు పూవులు పుల్లగనుండును. దీనిపూవు యెర్రగనుండును. కాయ నక్కదోసకాయవలె నుండును. గానిదానికన్న మిక్కిలి చిన్నది.

పులుపు రుచి రూక్షగుణము ఉష్ణవీర్యము అమ్లవిపాకము కలది. శరీరమునార్చును విరేచనముచేయును. తలత్రిప్పును వేడిని పుట్టించును. నంజురోగులకు మిక్కిలి హితమైనది. ఉప్పు కారము లేకుండ గోంగూరను ఉడకబెట్టి నిమ్మకాయంత ఉండలుచేసి ఉదయ సాయంకాలములందు ఔషధముగనిచ్చి అన్నములోగూడ గోంగూర కలుపుకొని తినునట్లుచేసిన వారముదినములకు నంజు తగ్గును. గోంగూర వెచ్చసి నూరి కట్టుగట్టిన వరిబీజము మేహవాతపుచొప్పులు గోదకాలు కఫముకు దెబ్బలవాపు మున్నగునవితగ్గును. సెగగడ్డలకు కట్టిన వెంటనే పక్వమై చితికిపోవును.

గోధుమలు:— సం. గోధూమ బహుదుగ్ధ, అపూప, మ్లేచ్ఛభోజనఅనియు, హిం. గేహూం అనియుపేరు. ఇదియొక ధాన్యవిశేషము. సుమనగోధుమ, మధూళి, నందీముఖ అని గోధుమలలో మూడుజాతులున్నవి. మొదటివి పశ్చిమదేశమునుండి వచ్చినవి మధూళిగోధుమలు దీనికన్న అల్పమైనవి. మధ్యదేశమునందు పైరగును. నందీముఖమనునది తేలికయుండక పొడవుగ నుండును. ఇంచుమించు మూడింటికి సమానగుణములుకలవి. గాని పొడుగుగోధుమలు శ్రేష్ఠము.



గోధుమలు మధురరసము గురు స్నిగ్ధ సర గుణములు శీతవీర్యము మధురవిపాకముగలవి. కఫము శుక్రము బలము కాంతి ఆయువు ధాతుపుష్టి గలిగించును. విరిగినయెముకల నతుకుకొనచేయును. వయస్సునునిల్పును. అతిమూత్రము మధుమేహము నంజు క్షతక్షయము స్థూలము వాతము యీరోగములు కలవారలకు గోధుమాన్నము హితకరముగనుండును. ఆలస్యముగ జీర్ణమగును. గోధుమలను పైపొట్టు తీసి దోరగవేయించి పిండివిసిరి కాచిన జావ ఛర్దినిఆపును. సులభముగ జీర్ణమగును. జ్వరితులకు పథ్యముగనుండును. ఆకలిని అన్నహితమును కలుగజేయును. తృప్తినిచ్చును, ఎక్కువగ త్రాగిన నీరుపట్టును. ఆమవిరేచనములు కడుపులోనొప్పి పేగులరుచుట మొదలగు వానిని బుట్టించును. గోధుమలను నానబెట్టి రుబ్బి పిండినపాలలో బాదంపప్పు ద్రాక్ష కిస్‌మిస్ పచ్చకర్పూరము కుంకుమపూవు జాజికాయ మొక్కజీడిపప్పు కలిపి ఇగురువరకు కాచిన హల్వా ప్రతిదినము పుచ్చుకొనుచున్న వీర్యవృద్ధి పుష్టి కలుగును నులిపురుగులను పుట్టించును. కఫమును పెంచును.

గోధుమనూకను పాలలోవేసి పంచదారకలిపి వండిన పాయసము రుచిగ బలకరముగనుండును. అగ్నిమాంద్యము చేయును. వాతపిత్తములను హరించి కఫమును పెంచును. గురువైనది.

గోధుమపిండితోచేసిన అప్పడములను నిప్పులపై కాల్చి బలానుసారముగ తిని ఆవుపాలు లేక ఉష్ణోదకము త్రాగిన నంజురోగులకు హితకరముగనుండును. శరీరమందలి నీరును హరించును. విరేచనము చేయును. ఎక్కువగతినిన అజీర్ణ విరేచనములు గ్రహణి కడుపునొప్పి మొదలగునవి కలుగును.

గోమూత్రము:— చూ. ఆవు.

గోమూత్రశిలాజిత్తు:— సం. శిలాజిత్, శైలనిర్యాస అనియు, హిం. శిలాజీత్ అనియుపేరు. గ్రీష్మకాలమున తీక్ష్ణమైన యెండకాకచేత బంగారు వెండి రాగి పుట్టురాళ్ళనుండి నిర్యాస (జగురు) రూపమైన

ద్రవమునకు శిలాజిత్తు అని పేరు. సువర్ణగర్భ శిలలనుండి పుట్టినది. దాసానిపూవు రంగుగలిగి బరువై కొంచెము చేదుగలిగి ప్రియముగ నుండును. ఇది రసాయనము. రజతగర్భ శిలలనుండి పుట్టునది తెల్లగ బరువుగ మధురముగ నుండును. ఇది ప్రధానముగ పాండువును పిత్తవ్యాధిని హరించును. తామ్రగర్భ శిలలనుండి పుట్టినది నల్లగ బరువుగ నుండును. నిప్పుపై వేసినపుడు పొగలేవక లింగాకారమును జెందును, నీళ్లలో వేసిన మట్టియూపులవలె క్రిందకు దిగును.

సర్వశిలాజిత్తులును జ్వరము పాండువు శోఫ మేహము అగ్నిమాంద్యము మేదోదరము క్షయ శూల గుల్మము ప్లీహ జఠర హృదయ శూలలు వీనిని సంహరించును. రసోపరస సాధారణ రసాదులందున్న సకల సుగుణములును గోమూత్ర శిలాజిత్తునందుండును. గాన సకల రోగములను హరించి దేహమును లోహతుల్యముగ జేయును.

శిలాజిత్తు వైక్రాంతము వీనిని సమభాగముగజేర్చి త్రిఫల త్రికటుక చూర్ణములు ఆవునేయి అనుపానితో పుచ్చుకొనిన పాండువు క్షయ అగ్నిమాంద్యము మేహము గుల్మము ప్లీహ మూలవ్యాధి ఉదర శూల మొదలగు రోగము నివర్తించును. రసాయన సేవావిధానము ననుసరించి 6 మాసములు సేవించిన జరారోగములు నశించును. శిలాజిత్తును శుద్ధిచేయక నుపయోగింపరాదు. క్షారోదకములు గోమూత్రము ఆమ్లరసములు అనుపానితో కడిగిన శిలాజిత్తు శుద్ధమగును.

గోమూత్రికాదర్భ:—సం. గోమూత్రిక, రక్తతృణ, క్షేత్రజ కృష్ణభూమిజ అందురు. తృణభేదము మధురముగ వీర్యవృద్ధికరముగ నుండును. దీనిని ఆవులకు మేసిన వాటికి పాలువృద్ధియగును.

గోమేధికము:—ఇది రత్నములలో నొకటి. ఆవుయొక్క మేదస్సును బోలిన రంగుగలది గనుక గోమేదకమనబడును. గోమేదకము గోమూత్రపురంగుగలిగి స్వచ్ఛమైయుండును.

క్రమముగా శోధన మారణముల జేయబడిన గోమేదకమును సేవించిన కఫ పిత్తములు క్షయ పాండువు హరించును. దీపనపాచనము



లు కలుగును. రుచిపుట్టును. త్వగింద్రియమునకు హితకరము. బుద్ధిబలము నిచ్చును.

గోమేధకమును గోమూత్రము నేలగుమ్మడు రసములలో మూడు దినములు భావనచేసిన శుద్ధమగును. పిదప నల్లయుమ్మెత్తాకురసములో మూడుదినములు నానబెట్టి కొలిమిలో కాల్చిన భస్మమగును.

గోరింకమాంసము:—సం. శారిక అందురు దీనిమాంసము మలమూత్రముల బంధించును, అపథ్యమైనది.

గోరింటచెట్టు:—సం. తిమిర కోకదంత, ద్వివృంత. నఖరంజక అనియు, హిం. మేహదీ అనియు పేరు. గోరింటచెట్టు 2, 3 గజముల యెత్తువరకు పెరుగును. చిన్నఆకులును, తెల్లని పూవులును కలది దీని ఆకులునూరి గోళ్లకు, అరచేతులకు రాచుకున్న యెడల యెఱ్ఱబడును. ఇది విషతుల్యమైనది దీనికషాయము లేక రసమును సేవించిన పాండు కుష్ఠు సర్వాయి రోగములు హరించును. మలబద్ధకరము దీని ఆకుల కషాయముతో కడిగిన అగ్నిదగ్ధవ్రణము (కాలినపుండ్లు) మానును. ఆకునూరి చేతులకు కాళ్లకు కట్టిన తిమ్మిరిపోటు తగ్గును. కణతలకు పట్టువేసిన తలనొప్పి నిమ్మళించును ఆకుకషాయమున కాచుపొడిచేర్చి గండూషముచేసిన నోటిపూతతగ్గును. ఆకును వెచ్చచేసి నరుకు గాయములకు కట్టిన వెంటనే మానుపట్టును. ఆకురసమందు బావంచాల చూర్ణముచేర్చి శరీరమునకుపూసిన గజ్జి చిడుము చీడ మొదలగు చర్మరోగములు పోవును. ఆకునూరి గోళ్లకు కట్టించిన పుప్పిగోళ్లు నయమగును మోకాళ్లు మోచేతులు మొదలగు కీళ్లయందు కట్టుకట్టిన వాతపునొప్పులు కీళ్లనొప్పులు మొదలగునవి నయమగును. వేపచెక్క చూర్ణమును మహిసాక్షిలో కలిపి శనగగింజ అంత మాత్రలు చేసి ఇచ్చిన తిమ్మిరివ్యాధి నయమగును. గోరింటవిత్తులచూర్ణము పాలతో త్రాగించిన గ్రహణి మానును.

గోరింతచెట్టు:—సం. కురండికా, నేత్రభూషా అనియు, హిం. కురంజా దాదమాని అనియు పేరు. ఇది పుష్పవనములలో పెంచబడు

పుష్పులయొక్క. దీనిఆకులు పొడవుగ మృదువుగ కంగోగాకలిగియుండును. పలురంగులపుష్పములు పూచును. దీనికాయలు శనగకాయలవలె వంకరగ చిన్నవిగనుండును. కాయలలో చిన్నచిన్న నల్లనిబీజములు నిండియుండును. యిది చేదు వగరు రుచులు రూక్ష సరగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. వాతమునుచేయును. కఫమును హరించును. రక్తదోషమును మూత్రకృచ్ఛ్రమును హరించును. అగ్నిదీప్తి నిచ్చును.

గోరుచిక్కుడు:—సం. గోరాణి, దృఢబీజ, నిశాంధ్యఘ్ని అనియు, హిం. గ్వారకీఫలీ అనియుపేరు. చిన్నమొక్క. తెల్లనిపుష్పములు పులవకాయలవంటి కాయలుగలది. గోరుచిక్కుడుకాయ మధురరసము గురు రూక్ష సరగుణములు శీతవీర్యము మధురవిపాకముకలది. కఫవాతములను పెంచును. అగ్నిదీప్తినిచ్చును పిత్తమునుహరించును. ఆకుకూర రేచీకటిని పిత్తమును హరించును.

గోరోజనము:—సం. గోరోచన, గోపిత్త అనియు, హిం. గోరోచనఅనియుపేరు. ఆవుయొక్కచేదునకు గోరోచనమనిపేరు.

చేదు రుచి శీతవీర్యము రూక్షగుణము కటువిపాకముగలది. విషము, అలక్ష్మి, గ్రహబాధ, ఉన్మాదము, గర్భస్రావము, శ్వాస కాసలు, పీనస, నేత్రరోగములు, కృమి, కుష్ఠము మున్నగువానిని జయించును. అలక్ష్మిని తొలగించును. మంగళప్రదము. వశ్యక్రియలందు విశేషముగ దీనినివాడుదురు. శరీరమునకు కాంతినిచ్చును.

గోవిందదుంప:—సం. విష్ణుకంద, విష్ణుగుప్త, బహుసంపుట అందురు. మధురరసము గురుగుణము శీతవీర్యము మధురవిపాకము గలది. పిత్తము దాహము శోష అనువానిని హరింపజేయును. తృప్తిని రుచిని కలిగించును.

గ్రంథితగరము:—సం. తగర, కాలానుసార్య అనియు, హిం. తగర్ అనియుపేరు. చేదు తీపి రుచులు లఘుస్నిగ్ధగుణములు ఉష్ణవీర్య



ము మధురవిపాకముగలది. విషము ఉపస్మారము శిరో నేత్రవ్యాధులు త్రిదోషములు వీనినిహరించును.

గ్రంథిపర్ణము:—సం. గ్రంథిపర్ణ, బర్హిపుష్ప అందురు. తెలుపు నలుపు వర్ణభేదములచే రెండువిధములు. నల్లదిమంచిది.

కారము చేదు రుచులు తీక్ష్ణ లఘుగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగల . దీపనముగల్గించును. కఫవాతములు విషము శ్వాస దురద దుర్గంధము వీనినిహరించును.

చక్కయింగువ:—సం. నాడీహింగు పలాశ, జంతుక అనియు, హిం. పీతహింగ్, డికామాలీ అనియుపేరు. చక్కయింగువ కారము, రుచి, రూక్ష సర గుణములు, ఉష్ణవీర్యము, కటువిపాకము గలది. కఫవాతములు, అనాహము, అజీర్ణము వీనిని హరించును మలబద్ధము జేయును.

చంగల్వకోష్టు:— చూ. కోష్టు.

చంగల్వ:—సం. సౌగంధిక, నీలపద్మ అందురు. కలువజాతిలోనితీగ. చంగలువగడ్డ మధురరసము శీతవీర్యము లఘుగుణము మధురవిపాకముగలది. మేహము సోమరోగము గర్భవేదన అరికాళ్ళ అరచేతులందుమంట అనువాని నివర్తింపచేయును.

చంచలికూర:—సం. సునిషణ్ణక, శితివార, సూచిపత్రి అనియు హిం. శిరి, ఆరి చౌపతియా, గురవా అనియుపేరు. నీళ్ళవారలపెరుగు చిన్నక్షుపము. పులిచింతాకువలె నాలుగుఆకులు వేయును. చివరరెండు కాయలుకాచును. అందుండి గింజలు వెలువడును. కూరవండుకొని తిందురు.

తీపి, వగరు, రుచులు, రూక్ష లఘుగుణములు, శీతవీర్యము, మధురవిపాకముగలది. బలము, అగ్నిదీప్తి, జ్వరము, శ్వాస, మేహము, కుష్ఠము, భ్రమ వీనినిపోగొట్టును. చంచలిగింజలచూర్ణము మూత్రకృచ్ఛ్రను హరించును.

చండికాతృణము:—సం. చండిక, దుగ్ధన, సునాళ అనిపేరు. మిక్కిలి మధురమైనది. బలమునుకలిగించును. పశువులకుహితకరము.

చంద్రచెట్టు:—సం. ఖదిర, రక్తసార, గాయత్రి, దంతధావన అనియు, హిం. ఖైర్ అనియుపేరు. అరణ్యములలో పెరుగు ప్రసిద్ధమైన పెద్దవృక్షము. తెల్లచంద్ర యెఱ్ఱచంద్ర అని యిది రెండువిధములు.

తిక్తకషాయరసములు రూక్షగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. కృమి, మేహ, జ్వర, వ్రణ, శ్విత్ర, శోథ పిత్త, రక్త, పాండు కుష్ఠ, కఫ ముఖ దంతరోగములను హరించును.

తెల్లచంద్ర తిక్తకషాయరసములు, రూక్షగుణము కటువిపాకము, ఉష్ణవీర్యముగలది. దురద కుష్ఠు, భూతబాధ, కఫవాతములు, వ్రణములు అనువానినిహరించును. చంద్రపుల్లతో దంతధావనము చేసిన దంతరోగములుమానును. చంద్రచెక్క కషాయమును పుక్కిట బట్టిన నోటిపూతమానును. చిగుళ్ళుగట్టిపడును ముఖదుర్గంధము నశించును చంద్రచెక్కకషాయముతో కురుపులను కడిగిన నయమగును చంద్రచెక్కరసము లేక కషాయమునందు మహిసాక్షిని కలిపి త్రాగిన కుష్ఠము హరించును. పురాణకాసలు శమించును. చంద్రచేవ త్రిఫలములు కలిపి కషాయముగాచి అందు గేదెనేయి వాయువిడంగ చూర్ణము చేర్చి సేవించిన భగందరము నశించును.

చంద్రచేవ 50 ఫలములు, దేవదారు 50 ప॥ బావంచివిత్తులు 12 ప॥ మానుపసుపు 20 ప॥ త్రిఫలములు 20 ప॥ ఈవస్తువులను నలియగొట్టి 8 ద్రోణముల నీటిలో వెసి 8 వ వంతు మిగులునటులగాచి వడియగట్టి అందు తేనె 200 ప॥ పంచదార 100 ప॥ తక్కోలాలు నాగకేసరాలు, జాజికాయ లవంగములు యేలకులు. జాపత్రి దాల్చినచెక్క ఈవస్తువులు ప్రత్యేకము 1 ప॥ పిప్పళ్ళు 4 ప॥ యీవస్తువులన్నిటినిచూర్ణించి పైకషాయమునచేర్చి కుండలోబోసి చీరజేసి యొకమాసము నిలువయుంచిన నది ఖదిరారిష్టమనబడును. దీనిని బలానుసారము సేవించిన



కుష్ఠము హృద్రోగము పాండువు అర్బుదము గుల్మము గ్రంథులు కృమి ఉబ్బసము దగ్గు ప్లీహ అనురోగములను హరించును.

చందనము —సం. శ్రీఖండ, చంద్రకాంత, గోశీర్ష, భోగివల్లభ, భద్రసార, మలయజ అనియు, హిం. చందన్ అనియు పేరు. ఇది పెద్దవృక్షము. అడవులందు పెరుగును. ఆకు చిన్నదిగ పొడవుగనుండును. తెల్లపూవులు గుత్తులుగనుండును. నోటిలోవేసుకొని నములిన చేదుగను కర్రమొదలగువాసితో చెట్టును నరుకబెట్టిన పచ్చగను నరికిన యెఱ్ఱగను పైనచూచుటకు మాను తెల్లగను ఉండును. తొఱ్ఱలు సుళ్ళు కల చందనము శ్రేష్ఠము. చందనము సువాసనగలది.

కటుతిక్తరసములు, శీతవీర్యము, కటువిపాకము లఘు రూక్షగుణములుగలది. వీర్యవృద్ధి శరీరకాంతి కామోద్దీపనము సంతోషము గలిగించును పిత్తభ్రమ దాహము పిత్తజ్వరము ఛర్ది దప్పి కృమి బడలిక ముఖరోగము శోష వీనినిహరించును.

చందనచూర్ణము పావుతులం, మఱ్ఱిపాలు పావుతులం, పంచదార అరతులం వీనినిచేర్చి ఉదయములందు 7 దినములుసేవించిన తెల్లకుసుము మానును. పురుషులకు వీర్యవృద్ధి నిచ్చును. సెగరోగమును మాన్పును.

చందనము, వట్టివేరు, చెంగల్వకోష్టు, తుంగముస్తలు, ఉశిరికపప్పు, కచూరము, కలువదుంప, అతిమధురము, యిప్పపూవు, ద్రాక్ష ఖర్జూరము వీనిని సమభాగముగ చూర్ణించి ఒకపలము చూర్ణము 3 పలములనీళ్ళలోవేసి ఒకరాత్రి నిలవయుంచి ప్రాతఃకాలమున వడియగట్టి పంచదారచేర్చి త్రాగిన దారుణమైనదప్పి రక్తపిత్తము సెగరోగము తాపము ప్రమేహము తలత్రిప్పు పిత్తజ్వరము అను వ్యాధులను హరించును. ఇదియు చందనాదిచూర్ణమనబడును.

అభ్రకసిందూరము 2 భాగములు, తిప్పసత్తు 1 భా॥ పచ్చకర్పూరము 2 భా॥ చందినీ అత్తరు 5 భా॥ వీనిని అన్నిటిని కలిపి కుంకు

దుగ్గిజలంత మాత్రలుచేసి పూటకు ఒకటిచొ॥ సేవించిన సెగరోగము మానును. ఇదియ చందనాదివటియనబడును.

మంచిగంధము కురువేరు నఖము యష్టిమధుకము శిలాజితు పద్మకము మంజిష్ఠ దేవదారు వట్టివేరు కాన్గుపట్ట పెద్దయేలకులు నాగకేసరాలు ఆకుపత్రి చిన్నయేలకులు జటామాంసి పిప్పళ్ళు తక్కోలాలు ముస్తలు పసుపు సుగంధి కటుకరోహిణి లవంగాలు అగురుచెక్క కుంకుమపూవు లవంగపట్ట రేణుకలు తామరతూడు, అనువానిని సమముగ గ్రహించి కల్కముచేసి దీనికి 4 రెట్లు నూనె, నూనెకు 4 రెట్లు పెరుగుమీదతేట, నూనెకు సమం లాక్షారసము కలిపి తైలపాక విధానమున కాచి వడియగట్టిన తైలము చందనాదితైల మనబడును. దీనిని సేవించిన అపస్మారము జ్వరము ఉన్మాదము క్షయ నశించును. బలమును గలిగించును. గ్రహబాధనుతొలగించును.

చందనమునుండి తీసిన తైలమును పూటకు 5 లేక 9 చుక్కలవరకు అరటిపండులోవేసిగాని పంచదారలో వేసిగాని పుచ్చుకొనిన మేహశాంతిచేయును. సెగరోగము నెమ్మదించును. చెవిలోపోసిన పోటు నయమగును. శరీరమునకు పూసిన కాంతి మృదుత్వము కలిగించును చర్మరోగములనుమాన్పును. పరిమళముగనుండును.

చంద్రకాంతిచెట్టు:—మిక్కిలి మృదువైనట్టియు పలురంగుల పూవుల పూచునట్టియు తొట్లలోవేసి పెంచబడు చిన్నమొక్క. యెర్ర చంద్రకాంతగడ్డ రసమున పంచదారకలిపి యిచ్చిన యెర్రసెగయు పచ్చ చంద్రకాంతగడ్డ రసమునిచ్చిన పచ్చసెగయు. తెల్లచంద్రకాంతగడ్డ రసమునిచ్చిన తెల్లసెగయు, శుక్లనష్టము, తెల్లకుసుమలును నశించును. ఆకును ఆముదముతో వెచ్చజేసి కట్టుగట్టిన గడ్డలు పక్వమై పగులును.

చంపకము:—చంపక, కాంచన అనియు, హిం. ఆకీన్, చంపా అనియుపేరు. చంపకము అనగా సంపెంగ. ఇది తీగగను చెట్టుగను గూడ నుండును. గనుకనే చెట్టు సంపెంగ. తీగ సంపెంగ యని దీనిని



పిలుతురు. ఇంకను యిందు తెల్లసంపెంగ, నాగసంపెంగ, సుల్తానుసంపెంగ, భూమిసంపెంగ అని నాల్గువిధములు.

చెట్టు సంపెంగపూవు తీపి వగరు రుచులు లఘుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. కఫపిత్తములను హరించును. మతాంతరమున చెట్టు సంపెంగపూవు తీపి వగరు కారము రుచులు శీతవీర్యము గలది. దీనివాసన తగిలినయెడల తుమ్మెదలు చచ్చిపోవును. తాపము పిత్తము కఫము రక్తదోషము మూత్రకృచ్ఛ వాతము కుష్ఠము విషము కృమి దురద వ్రణము అను వ్యాధులను నశింపచేయును.

తెల్లచంపకముగూడ పెద్దవృక్షము. ఆకులువిరిచిన పాలుగారును. తెల్లనిపూవులుపూచును తిక్త కటు కషాయరసములు సరగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. కుష్ఠము వ్రణము దురద శూల కఫవాతములు ఉదరరోగము ఆధ్మానము అను వ్యాధుల జయించును.

నల్లచంపకవృక్షము సాధారణమైనచెట్టు. రామాఫలపుచెట్టు ఆకులవంటి ఆకులుండును. పూవులు నల్లగనుండును. ఈపూవులనే నాగకేసరములందురు. నల్లచంపకము కటురసము ఉష్ణవీర్యము సరగుణము కటువిపాకముగలది కఫవాతములు వ్రణము నేత్రరోగములు అనువానిని జయించును. మరికొన్నివస్తువులతోచేర్చి అగ్నిస్తంభన విద్యయందు ప్రయోగింతురు. సుల్తానుసంపెంగకు నివియేగుణములు.

భూమిచంపకము నేలమీదనేపారును. పరిమళగల తెల్లనిపూవులుపూచును కారము రుచిగలది. గలగండము ఉబ్బు వ్రణము అనువానిని సంహరించును.

చక్రవర్తికూర:—సం. వాస్తూక, వాస్తుక, క్షారపత్ర శాకరాట్ అనియు, హిం. చిల్లీఅనియుపేరు. మధురరసము సరగుణము, ఉష్ణవీర్యము, కటువిపాకముగలది. దీపనపాచనములు, బలము, పుష్టి బుద్ధిబలము అగ్నిదీప్తి గలిగించును. త్రిదోషహరము, పిత్తరక్తము ప్లీహ, అర్శస్సు, కృమి, శూల, మలబద్ధము మొదలగు సకలరోగము

లను హరించును. మిగుల పథ్యకరము. నేత్రములకు హితము. మలమూత్రములను శుద్ధిపరచును.

చక్రవాకపక్షి:—సం. చక్రరథ, చక్రఅండుసు. దీనిమాంసము మధురరసము ఉష్ణవీర్యము స్నిగ్ధగుణము గలది. వాతమును హరించును. అగ్నిదీప్తికరమైనది.

చనుబాలు:—తర్పణము, ఆశ్చ్యోతనము, నస్యము మున్నగు క్రియలందు వాడిన వాతము పిత్తము రక్తము అభిఘాతము నేత్రవ్యాధి వీనినిహరింపచేయును. చనుబాలతో తెల్లనిగుడ్డను తడిపి కండ్లపై వేసియుంచిన అత్యుష్ణమువలన గలిగినట్టి కండ్లయెరుపు మంట మొదలగునవితగ్గును. చనుబాలు ఆముదము కలిపి మాడుపట్టునకు మర్దనచేసిన తలనొప్పి పోటు తగ్గును. గరళౌషధము తినిన రోగులకు ఆప్యాయనముగనుండును. సులభముగ జీర్ణమగును. సన్నిపాతరోగులకు బాలురకు హితమైనది. ముక్కులోపోసిన ముక్కువెంటబడు రక్తముకట్టును.

చనుబాలవిత్తులు:—కొద్దివిరేచనకరమైనవి. గర్భిణులకు సుకుమారులకు విరేచనార్థముగ నుపయోగింపదగును. అజీర్ణమును కడుపుబ్బరమును హరించును

చన్నచల్లగడ్డ:—నాగేటిగడ్డయనియు దీనిని వాడుదురు. చేదురుచి సరగుణము ఉష్ణవీర్యము కటువిపాకము గలది. విషతుల్యము. కుష్ఠము మొదలగు చర్మరోగములను కృములనుహరించును.

చపలము:—చపలమనునది యొకవిధమగు రాయి పసుపు తెలుపు యెరుపు నలుపు రంగులభేదముచేత నాలుగువిధములు. బంగారు వెండి రంగులుగల చపలములు రసబంధమునుపయోగించును. తక్కిన పిరోజును నిప్పుపై బెట్టినవెంటనే లక్కవలె కరిగిపోవును. యివి నిరుపయోగమైనవి.

చపలము తిక్తరసము లఘు సర గుణములు ఉష్ణవీర్యము మధురవిపాకముగలది ఆరంచులు మెరుగు బరువుగల చపలము మంచిది. త్రిదోషహరము, వీర్యవృద్ధిని దేహసిద్ధిని రసబంధమును చేయును.



నిమ్మపండు ఆగాకరదుంప అల్లము అనువాని రసములందు భావనచేసిన చపలమందలి దోషములుహరించి శుద్ధమగును. శుద్ధమగు చపలమును చూర్ణించి జల్లెడు జెముడు పొత్తిదుంప గురివెంద గన్నేరు విషముష్టి నేపాలము ఉమ్మెత్త నల్లమందు శృంగి కాలకూటము ముస్తము నాభి సక్తుకము అను విషములను చేర్చి కాంజికముతో నూరి కొలిమిలోనుంచి యూదిన అందుండి చపలసత్త్వము వెలువడును. ఈసత్త్వమును భస్మముగావించి సేవించనగును. శోధనమారణములను చేయక చపలము నుపయోగింపరాదు.

చమ్మచెట్టు:— దొడ్లలోవేసి పెంచబడు చిన్నమొక్క. దీనికాయలు పలచగ వెడల్పుగ నుండును. కాయలను కూరవండుకొని తిందురు, మిక్కిలివేడి పిత్తము, శ్లేష్మము, గలుగజేయును. మలబద్ధమును గల్గించును. అపథ్యముగ నుండును.

చలవమిర్యాలు:—సం. కంకోల, కోషఫల, కోలక అనియు హిం. కాంకలా, అనియుపేరు. తోకమిర్యాలనియు వాడుదురు. మిరియముల వలెనే చిన్నతోకతో గూడియుండును.

కారము. చేదురుచులు, లఘు తీక్ష్ణ గుణములు, ఉష్ణవీర్యము కటువిపాకము గలది. రుచిని ఆస్వాదమును పరిమళమును, అగ్నిదీప్తిని కలిగించును. హృద్రోగము కఫవాతములు కండ్లమసక, రేచీకటి ముఖరోగ వాతరోగములు, కృమి, ఆమదోషము అనువానిని హరించును.

చలిదిఅన్నము:— ఆకలిని పిత్తమును అణచును. మత్తుదెచ్చును గురుత్వముగ నుండును, బలకరమైనది.

చల్లచారు:— ఉప్పు కారము వేసి పొంగించినది రుచిగనుండును. వేడిగరిటె తగులకుండ పొంగించినచారు చలువను. తగులునట్లు పొంగించినది వేడిని కలిగించును,

చల్లపులుసు:—పెసరపిండి, చింతపండు మొదలగువానిం జేర్చి కాచినది శ్లేష్మము, అతిసార విరేచనములు, పీనస, శ్వాసకాసలు, హరించును. పథ్యమైనది,

చల్ల:—సం. తక్ర అనియు హిం. ఛాఛమట్టా అనియుపేరు.

చల్ల మధుర రసము, సర లఘుగుణములు, ఉష్ణవీర్యము, మధుర విపాకముగలది. దీపము గల్గించును. త్రిదోషహరము తీయగనుండు చల్ల శ్లేష్మమును వృద్ధిచేయును. వాతపిత్తహరము, పుల్లనిచల్ల పిత్తమును కల్గించును.

కాచబడిన చల్ల కోష్ఠము నందలి కఫమును హరించి కంఠమునందు శ్లేష్మమును కల్గించును. గాన పీనస, శ్వాస, కాసయందుపయోగించును.

శొంఠి సైంధవలవణచూర్ణముల చేర్చిన చల్ల వాతమును, పంచదారకలిపిన చల్ల పిత్తమును, శొంఠి పిప్పలి మిర్యాలచూర్ణము కలిపిన మజ్జిగ కఫమును హరించును. ఇంగువ, జీలకర్ర, సైంధవలవణము కలిపిన మజ్జిగ అతిసారము అర్శస్సు, వాతము అనువ్యాధులందు వాడవలయును. ఇది పుష్టి బలము యిచ్చును. వస్తియందలిశూలనునిర్మూలింపచేయును. బెల్లముకలిపిన మజ్జిగ మూత్రకృచ్ఛ్రయందును చిత్రమూలముకల్పిన మజ్జిగను పాండురోగమునందును యివ్వవలెను.

ఉష్ణకాలములందును దుర్బలునకును గాయములు తగిలినవానికిని మూర్ఛ భ్రమ, దాహము, రక్తపిత్తము అను వ్యాధులుకలవారలకును మజ్జిగను త్రాగించరాదు.

శీతకాలమునందును అగ్నిమాంద్యము కఫ జన్యమైనరోగములు మార్గావరోధము కుష్ఠము వాతము అను వ్యాధులుకలవారలకును మజ్జిగ మిక్కిలి పథ్యమైయుండును. మొత్తముమీద మజ్జిగ అగ్నిమాంద్యము వాతవ్యాధి అరుచి స్రోతోబంధకము విషము ఛర్ది విషమజ్వరము పాండువు మేహరోగము గ్రహణి అర్శస్సు మూత్రకృచ్ఛ్ర భగందరము మేహము గుల్మము అతిసారము శూల ప్లీహ ఉదరము బొల్లి



జఠరదోషములు కుష్ఠము వాపు దప్పి కృమి అనువ్యాధులందు పథ్యముగ నుండునని తెలియవలయును. ఇంచుమించుగ చల్లలన్నియు సమానరసాదులం గలిగియుండును.

చల్లగుమ్మడు:—దీనివేరు చూర్ణము లేక కషాయము లేక అరగదీసిన గంధము కొంచెముగ విరేచనమునుచేయును. పట్టువేసిన వాతపునొప్పులను నశింపచేయును. లోపలకు తినిన సెగ సవాయి మొదలగు రోగములను పోగొట్టును. వేడిచేయును.

చల్లగడ్డలు:—హిం. సఫేద్‌ముసలీ అనిపేరు. జిగటగ నుండును చూర్ణమును పాలతో ఉడికించి పంచదారకలిపి తినిన అమితవీర్యవృద్ధి బలము పుష్టి కాంతి గలుగును కఫముహెచ్చును. ఆలస్యముగ జీర్ణమగును.

చవిటికొమ్ము:—సం. కరీరం అనిపేరు ఇదియొకమూలిక. కషాయ తిక్త మధురరసములుగలది. ఆధ్మానమును కలిగించును.

చవుడు:—సం. ఔషరక, సార్వగుణ, సాంభార అనియు హిం. ఖారీనోన్ అనియు పేరు. ఇదియొకవిధమగు ఉప్పు. వాతకఫములను హరించును. మూత్రమును శుద్ధిచేయును. విదాహమును పిత్తమును పుట్టించును.

చాగ:—సం. మూర్వా, మధురస, గోకర్ణి, దృఢసూత్రిక అనియు, హిం చూర్ణహార్, మురహరీ అనియు పేరు. ఇది కలబందవలె నుండును. కలబందమట్టలకంటె దీనిమట్టలు పలచగనుండును. దీనికి గూడ వాడిగల చిన్నముండ్లుండును. మట్టలయొక్క నార మిగుల జిగిమైయుండును. రసము చిక్కగ జిగటగ పసుపుపచ్చ ఆకుపచ్చ తెలుపురంగులు కలదిగనుండును. తోటలయొక్క ఆవరణలయందు వేయుదురు. చిన్నచిన్నపండ్లుండును. పండ్లు కొంచెము తీపిగనుండును. ఇది క్షుపజాతిలోచేరినది.

చాగ చేదు వగరు రుచులు గురుసరగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముకలది. పిత్తరక్తము మేహము దప్పి హృద్రోగము కండూ

కుష్ఠములు విషమజ్వరము కఫవాతములు ఛర్ది అనురోగములను చేయును. దీనిదుంప కృమి నాశకరము. దగ్గునుతగ్గించును. మట్టరసముతో మెట్టచోళ్ళను రుబ్బి పిక్కలకుపట్టువేసిన ఉబ్బు పిక్కనరములు లాగుట నొప్పులు మున్నగునవిహరించును. చాగమట్టలరసము 4 భా॥ నూనె 1 భా॥ చేర్చి కాచినతైలమును మర్దనచేసిన వాతపునొప్పులు హరించును. వ్రణములకురాచిన నవిమానును.

చాతుర్జాతకములు:—అనగా యేలకులు లవంగాలు దాల్చిన చెక్క నాగకేసరములు యీనాల్గింటి సముదాయమునకు చాతుర్జాతకములుఅనిపేరు. చాతుర్జాతకచూర్ణము లేక, కషాయము ఎక్కిళ్ళు వాంతి అతిసారము రక్తపిత్తము అను రోగములను పోగొట్టుటయగాక వీర్యవృద్ధి బలము శరీరకాంతి గలుగజేయును.

చామంతిచెట్టు:—సం. సేవంతి, తరుణి, కర్ణిక, చారుకేసర అనియు, హిం. సేవంతి అనియు, దొడ్లలోవేసి పెంచబడుమొక్క. యెరుపు తెలుపు పసుపు గులాబిరంగుల పూవులభేదముచేత 4, 5 విధములుగనుండును. ఆకులు పూవులు సువాసనగలవి.

చామంతిపూవు తిక్త కషాయరసములు సర లఘుగుణములు శీతవీర్యము కటువిపాకముగలది. పిత్త దాహము కుష్ఠము జ్వరము రక్తపిత్తము విస్ఫోటము నోటిపూత వీనిని హరించును. కాంతిని ఆనందము కలిగించును.

చామంతిఆకును వెచ్చజేసి కాపడముపెట్టినను కట్టుగట్టినను తలత్రిప్పు పిత్తభ్రమ వాపు మున్నగుబాధలుతగ్గును. సమూలకషాయము లేక స్వరసము బుతుబద్ధమును విప్పును మలమూత్రములను జారీచేయును. యెఱ్ఱచామంతిపూవు రసమును తేలుకుట్టినచోట రాచిన తేలుబాధ నెమ్మదించును. త్రిదోషములను హరించును. సాధారణముగా అన్నిరకములు చామంతి చెట్లును సమాన రసవీర్యాదులు గలిగి యుండును.



చామదుంపలు:— సం. వితండ కచు అందురు. ఇది తీగ. చామదుంపలు మధురరసము శీతవీర్యము గురు స్నిగ్ధ గుణములు మధురవిపాకముగలవి. వాతపిత్తములనుహరించును. కఫమును పెంచును. అజీర్తి కడుపునొప్పి శూల బుట్టించును. వీర్యవృద్ధిని బలమును కలుగజేయును. చామకాడలు లేక ఆకులు కూరచేసుకొని తినిన మలమూత్రములను జారీచేయును. మూలరోగులకు హితము. కఫవాతములను పెంచును.

చారపప్పు:—ఇది యూనానీ సంప్రదాయద్రవ్యము. ఒకచెట్టుకాయలో పప్పును చారపప్పు, సారపప్పు అందురు. తీయగ కమ్మగనుండును. బలము పుష్టి కాంతి వీర్యము గలుగజేయును. పిత్తమును హెచ్చించును.

చించలము:—చెట్టంతయు యెర్రగ నుండును. ఇది క్షుపము. దీనిని కోడిజుట్టుచెట్టుఅనియు వాడుదురు. సమూలరసము లేక కషాయము మిక్కిలి వేడిచేయును. ఆకునూరి కట్టిన వ్రణములను మాన్పును. రసమునుత్రాగిన శ్లేష్మపుదగ్గును హరించును. విశేషముగ నుపయోగించిన జబ్బుచేయును.

చింతచెట్టు:—సం. అమ్లిక, చుక్రిక, వృక్షామ్ల, తింత్రిణీ అనియు, హిం. ఇమిలీ యనియు పేరు. చింతచెట్టు పెద్దవృక్షము. ప్రసిద్ధమయినది.

చింతకాయ పులుపు రుచి గురుగుణము శీతవీర్యము అమ్లవిపాకముగలది. వాతమునుహరించును. పిత్తకఫములను రక్తదోషమును కలిగించును. బాగుగా పండిన చింతపండు పులుపు రుచి రూక్ష సరగుణములు ఉష్ణవీర్యము అమ్లవిపాకముగలది. కఫవాతములను హరించును. అగ్నిదీప్తినిచ్చును. విరేచనముచేయును. సంవత్సరముగడచిన చింతపండుపచ్చడి పథ్యకరము. చింతపండువేసి కాచినచారు పిత్తవికారముల నణచును. అగ్నిదీప్తినిచ్చును. మలబద్ధమును విప్పును. చింతపండును నీళ్ళు పోసి ఉడికించి కనుకుదెబ్బలు తగిలినచోట కట్టుగట్టిన వాపు పోటు

నొప్పి తీసివేయును. చింతపండురసమును తాగిన మందమతి చిత్తచాంచల్యము బోగొట్టును. చింతపండుచారు జ్వరముక్తులకు హితకరముగ నుండును. ఆహారపదార్థమును సులభముగ జీర్ణింపచేయును. అన్నహితమును నోటియందు రుచిని బుట్టించును. అమితముగదినిన రక్తమును విరుచును. కఫమును ప్రకోపింపచేయును. ప్లీహ శోఫ ఉబ్బురోగము కలవారలకు అపథ్యమైనది. పాతచింతపండు మంచిది. కొత్తది వాతకఫములను పెంచును.

చింతాకు పసరులో ఉప్పుకలిపి శరీరమునకు పూసిన చీడ దురద తగ్గును. చింతాకునుత్రొక్కి ఉడికించి కట్టుగట్టిన బెణుకునొప్పి కవుకుదెబ్బనొప్పి వరిబీజపుబాధ శమించును.

చింతచిగురుపచ్చడి లేక కూర, వేడిచేయును. అర్శస్సు క్రిమి కఫము అను వ్యాధిగలవారలకు పథ్యముగనుండును. ఆలస్యముగ జీర్ణమగును. ఆమవిరేచనములను పుట్టించును.

చింతపూవు వగరు పులుపు రుచులు విశద లఘుగుణములు కలది. వాతకఫములను హరించును. రక్తాతిసారము పిత్తము వాతము అగ్నిమాంద్యము అను రోగములకు మాన్పును.

చింతగింజలపైపొట్టు తీసివేసి నేయించి చూర్ణముచేసి పటికిబెల్లముకలిపి తినిన శుక్లనష్టముకట్టును. శుక్లముగట్టిపడును. దోరమాడ్చిన చూర్ణముయొక్క పానీయకషాయము రక్తగ్రహణిని రక్తప్రదరమును అరికట్టును. చింతగింజగంధమును తేలుకుట్టిన చోట పట్టించి గుడ్డపాగ వేసిన బాధనెమ్మదించును.

చింతపొట్టు అనగా యెండించినఆకు చూర్ణము పథ్యముగ నుండును. పిత్తమును ఛర్దిని ఆయాసమును హరించును.

చింతబెరడును కాల్చిచేసిన క్షారము అగ్నిమాంద్యమును శూలను హరించును. ఆముదములోకలిపి వ్రణములపై వేసిన రంధ్రముచేసి దుష్టరక్తమును చీమును బైటకు వెడలించును. పక్వముచేసి మాన్పును. వ్రణములకుకొత్త అపుపథముగ వాడనగును. గోమూత్రములో



క్షారముగలిపి యిచ్చిన మలమూత్రములను జారీచేసి ఉబ్బురోగమును హరించును. శరీరమునుఆర్చును. మరియు గంధకము తాళకము మొదలగు పాగవస్తువులను కట్టును.

సీసము వంగము మున్నగు లోహములను భస్మముగావించుటకు ఉపయోగించును. వాదమునందుగూడ చించాక్షారము విశేషముగ వాడబడును. చింతక్షారమును సున్నము మీద తేటలోకలిపి యిచ్చిన శోషా లక్షణములు నివర్తించును.

చిక్కుడుచెట్టు:—ఇదితీగ. ఒకతొడిమెకు మూడుఆకులు విడి విడిగనుండును. తెల్లనిపూవులును అనపకాయలవంటి కాయలు నుండును. చిక్కుడుతీగ అనుములు లేక అలచంద జాతిలోనిది. చిక్కుడుకాయకూర లేక చిక్కుడు గింజలకూర వీర్యవృద్ధిని బలమును కలిగించును. శ్లేష్మమును పెంచును. ఆలస్యముగ జీర్ణమగును. కడుపునొప్పి పుట్టించును. నేత్రరోగులకును క్షయరోగులకును అపథ్యమైనది.

చిక్కుడాకులునూరి ముద్దజేసి అందులో తాళకపు చూర్ణమును పెట్టి చీరజేసి పుటమువేసిన తెల్లగ భస్మమగును. ఇట్లు మైలతుత్థమును గూడ భస్మము చేయును. అలచందలయొక్క గుణములన్నియు చిక్కుడుకాయలకు కలవు. చూడు. అలచందలు.

చిట్టాముదపుచెట్టు:—ఆముదపు చెట్టుయొక్క సకల గుణములును చిట్టాముదపు చెట్టునకు గలవు. గాని చిట్టాముదము మంచిది. తేలికయైనది. గుణాధికము.

చిట్టీత:—చూ. ఈతచెట్టు.

చిట్టుడుకునీళ్ళు:—బియ్యము సగము ఉడికినపుడు వార్చిన గంజిని చిట్టుడుకునీళ్ళు అనిపేరు. ఇవి తేలికగ జీర్ణమగును, ఒడదెబ్బ తగిలినవారికిని శోష. దప్పి, అజీర్ణము, మూత్రాయాసము, గలవారికిని మిగుల హితముగ నుండును. తృష్ణని చలువను యిచ్చును. మూత్రమును జారీచేయును.

చిత్రమూలము:—సం. చిత్రక. అగ్ని, వ్యాళ, అనియు హిం. చీతాయనియు పేరు. యిది క్షుపము గుండ్రని ఆకులుండును. దీనివేరు చిదుగగొట్టినయెడల పసుపుపచ్చగ నుండును. యిది తెలుపు, ఎరుపు, నలుపు పువ్వుల భేదముచే మూడు తెరంగులు. క్రమముగనవి అల్పాల్పముగ దొరకును. మూడును వేరుపైపట్టయే ప్రధానముగాగలవి. తెల్లచిత్రమూలము కటుతిక్తరసములు లఘు రూక్షగుణములు ఉష్ణవీర్యము కటువిపాకము గలది. అగ్నిదీప్తిని, మలబద్ధమును గల్గించును. కుష్ఠు, శోష, అర్శస్సు కృమి, కాస, వాతశ్లేష్మములు, వాతోదరము, దురద. యకృత్ ఆమదోషము క్షయ, గుల్మము మున్నగు వానిని హరించును.

కారము గలదిగాన కఫమును, చేదుగలదిగనుక పిత్తమును, ఉష్ణవీర్యమైనదిగాన వాతమును, హరించును. చిత్రమూలమును ఆముదములోవేసి కాచి, వడియగట్టి బిడ్డలకు త్రాగించిన దగ్గు, పాలఉబ్బసము జలుబు, జ్వరము, కడుపుబ్బరము, అజీర్ణము మొదలగునవి తగ్గును. పచ్చి చిత్రమూలమును నూరి కను బొమ్మయొక్క మొదటసరము మీద అంటించిన పుంజై ఒంటి కణత నొప్పి నయమగును. ఏపార్శ్వమున నొప్పి గలిగిన ఆకనుబొమ్మ మొదట గురిపెట్టవలెను. మరియు చిత్రమూలకల్కమును (నూరినముద్దను) బొడ్డుచుట్టు పట్టువేసిన ఆచోట పుండుపడి అసాధ్యమగు గ్రహణి మొదలగు రోగముకుదురును. చిత్రమూలము, తెల్లబాడిదచక్క రెండుకలిపి రసము తీసి పొంగించి తేనె చేర్చి యిచ్చిన దారుణ కఫ కాసలు నివర్తించును. చిత్రమూలము ముసాంబరము కలిపి మాత్రలు చేసి అన్నములో పొదిగి మ్రింగిన ఋతు రక్తము వెడలును. ముట్టునొప్పి తగ్గును. గర్భిణులు తినిన గర్భపాతము చేయును. వట్టిచిత్రమూలమును తినినను పైనకట్టినను పుండుచేయును. చిత్రమూలము నిప్పుతో సమానమైనది.

ఎర్ర చిత్రమూలమునకు నల్ల చిత్రమూలమునకును యివియేగుణములుగాని, ఇవి రెండును రసబంధము నందును లోహవేధ యందును రసవాద విద్యయందును మిగుల సుపయుక్తములుగ నుండును.



నల్ల చిత్రమూలమును భక్షించుచున్న వెండ్రుకలు నల్లబడును. వేరును ఆవులకు వాసనజూపినను లేక పాలలోవేసినను పాలు నల్లబడును. రక్త కృష్ణ చిత్రమూలములు రసాయనములుగనుండును.

చిన్నదూలగొండి:—సం. గురాలభ, యాస అనియు హిం కౌఞ్ అనియుపేరు యిదిచిన్నచెట్టు. శరీరముకుతగిలిన అమితమగు దురదపుట్టును. దీనికాయలు పిల్లగింజలకంటె చిన్నవిగ గుండ్రముగా నుండును. చెట్టునందంతట తెల్లనినూగుండును.

వగరు చేదు రసములు లఘుగుణము శీతవీర్యము కటువిపాకము లది. పురుషులకు వీర్యవృద్ధిని స్త్రీలకు సంతానయోగ్యతను కలిగించును. వాతపిత్తములు సిధ్మ అతిసారము అను రోగములహరించును.

చిన్నపల్లేరు:—చూ. పల్లేరు.

చిన్నముత్తవపులగము:—చూ. బలాచతుష్టయము.

చిమ్మిలి:—బెల్లము నువ్వులు వేసి తొక్కిన ముద్దకు చిమ్మిలి అని పేరు. బలమును వీర్యవృద్ధిని కలిగించును. రక్తముపడుమూలవ్యాధులుకలవారు సాయంకాలమున పరుండబోవునపుడు నిమ్మకాయంతవుండను తిని మంచితీర్థమును త్రాగుచున్న మొలలు నశించును. విరోచనముచేయును. కఫమును పెంచును. ఋతురక్తమును జారీచేయును. ఋతుబద్ధమువిప్పును. రక్తగుల్మమును కరిగించును. తలత్రిప్పును. నోటినీరూరచేయును. నేత్రములకుజబ్బుచేయును. నువ్వులు తాటిబెల్లము కలిపి తొక్కి తినిన అతిమూత్రవ్యాధి నివారించును.

చిరుబొద్ది:—సం. లఘుపాఠా అనియు, హిం. పాఢ్ అనియుపేరు. యిదితీగబారును. ఆకులు కొంచెము గుండ్రముగా నుండును. సన్నని తెల్లటి పువ్వులుపూచును. యెర్రనిపండు పండును. ఆకుపైన నలుపును అడుగున తెలుపునువుండును. చేదు రుచి లఘు తీక్ష్ణగుణములు ఉష్ణవీర్యము కటువిపాకము గలది. విషము కుష్ఠము దురద ఛర్ది హృద్రోగము అను రోగములను హరించును. త్రిదోషహరమైనది.

చిరికందులు:—కఫపైత్యములు అతిసారము హరించును. గురుత్వముగనుండును చూ. కందిచెట్టు.

చిరుపాల:—చేదు రుచి లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. వాతము పిత్తము కృమి దురద కుష్ఠు మున్నగువానిని హరింపజేయును. దీనికి కాంచనక్షీరియనియు పేరు.

చిరుమొగలి:—సం. కాకకేతకి, తృణకేతకీ, మధ్యదండా అనియు, హిం. రామబాన్ అనియుపేరు. కటు మధుర తిక్తరసములు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. విషమును కఫమును హరించును. దీనిపువ్వు కటుతిక్తరసములు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. కాంతినికలిగించును. కఫవాతములనుహరించును. ఈపువ్వులోని కేసరములు వెంట్రుకలయందలి దుర్గంధము తాపము సిధ్మ దురద అనువానిని హరించును. పండు తీపి రుచి కొంచెము ఉష్ణవీర్యముకలది. వాతకఫములను మేహములను హరించును.

చిరుశనగలు:—సం. మసూరా, రాగదాళీ అనియు. హిం. మసూర్ అనియుపేరు. మధురరసము రూక్ష లఘుగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. మూత్రకృచ్ఛ్రను కఫపిత్తములను హరించును. వాతవ్యాధులు శూల గుల్మము గ్రహణి అనువానిని పుట్టించును. వీర్యవృద్ధిని బలమును తగ్గించును.

దీనిఆకు కూర వగరు చేదు రుచులు గలది. తేలికగానుండును.

చిర్రిచెట్టు:—సం. తండులీయ, మేఘనాద భండీర అనియు, హిం. చౌలాయీ అనియుపేరు. చిర్రిచెట్టు నేలమీదపారు తీగజాతిలోని చిన్నమొక్క. సన్నగనుండు దీనికాడలు ఎరుపువాలుగనుండును ఆకులు మిక్కిలిచిన్నవి. ముదిరినతర్వాత తోటకూర వెన్నువంటి చిన్న వెన్ను వేయును. దీనిని కూరవండుకొనితిందురు. రూపమంతయు తోటకూరవలెనుండును. గాని అంతకన్న మిక్కిలిచిన్నది.

మధురరసము లఘు రూక్ష గుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. పిత్త కఫములు, విషదోషము, భ్రమ, దప్పి, అరోచకము



తాపము, రక్తవికారములు, కాస, శోష మొదలగు రోగములను హరించును. అగ్నిదీప్తిని రుచిని పుట్టించును. శ్లేష్మరోగులకును మందాగ్నికలవారికిని మిక్కిలిపథ్యమైనది మలమూత్రబద్ధమునువిప్పును. రసమును తినునప్పుడు అపథ్యముచేసినందున గలుగు సకలవికారములను నశింపచేయును. దీనివేరు ఉష్ణవీర్యముగలది. నాభిమున్నగు విషములు తినినవారలకు వేళ్ళరసమును త్రాగించిన విరుగును. రక్తప్రదరమును రక్తపిత్తమును ఖండించును. ఋతుబద్ధముగావించును.

చిలగడదుంప:—సం. రక్తాళు, పిండకంద అనియు, హిం. రతాల్, పిండాల్, కాందూ, శకర్‌కందీ అనియుపేరు. ఎరుపు తెలుపు భేదముచేత నిది రెండువిధములు. ముల్లంగిదుంపవలె పొడవుగ లావుగనుండును. ఆకులను విడచి ప్రత్యేకముగ దుంపనే భుజింప నర్హముగ నుండును.

మధురరసము, గురుగుణము, శీతవీర్యము, మధురవిపాకముగలది బలము, పుష్టి, వీర్యము, కఫము గలుగ జేయును. పిత్తదాహమును మూత్రకృచ్ఛ్రను శ్రమను పోగొట్టును. తృప్తినిచ్చును. మేహమునణచును. అమితముగదినిన కడుపునొప్పిని అజీర్ణమును కలుగజేయును రెండువిధములగు చిలగడదుంపలకు నివియేగుణములు.

చిలుకకూర:— సం హిలమోచక, త్రివృత్పర్ణి అనియు, హిం. హురహుల్, హులహుల్ అనియుపేరు. నీళ్ళవారలేచెడు చిన్నమొక్క. సరస్వతి (బ్రాహ్మి) చెట్టువలె నుండును. చిన్నచిన్న నల్లని పువ్వులు పూచును

తిక్తరసము సరగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. కుష్ఠమును కఫపిత్తములను హరించును. విశేషముగ గ్రహణి అర్శస్సు ఉబ్బురోగములందు పనిచేయును. అగ్నిదీపనము బలము గలుగజేయును.

చిలుకతోటకూర:—తోటకూరలోభేదము. చెట్టు కొంచెము ఎర్రవాలుగానుండును తెల్లకుసుమ సర్పవిషము అగ్నిమాంద్యము కృమి అను రోగములనుమాన్పును. దీనిని కూరవండుకొనితిందురు

చిలుకమాంసము:— సం. శుక, కీర, రక్తతుండ అందురు. ఇది శీతవీర్యము లఘుగుణముకలది. మలబద్ధము చేయును. గాయములను మాన్పును. కాసను క్షయను నశింపచేయును.

చిల్లగింజలు:— చూ. ఇండుపగింజలు.

చీకటిచెట్టు:— సం. తమాల, కాలస్కంధ, అమిత్రద్రుమ అనియు, హిం. శ్యామతమాల్ అనియు పేరు. సముద్రతీరములయందు మొలచెడు పెద్దవృక్షము. దీనియాకులు కొమ్మలు నల్లగ చీకటివలె నుండును గాన దీనిని చీకటిచెట్టని పిలుతురు. యెర్రని చిన్నపూవులు పూచును ఆకులుగుండ్రగనుండును.

వగరు తీపి రుచులు గురుగుణము శీతవీర్యము మధుర విపాకము గలది. వాపు తాపము విస్ఫోటము శ్రమ కఫము పిత్తశోథ అను రోగములను హరించును. ధాతుపుష్టి బలము గలిగించును.

చీకువెలగచెట్టు:— చూ. వెలమసంధి.

చుక్కకూర:— సం. చుక్రఅనియు, హిం. చూల్ అనియుపేరు ఇది చిన్నక్షుపము. ఆకులుగుండ్రగ పెళుసుగ నుండును. చిన్న పూవులుపూచును. యెండినపూవులన్ను పాతిపెట్టిన మొక్క మొలచును. పుల్లనిరుచి ఉష్ణవీర్యము రూక్షగుణము అమ్లవిపాకము గలది. విషదోషములు కడుపులోమంట ఛర్ది మూలవ్యాధి గుల్మము శూల తాపము దప్పి గ్రహణి అరుచి అను వ్యాధులను హరించును. ఆకులనునూరి కట్టిన వ్రణములు పక్వములై పగులును. రుచిని ఆకలిని పుట్టించును. బలమును ఉత్సాహమును వీర్య పటుత్వమును గల్గించును. ఆకురసములో ఉప్పుకలిపి శరీరమునకుపూసిన గజ్జి చిడుము మానును. శ్లేష్మవాతములను హెచ్చించును. దీపనపాచనముల గలుగజేయును.

చెంచలికూర:— సం. సితివార, స్వస్తిక, సునిషణ్ణక అనియు, హిం. శిరియారీ, చౌపతియా, ఉటింగణ, గుతవా అనియుపేరు. కొటినారలనుండు చిన్నమొక్క. పులిచింతమొక్కవలె నుండును. దీనికి బాడనా



లుగేసిఆకులుండును. ఆకులనడుమనుండి వెన్నుపుట్టును. వెన్నులో రెండేసిగింజలుండును. ఈగింజలు గొబ్బిగింజలను పోలియుండును.

కషాయ మధుర రసములు, లఘు రూక్షగుణములు, శీ. వీర్యము, మధురవిపాకము గలది. మేహము, జ్వరము, శ్వాస, కుష్ఠము, భ్రమ దాహజ్వరము, అనురోగములను హరించును. అగ్నిదీప్తి, వీర్యము, బలము, పుష్టి గలుగజేయును. త్రిదోషహరమైనది.

చెంచలి గింజలు, మూత్రకృచ్ఛ్రను నివారింపచేయును. కోమలమైన చెంచలికూరను నేతితోవేయించి కూరవండుకొని తినిన త్రిదోషహరముగ నుండును పచ్చిదిగను, నేతితో వేయించనిదిగను ఉండు చెంచలి ఆకు కఫ పిత్తములను పెంచును.

చెరుకు:— సం. ఇక్షు, అనియు. హిం. ఈఖ్ అనియుపేరు. చెరకు పలుదెరంగులు, చెరుకు వెదురు గడవలె పెరుగును. పొడవగు కొబ్బరి యాకులవంటి ఆకులుండును.

చెరుకు సాధారణముగా మధురరసము, స్నిగ్ధ గురుగుణములు, శీతవీర్యము, మధుర విపాకము గలది, బలము, వీర్యవృద్ధి, కఫము, వీనిని హెచ్చించును. పిత్తమునణచును. మూత్రమును వృద్ధిచేయును.

చెరుకు వేరునందు మధ్యమందును మాధుర్యము ముడిచర్మము చిగురు అను భాగములందు ఉప్పదనము ఉండును. లేతచెరుకు కఫము, మేదస్సు, మేహము గలుగజేయును. తరుణవయస్సు గలది. వాతపిత్తహరముగ కొంచెము తీక్ష్ణముగ నుండును, బాగుగాముదిరి వృద్ధవయస్సుగల చెరుకు రక్తపిత్త క్షత క్షయములను హరించును. బలవీర్యములను కల్గించును

దంతములతోనమిలి పీల్చి మ్రింగబడిన చెరకురసము రక్తమును హరించును. విదాహమునుపుట్టింపదు బల వీర్య కఫములనుపెంచును శర్కరతో సమానమగు వీర్యము కలది యగును. మూత్రమును వృద్ధి చేయును.

వేరు వెన్ను మొదలగువానిని పుచ్చుపట్టినవానిని ధూళిమొదలగు మలినసంపర్కముగలవానిని కలిసి యంత్రమునందుంచి రసముతీయుదురు గావున యంత్రమువలన తీయబడిన చెరకురసము ఒక్క క్షణమాత్రములో వికారమును జెందును. గాన దానిని సేవించిన విదాహము మలబద్ధము గురుత్వము అగ్నిమాంద్యము మున్నగు రోగములం గలుగ జేయును.

కొన్నాళ్ళు నిలవయుంచబడిన చెరకురసము పులుపు రుచి గురుగుణము ఉష్ణవీర్యము అమ్లవిపాకము గలదిగ నుండును. కఫ పిత్తములను మూత్రమును వృద్ధిచేయును, శోషింపచేయును విరేచనముచేయును.

కాచినచెరకురసము గురు స్నిగ్ధ తీక్ష్ణ గుణములుగలదిగనుండును. కఫవాతములు గుల్మము ఆనాహము అనురోగముల పోగొట్టును. కొంచెము పైత్యమును పెంచును.

భోజనమునకుపూర్వము చెరకునుతినిన పిత్తమును శమింపచేయును. భోజనానంతరమున దినిన వాతమును పెంచును. భోజనమధ్యమందు తినిన మిగుల జడత్వమును రోగములను కలిగించును.

మిక్కిలి గట్టిపడకుండ పలచగనుండునట్లు కాచబడిన చెరకు రసమునకు ఫాణితమనిపేరు. ఇది శరీరపుష్టి వీర్యవృద్ధి గలుగజేయును. కఫమును పెంచును. వాత పిత్త శ్రమలనుహరించును. మూత్రమును వస్తిని శుద్ధముచేయును.

కొంచెము ద్రవరూపమై గట్టిపడను వచ్చువరకు పాకముచేయబడిన చెరకురసమునకు మత్స్యండిక యనిపేరు. ఇది బలమును పుష్టిని వీర్యమును కఫమును వృద్ధిచేయును. వాతపిత్తములను హరించును. రక్తదోషములను పోగొట్టును. తక్కిన చెరకు భేదములన్నియు సాధారణముగ సమాన రసవీర్యాదులం గలిగియుండును. చెరకురసముతో బెల్లము పంచదార పటికబెల్లము మొదలైనవితయారగును. చూ. బెల్లము, పంచదార, కలకండ,



అగ్నిమాంద్యము, కుష్ఠము, మేహము, ఉదరరోగము, పీనస, కఫము, కృమి, గుల్మము, జ్వరము, నంజు, భగందరము,కఫ, కాస అను రోగములుకలవారలు చెరకునుతినరాదు.

చెవులపిల్లిమాంసము:—దీపనకారి పాకమువలన కటువు (కారము) గ ఉండును మలబద్ధము చేయును. రూక్ష గుణము శీతవీర్యము గలది.

చెవ్యము:—సం. చవ్య, చవణ, చవిక, కోలవల్లిక అనియు, హిం. చవ్య అనియు పేరు. ఇదియొకతీగ. మిరియాలతీగయని కొందరందురు. కటురసము లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. దీపనపాచనముల గల్గించును. జంతువాతము శ్వాసకాసలు శూల వాతకఫములు జ్వరము అర్శస్సు అనురోగములను నశింపచేయును. మరియు పిప్పలి మోడియొక్క గుణములన్నియు దీనియందుగలవు. చెవ్యమందొక్కపూవు విషము శ్వాసకాసలు క్షయ అనువ్యాధులను హరించును.

చేతరాశికూర:—చాతరాశిని చాదలాశి యనియు నాడుదురు. చిన్న మొక్క చిర్రిమొక్కంతయుండును. ఒకతొడిమెకు నాలుగాకులు వేయును. తిక్త మధురరసములు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది అరుచి మూత్రకృచ్ఛ్ర మేహము మూలరోగము కృమి ఉదరము మొలుకమున్నగు జంగమవిషము శ్లేష్మపిత్తములు అను వానిని ఖండించును. కొద్దిగ విరేచనముచేయును. నిద్రపట్టించును. నేత్రరోగులు గర్భిణులు దీనినితినరాదు.

చేదుదొండ:—సం. తిక్తతుండి, కటుతుండి అనియు, హిం. కడవీ కందూరీ అనియు పేరు. దొండ తీగజాతిలోనిది. తియ్యదొండ చేదుదొండ యని యీజాతిలో రెండుభేదములుకలవు. తియ్యదొండను దొడ్లలోవేసి పెంచి కాయలు కూరవండుకొనితిందురు. చేదుదొండతీగ అరణ్యములందు వానియంతట యవిమొలచును. తెల్లనిపూవులు పూచును పండినపండ్లు మిక్కిలియెఱ్ఱగ మనోహరముగఉండును

కారము చేదు రుచులు లఘు రూక్షగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. అరోచకము రక్తపిత్తము విషము నంజు క్షయ ము

న్నగువానిని హరించును. చేదుదొండకాయ వాంతిని వాతప్రకోపమును చేయును. ఉబ్బు విషము పిత్తము రక్తవికారము హరించును, పథ్యము గనుండును. పండినపండు మధురరసము శీతవీర్యము గలది. పిత్తహరము గ ఉండును,

చేదుదోస:—సం. తిక్తకర్కటి, శశాండులీ, ధామార్గవ. భర్గా యని అనియు పేరు. హిం. కడవీ. కకడీ అనియు పేరు. చేదు దోసతీగయు దోసతీగవలెనే యుండును. భేదములేదు. దీనికాయలు మాత్రము చేదుగ ఉండును.

చేదు కారము రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. మూత్రకృచ్ఛ్ర, ఆధ్మాన, వాత, అష్ఠీలా, రోగములను హరించును. మూత్రమును జారీచేయును. వాంతికరమైనది. చేదుకలది గనుక పిత్తమును క్రిమినిహరించును.

చేదుపుచ్చ:—సం. ఇంద్రవారుణి చిత్ర అనియు, హిం. ఫర్ ఫేద్ అనియు పేరు. ఇదియొకతీగ. పుచ్చతీగవలె ఉండును. దీనికాయలు దబ్బకాయలంతయుండును. తీగయంతయు అమితమైన చేదుగలిగి యుండును. కాయలలోగింజలు నల్లగ గుమ్మడిగింజలవలె ఉండును. కాయలు గుండ్రగ ఉండును. ఆకులపై తెల్లనిజీరలుండును. ఇది రేవడి భూములలో అమితముగా పెరుగును.

చేదుపుచ్చ చేదు కారము రుచులు సరగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. దీనివేరు రసమును త్రాగిన వాంతి గర్భపాతము చేయును ఋతురక్తమును వెడలించును. పైపొట్టు గీసివేసి వేరును యోనియందుంచిన గర్భపాతమగును. వేరు అరగదీసిన గంధమును రాచిన తేలు జెర్రి కందిరీగ మొదలగువాని విషము హరించును. వేరు చూర్ణమును నస్యముచేసిన శిరోవాతము హరించును. ఆకురసమును శరీరము నకు పూసిన చర్మరోగములు నశించును. ఆకులను వెచ్చజేసి కురుపులకు కట్టిన వ్రణములందలి క్రిములు నశించును. బొడ్డునకుగట్టిన విరేచనముచేయును. కాయలరసముతో ఉప్పును 40 దినములు భావనచేసి



బలాను సారముగ నిచ్చిన ఋతుబద్ధము, రక్తగుల్మము, గుల్మము, శూలము, కడుపుబ్బరము దారుణ మలబద్ధము సవాయినొప్పులు హరించును.

కాయలను కుమ్ములోపెట్టి తీసినరసము 4 భాగములు. తెల్లతెగడవేరు రసము 2 భా॥ రేలచిగుళ్ళ కల్కము (నూరినముద్ద) 1 భా॥ అన్నిటికి సమము ఆముదములు, యీవస్తువులనుచేర్చి ఆముదము మిగులు వరకు కాచి వడియగట్టి దానిని పంచదారలో యెన్ని చుక్కలువేసి తినిన అన్ని విరేచనములగును. ఇదియొక విధమగు బిందు తైలము కాయల పై పెచ్చులను కోసివేసి గింజలను లోనిబురుగును తీసివేసి తక్కిన కండను ఉప్పునీళ్ళలో 10 దినములు నానబెట్టి పిదప ముక్కలను కడిగి పంచదారలోవేసి పాకముబట్టి యీమురబ్బాను ఒక గాజుపాత్రలో భద్రపరచి బాలానుసారముగ ప్రతిదినముసేవించిన నంజు, క్రిమి రోగము నశించును. పచ్చికాయల రసమును పక్షవాతముచేత పడిపోయిన పార్శ్వమునపూసి మిరపకాయల కారమును అంటించిన యెడల పక్షవాతము తప్పక కుదురును. కాయకు రంధ్రముచేసి ఆరంధ్రముగుండా నాములేక శొంఠికొమ్ములు దూర్చి వారము దినములవరకు నిల్వయుంచి 9 వదినమున కుమ్ములోపెట్టి తీసి కాయనుపారవేసి యెక్కించిన ద్రవ్యము కనగకుండ యెండబెట్టి విరేచనౌషధముగ వాడుటకుపయోగించును.

వెర్రిపుచ్చకాయలో తాళకపు ముక్కను పెట్టిచీరజేసి పుటము వేసిన తాళకము భస్మమగును. వాదమునందుగూడ దీనిని విశేషముగ వాడుక చేయుదురు.

చేదుపొట్ల:—సం. తిక్తోత్తమ, బీజగర్భ, జ్యోత్స్నీ అందురు. తీగబారును. ఆకులు పొట్లఆకులవలెనుండక చీళ్ళలువేయును. కాయలు గుండ్రగ చిన్నవిగనుండును. పండినవెనుక మిక్కిలి యెఱ్ఱగ మనోహరముగఉండును. కాయపైన తెల్లచారలుండును.

ఇది చేదు వగరు రుచులు సరగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. మలమునుభేదించును. దీపన పాచనములం గలుగ జేయును. పిత్తము కఫము దురద కుష్ఠము రక్తవికారము జ్వరము తాపము దప్పి

క్ష్యమి అను వ్యాధులను నశింప చేయును సమూలముగ దీనిని వాడుక చేయదగును.

చేదుపొట్ల రక్తచందనము చాగ కటుకరోహిణి విషబొద్ది తిప్పతీగ వీనికషాయమును త్రాగిన పిత్తశ్లేష్మ జ్వరము ఛర్ది తాపము దురద విషబాధ నశించును. ఇదియ పటోలాదిక్వాథ మనబడును. చేదుపొట్ల త్రిఫలములు వేపచక్క ద్రాక్ష కేలశిగురు అడ్డసరము అను వాని కషాయమున పంచదార తేనెచేర్చి సేవించిన ఒకరోజువిడచి ఒకరోజు వచ్చు విషమజ్వరము నెమ్మదించును.

చేదుబీర:—సం. తిక్తకోశాతకి, జాలిని, కృతవేధన అనియు, హిం. కడవీతోరయీ అనియుపేరు. మంచిబీరయొక్క ఆకారములసన్నిటిని సమగ్రముగగలది కొంచెము కారము వగరు చేదు రుచులు లఘు రూక్షగుణములు శీతవీర్యము కటువిపాకము గలది. మలాశయ ఆమాశయ పక్వాశయములను శుద్ధిపరచును. త్రిదోష పాండువులు విషము యకృత్ కుష్ఠు శోథ కాస ఉదరము కామిల గుల్మము అను రోగములను హరించును.

చేదుబీరకాయ కటుతిక్తరసములు స్నిగ్ధగుణము శీతవీర్యము కటువిపాకముగలది. కాస అరోచకము మేహము జ్వరము కుష్ఠు కఫము శ్వాస వాతపిత్తములు మున్నగురోగములను హరించును. పండురసమును లేక గింజలరసమును లేక గింజలచూర్ణమును నస్యముచేసిన అనేక శిరోవ్యాధులు నశించును.

సమూలరసము 4 భాగములు. నేయి 1 భా॥ చేర్చి కాచినఘృతమును బలానుసారముగ సేవించిన గుల్మము పాండువు మూలరోగము ఉబ్బు మున్నగురోగములు తగ్గును. సమూలకషాయము లేక రసము సన్నిపాతమునందు పనిచేయును. కాయ రసమును ఆముదములోవేసి కాచి దానితో అభ్యంగనముచేసిన శూలపోటు కండ్లుమంట మున్నగునవితగ్గును. చచ్చువాతముగలవారలకు 4 రెట్లు కాయలరసముపోసి కాచిన నూవులనూనెను మర్దనచేసిన నయమగును. నరములకు మంచిసత్వ



మునిచ్చును. చేదుబీర సాధారణముగా విషమజ్వరము సన్నిపాతము శిరోవ్యాధులు గుల్మము అనువ్యాధులందు పనిచేయును.

చేదుబాదాం:—చేదుబాదంపప్పును తినిన అశ్మరి మూత్రకృచ్ఛ్ర నివర్తించును. ఋతురక్తమును జారీచేయును. అభ్యంగము చేసుకొనినప్పుడు యీపప్పును రుబ్బి తలకురుద్దిన పేలు ఊపె చచ్చును. శరీరమునకుపూసిన చర్మరోగములు నివర్తించును.

చేదుసొర:—సం. కటుతుంబీ, పిండఫల, రాజపుత్రి అనియు, హిం. తితలోకీ. కడవీతోంబీ అనియుపేరు. మంచిసొరతీగకును దీనికిని భేదమేమియునుండదు. చేదు రుచి లఘు తీక్ష్ణ గుణములు శీతవీర్యము కటువిపాకముగలది. పిత్తము కాస విషము వాతపిత్తజ్వరము అను వానినిహరించును. చేదుసొరఆకు మధురవిపాకము గలది. మూత్రమును శుద్ధిపరచును. శ్వాసకాసలు విషము ఛర్ది జ్వరము కఫము అను రోగములుగలవారలకు వమనార్థముగ యిదియివ్వవచ్చును. క్షయ పాండువులనుహరించును. త్రిదోషహరమైనది.

చేపమాంసము:—మధురరసము ఉష్ణవీర్యము గురు స్నిగ్ధగుణము మధురవిపాకముగలది. వాతపిత్తములు శ్రమ శుక్లనష్టము మున్నగు రోగములను హరించును. దేహపుష్టి ధాతువృద్ధి బలము కాంతి సంభోగశక్తి గలిగించును. ఆలస్యముగ జీర్ణమగును. కఫమును పెంచును. పాము తేలు మొదలగు విషములను హరించును. పుబ్బువ్యాధిని పుట్టించును. చేపనూనెను త్రాగిన క్షయ కాస మొదలగు రోగములు హరించును.

చోళ్ళు:—సం. రాగి, బహుతరకనిశ అందురు. తమిదలు అనియు వాడుదురు. చిన్నవిగ ఆవాలవలెఉండును, యివి తృణధాన్యవిశేషములు. వగరు రుచి లఘు రూక్షగుణములు శీతవీర్యము మధురవిపాకముకలది. ఆకలి దప్పికల నణచును. మూత్రము శ్లేష్మము శోష వాతము వీనినిపెంచును. మలబద్ధముజేయును. వెంట్రుకలకు నలుపెక్కించును. ఉష్ణతత్వముగలవారికి మిక్కిలి హితకరముగఉండును.

జంగాలపచ్చ:— ఇది రాగికిలుము, మైలతుత్తపు జాతిలో దీనిని చేర్చవచ్చును. దీనిని పైకిపూయుటకేగాని లోనికి సాధారణముగా తి నుటకు వ్యవయోగించరాదు. లోపలకుతినిన దారుణ వమనముచేయును. యెక్కువతినిన చంపును.

జంగాలపచ్చ మేకకొవ్వు రెండును దొండాకు పసరులో కలిపి పూసిన సవాయిపుండ్లు మొండివ్రణములు కుళ్ళువ్రణములుమానును.

జంగాలపచ్చ రసకర్పూరము యింగిలీకము గంగశిందూరము మృ ద్దారుశృంగి మైలతుత్తం పోకకాయ వీనిచూర్ణమును వెన్నలో కలిపి రాచినగోరుకు సవాయిపుండ్లు పోవును.

ప్రత్యేకము జంగాలపచ్చ చూర్ణమును వ్రణములపై వేసిన కో యును. యిది దేశవాళిది సీమది అని రెండురకములు సీమది మంచిది,

జంగిలీహారదా:— కరక్కాయజాతిలోనిది. వీటిని కరక సిందలని యు అందురు. దీనిని పగులుగొట్టి బుగ్గనబెట్టుకొని రసము మ్రింగుచు న్నయెడల గొంతునొప్పిని పుంస్త్వమును తగ్గించును. కొద్దిగా విరేచనము జేయును. నోటిపూతనుమాన్పును. కరక్కాయగుణములు దీనియందు గలవు. చూ. కరక్కాయ.

జటామాంశి:— సం. జటామాంశి, జటీ పేషీ, లోమశా, మి శి, తపస్వినీ అనియు, హిం బాలచడ్ అనియుపేరు. మధుర తిక్త క షాయరసములు లఘుస్నిగ్ధగుణములు శీతవీర్యము కటువిపాకముగలది కాంతి బలము గల్గించును. పవిత్రమైనది. త్రిదోషహారము రక్తదోష ము తాపము విసర్పి కుష్ఠు కఫము అను వానిని హరించును. అనులో మజ్వరమునకు విశేషముగపనిజేయును.

జనచెట్టు:— చూ. గిలిగిచ్చ.

జమ్మిచెట్టు:— సం. శమీ, సక్తుఫలీ, కేశహంత్రీ, పవిత్ర అని యు, హిం. ఛోకరుచికుర్ అనియు పేరు. ఇది సాధారణమైనచెట్టు. చింతాకులకంటె మిక్కిలి సన్నమైనఆకులు వానపాములవలె సన్నగా పొ డవైనకాయలుండును. కాయలు రుచిగానుండును. దీనిఆకులుతుమ్మా



కులవలెనుండును. ఇది కటుతిక్తకషాయరసములు లఘుగుణము శీతవీ ర్యము కటువిపాకముకలది కఫకాసలు శ్వాస భ్రమ కుష్ఠు అర్శస్సు కృమి అతిసారము రక్తపిత్తము కఫము శ్రమ అనువానిని హరించును. జమ్మికాయ మధురరసము గురు రూక్షగుణములు ఉష్ణవీర్యము మధుర విపాకముగలది. పిత్తమును పెంచును. వెండ్రుకలకు నలుపెక్కించును.

జమ్మిఆకు లేక చక్కరసము వెండ్రుకలకు పూసిన వెండ్రుకలూ డిపోవును. చేదు వగరు రుచులు కలదగుటచే దీనిచెక్క చూర్ణముతో దంతధావనముచేసిన దంతములు దంతమాంసములు బలముగనుండును.

జమ్ము:— సం. గుంద్ర, పటేరక, రచ్ఛ అనియు, హిం. గోంద పటేరు అనియుపేరు. చెరువులలోను నీళ్ళయందును అమితముగా పెరు గునట్టి ఒకవిధమైన తుంగ. రెండుమూడు గజములఎత్తువరకు దుబ్బుగా పెరుగును. జమ్ముతో గూడలు యిండ్లకప్పు దళ్ళు మొదలైనవి కట్టు దురు. దీని వెన్నునపుట్టు దూదిని పరుపులు కుట్టుదురు. యివి మిక్కిలి మృదువుగా వుండును. కండ్లలోపడిన బైటకురాక పువ్వులువేయును. జమ్ము మధురకషాయరసములు లఘుగుణము శీతవీర్యము మధురవిపా కముగలది. పిత్తరక్తహారము స్తన్యము శుక్రము రజస్సు మూత్రము వీనిని శుద్ధిపరచును. మూత్రకృచ్ఛ్రనుహరించును.

జిరడీతృణము: సం. గరమోటికా సులీలా, జలాశ్రయ అనిపే రు. మధురరసము సరగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. తా పమును రక్తదోషమును హరించును. రుచిబుట్టించును. పశువులకు మే పిన పాలువృద్ధిఅగును. యిది నీటిని ఆశ్రయించివుండు గడ్డిజాతిలోనిది.

జాజికాయ:— సం. జాతీఫలం, ఫలజాతీ, సుమనఃఫలఅనియు, హిం. జాయఫల్ అనియు పేరు. జాజిచెట్టు గుల్మముగా పెరుగును. కాయ పైబెరడునకు చుట్టుకొని జాపత్రివుండును. పుట్టినతరువాత కొం తకాలమునకుగాని జాపత్రి పచ్చపడదు. జావా, పినాంగ్ దేశములందును మళయాళమునందును యిది పైరగును. బరువు చమురు మంచివాసన గల జాజికాయమంచిది.

జాజికాయ చేదు కారము రుచులు సర తీక్ష్ణ లఘుగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. శీఘ్రముగ శరీరమున వ్యాపించును. దీపనకారి మలబద్ధము వీర్యస్తంభనము మత్తుపిత్తము గలుగ చేయును. వాతశ్లేష్మములు అరుచి మలదౌర్గంధ్యము కృమి శ్వాసకాసలు ఛర్ది శోష పీనస అనురోగములహరించును. కంఠస్వరమును బాగుచేయును వాతాతిసారమును మేహరోగముల నరికట్టును. బలము నిచ్చును. దీని చూర్ణమును వెన్నతోకలిపి రాచిన నోటిపూత తగ్గును. జాజికాయకు రంధ్రముజేసి నల్లమందు శనగగింజంత అందుకూరి గుడ్డచుట్టి గుంటగలగరఆకురసమున వుడికించి తీసి మెత్తగానూరి రెండు మాత్రలుజేసి అందొకమాత్రనుమింగి పాలుత్రాగిన వీర్యస్తంభనము మత్తు గలిగించును. రతిసౌఖ్యమునిచ్చును. లింగమునకు దార్ఢ్యమును స్థిరతను గలుగజేయును. జాజికాయ కాచు చూర్ణించి పెరుగుతోత్రాగిన అతిసారము కట్టును మిక్కిలిగతినిన మరణముకలిగించును. దీనిగంథమునందు మంచినూనెకలిపి పూసిన వాతపునొప్పులు హరించును. హారతికర్పూరము కలిపి కంటిచుట్టు పట్టువేసిన నేత్రవ్యాధులు కొన్నికుదురును

జాజికాయనుండి తీసిన తైలమును శిశ్నమునకుపూసిన దానికిబలమిచ్చును. లోపలకుతినిన దారుణమైన అజీర్ణరోగములు అతిసారము కట్టును. ఆనందము నరములకు దృఢత్వముకలుగును. జాజిచెట్టునకును కాయగుణములు సాధారణముగాఉండును.

జాజితీగ:—సం. సుమనా, మాలతీ, జాతీ, అనియు హిం. చమేలీ, జాయీ, జాతీ అనియుపేరు. ఇందు జాజి, స్వర్ణజాజి, ఉపజాజి అనిభేదములుకలవు. జాజి తెల్లనిపూవుపూచును. పూవులమితపరిమళముకలవి. తీగబారును. పచ్చని పూవులు పూచు జాజికి స్వర్ణజాజి అనియుపేరు

వేరు పట్ట లేక ఆకులరసము లేక కషాయము చూర్ణము కటుతిక్తకషాయరసములు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకము గలది. నోరుపూత కఫ వాతములు ముఖదంత శిరోరోగములు నేత్రవ్యాధి విష



ము కుష్ఠు రక్తదోషము వ్రణము పిత్తము కృమి అనువ్యాధులను జయించును. ఆకును శిరస్సునకుగట్టిన తీరనిశిరోవ్యాధులు నయమగును. నూరినముద్దను నరుకు వ్రణములకుగట్టిన మానుపట్టును. ఆకురసమును శరీరమునకుపూసిన గజ్జి మొదలగు చర్మరోగములు మానును. వేరురసమును లోపలకుత్రాగి వేరు గంధమును రాచిన తేలుమున్నగు విషములు నశించును. చేదు వగరు కారము రుచులు గలదిగనుక దీనిపుల్లతో దంతధావనముచేసిన దంతరోగములనేకములు మానును.

జాజిమొగ్గలు వ్రణము విస్ఫోటము నేత్రరోగము కుష్ఠము అనురోగములజయించును. విడిచిన పూవులు కఫపిత్తములహరించును. మనోహరముగ పరిమళముకలవిగ నుండును.

స్వర్ణజాజి దంతరోగము శూల రక్తదోషము అనువానింజయించును. వేరు రసమును చెవిలోబోసిన చీముకారుట పోటు తగ్గును. తెల్లజాజికిగల రసగుణాదులన్నియు దీనియందునుగలవు.

ఉపజాతి లేక ఉపజాజికి విరజాతియనియు పేరుగలదు. దీనిపూవులు తెల్లగ పూవుమధ్య కొంచెమెఱ్ఱగ నుండును. అమిత పరిమళము గలవి. తిక్తకషాయరసములు గలది. జాజిగుణములు దీనికినిగలవు.

జాపత్రి:—సం. జాతీకోశ, జాతిపత్రి, సుమనః పత్రిక అనియు హిం. జైత్రీ, జయిత్రీ అనియుపేరు. జాజికాయను చుట్టుకొనియుండు పుష్పమునకు జాపత్రియనియు పేరు.

కారము చేదురుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకము గలది. కఫము శ్వాసకాసలు ఛర్దిదప్పి కృమి విషము మాంద్యము అగ్నిమాంద్యము దుర్గంధము అనువానిని హరించును. కొన్నివస్తువులలో చేర్చిగాని తాంబూలముతోగాని జాపత్రినితినిన బుద్ధివికాసము వీర్యస్తంభనము మత్తు వీనినిగల్గించును. ముఖమందలి దుర్గంధమునశించును. అతిసారవిరేచనములు నీళ్ళవిరేచములు కట్టును. హెచ్చుగ దినిన పిత్తమును హెచ్చించును. తలనొప్పి దెచ్చును. గుండెలకుహానిచేయును.

జాభరాపువ్వు:—సం. సిందూరపుష్పి, సిందూరి, తృణపుష్పి హిం, జాఫర్, లటకణ్, సిందూరియా అనియు పేరు. యెఱ్ఱనిపూవులును యెఱ్ఱని చిన్నగింజలుఉండును. ఈగింజలను నీళ్ళలో వేసిన నీరు యెఱ్ఱబడును. వీనితో బట్టలకు రంగు వేయుదురు.

కటుతిక్త కషాయరసములు లఘుగుణము శీతవీర్యము కటువిపాకముగలది. విషము పిత్తరక్తము దప్పి వమనము వాతశ్లేష్మములు తలనొప్పి భూతబాధ అనువానినిహరించును. ఈపూవులు చండికా దేవికి ప్రియమైనవి.

జామిచెట్టు:—ఇది సాధారణమైనచెట్టు. సన్నగ పొడవుగ నుండు ఆకులును నిమ్మకాయంత మొదలు దబ్బకాయంతవరకు పెద్దవియగు పండ్లునుకలది మ్రానుపై పట్ట పలచగ ద్రాల్చినచక్కవలె నుండును. పండ్లకు మంచిపరిమళముకలదు. పండ్లలోనిగుంజు కొన్నికాయలకు యెఱ్ఱగను కొన్నిటికి తెల్లగనుఉండును. పూవులు తెల్లగనుండును. తోటలలోను దొడ్లలోను వేసి పెంతురు. పండ్లు మిక్కిలి మధురమైనవి పచ్చికాయలు వగరుగ నుండును పండినపండు పసుపుపచ్చ రంగు గలిగియుండును.

జామిఆకు వగరు రుచికలది. నమిలిన నోటపూత చిగురు వాపు తగ్గును. ఆకురసమందు ఉప్పుకలిపి యిచ్చిన అజీర్ణవిరేచనములు కలరా తగ్గును. మలబద్ధముచేయును. జామిఆకురసమును త్రాగిన గంజాయి సారాయి మొదలగువాని మత్తునువిప్పును.

పచ్చిజామికాయను తినిన కడుపుబ్బును. ఆశక్తిచేయును. జ్వరమును పుట్టించును. పండినపండు మధురముగ మనోహరముగ నుండును. తృప్తినిచ్చును. ఆకలిని చంపును. అగ్నిమాంద్యము చేయును. కడుపులో నులిపురుగులను పుట్టించును. మూలవ్యాధినిహెచ్చుచేయును. జలుబు జ్వరము గలుగ చేయును మూత్రము నధికపరచును. అస్నిగ్ధమైనది.



జింకమాంసము:—సం. హరిణ, రురు, సారంగ అందురు. దీని మాంసము మధురరసము లఘుగుణము శీతవీర్యము మధురవిపాకము గలది. అగ్నిదీప్తినిచ్చును. త్రిదోషములను ఖండించును. మలమూత్రబద్ధము గలిగించును.

జిబిలిక:—చూ. బలాచతుష్టయము.

జిల్లేడుచెట్టు:—సం. అర్క, క్షీరవృక్ష, సదాసుమ, తూలఫల అనియు, హిం. ఆక్ అనియుపేరు జిల్లేడు తెలుపు నలుపు పూవులభేదముచేత రెండువిధములు. తెల్లజిల్లేడునకు శ్వేతార్క అలర్క రాజార్క గణరూపక అని సంస్కృతనామములు. జిల్లేడు చిన్నచెట్టు. క్షుపజాతిలోచేరును. జిల్లేడుకాయలు వంకరగా ఆకుపచ్చగనుండును. యెండినతరువాత కాయలోనుండి స్వచ్ఛమై మృదువైన దూదివెసలును. చెట్టు యెచ్చటగిల్లిన అమితముగ పాలుగారును. పాలకు మదపువాసన గలదు. తెల్లజిల్లేడు పూవులు శివునికి ప్రీతికరములని పూజచేయుదురు. ఆకులు మందముగ కొంచెము కోలగనుండును. చెట్లంతటను సన్నని తెల్లని నూగుండును. ఇది ప్రసిద్ధమైనచెట్టు. రెండుజిల్లేళ్ళును సమాన ప్రభావముగలవి. గాని తెల్లజిల్లేడు మిగులశ్రేష్ఠము.

జిల్లేడు చేదు రుచి సరగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది క్రిమి, అర్శస్సు, కఫము, శూల, ఉదరము, మున్నగు రోగములను హరించును

జిల్లేడువేరు చెమటనుపుట్టించును. మిక్కిలి వేడిని వాంతిని చేయును. దగ్గు సవాయిరోగము కుష్ఠము దద్రు విషము వాతవ్యాధులు ఉదరము క్రిమి సన్నిపాతజ్వరము ఆహ్నికజ్వరము మొదలగు అనేకరోగములనుహరించును. దుష్టరక్తమును జారీచేయును. వేరుగంధమును అరగదీసి రాచిన తేలువిషముతగ్గును. వేరురసమును నస్యము చేయించిన పాముకాటుయొక్క మైకము తగ్గును

జిల్లేడాకులరసమును ముక్కులో నస్యము చేయించిన చంటిబిడ్డ గుణము లేక గుదవాతము హరించును. వమనమగును.

పండు జిల్లేడాకులకు నూనెపూసి వెచ్చజేసి రసమును పిండి చెవిలోపోసిన చెవిపోటుతగ్గును. జిల్లేడాకురసమునందు పసుపుకలిపి శరీరమునకుపూసిన చిడుము మొదలగు సకల చర్మరోగములు మానును. జిల్లేడాకుపసరు 4 భా॥ ఆవనూనె 1 భా॥ పసపుముద్ద నూనెకు నాల్గవవంతుచేర్చి కాచిన తైలమును వడియగట్టి పూసిన అన్నివిధములగు చర్మరోగములు మానును.

జిల్లేడాకులను చుట్టగాచుట్టి కట్టి మధ్యకునరికి దానిని సలసలకాగుచున్న నేతిలోముంచి కాపడముపెట్టిన కవుకుదెబ్బనొప్పి మేహవాతపునొప్పులు కీళ్ళనొప్పులు తగ్గును.

ఆకులకు చమురునైననుపూసి వెచ్చజేసి గుదస్థానమందు కట్టుగట్టిన మూలవ్యాధి బాధతగ్గును.

జిల్లేడుపూవులను యెండించి చూర్ణించి తేనె పటికిబెల్లము కలిపి తినిన పురాణకాసలు గుల్మము అర్శస్సు తగ్గును. జిల్లేడుపూవులు పిప్పళ్ళు సమముగజేర్చి మెత్తగానూరి కుంకుడుగింజలంత మాత్రలుచేసి నీడనుఆరబెట్టి గాలితగులకుండ భద్రపరచి రెండు లేక మూడుగంటలకొక మాత్ర తినుచున్న దారుణమగు కళ్ళిదగ్గు తగ్గును. మూడుజిల్లేడుపూవులు ఒక వెల్లుల్లిగర్భము 2 మిర్యాలు కలిపి మెత్తగానూరి యొకమాత్రచేసి జ్వరమువచ్చుటకు రెండుగంటలు ముందుగా యిచ్చిన చలిజ్వరము తగ్గును. జిల్లేడుపూవుల రసము లేక కషాయముతో సవాయిపుండ్లను కడిగిన నవి వెంటనే మానుపట్టును.

పూవులరసమందు పసుపు కలిపి తాగించిన యెలుక విషము ఉబ్బు గుల్మము కఫము పిత్త రక్తము కుష్ఠు నశించును.

జిల్లేడుపాలు చేదు ఉప్పన రుచులు లఘుస్నిగ్ధగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలవి. కుష్ఠు గుల్మము ఉదరము మున్నగు రోగములను ఖండించును కొద్దివిరేచనముచేయును. పండ్లకురాచిన పండ్లతీపు తక్షణముతగ్గును. జిల్లేడుపాలలో రక్తపాషాణము కలిపిపూసిన సవాయిబిళ్ళలు సెగగడ్డలు హరించును. జిల్లేడు పాలతో మిరియాలను



21 దినములు భావనచేసి మెత్తగానూరి పెసరగింజలంత మాత్రలు చేసి యిచ్చిన దగ్గు ఆయాసము వరుసజ్వరము ఋతుబద్ధము నశించును. యెండించిన పాలచూర్ణమును ఫిరంగిచెక్క చూర్ణముకలిపి యిచ్చిన సవాయిమచ్చలు కరిమేహము తగ్గును. జిల్లేడుపాలు చింతాకురసము మేకపాలు వావిలిరసము నువ్వులనూనె వీనిని సమభాగముగ జేర్చి నూనె మిగులువరకుకాచిన నది అర్కక్షీర తైలమనబడును. దీనిని మర్దనచేసిన పక్షవాతము వాతపునొప్పులు మున్నగునవి అమోఘముగకుదురును. ఆదివారమురోజున తెల్లజిల్లేడు దూదినిగ్రహించి వత్తిచేసి ఆవునేతిలో తడిపి దీపముపెట్టి ఆదీపపువెలుగున సంభోగముచేసిన శీఘ్రస్ఖలన దోషము నివర్తించును.

జిల్లేడుపాలు రసబంధము రసరంజనము మున్నగు ప్రక్రియందు పయోగించును. తెల్లజిల్లేడుపాలు వాదవిద్యయందు ప్రశస్తముగ నెన్నబడును.

జీడిచెట్టు:— సం. భల్లాత, అరుష్కర, శోథహృత్, వ్రణకృత్ భూతనాశన అనియు, హిం. భిలావా అనియుపేరు. ఇది పెద్దవృక్షము. కొంచము పొడవుగా వెడల్పుగా నుండు ఆకులు నల్లనిగింజలు గుండ్రని పండ్లు బూడిదచరిచినట్లు తెల్లగనుండుమార్పినుకలది.

ఇది మధురకషాయరసములు లఘుగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. వాతశ్లేష్మములు, ఉదరము, అనాహము, కుష్ఠు గ్రహణి, మదము, గుల్మము, జ్వరము, బొల్లి, అగ్నిమాంద్యము, క్రిమి వ్రణము అనువానింజయించును, నల్లజీడివేరునందు శుద్ధిజేసిన రాగిముక్కనుపెట్టి గాఢపుటమువేసిన తెల్లగాభస్మమగును. ఆకులరసమును రాచిన కుష్ఠు పుండ్లు మానును. వేరునుండి పాతాళయంత్రమునుండి తీసిన తైలమునురాచిన బొల్లిమచ్చలు పోవును. ఆకులరసమును పెరుగులో గలిపి యిచ్చిన గ్రహణికట్టును. గర్భిణులకు దీనినియివ్వరాదు, పండిననల్ల జీడిగింజ నల్లగా చమురుగలిగియుండును. శరీరముపై వేసిన పొక్కి పుం

ష్టుసు. కొందరకు దీనిరసపుగాలి తగిలినను పొగతగిలినను దద్రు వాపు పుట్టును.

నల్లజీడిపండు చక్కగా పండినది తీపి వగరు రుచులు సర లఘు గుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. అగ్నిదీప్తినిచ్చును. ఛేదనమును భేదనముచేయును. కఫవాతములు వ్రణము కుష్టు అర్శస్సు గ్రహణి గుల్మము నంజు అనాహము క్రిమి శూల శ్వాసకాసలు అనువానిని హరించును. పండుపైనుండుపెచ్చు మధురకషాయరసములు లఘు స్నిగ్ధగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముకలది. అగ్నిదీప్తినిచ్చును. కఫవాతములనుహరించును. పండుయొక్క గుణములన్నిటినిగలిగియుండును. జీడిపండుగుంజు తియ్యగనుండును. బలము పుష్టి వీర్యము తృప్తి రుచి తాపము పిత్తము కలుగ జేయును, నల్లజీడితోడిమ మధురకషాయరసములుకలది. వాతమును హెచ్చించి పిత్తకఫములను హరించును. అగ్నిదీప్తినిచ్చును. వెండ్రుకలకునలుపెక్కించును.

జీడిగింజలను నరికి నేతిలోవేసి వేయించి రసమంతయు చమురు లోనికి వచ్చినపిదప గుల్లలనుతీసి పారవైచి నేతిని పావుతులం మొదలు అరతులమువరకు అరటిపండులోవేసి పుచ్చుకొనిన అమిత ఋతుస్రావము (రక్తప్రదరము) రక్తపిత్తము తగ్గును. దినమునకు మూడుసార్లు తినవలయును. వ్యాధికుదురుటకు మూడుమోతాదులు చాలును. పై చమురులో ఫిరంగిచక్క జీలకర్ర చూర్ణములుచేర్చి సమభాగములుగ పంచదారకలిపి సేవించుచున్న సవాయిరోగము కరిమేహము మచ్చలు పొడలు మేహకురుపులు మానును. అర్ధగర్రలు అపక్వస్థితియందుండి నపుడు జీడిఅంటించినయెడల హరించిపోవును. పుంసాగును. తిరగినొప్పులుగలచోట జీడితోకాల్చినయెడల నొప్పులు నివారణమగును. అరికాళ్లలో ముల్లుగుచ్చుకొనినప్పుడును గాయము పడినపుడును జీడిని అంటించినయెడల చీము నీరు పట్టనివ్వక వెంటనే మానుపట్టించును. స్త్రీలు జీడిగింజలను విశేషముగ తినినయెడల గర్భకోశ చెడిపోయి సంతానాస్తతను తగ్గించును. ఉష్ణతత్వముగలవారికి జీడిగింజతినిన దృష్టి దో



షము తలదిమ్ము తిప్పు మొదలైనవిపుట్టును. జీడిగింజలముక్కలను నూనెలోవేసి కాచి వడియగట్టి వెండ్రుకలకు రాచుకొనినయెడల నెరసినవెండ్రుకలు నలుపెక్కును బలముగ పెరుగును. పేలు ఈపి చచ్చును. ఈతైలమును లోపలికికూడ తినుపించవచ్చును. దీనివలన దారుణమైన వాతవ్యాధులు క్రిమిరోగములు హరించును. జీడిగింజలను మూడుదినములు బురదలో ఊరబెట్టి తీసి కడగి ప్రతిదినము ఒకటి మొదలు నాలుగువరకు తాంబూలముతో తినుచున్న యెడల దంతపటుత్వము దంతమాంసములకు జిగిదంతములవెంట చీము రక్తముకారుట వివిధమేహవ్యాధులు హరించును. కల్పప్రకారము దీనిని సేవించిన జరారోగములను రాకుండజేయును. జీడిగింజలలోనిపప్పు కమ్మగా వగరుగా యుండును. అమితవీర్యవృద్ధి బలము పుష్టి కాంతి తేజస్సు బుద్ధి బలము కఫము పిత్తము వీనినిహెచ్చించును జీడిగింజలను కాల్చిన మసి రెండుభాగములు గవ్వభస్మము ఒకభాగము సీమసున్నము రెండుభా॥ వీనిని ఏకముచేసి ప్రతిదినము దంతధావనము చేసుకొన్నయెడల ముఖదంతరోగములు హరించును నల్లజీడిపువ్వులు మిరియాలు నూరి కుంకుడుగింజంత మాత్రలుసేవించిన దారుణ గ్రహణీరోగము హరించును. నల్లజీడిగింజపొగరుపడనివారికి కలుగు పైచెప్పిన వికారములు శాంతించుటకై నువ్వుల పిండిని కొబ్బరిపాలతోకలిపి పూతపూయవలయును.

జీడిమామిడిచెట్టు:— ఇది విశ్వామిత్ర సృష్టిలోనిదందురు, ఇది పెద్దవృక్షము. ఇంచుమించుగా దీనియాకులు బాదమాకులనుపోలియుండును. దీనిగింజలు వంకరగా చిన్నవిగా నునుపుకలిగి యుండును. నిప్పులోవేసి కాల్చినయెడల కారువాసనవచ్చును. ఈగింజలలోనిపప్పు మిక్కిలి రుచిగాయుండును. వీర్యవృద్ధిని బలమును కలిగించును. పిత్తకఫములను హెచ్చించును. గింజలచమురు శరీరమునకంటిన పుండుఅగును. పరగడుపున దీనిపప్పును దినినయెడల ప్రాతవియగు సెగసవాయీల చిహ్నములు బయలుపడును. జీడిమామిడిపండు తీపి వగరు రుచులు గలది.

కఫమును పెంచును. గొంతులో గురుగురులాడ చేయును. జలుబు దగ్గు పడిశము జ్వరమును కలుగజేయును.

జీర్ణదారు:—సం. జీర్ణా, సుపుష్పికా అనియు, హిం. విధారా కాలావిధారా అనియు పేరు. ఇది సముద్రశోషను పోలియుండును. దీని పూవులు ఆకు వృక్షము మొదలైనను పూర్తిగా సముద్రశోషను పోలియుండును. ఇది వృద్ధదారు జీర్ణదారు అని రెండువిధములు. ఇది కఫవాతములు కాస మదము అనువానిని హరించును. బలకరమైనది.

కటుతిక్త కషాయరసములు సర లఘుగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముకలది. కాంతి ధాతుపుష్టి బలము రుచి అగ్నిదీప్తి కలిగించును. సవాయిరోగము పాండువు క్షయ ప్రమేహము వాతరక్తము ఆమవాతము వాతము శోఫ కఫము అనువానినిజయించును.

జీలకర్ర:— సం. అజాజీ, జరక, జీరా అనియు, హిం. సఫేద్ జీరా అనియుపేరు. ఇది చిన్నమొక్క. దీని కొనలయందు గుత్తులు గుత్తులుగపూచి పువ్వుగుత్తులలో గింజలేర్పడును. దీనిని తెల్లజీలకర్ర అందురు. భోజనద్రవ్యములందు తాలింపు దినుసులలో నుపయోగింతురు. ఇది కారము తీపి రుచులు లఘు రూక్ష గుణములు శీతవీర్యము కటువిపాకముగలది. పాచనదీపముల గలుగజేయును. నేత్రములకు హితమైనది. గర్భాశయమును శుద్ధిపరచును. వాంతి క్షయ ఆధ్మానము విషము జ్వరము కుష్ఠు అరోచకము రక్తదోషము అతిసారము క్రిమి పిత్తము గుల్మము అనువానిని హరించును.

జీలకర్రను దోరగావేయించి చూర్ణించి పంచదార తేనెకలిపి నాకిన ఛర్ది, గుండెలలోనొప్పి కట్టును. తలత్రిప్పుతగ్గును. అన్నహితవు కలుగజేయును. జీలకర్రరసము గుంటగలగరాకురసము సమభాగముగ కలిపి త్రాగించిన వరుసజ్వరముకట్టును. జీలకర్రను నిమ్మపండ్ల రసములో భావనజేసి సైంధవలవణముచేర్చి తినుచున్న మేహాదులు తగ్గును. ఎక్కిళ్ళు కడుపునొప్పి అజీర్ణము హరించును. మూత్రముజారీచేయును స్త్రీల ఋతుదోషములను బాగుపరచును. జీలకర్ర రసమున కొద్దిగా పటికిబెల్లముచేర్చి త్రాగించిన స్త్రీలకు స్తన్యము (చనుబాలు) కలిగించును. జీలకర్రఆకును కూరవండుకొని తినిన కఫవాతములను హరించి పిత్తమును హెచ్చించును. జీలకర్రను మంచినీళ్ళతోనూరుబ్బి ఆపిండిని శరీరమునకు నలుగుబెట్టినయెడల పైత్యపుదద్దుర్లు తగ్గును. శిరస్సునకు పూసుకొనిన యెడల చిత్తభ్రమ ఉన్మాదము మున్నగునవిహరించును.



జీవంజీవకము:—ఇదియొక పక్షి. దీనిమాంసము త్రిదోషహరమైనది. తేలికగా జీర్ణమగును. బలము పుష్టి గలిగించును.

జీవకము:—చూ. అష్టవర్గము.

జీవనపంచమూలములు:—పిల్లిపీచర, పెగ్గుమ్ముదు, జీవంతి, జీవకము, ఋషభకము ఈయైదింటివేళ్ళ సముదాయమునకు జీవనపంచమూలములు అని పేరు. అమిత వీర్యవృద్ధి నేత్రప్రసాదము బలము ఆయువు గలుగచేయును. పిత్తవాతములను హరించి శ్లేష్మమును వృద్ధి చేయును.

జున్ను:—ఆవు గేదె మున్నగు జంతువులు ఈనినరోజు మొదలు మూడుదినములవరకు పితికినపాలు ముర్రుపాలకు అనిపేరు. వీనినివండిన గడ్డకట్టును. ఇది తియ్యగానుండును. దేహపుష్టి వీర్యవృద్ధి రక్తపటుత్వము కఫము కడుపునొప్పి అగ్నిమాంద్యము అనువానిని గలుగచేయును. మూత్రము నధికపరచును. శెగరోగపు స్రావమునుకట్టును. మూత్రపుచురుకును మాన్పును. కీళ్ళయందును నరమునందును నొప్పిని బద్ధకమును కలిగించును.

జున్ను:—మొసలియొక్క చేగుకట్టునకు జున్నుఅనిపేరు. ఆదిపచ్చికాన అనియు దీనినివాడుదురు. చేదు రుచి లఘు తీక్షణగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముకలది. వాతవ్యాధి సన్నిపాతము జ్వరము సూతికారోగము మున్నగువానిని హరించును. గర్భిణీస్త్రీలకు వాతము వలన గలిగిన నొప్పులుహరించుటకై 1, 2 గుంజలయెత్తు రెండు తమలపాకులు రెండులవంగములు కలిపి నమిలి మింగునట్లుచేయవలెను. దెబ్బ

లుపాతమువలన గలిగిన నొప్పులకు మొమ్మాయికిబదులుగా దీనిని వాడవచ్చును. వయస్సునుబట్టి నెయ్యిపుగింజలో నాల్గవవంతు మొదలు గుంజెత్తువరకు చనుబాలలో కలిపి పోసినచో చంటిపిల్లల జ్వరము దగ్గు పడిశెము మున్నగునవి కుదురును.

జువ్విచెట్టు:—సం. ప్లక్ష జటీ, పర్కటీ, శృంగీఅనియు హిం. పాఖర్, పిలఖన్‌అనియు పేరు. ఇది పెద్దవృక్షము. మందముగా కొంచము పొడవుగా కొనతేలియుండు ఆకులును తెల్లని మారినను గుండ్రని చిన్నకాయలును కలది. చెట్టునరికిన పాలుకారును, కొమ్మపాతిన బ్రతుకును. జువ్విచెక్క వేరు వగరు కారము రుచులు రూక్షగుణము శీతవీర్యము కటువిపాకముకలది. వ్రణము యోనిరోగము తాపము పిత్త కఫములు శోఫ రక్తపిత్తము మూర్ఛ భ్రమ ప్రలాపము అనువానిని హరించును.

జువ్విపాలను వ్రణములపై పూసిన దారుణమగు రాచపుండుమొదలైనవి మానును, చెక్క కషాయముతో వ్రణములను కడగిన వెంటనే మానుపట్టును. జువ్విచిగుళ్ళను నూరి కుంకుడుకాయంతమాత్ర మ్రింగిన రక్తప్రదరముకట్టును. కఫము మేహము హరించును. జువ్విఆకు విస్తరిలో భోజనముచేసిన మేహశాంతి చలువచేయును. ఆరోగ్యముగనుండును జువ్విపుల్లతో దంతధావనచేసిన దంతబాధలుపోవును. నోటిపూతతగ్గును వాక్కునుశుద్ధిపరచును.

జూకామల్లి:—సం. యూధిక, వాసంతి, బాలపుష్పి అనియు, హిం. జూహీఅనియు పేరు. దీనిపువ్వులు తెల్లగ పరిమళముగ నుండును. దీనిలో పసుపుపచ్చపూవులు పూచునదియు గలదు. [illegible] మనోహరముగ పరిమళముగ నుండును. ఇది మధురకషాయ తిక్త కటురసములు లఘు గుణములు శీతవీర్యము కటువిపాకము గలది. మధుమేహము పిత్త తాపము దప్పి చర్మరోగములు వ్రణము ముఖదంత నేత్ర శిరోరోగములు విషము అనువానినిజయించును. పిత్తమును ఖండించి కఫవాతములను పెంచును



జెముడు:—సం స్నుహీ సమంతదుగ్ధా, సుధా వజ్ర అనియు హిం మనసాగాఖ్, సిజవృక్ష అనియు పేరు. జెముడు చెట్లలో ఆకుజెముడు, పుల్లజెముడు, పలకల జెముడు మున్నగు అనేక భేదములు గలవు. అన్నిటికిని పాలుపూర్తిగా నుండును. ఇంచుమించు సమాన గుణములు కలవి. పుల్లజెముడుకు సన్నని కాడలును అరుదుగ చిన్నఆకును నుండును దీనిపాలు కారము, రుచి, లఘు తీక్ష్ణగుణములు, ఉష్ణవీర్యము, కటువిపాకము కలవి. దారుణవిరేచనము వాంతిచేయును. గుల్మము శ్వాస, కాసలు, శూల, పాండు, నంజు, మున్నగు రోగములను హరించును దీనిపాలు శరీరముమీద పడిన పొక్కి పొంగును. తీరని నొప్పులుగలచోట పాలనుపూసి పసుపు జల్లిన పుండుచేసి నొప్పినిలాగును అనేక కుక్షివ్యాధులకు నాభి చుట్టూ పట్టువేయుదురు. దీనికాడలు కాల్చిన క్షారమును పటికబెల్లము తేనె మొదలగు అనుపానములతో నిచ్చిన కళ్ళెదగ్గు శూల, వాతము హరించును. 1 మొదలు 4 గురివెందగింజలయెత్తువరకు ఇవ్వవచ్చును. వకబొట్టుపాలు పంచదారలో కలిపి యిచ్చిన దారుణవిరేచనము జేయును. మోతాదు ఎక్కువఅయిన చంపును ఇది ఉపవిష వర్గములో చేరినది. దీనినివాడునప్పుడు దోషము వయస్సు బలము వ్యాధి మున్నగు వానిని పరిశీలించి జాగ్రతగా వాడవలెను. బిళ్ళలు అర్శగ్రంధులు మొదలగు వానికి ఈపాలను అంటించి గుడ్డఅంటించి నయుడల పుండుజేసి వానిని హరింపజేయును. ఆకుజెముడు ఆకులను నిప్పుపై మగ్గించి పిండిన రసమున తేనెగలిపి యిచ్చిన దారుణ శ్లేష్మములను కోయును.

1 శేరు (తు॥ 80) జెముడుపాలలో తు॥ 20 ల రసకర్పూరమును చూర్ణించి చేర్చి యొకమట్టి పాత్రలో బోసిచీరకసి వంటచేసే పొయ్యి క్రింద పాతిపెట్టి 4 మాసములుంచి తీసి కుండలోని ద్రవ్యమునుతీసుకొని మెత్తగానూరి కందిగింజలంత మాత్రలు చేసి ప్రాతస్సాయంకాలములందొక్కొక్క మాత్ర యుక్తానుపానములతో సేవించిన దారుణమగు ఉబ్బువ్యాధులు నివర్తించును.

ఆకుజెముడు ఆకుకూర పండుకొని తినిన వేడిచేయును. ఆధ్మానము అష్ఠీలిక, గుల్మము శూల, శోథ, ఉదరము అనురోగములను హరించును.

జొన్నలు:—సం. యావనాల అనియు హిం. జుఆర్ అనియు పేరు. యివి తెలుపు పసుపు యెఱుపు రంగుల భేదముచే మూడురకములు. జొన్నచెట్టు రేవడినేల యందు బాగుగా పైరగును. ఆకులు సన్నముగ పొడవుగ నుండును. చెట్టుసన్నముగా బెత్తమువలె పెరుగును. ముదిరినతర్వాత చివర వెన్నువేసి గుత్తివలెనుండి అందుగింజ లేర్పడును. గింజలు చిన్నవిగ గుండ్రగ వెన్నువేసి గుత్తివలెనుండి అందుగింజ లేర్పడును గింజలు చిన్నవిగ గుండ్రగ నుండును. లేతగింజలను ఊచబియ్యమందురు. ఊచబియ్యమును తినిన తియ్యగనుండును. జొన్నలను పశువులకు వేయుదురు. జొన్న చెట్లను యెండినతర్వాత భద్రపరచుకొని పశువులకు మేతగా నుపయోగింతురు. జొన్నలనుఅన్నమువండుకొని మనుష్యులునుతిందురు.

యెఱ్ఱజొన్నలు వగరు రుచి రూక్ష లఘుగుణములు శీతవీర్యము మధురవిపాకముగలవి. శ్లేష్మపిత్తములను హరించును. ఆయాసము కలుగజేయును. కొద్దిగ వీర్యవృద్ధిని చేయును. తెల్లజొన్నలు వీర్యవృద్ధి బలము కాంతి గలిగించును. ఆలస్యముగ జీర్ణమగును. జఠరదీప్తి లేనివారికి కడుపుబ్బరము నొప్పి గలుగ జేయును. పచ్చజొన్నలు పైత్యమును హెచ్చించును. బలకరముగనుండును.

చెరకుగడలనుండివలె జొన్నకఱ్ఱలనుండి తీసినరసముతో తయారుచేయబడిన బెల్లము తీపుగ ఉప్పగ వగరుగనుండును. కఫవాతములను హరించును. చర్మవ్యాధులను తాపమును పుట్టించును. జఠరాగ్నిని పెంచును.

జ్యోతిష్మతి:—సం. జ్యోతిష్మతి, లగణా, పారావతపదీ, పీతతైల అనియు, హిం. మాల్కంగునీ అనియుపేరు. ఇదియొకతీగ. ఆకులు కొంచెముగుండ్రగ కోలగఉండును. దీనిపచ్చికాయ నల్లగ పండినది పచ్చగనుండును. పండులోనిగింజలు యెఱ్ఱగను గింజలనుండితీసిన తైలము పసుపుపచ్చగను ఉండును. చిన్నజ్యోతిష్మతి పెద్దజ్యోతిష్మతి యని ఆకులయొక్కయు కాయలయొక్కయు చిన్న పెద్ద భేదముచేత రెండువిధములు. జ్యోతిష్మతీలతను మావేరు, మానేరు, ఎక్కుడు. ఉప్పిరింత, మెఱపుతీగ అను పేళ్ళతో వాడుదురు.



ఇది చేదు కొంచెము కారము రుచులు రూక్షగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. వాతకఫములు అగ్నిమాంద్యము వాతము అనువానిని హరించును. తాపము వీర్యవృద్ధి జ్ఞాపకశక్తి కాంతి గలుగజేయును. వమనముచేయును. రెండువిధముల జ్యోతిష్మతికి రసవీర్యాదులు సమానములు.

గింజలనుండి తీసిన తైలమును మర్దనచేయుట వలన మహావాతపునొప్పులు చర్మరోగములు మానును లోపలకుతాగిన విరేచనముచేయును. కుష్ఠము ఉబ్బు క్రిమి మున్నగురోగములు తగ్గును.

టేకుచెట్టు:—సం. ఖరపత్ర, క్రకచపత్రిక, శాకవృక్ష అనియు హిం. సాగోన్, సాగబన్ అనియుపేరు. పెద్దవృక్షము దీనియాకులు వెడల్పుగ గుండ్రగ పెద్దవిగ గరగర లాడునవిగ నుండును. గృహాది నిర్మాణమున కుపయోగపడు అన్ని వృక్షములలోను ఉత్తముగ నెన్నబడును. తెల్లని పూవులు పూచును ఆకు చేతితో నలిపిన చేయి యెఱ్ఱబడును. టేకుచెక్క మధుర కషాయ రసములు, సర రూక్షణ గుణములు, శీతవీర్యము, మధుర విపాకము గలది. రక్తపిత్తము పిత్తతాపము, శ్రమ వాతము, ఆమదోషము, అర్శస్సు, కుష్ఠము, ప్రదరము అనువ్యాధులను హరించును. గర్భమును నిలుపును గర్భదోషములను హరించి సంతాన యోగ్యత కలిగించును. టేకుకఱ్ఱనుండి పాతాళయంత్రమున దీసిన తైలము సకల చర్మవ్యాధులనుహరించును టేకుపూవు కషాయతిక్తరసములు,విశద రూక్ష లఘుగుణములు, శీతవీర్యము, కటువిపాకము గలది. వాత కఫములు, ప్రమేహముహరించును.

డావరడంగి:—సం జీమూత కంటఫలా, గరాగరీ దేవదాలి అనియు హిం. సోనైయా, ఘుఘుక్ బేల్ బిదాలీ, ఘుసరాన్ అనియుపేరు.

దేవదాళి యనునది చిన్నక్షుపము కొండ భూములందు విశేషముగ దొరకును. కాయలు ఆముదపు కాయలంత యుండును. ఆముదపు కాయవలెనే గరగరలాడు ముండ్లుండును. ఆకులు కొంచెము పొడవుగ కంగోరా గలిగి యుండును. పిచ్చికుసుమను పోలియుండును. తెలుపు మెరుపు పసుపు పూవుల భేదముచే నిదిమూడు విధములు. పూవులు చిన్న తుత్తాయి పూవులవలెనుండును. పూవులపైన చిన్నచిన్న ముండ్లుండును. ఇది చేదురుచి తీక్ష్ణగుణము ఉష్ణవీర్యము, కటువిపాకము గలది. గుదరోగము, శోఫ కామిల, కఫము, జ్వరము, కాస అరుచి శ్వాస హిధ్మ పాండు, క్షయ, కృమి, హిక్క, విషము భూతబాధ మున్నగు రోగములను హరించును. దేవరడంగి కాయ రసమును నస్యము చేయించిన నెడల నంజురోగము తగ్గును.

తంగేడు చెట్టు:— సం. తలపోట అందురు. ఇదిక్షుపము గుబురుగా పెరుగును దీనిచెక్కతో తోళ్ళు బాగుచేయుదురు. పచ్చనిపూల బూచును. కాయవంకరగ బద్దవలె నుండును. ఆకు చింతాకు కన్న రెట్టింపు పెద్దదిగ నుండును.

చెక్కరసము వగరుగ నుండును. పంచదార చేర్చి త్రాగిన మేహ రోగములు, ప్రదరము రక్తపిత్తము తగ్గును. ప్రత్యేకముగ చెక్కరసమును త్రాగిన రక్తగ్రహణి నీళ్ళవిరేచనములు కట్టును.

తంగేడు చిగుళ్ళను నేతితో వెచ్చజేసి కన్నులకు గట్టిన మెరుపుపోటు తగ్గును శిరస్సునకుగట్టిన వేడివలన గలిగిన తలపోటు నొప్పినశించును. నేత్రములకు చలువ నిచ్చును. ఒడదెబ్బ తగులనీయదు తంగేడు చిగురు మిర్యాలుసమముగ కలిపి నూరి కుంకుడు కాయంత మాత్రను త్రాగిన నీళ్ళవిరేచనము అతిసారము హరించును.

తంగేడు విత్తులను చూర్ణించి పాలతో ఉడికించి పంచదార కలిపి ఉదయమునందు పుచ్చుకొనిన శుక్లనష్టము సెగరోగము శీఘ్రస్ఖలనము మున్నగునవి మానును. అతిమూత్రము కట్టును.



తంగేడు జిగురు వగరురుచికలది. నల్లమందుతో సమముగచేర్చి మాత్రలుచేసి సేవించిన రక్తగ్రహణి జిగట విరేచనములు కట్టును. ప్రత్యేకముగ జిగురును పాలలో నానబెట్టి త్రాగిన మధుమేహము అతిమూత్రము తగ్గును.

తంగేడుపూవు కషాయమున పంచదార చేర్చి త్రాగిన మూత్రబద్ధమును విప్పును. సెగరోగముమానును. మేహదారుణము నశించును. పచ్చిపూవులరసమును పంచదారలో పోసి పాకముపట్టి ప్రతిదినము ఉపయోగించిన శోష తాపము పొడిదగ్గు నిక్కాకతగ్గును బలముచేయును. వీర్యముగట్టిపడును. విరేచనబద్ధముజేయును ఎండించిన పూవులను పటికిబెల్లపుపొడిలోవేసి తేనెబోసి యుంచిన మురబ్బాఅగును. మురబ్బాను ప్రతిదినము భోజనమైనవెంటనే ఒకతులము తినుచున్న అమితవీర్యవృద్ధియగును. అతిమూత్రము నయమగును. సెగరోగము జీర్ణించియున్నవారలకు మిగుల పథ్యముగనుండును.

తంటెపుచెట్టు:—సం. చక్రమర్ద, ప్రపున్నాడ, దద్రుఘ్న అనియు, హిం. పవాడ్, చకవడ్. పమాడ్ అనియు పేరు ఇదిక్షుపము. ఆకు కొంచెము గుండ్రగ కోలగ కొనదేరియుండును. పసుపుపచ్చపూవులుపూచును. కాయలు కొద్దిగ వంకరగ పలచగ పొడవుగ సన్నముగ ఉండును. చెట్టునకు వెగటువాసనయుండును. ఆకుయొక్క పెద్ద చిన్న భేదములచే రెండువిధములు. దీనికి తగిరిశ చెట్టనియు పేరు.

తీపి చేదు కారము రుచులు రూక్ష లఘుగుణములు శీతవీర్యము కటువిపాకముకలది. వాత పిత్త కఫములు శ్వాసకాసలు కుష్ఠు దద్రు కృమి శిరోరోగము వ్రణము మేదస్సు తామర అరుచి జ్వరము మేహము అనువ్యాధులను హరించును.

తెలతంటెపు ఆకులను ఆముదముతో వెచ్చజేసి కన్నులకుగట్టిన నేత్రరోగములు హరించును. వేరును నిమ్మపండ్ల రసములో అరగదీసి పూసిన గజ్జి చీడ తామర కుష్ఠు మొదలగు చర్మరోగములు నశించును. ఆకురసమందు పాదరసముంచి వండిన రసము బద్ధమగును. సమూల

కషాయమునందు సుగంధిచూర్ణమును చేర్చి త్రాగిన కుష్ఠము నశించును. శ్వాసకాసలుతగ్గును. ఆకును ఆవిరిమీద ఉడికించి వ్రణములకు గట్టిన మొండివ్రణములు మానును పురుగులు చచ్చును. ఆకును ఆముదముతో వెచ్చజేసి కాపడము పెట్టిన మేహవాత ఆమవాతపు నొప్పులు నయమగును.

తింటెపవిత్తనములు కారము రుచి లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలవి. చూర్ణము లేక కషాయముచేసి సేవించిన కుష్ఠము శ్వాసకాసలు సవాయిరోగములు కృములు మున్నగువ్యాధులు తగ్గును. శరీరమునకు నలుగుపెట్టిన దేహకాంతినిచ్చును. నీరుగారు వ్రణములపై చూర్ణమునుచల్లిన వ్రణములు ఆరిపోవును. మరియు చూర్ణమును యుక్తమగు అనుపానములతో సేవించిన కఫము దద్రు తామర మేహము నంజు గుల్మము వాతరక్తము మొదలగువ్యాధులు కుదురును.

తంటెపుఆకుల కూర కారము చేదు రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము అమ్లవిపాకముగలది. పిత్తమును పెంచును. సులభముగ జీర్ణమగును. కఫవాతములు దద్దుర్లు కుష్ఠము తామర దురద శ్వాసకాసలు నశించును.

తక్కలిచెట్టు:——సం. అగ్నిమంథ, జయ, జయంతి అనియు, హిం. అరణీ, అగేథు, గణివారి అనియుపేరు. యిది పెద్దచెట్టు. దీనిలో చిన్నతక్కలికూడ గలదు. యిదిగుల్మము. చిన్నతక్కలిని చిరినెల్లి యనియు, పెద్దతక్కలిని నెల్లియనియు వాడుదురు. తక్కలియాకు వెగటు వాసన గలిగి మందముగానుండును. చిరినెల్లియాకు కూర వండుకొని తిందురు నెల్లి గుణపంచమూలములలో చేరినది చిరినెల్లి ఆకునెల్లియాకువలె మిగుల మందముగనుండదు. రెంటికి వాసన సమానము

నెల్లివేరుపక్క కారము చేదు రుచులు సరగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. వాతము. పాండు, శోథ. కఫము అగ్నిమాంద్యము, అర్శస్సు, మలబద్ధము, ఆమదోషము, జలుబు, విషము, మేహరోగము అనువానిని జయించును. వేరును దొండాకుపసరుతో నూరి



పూసిన సర్పి మొదలగు పుండ్లుమానును. రసమునుపూసిన మేహవాతపు నొప్పులు తగ్గును.

చిరినెల్లికిని నెల్లిగుణాదులు కలవు. గాని చిరినెల్లి విశేషముగ లేపనయోగములందును కట్లుకట్టుట యందును శోథయందును ఉపయోగ పడును.

తక్కోలాలు:— సం. తక్కోల, కోశఫల, కోలక అందురు. తక్కోలపు పుట్లు అనియు వీనినివాడుదురు చిన్నవిగ నల్లగ పరిమళముగనుండును ఇవియొకదినుసుగింజలు.

చేమ కారము రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలవి. అర్శస్సు మూత్రకృచ్ఛ్ర మూత్రాఘాతము వాతబలాసకరోగములు ముఖరోగములు శ్లేష్మము అనురోగములను జయించును. రుచిబుట్టించును. జఠరదీప్తినిచ్చును.

తగరము:—సం. వంగ రంగ, స్వర్ణజ అనియు, హి. రాంగ, కలయీ, వంగ్ అనియుపేరు. ఇదియొకలోహము. తెల్లగనుండును. ఖురకము మిశ్రకము అని తగరము రెండువిధములు. ఖురకము మంచిది. వంగము చేదు రుచి రూక్షగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. కొలదిగ వాతమును ప్రకోపింప చేయును. మేహము శ్లేష్మము మేదస్సు కృమి పాండు నేత్రవ్యాధులు శ్వాస మున్నగురోగములను జయించును. మేహవ్యాధులకిది అమోఘమైనది. పుష్టినిచ్చును. కాస శ్వాస అగ్నిమాంద్యము పీనస విషమజ్వరము ప్రమేహము పాండువు అనువ్యాధులందు వంగభస్మము విశేషించి గుణదాయకముగ నుండును.

అపరిశుద్ధమైన వంగమును సేవించిన కుష్ఠు గుల్మము మేహము పాండు అపచి వాతరక్తము అనువ్యాధులుపుట్టును. గాన వంగమునుశుద్ధిచేయక భస్మముచేయక నుపయోగింపరాదు.

పసుపుకలిపిన వావిలియాకు రసమునందు మూడుసారులు కరిగించిన వంగమును పోసినయెడల పరిశుద్ధమగును లేక పులిమజ్జిగ గలిసేరు

విషముష్టి చేదుపొగ అనువాని రసములందు కరిగిన వంగమును బోసిన శుద్ధమగును.

శ్లేష్మపాలతో నూరిన తాళకమును శుద్ధిజేసిన వంగపు రేకులకు పట్టించి చింత రావి బెరళ్ళబూడిదలో పెట్టిపుటము వేసి స్వాంగశీతలమున దీసి అందు పేలాలవలె పొంగియున్న వంగమును గ్రహించి నూరి వస్త్రగాలితముచేసి రసాయనములంజేర్చి వాడుకొనవలెను. ఇదిభస్మ ప్రక్రియ.

శోధిత శుద్ధవంగమును చింతాకులవలె సాగగొట్టి కత్తిరించి తంగేడు ఆకులోగాని వేపఆకులోగాని వాములోగాని పెట్టి పుటమువేసిన భస్మమగును. ఇట్లు శోధనమారణములనుచేసిన వంగమును అడ్డిగెత్తుచొ॥ వెన్న సుగంధిచూర్ణము చాతుర్జాతకచూర్ణము కన్యకోమలి చూర్ణము మున్నగు అనుపానములతో నిచ్చిన సెగరోగము అతిమూత్రము మున్నగు మేహరోగములు నశించును. శుక్లనష్టముకట్టును. ఉష్ణము తగ్గును. ఇంద్రియపుష్టి వీర్యవృద్ధి కలుగును. వంగభస్మమును 21 దినములకన్న నెక్కువ కాలము ఒకపర్యాయముగ సేవించరాదని వృద్ధ వైద్యులుపదేశింతురు.

వంగ భస్మము కాంతభస్మము కృష్ణాభ్రకభస్మము అను మూటిని సమముగ గ్రహించి ఉమ్మెత్తాకురసము వేపాకుకషాయము దానిమ్మపండ్లరసము బ్రహ్మమేడిరసము అనువానితో ప్రత్యేకము నొకదినము నూరి పై యౌషధమునకు సమము రాజావర్తభస్మమును చేర్చి గోమూత్ర శిలాజిత్తు రసముతో మర్దించవలెను. పిదప మహాసాక్షిని నీళ్ళ వేసి కాచి కరిగించి యానీళ్ళతో 8 దినములు మర్దించి యెండించి యాచూర్ణమునకు సమముగ వేగిసబంకను విషముష్టివిత్తుల చూర్ణమును చేర్చి బలానుసారము ఆవుమజ్జిగ పసుపురసము అనువానిలోగలిపి త్రాగవలెను. దీనిని సేవించుటచే వింశతిమేహములును నశించును. మోతాదు 1 మొదలు 4 వల్లములయెత్తు. ఇదియ వంగరసాయనమనబడును. వంగరసాయనము సేవించు వారలకు శాలిధాన్యము, పెసరపప్పు, వెన్న, నూనె పొట్లకాయ, చేదుదొండ మజ్జిగ అను వస్తువులు ఆ



హారముగ నుపయోగింప నర్హములుగనుండును.

రసగంధకములు నవాసాగరము వంగము అను నాల్గువస్తువులను సమభాగముగ గ్రహించి మెత్తగానూరి యొక మట్టిపాత్రలోపోసి పైన నొకపాత్ర బోర్లించి పైమూతయొక్క మధ్య చిన్నరంధ్రముచేసి సంధిబంధముగావించి క్రమముగ అగ్నిని ప్రజ్వరిల్ల చేయుచు నాల్గుజాములు వండిన అందుండు వంగము సువర్ణముయొక్క ఆకారము గలిగి తేలికగ నుండును. ఇదియ స్వర్ణవంగమనబడును

దీనిని అడ్డిగెత్తుచొ॥ యుక్తమగు అనుపానములతో, సేవించిన జీర్ణించిన సెగసవాయిలు మచ్చలు దద్దుర్లు మున్నగు చర్మరోగములు మానును.

తడచెట్టు:— సం. ధవన, పిశాచవృక్ష, శకట అనియు, హిం ధోం, ధామిన్ అనియుపేరు. ఇది పెద్దవృక్షము. దీనికర్రజిగిగలిగి సాపుగానుండును. మంచపుపట్టెలకును, కావడిబద్దలకును, రోలు, రోకళ్ళు చేయుటకును ఉపయోగింతురు. అడవులలో పెరుగును. ఆకులు అమ్రిదుఆకులవలె నుండును. మాను తెల్లగనుండును. చిన్నచిన్న కాయలుకాచును.

దీనిచెక్క కారము వగరు రుచులు లఘు సరగుణములు శీతవీర్యము కటువిపాకముగలది. కఫవాతములను హరించి పిత్తమునుపెంచును. పాండుప్రమేహము అను రోగముల నణచును. రుచినిబుట్టించును. జఠరదీప్తినిచ్చును.

తడపండు తీపి వగరు రుచులు రూక్షగుణము శీతవీర్యము మధుర విపాకముగలది. కఫ పిత్తములనుహరించి వాతమునుహెచ్చించును. మలబద్ధము గలుగజేయును.

తమలపాకులు:— సం. నాగవల్లి, తాంబూలీ, దినాక్షీస్తా అనియు, హిం. నాగరబేల్, పాన్ అనియుపేరు. తమలపాకు తీగెసన్నముగ పాకును. దీనికి నీళ్ళవడియు చల్లదనమును ఆవశ్యముగనుండవలెను.

తమలపాకులు కొంచెము గుండ్రగ కోలగ కొనదేలియుండును. తమలపాకుతీగ నరికిపాతిన బ్రదుకును.

కారము చేదు వగరు ఉప్పన రుచులు లఘు సర తీక్ష్ణ విశదగుణములు ఉష్ణవీర్యము కటువిపాకము గలది. ముఖదుర్గంధము శ్లేష్మము వాతము శ్రమ క్రిమి దుఃఖము అనువానినిహరించును. దీపనపాచనములు సంతోషము ధైర్యము ఉత్సాహము చురుకు కామోద్దీపనము మొదలగువానిం గలిగించును. ముఖమునకు భూషణమైనది. దంతమాలిన్యము దంతముల తీపు రసపుపుండ్లు హరించును. నాలుక బెరడుకట్టును. పోకచెక్క సున్నముతోచేర్చి తినిన తాంబూలపు తమ్మని గుడ్డలోవేసి చెవిలో రసమును పిండిన చెవిలోపుట్టు పుండు నయమగును. తమలపాకులను నిప్పులపై మగ్గించి రసముపిండి తేనెజేర్చి యిచ్చిన శ్లేష్మము దగ్గు నశించును. చంటిబిడ్డలజలుబు దగ్గులుహరించును. చంటిబిడ్డలకిచ్చునప్పుడు చనుబాలనుచేర్చి యివ్వవచ్చును. తమలపాకులకు ఆముదముపూసి వెచ్చజేసి కడుపుపై ఒత్తుగవేసిన బిడ్డల కడుపునొప్పి ఉబ్బరముతగ్గును విరేచనబద్ధమును విప్పును. పండిన తమలపాకుల రసము మిక్కిలి లఘువుగనుండును. కఫవాతములు మందాగ్ని గొంతునొప్పి స్వరభంగము మున్నగువానిని హరించును. తమలపాకు తొడిమల రసమును కండ్లలో ఉదయముపూటలమాత్రము పిండుచున్న నేత్రరోగములుమానును. తాంబూలపు తమ్మరసమును వెచ్చగా నుండగనే పూతబూసిన సర్పి మున్నగు చర్మరోగములు తలయందు పుట్టు సన్నని తెల్లని పొక్కులు మానును. తమలపాకురసముతో నల్లమందును అరగదీసి కంటిచుట్టు పట్టువేసిన కన్నునుంట పోటు వాపు మున్నగు వాతజనిత నేత్రరోగములు మానును.

జాజికాయ లవంగము పచ్చకర్పూరము తక్కోలము పోకచెక్క అనువస్తువులతోడ లేత తమలపాకులను నోటియందు ధరించిన రుచి నైర్మల్యము సుగంధము ఉత్సాహము చురుకుతనము కామోద్రేకము కలుగును. నిదురనుండి లేచినవాడు, భుజించినవాడు, శ్రమజెందినవాడు



వమన శోధన జేసికొన్నవాడు పీరు కాచు సున్నముతో గూడిన తమలపాకులు మూడును ఒకవక్కయు కలిపి భుజించుట హితకరము. గాయము పిత్తరక్తము రూక్ష నేత్రరోగము విషము మూర్ఛ మదము క్షయ అను వ్యాధులుకలవారు తాంబూలమును తినకూడదు.

తమలపాకు తీగవేరు మిరియము కలిపి నమిలి బుగ్గనుంచుకొని రసమును మింగుచున్నయెడల అమితముగ మాటలాడుటవలన గలిగిన స్వరభంగము బాగగును. గొంతునొప్పి తీయును. పచ్చి తమలపాకులు పిత్తమును హెచ్చించును గాన వానిని ఉపయోగించరాదు.

తమలపాకులు రస బంధన విద్యయందును వాద విద్యయందును మిగుల నుపయుక్తము.

తమాలవృక్షము:—చూ. చీకటిచెట్టు.

తరవాణి:—గంజి, నీళ్ళు, కలిపి యొకకుండలో బోసి కందిగింజలను గుడ్డలోగట్టి చిన్నమూటనందుంచిన 3 రో॥ లకుచక్కగాపులియును ఇదియె తరవాణియనబడును. ఇది కొద్దికారము పులుపు రుచులుగలిగియుండును. దప్పి, తాపము, యెండదెబ్బ అనువానిని హరించును. బలము, కాంతి, మేహశాంతి గలుగ జేయును. మూత్రమును వృద్ధిపరచును.

తరవాణిలో ఊరబెట్టిన యన్నమును దినిన అమిత బలము మేహశాంతి చేయును. మత్తును గలిగించును. ఆరోగ్యకరముగ నుండును.

తరవాణిని కాచి పోగిచి త్రాగిన మిక్కిలి వేడిచేయును. జఠరదీప్తి నిచ్చును. వాత తత్వము గలవారికి శూలనొప్పి పుట్టించును.

తరుబూజాపండు: చూ. కరుబూజా పండు.

తవక్షీరి:—సం. వంశరోచన, తుగాక్షీరి, వైణవి యనియు హిం. వంశలోచన్ అనియు పేరు. వెదురు బొంగులను చీల్చినపుడు తెల్లని పలుకులు కొన్నిటిలో బయలు దేరును. దానికే తవక్షీరి యనిపేరు.

ఇది మధుర కషాయ రసములు రూక్షగుణము. శీతవీర్యము, మధుర విపాకముగలది. ధాతువృద్ధి మలబద్ధము గలిగించును. దప్పి, జ్వరము, శ్వాస, కాసలు, క్షయ, పిత్తరక్తము. కామిల కుష్ఠు వ్రణాలు,

పాండువు, మూత్రకృచ్ఛ్ర అరుచి, తాపము, వాతము అను వానినిఁ జయించును తవక్షీరి చూర్ణమును వెన్నతోఁ కలిపి రాచిన నోటిపూత తగ్గును. పంచదారఁ జేర్చి యిచ్చిన పొడిదగ్గు నశించును. వంగ భస్మముతోఁ జేర్చి యిచ్చిన శుక్లనష్టము కట్టును. మద్రిపండ్ల రసముతో యిచ్చిన తెల్లకుసుమ నివారించును. కొండపిండి వేళ్ళ రసముతో తినిన మూత్రకృచ్ఛ్ర నయమగును. కొబ్బరికాయ నీళ్ళతో యిచ్చిన ముఖశోష అమితమగు దప్పితగ్గును. గసగసాల రసముతో యిచ్చిన జిగట విరేచనములు కట్టును. సోపురసముతో యిచ్చిన వెక్కిళ్ళు తగ్గును. మద్రిపాలతో కలిపి కురుపులకు పూసిన మానుపట్టును. జీలకర్ర రసముతో యిచ్చిన తలత్రిప్పు కండ్లు పచ్చబడుట మున్నగు పిత్తవికారములుమానును రత్నాపురిగుగ్గిలముతో చేర్చి, తినిన మొండి వ్రణములు మానుపట్టును.
తవక్షీరిని దాలతోను గోధుమ పిండితోను యింకను మరికొన్ని వస్తువులతోను గూడ తయారు చేయుదురు. ఇదియు వంశలోచన వలెనేయుండును. గాని అంత తెల్లగా నుండదు. దీనికి సంస్కృతమున తవాక్షీర పయఃక్షీర, యవజ, గోధూమజ, పిష్టిక అనియు హిం. తవాఖీర్ అనియు. నామములు.

ఇదిమధుర రసము లఘుగుణము, శీతవీర్యము, మధుర విపాకముకలది. తాపము పిత్తము, క్షయ. శ్వాస, కాసలు, కఫము, రక్తదోషము అరుచి, జ్వరము దప్పి, కామిల, పాండు కుష్ఠు మున్నగు రోగములను హరించును. ధాతుపుష్టి బలము వీర్యము కాంతి గలిగించును.

తాంబేలు:—సం. కూర్మ, కమఠ, కచ్ఛప అందురు. దీని మాంసము మధురరసము, గురు స్నిగ్ధ గుణములు, శీతవీర్యము మధుర విపాకము గలది.

ఆయువు బుద్ధిబలము ధాతుపుష్టి వీర్యము కాంతి గలుగ జేయును. పిత్తమునుహరించి వాతకఫములను పెంచును. సంభోగశక్తి నిచ్చును. తాంబేలు చేసుకట్టె అజీర్ణమును అజీర్ణవిరేచనములను కలరావ్యాధిని హరించును చంటిబిడ్డలకు పోసిన జలుబు దగ్గు జ్వరముహరించును.



శరీరమునకు వేడి పుట్టించును. తాంబేలు గ్రుడ్లలోని మాంసమును తినిన పురాణ కాసరోగములు నివర్తించును. తాంబేలు చిప్పలోనిసీరు అన్నము తినిన త్రిదోషములను పెంచును.

తాచుపాము మాంసము:—సం. వ్యాళ, భుజంగ, అహి. అందురు. తాచుపాము మాంసము చమురు కలదిగ నుండును. నేత్రములకు హితమైనది. పుష్టినిచ్చును. గురుత్వము కలది. కన్నులందుపుసి. విషము క్రిమి, నశింపచేయును. బుద్ధిబలము అగ్నిదీప్తి బలము గలిగించును.

తాటిచెట్టు: సం. తాళ, దీర్ఘస్కంధ, ధ్వజద్రుమ, లేఖ్యపత్ర అనియు పేరు. మానునల్లగ కర్కశముగ నుండును. 10 గజముల యెత్తువరకు పెరుగును. దీనిని నిలువుగకోసియు కోయకయు యిండ్లకు వాసములు దూలములుగా నుపయోగింతురు. తాటియాకులను చక్కగ పుస్తకమువలె సంపుటిజేసి గంటముతో గ్రంథములనువ్రాయుదురు. దీనిపండ్లు యెరుపు నలుపు రంగులుకలిగి తీయగనుండును. లేత తాటికాయలకు ముంజికాయలని పేరు. లేతకాయలను తలవద్దనరికి లోనుండు గుంజు నీళ్ళు తిందురు. తీయగ నుండును. తాటిచెట్లనుండి కల్లుదీయుదురు. తాలవృక్షములలో శ్రీతాళము, తాళము, హిం తాలము అని మూడు విధములు కలవు, తాటిచెట్లలో మగతాడి, ఆడుతాడియని భేదములుకలవు. మగతాడికి కాయలుండవు. ఆడుతాడి కాయలు కాచును. హింతాళమునకు గిలక తాడియని పేరు.

తాటిచెట్టు సామాన్యముగ తీపి, రుచి గురుగుణము, శీతవీర్యము, మధుర విపాకముగలది. పుష్టి, మత్తు, కఫము, శుక్రము. బలము కొవ్వు గలిగించును. తాపము, శోష విషము శ్రమ, కుష్టు క్రిమి రక్తదోషము. వాతము అనువానిం జయించును.

ముంజికాయ లోనినీరు తీపిరుచి. స్నిగ్ధ గురుగుణములు, శీతవీర్యము, మధుర విపాకము గలది. మలబద్ధము, బలము, తృప్తి ధాతుపుష్టి మాంసపుష్టి, కఫము వీనిని పుట్టించును. వాతము, శ్వాస. రక్తపిత్తము వ్రణము తాపము క్షతక్షయ, పిత్తక్షయ, రక్తదోషము అను వానిని

నశింపజేయును. మూత్రమును వృద్ధిపరచును. మూత్రపుచురుకు కట్టును. సెగరోగులకు హితమైనది,

దోరగపండిన తాటిపండు వాతమును హరించును. పుష్టి వీర్యవృద్ధి బలము గలిగించును. కృమి కుష్టు రక్తపిత్తము హరించును.

బాగుగపండినది పిత్తరక్తమును శ్లేష్మమును పెంచును. ఆలస్యముగ జీర్ణమగును. అతిమూత్రము తంద్ర అభిష్యందము శుక్రము అను వానిని పుట్టించును.

లేతముంజి అనగా కలబందగుజ్జువలె నుండు భాగము చలువజేయును. మూత్రమునధికపరచును. కఫమును పెంచును. వాతపిత్తములను హరించును. తీపి రుచి మధురవిపాకము గలిగియుండును.

తాటిచాప అనగా తాటిపండ్లగుజ్జును చాపలకు పూసి యెండింతురు. దానిని తాటిచాపఅందురు. వాతశ్లేష్మములు శుక్రము గలిగించును. అజీర్ణము కడుపుబ్బరము గల్గించును. జఠరమును చంపును. జబ్బు చేయును.

తాటిమొవ్వులోని నీరు అతిసార విరేచనముల గట్టును. మేహమునణచును. పిత్తవాతములను హరించును. జలుబు దగ్గుకలిగించును.

లేతతాటిచెట్టుమొవ్వ తెల్లగ తీయగ వగరుగనుండును. ధాతువృద్ధి వస్తి (మూత్రపుసంచి) శుద్ధినిచేయును. వాతపిత్తములను హరించును

తాటియాకు విసనికఱ్ఱతో విసరుకొనిన త్రిదోషములు శమించును. తాటివేళ్ళరసమును త్రాగిన రక్తపిత్తము తగ్గును.

తాటితేగలు అనగా చెట్టు మొలచుటకు పూర్వము తాటిటెంక నుండి క్రిందికిదిగినవేరును కాల్చితినిన త్రిదోషములు ప్రకోపించును. గురుత్వముచేయును. డోకులుపుట్టించును. మలమూత్రబంధమును బలమును గలిగించును.

తాటిపూవురసమును త్రాగిన రక్తప్రదరము తెల్లకుసుమ అతిసారముకట్టును. విరేచనబద్ధముచేయును.



తాటిగులకలను కాల్చిన బూడిదను క్షారపాకవిధానమున గాచి చేసినక్షారమును తాటిబెల్లములోపొదిగి తినిన శూల కడుపుబ్బరము అజీర్ణము త్రేపులు తగ్గును. ఆముదములోకలిపి పుండ్లమీదబెట్టిన వ్రణమే రంధ్రమువేయును. నీళ్ళలోకలిపి త్రాగిన గొంతుకలో గురగురలాడుట కఫము గొంతుకచుట్టుకొనియుండుట తగ్గును.

తాటికల్లు తియ్యగనున్నపుడు త్రాగిన మత్తు చేయును. పుష్టి బలము కాంతి ఉత్సాహము చురుకుదనము తృప్తి గలిగించును. దప్పినణచును. ఆయాసమునుపోగొట్టును. కఫవాతములనుహరించును. ఆకలి బుట్టించును. మూత్రమునుజారీచేయును. మూత్రపుమంట చురుకు గట్టును. పులిసినకల్లు త్రాగిన తలదిమ్ము అమితపిత్తము మత్తు కాక బుద్ధిమాంద్యము వాతము గలుగజేయును. పోతుతాటికల్లు శ్రేష్టమైనది జీర్ణించిన సెగరోగముగలవారు పోతుతాటికల్లును సూర్యోదయమునకు పూర్వమే తీయగనుండునపుడు 5 మొదలు 10 తులముల యెత్తువరకు త్రాగిన నిశ్శేషారోగ్యము నిచ్చును. నిస్త్రాణ నణచును. ఆడుతాటికల్లు వాతశ్లేష్మములను పెంచును. అపథ్యమైనది. గీత మొదలుపెట్టిన 15 దినములవరకు కల్లుత్రాగకూడదు. త్రాగిన జలుబు దగ్గు పీనస తలత్రిప్పు శ్లేష్మము మున్నగువ్యాధులను కలిగించును. అమితముగ నెట్టి కల్లునైనను త్రాగిన బుద్ధిమాంద్యమును చిత్తభ్రమను గల్గించి అనేక వ్యాధులను బుట్టించును.

శ్రీతాళమునకు సంస్కృతమున శ్రీతాళ మధుతాళ లక్ష్మీతాళ యనిపేరు. ఇది మిక్కిలి మధురముగ కొంచెము వగరుగనుండును. పిత్తమునుహరించును. కఫమునుపెంచును. వాతమునుగూడ కొలదిగ వృద్ధిచేయును.

గిలకతాడికి సంస్కృతమున హింతాల, స్థూలతాళ, వల్కపత్ర, బృహద్దళయని పేరు. తీపి పులుపు రుచులు శీతవీర్యము కలది కఫమును పెంచును. పిత్తతాపము శ్రమ దప్పి వాతదోషము అను వానిని హరించును.

తానిచెట్టు:—సం. అక్ష, కలిద్రుమ, విభీతక, కర్షఫల అనియు హిం. బహేడా అనియుపేరు. ఇది పెద్దవృక్షము. అరణ్యములందు పెరుగును. దీనియాకులు జీడిమామిడిఆకులవలె ఉండును. మిక్కిలి సూక్ష్మమైన పూవులుపూచును. కాయలు గుండ్రగ తొడిమవద్ద కొంచెము కోలగ యెండినపుడు బూడిదచరచినట్లు ఒకమాదిరి బూజుపట్టినట్లుగ ఉండును. యీకాయపై పట్టయే ఔషధములందు వాడుదురు. ఇది త్రిఫలములలోనిది.

తానికాయ వగరు రుచి రూక్ష లఘు సరగుణములు ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. కఫపిత్తములు కాస నేత్రరోగములు కృమి స్వరభంగము నాసారోగము రక్తదోషము కుష్ఠము అనురోగములను హరించును. వెంట్రుకలను నలుపుగ పెరుగజేయును. తానికాయ ప్రత్యేకముగకంటె కరక యుసిరికలతో చేర్చి వాడుట విశేషముగ ఉండును. తానికాయలోని పప్పును నీళ్ళతో అరగదీసి గంధమును కంటిలో పెట్టిన కండ్లపోట నీరుగారుట మరద యెరుపు మొదలగునవి తగ్గును మరియు నేత్రరోగములందు అనేకవిధముల ఉపయోగపడును. పై గంధమును క్రొరుకు సవాయిపుండ్లకురాచిన నవి మాడిపోవును. తానిపండు గుంజు దప్పి ఛర్ది కఫవాతములు వీనిని నశింప చేయును. మత్తెక్కించును. ఒకకరక్కాయ రెండు తానికాయలు నాలుగు ఉశిరిగ కాయలు కలసిన మొత్తమునకు త్రిఫలాఅనిపేరు. త్రిఫలములు రసాయనములందు శ్రేష్ఠములు. నేత్రరోగములను హరించును. వ్రణములను మాన్పును. కుష్టు మున్నగు చర్మరోగములయొక్కయు వ్రణముల యొక్కయు సారివమును కట్టును. మేదస్సు, కఫము, ప్రమేహము, రక్తదోషము అనువానిని శమింపచేయును.

తానికాయలనుండి తీసినతైలము మధురముగ శీతలముగ యుండును. వెంట్రుకలకు హితకరమైనది. గురుత్వము గలది. వాతపిత్తములను హరించును.



తామరతీగ:—సం. పద్మినీ, నలినీ, కమలిని అనియు, హిం. కమల్ అనియుపేరు. చెరువులలో నుండుతీగ దీనిఆకులు వెడల్పుగ గుండ్రగ స్వచ్ఛముగ నుండును. అడుగు పైపున నల్లగను పైనతెల్లగను ఉండును లేతయాకులు యెరుపు వాకుగ నుండును. తామరఆకులలో భోజనము చేయుదురు. తెలుపు, యెరుపు నలుపు, పూవుల భేదముచేత తామరతీగ మూడువిధములు. తామరతీగ ప్రసిద్ధమైనదిగాన స్వరూపవర్ణన మనవసరము.

సాధారణముగా తామరతీగలు మూడును తీపి, చేదు, వగరు, రుచులు, శీతవీర్యము, గురుగుణము, కటువిపాకము గలవి. పిత్తము, కృమి, శోష, ఛర్ది, అతిసారము, తాపము అనువానిని జయించును.

మతాంతరమున తీపి, ఉప్పురుచులు గలదియని చెప్పబడెను. తామరతీగను నూరి స్తనములకు గట్టిన స్తనములుగట్టిపడును. తామరతీగపై పరుండిన అమితమగు తాపము శోష నశించును తామరపూవు నాళము (కాడ) రసమును త్రాగిన మూత్రకృచ్ఛ్ర శమించును. పచ్చి తామరాకులో భోజనము చేసిన అనారోగ్య కరముగను యెండిన ఆకులో భోజనము ఆరోగ్య కరముగను ఉండును.

లేత తామరాకునకు సంవర్తిక యనియు. తామర పూవులో మధ్యనుండు మిద్దెకు కర్ణికయనియు మిద్దెకు చుట్టునుండు దారములవంటి కింజల్కములకు కేసరము లనియు తామర పూవులోని రసమునకు మకరంధమని పేరు.

సంవర్తిక తిక్తకషాయ రసములు లఘు గుణము, శీతవీర్యము, కటువిపాకము కలది. తాపము, దప్పి, మూత్రకృచ్ఛ్ర, గుదరోగము. రక్తపిత్తము అనువానిని జయించును

కర్ణిక తిక్తకషాయ, మధుర రసములు. లఘుగుణము, కటువిపాకము కలది. ముఖమందు విశదత్వమును కలిగించును. -దప్పి, రక్తపిత్తము, కఫపిత్తములు, అనువానిని హరించును.

కేసరములు మధుర కషాయ కటురసములు రూక్షగుణము, శీతవీర్యము, కటువిపాకముగలది. చలువ వీర్యవృద్ధి మలబద్ధము గలుగజేయును కఫపిత్తములు దప్పి తాపము రక్తార్శస్సు విషము శోధహరించును. రుచిబుట్టించును. స్త్రీలకు గర్భము నిలుపును. వ్రణములు హరింప చేయును. క్షయ, శోష, జ్వరము, వాతము అనువానిం గూడజయించును.

తామర గింజలకు సంస్కృతమున పద్మబీజ, పద్మాక్ష, గాలోడ్య పద్మ కర్కటీ యనియు, హిం. కమల గట్టాయనియు, పేరు నల్లగ గుండ్రగ కొన్నికోలగ నుండును. వీనికి రంధ్రములువేసి దారమున గుచ్చి మాలికగా ధరింతురు. శ్రీదేవతా భక్తులును వైష్ణవులును పద్మాక్ష మాలికతో జపము చేయుదురు.

పద్మబీజములు మధుర కషాయ తిక్తరసములు, గురుగుణము, శీతవీర్యము, కటువిపాకము గలది. దీపనము గలిగించును. మలబద్ధముచేయును. స్త్రీలకు గర్భము నిలుపును. వీర్యమును బలమును వాతకఫమును పెంచును. పిత్తరక్తదోషము, ఛర్ది, తాపము అనువానిం జయించును.

మకరందము చలువ వీర్యము ధాతుపుష్టి బలము కలుగచేయును. త్రిదోష హరమైనది. సకల రోగములను హరించును.

తామరాకు వగరు చేదు తీపిరుచులు, శీతవీర్యము లఘుగుణము కటువిపాకము గలది. వాతమును పెంచి కఫపిత్తములను హరించును. మలబద్ధము గలిగించును.

తామర తూడునకు సంస్కృతమున మృణాల, పద్మనాళ, బిస అనియు, హిం. కమలకీదండీ అనియు పేరు. తెల్లగ యేనుగు దంతమువలె నుండును. తామరదుంపకు సంబంధించి బురదలో నుండును. ఇది చేదు వగరు. రుచులు, శీతవీర్యము గురుగుణము మధుర విపాకముగలది. స్తన్యము (చనుబాలు) కఫము, వీర్యము, వృద్ధి జేయును. మలబద్ధము జేయును. పిత్తతాపము, మూత్రకృచ్ఛ్ర, రక్తవాంతి అనువానిని హరించును



తామరదుంపకు సంస్కృతమున పద్మినీకంద, శాలూక, కరహాట అనియు, హిం. భసీడా అనియు పేరు. కందదుంపవలె నల్లగ బురదలో నుండును. ఇది చేదు వగరు తీపి రుచులు రూక్షగురుగుణములు శీతవీర్యము కటువిపాకముగలది. మలబద్ధము వీర్యము కలిగించును. ఆలస్యముగ జీర్ణమగును. నేత్రరోగములు రక్తపిత్తము తాపము దప్పి కఫము పిత్తవాతములు శూల పిత్తకాస క్రిమి ముఖరోగములు రక్తదోషము అనువానిని నశింపచేయును, యెఱ్ఱతామరపూవు కటుతిక్త మధుర రసములు, శీతవీర్యము గలది. రక్తదోషమును, త్రిదోషములను హరించి వీర్యవృద్ధి గలిగించును.

తెల్లదామరపూవు మధుర రసముగలది. కఫపిత్తములను హరించును. చలువచేయును.

నల్లతామరపూవు ప్రసిద్ధముగ దొరకదు. ఇది మధుర రసముగలది. పిత్తమును హరించును. రుచిబుట్టించును. వెండ్రుకలను నల్లగపెరుగునట్లు చేయును.

తామరదుంప క్రిందమన్ను (బురద) పిత్తవ్రణములపై వేసికట్టినను తాపము తక్షణము తగ్గును.

మూడువిధములగు తామరపూవులును యోనిదోషములను హరించి గర్భధారణ యోగ్యతను కల్గించునవై యున్నవి.

తామ్రము:—సం. మ్లేచ్ఛముఖ, తామ్రం, ద్వ్యష్ట, అనియు పేరు. నేపాలము, మ్లేచ్ఛము అని రాగి రెండువిధములు నేపాలము మంచిది. నేపాలపు గనులందు పుట్టిన తామ్రము నేపాల తామ్రమన బడును నునుపుగ మెత్తగ సాగగొట్టి నపుడు పొడిపొడిగ విరుగక సాగునదిగ యెఱ్ఱని కాంతికలదిగనుండు రాగిశ్రేష్ఠము రాగి చేదు వగరు రుచులు లఘుసరగుణములు, ఉష్ణవీర్యము, మధుర విపాకము (కటువిపాకమని కొందర మతము) కలది. ఆమ్లపిత్తము, కఫము, జఠరవ్యాధి, కుష్టు ఆమవాతము, క్రిమి స్థౌల్యము, మూలవ్యాధి, క్షయ, పాండు, నేత్రరో

గము అను రోగములహరించును. వమన విరేచనముల జేయును. ఆకలి బుట్టించును. లేఖనకారిగనుండును. అపరిశుద్ధమైన తామ్రము మహావిషతుల్యమైనది గాన శుద్ధిభస్మములజేసి యుపయోగించ వలెను. అపరిశుద్ధమును భస్మముగావింపబడనిదియు నగు తామ్రమును సేవించిన ఆయువు బలము కాంతి వీర్యమునశించును. వాంతి మూర్ఛ భ్రమ కుష్ఠము అర్శస్సు శూల పుట్టించును. తామ్రపు రేకులకు అమ్లవర్గములతో నూరిన క్షారములను పట్టించి యెరు పిడకలలో కాల్చి గేదె మజ్జిగలో యేడుసారులు చల్లార్చినచో ఆయాసము భ్రాంతి త్రిప్పుట తాపము, మూర్ఛ అను వ్యాధులను గలిగించు తామ్రదోషము లైదును నశించిపోవును ఇట్లు శుద్ధిచేయబడిన రాగి రేకులకు నిమ్మపండ్ల రసముతో నూరిన రసగంధకములను పట్టించి శరావ సంపుటము నందుంచి మూడుపుటములు వేసిన నల్లగభస్మమగును. అట్టిభస్మమును అమ్లవర్గముతో నూరి బిళ్ళచేసి అడవికంద దుంపలో బెట్టి చీరజేసి గజపుటమువేసిన సర్వదోషరహితమగు భస్మమై వాంతివిరేచనములం జేయక రోగములను హరించు శక్తిని గల్గియుండును. తామ్రమును దివ్యమూలికల సహాయము నక్షణ మాత్రమున స్వచ్ఛముగ భస్మము కావించి సూదికొనతో యెత్తిన మోతాదును ఒక్కసారియిచ్చిన కుష్ఠము క్షయ మున్నగు దారుణ రోగములను కొందరు సిద్ధులు కుదుర్తురు. అట్టిప్రక్రియలును తామ్రము వలన స్వర్ణముచేయు ప్రక్రియలును అనేకరీతులనుండును. అవి విశేష ప్రచారములు రహస్యములునై యున్నవి. తామ్రమును వివిధ ఔషధయోగములలో జేర్చి సకలవ్యాధులందును వాడదగును.

తారమాక్షికము:—చూ. మాక్షికము.

తాళకము:—సం. ఆల, తాళ, హరితాళ అనియు హిం. హరితాల్ అనియుపేరు. తాళకము ఖనిజ వస్తువు పసుపు పచ్చగ దుర్వాసనగ నుండును ఇది పత్రతాళకము పిండతాళకము అని రెండువిధములు విడదీసిన బంగారపు రేకులవలె విడునది పత్ర తాళకము ముద్దవలె నుండునది. పిండతాళకము తాళకము కారము వగరు రుచులు స్నిగ్ధగుణము



ఉష్ణవీర్యము కటువిపాకము కలది. సకలవాత కఫవ్యాధులు కుష్ఠము మేహము, గుదరోగము సవాయి, శ్వాసకాసలు, చలిజ్వరము. సన్నిపాతము మొదలగు సకల రోగములను ఖండించును. క్రమముగ శుద్ధిచేయబడని తాళకము కఫవాతములు మేహము తాపము మున్నగు అనేక వ్యాధుల గలుగజేయును. బూడిద గుమ్మడికాయ రసము సున్నపునీరు నిమ్మపండురసము అను వానిలో దేనియందైన 4 జాములు స్వేదనము చేసిన తాళకము శుద్ధమగును. తాళకమును శుద్ధిచేసి యౌషధములలో జేర్పదగును. ప్రత్యేకముగ తాళకమును సేవించుటకు భస్మముచేయుట ఆవశ్యకము.

మోదుగవేరు కషాయము తేనె సమభాగముగ జేర్చి గట్టిపడువరకు మరలకాచి ఆరసక్రియయందు శుద్ధిచేసిన తాళకపు ముక్కను పెట్టిమూడు జాములుంచి గేదెమూత్రముతో నూరి బిళ్ళచేసి చీరజేసి 10 యెరు పిడకలతో పుటము వేయునది ఇటుల 12 పుటములు వేసిన దోషరహితమగు భస్మమగును. శుద్ధతాళకమును శ్వేతాభ్రకపు రేకులలో కట్టికట్టి బొగ్గు నిప్పులమీద బెట్టిన తక్షణమే తాళకము మాణిక్యమువలె యెర్రబడును. ఇదియె రసమాణిక్య మనబడును. పైభస్మమును గాని రసమాణిక్యమును గాని రెండుగుంజలెత్తు చొ॥ అనుపాన విశేషములతో సేవించిన కాసశ్వాసలు, సుఖవ్యాధులు. చర్మరోగములు మున్నగునవి మానును.

రెండుతులముల తాళకమును తెల్లని గట్టిబట్టతో మూటగట్టి నీళ్ళతో నూరిన గంధకమును మూడుపూతలు పెట్టి 12 తులముల రాగిని కరిగించి కరిగినరాగిలో పైతాళకపు మూటను వేసివెంటనే బూడిదతో కప్పివేయవలెను. స్వాంగ శీతలమున రాగికంటియుండు తెల్లని సత్త్వమును గ్రహించవలెను. ఇదియొక తాళక సత్త్వపాతన విధానము తాళకసత్త్వమును ఒకయవలో యెనిమిదవవంతు వెన్న మొదలగు అనుపానములతో క్రూరమైన కఫరోగములందును కుష్ఠమందును వాడవలెను. తాళకము సాధారణముగా స్త్రీలరజస్సును హరించునదగుటచే గర్భిణులకు

సుకుమారులకు పైసత్వమును వాడరాదు. ఇంకను అనేకరీతుల్ల తాళక భస్మ విధానములు, సత్తము, ద్రుతి. సిందూరము, కట్టు, మైనము మున్నగు పద్ధతులును వానికి వైద్యమందు వాదమందు ఉపయోగములును రసగ్రంథములందునవ్రాయబడి రహస్యములుగనున్నవి. కొన్నిటిని మా రసరత్న సముచ్చయము అను గ్రంథమున దెలిపి యుంటిమి గ్రంథవిస్తర భీతిచే నిటనుదహరింపలేదు

తాళీశపత్రి:—సం. తాళీస, ధాత్రీపత్రి, శుకోదర. గ్రంధికాపత్రి అనియు హిం. తాళీసపత్రి అనియుపేరు. తాళీశచెట్టు మిక్కిలి పెద్దది సన్నముగ యొడిన శుంగవలె నుండును. అంతవెడల్పుగా నుండవు గాని ఆకుల యొక్కతీరు అకుజెముడాకు తీరువనుండును.

ఇదిచేదు కారపురుచులు తీక్ష్ణ లఘుగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. శ్వాసకాసలు కఫవాతములు, అరుచి, గుల్మము, ఆమము, అగ్నిమాంద్యము. క్షయ ఎక్కిళ్ళు. ఛర్ది, స్వరభంగము, రక్తదోషము ముఖరోగము అను వానిని జయించును.

తాళీశపత్రి 1 భా॥ మిర్యాలు 2 భా॥ శొంఠి 3 భా॥ పిప్పళ్ళు 4 భా॥ దాల్చినపట్ట ఏలకులు కలసి 1భా॥ చక్కెర 32 భా॥ వీనిచూర్ణమునకు తాళీశాది చూర్ణమని పేరు. ఈచూర్ణమును బలానుసారము సేవించిన శ్వాస కాసలు, అరుచి, పాండువు, గ్రహణి ప్లీహ, శోష, జ్వరము ఛర్ది అతిసారము. శూల, మూఢవాతము అనురోగములుహరించును

తిక్తజీవంతి:—సం. తిక్తజీవంతి, తిక్తభద్ర, తిక్తప్రియంకరీ, అనియు హిం. కోడీ అనియుపేరు. పాలముక్కలలోనిది యొకభేదము ఇది చేదు కారము రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది వాతకఫములు అజీర్ణము జ్వరము, శోఫ విషము, రక్తపిత్తము, కంఠరోగము, గుల్మము అర్శస్సు క్రిమి కుష్టు, శ్వాస ప్రమేహము మొదలగు రోగముల హరించును. మలబద్ధము, తాపము బుట్టించును. అరగదీసి రాచిన యెడల ఎలుక విషమును హరించును.



తినిశచెట్టు:—సం. తినిశ స్పందన, నేమీ, సర్వసార అనియు హిం. తిరిచ్ఛ తిన సునా అనియుపేరు. ఇదిపెద్దవృక్షము దీనియాకులు మిక్కిలి చిన్నవిగ జమ్మిఆకులను పోలియుండును. ఈచెట్టుయొక్క ఆకారము సాధారణముగా చంద్రచెట్టును పోలియుండును.

తినిశ వగరు రుచి, లఘుగుణము. ఉష్ణవీర్యము, కటువిపాకము కలది. మలబద్ధముచేయును. కఫవాతములు రక్తాతిసారము కుష్టు, మేహము వ్రణము రక్తదోషము పిత్తము శ్విత్రము (బొల్లి) క్రిమి తాపము పాండువు మున్నగురోగములహరించును.

తిప్పతీగ:—ఇదియొకవిధమైన తీగ డొంకలమీదను కంచెల మీదను ప్రాకును. దీనియాకులు యించుమించు తమలపాకును పోలియుండును. ఈతీగ గణుపులలో రెండువైపుల చిగురుపట్టి పెద్దతీగగా పెరుగును. దీనికి చిన్నచిన్న తెల్లనిపూవులును. బచ్చలకాయల వంటి కాయలును ఉండును. పండ్లుపండినపుడు నలుపురంగుగాఉండును. పిండగుడూచియనియు, లతాగుడూచియనియు నిది రెండువిధములు. మొదటిదానికి దుంపయుండును. రెండవదానికి వేరుండును. లతాగుడూచికి సంస్కృతమున గుడూచి అమృతవల్లి కుండలీ. సోమవల్లి ఛిన్నరుహా అమృతసంభవా దేవనిర్మితా మొదలగు నామములుకలవు. హిందీభాషయందు "గిలోయ" అందురు. పిండగుడూచికి సంస్కృతమున కందోద్భవా కందరుహా పిండగుడూచికా బహుచ్ఛిన్నా మొదలగు నామములుగలవు. పాముకుబుసమువలె నీతీగపైన పొలుసు ఉండుటచేతను పామువలె చుట్టుకొని యుండునది యగుటచేతను కుండలియనియు. నరికి పాతినను బ్రతుకునుగనుక ఛిన్నరుహాయనియు, రామరావణయుద్ధమున మృతులైన కపీశ్వరులను బ్రతికించుటకై దేవతలు వారి శరీరమునచల్లిన యమృతబిందువులు పడినచోట నీతీగ మొలచినదని యుండుటచే అమృతసంభవా, దేవనిర్మితాయనియు దుంపనుండి పెరుగును గనుక కందోద్భవా కందరుహా యనియు అనేకమగు గణుపులుండును గనుక బహుఛిన్నాయనియు దీనికిపేళ్ళుగలిగెను.

తిప్పతీగ చేదు వగరు రసములు గురుగుణము ఉష్ణవీర్యము మధురవిపాకము గలది. ఇది త్రిదోషహరము. కామిల రక్తదోషము వాంతి దాహము దప్పి జ్వరము కుష్ఠము వాతరక్తము రక్తార్శస్సు దురద విసర్పి కఫము మొదలగు వానిని ఖండించును. దీని సమూల చూర్ణమును నేతితో సేవించిన వాతమును బెల్లముతో గలిపి తినిన మలబంధమును, పంచదారతో జేర్చి తినిన పిత్తమును, తేనెతో గలిపి సేవించిన కఫమును, శొంఠితో చేర్చి భుజించిన ఆమవాతమును హరించును. ఈతీగనుండితీసిన సత్త్వము లఘువుగ కొంచెము చేదుగ శీతవీర్యముగ నుండును. అగ్నిదీప్తిని పుంస్త్వమును కల్గించును. పాండువు వాతరక్తము తీవ్రమైనజ్వరము జీర్ణజ్వరము కామిల ప్రమేహము అరుచి పొడిదగ్గు ఎక్కిళ్ళు మూత్రకృచ్ఛ్రము తెల్లకుసుమ (సోమరోగము) సెగరోగము వీనిని సంహరించును. తీగనుండితీసిన సత్త్వముకన్న దుంపనుండితీసినది స్వచ్ఛముగను శ్రేష్టముగను ఉండును.

తిప్పసత్తుచేయువిధము, తిప్పతీగయొక్క దుంపలనుగాని సమూలముగగాని తెచ్చి చక్కగాకడిగి పైపొట్టునుగీకివైచి రోటిలోవేసి నలియగొట్టి మంచినీళ్ళలో జాడించవలెను. మరల నాపిప్పిని పైవిధముగ రోటిలోరుబ్బుచుగాని నలియగొట్టుచుగాని నీటిలో జాడించుచుండవలెను. కొంతసేపటికి తీగయందుండు సత్త్వమంతయు నీళ్ళలోనికివచ్చి మధ్యనుండు వట్టికట్టెమాత్రమే మిగులును. దానిని పారవేసి నీళ్ళను మంచి దళసరిగుడ్డతో పలుమారులు వడియగట్టి యానీటిని కదపకుండ ఒకజాముసేపుంచినచో అడుగున తెల్లనిపిండివంటి సత్త్వము పేరుకొనును. పైనీటిని మెల్లగా వంచివేసి మరల శుభ్రమైన యుదకము పోసి కలియగలిపి మరలతేరనిచ్చి నీళ్ళు పారబోయవలెను. ఇట్లు కొన్నిమారులు కడిగినచో సత్త్వమందలి మలినముపోయి స్వచ్ఛమగు సత్త్వమేర్పడును. దానిని యెండలో యెండించి భద్రపరచునది. యిదియే తిప్పసత్తు. శీతాకాలమందు తిప్పతీగనుండి సత్త్వమధికముగావచ్చును



కందగుడూచికి గూడ పైలతాగుడూచి గుణములు గల్గియుండును. అ లతాగుడూచికన్న తక్కువ ఉష్ణముచేయును.

తిప్పఆకుకూర వగరు,చేదు కారము రుచులు గలది. ఉష్ణవీర్యము, లఘుగుణము, కటువిపాకము గలది. వాతరక్తమందును కుష్ఠమునందును మిక్కిలి పథ్యముగనుండును. మరియు పాండు ప్రమేహ కామల లా రోగములను హరించును. తిప్పవేరు చూర్ణము మూడుచిన్నములు తెల్లదింతిన వేరుచూర్ణము చిన్నముకలిపి చన్నీళ్ళతో యిచిన నెడల సర్పవిషముహరించును. దినమునకు 6 సార్లు యివ్వవలెను. దీని రసాయన కల్పము ననుసరించి సేవించిననో కాయసిద్ధిని గల్గించును.

గుడూచ్యాది లోహము—తిప్పసత్తు, త్రిఫలములు, త్రికటుకములు, విడంగములు, చిత్రమూలము, తుంగముస్తలు యివిప్రత్యేకము ఒకభాగము లోహభస్మము ౧౦భా॥ చేర్చి మాషప్రమాణముగ వాడిన వాతరక్తము హరించును. (ర. చి)

తిప్పసత్తు, వెలగవేరుపట్ట, మామిడియిగుళ్ళు, లేతదానిమ్మకాయబెరడు, రససింధూరము వీనిని సమభాగముగ మంచినీటితో నూరి శనగలవలె మాత్రలుచేసి దినమునకు 2, 3 యిచ్చిన రక్తకాస, అతిసారము గ్రహణికట్టును. (ఆ. యో.)

గుడూచ్యాదిగణకషాయము—తిప్పతీగె, అతివస, ధనియాలు శొంఠి. మారేడువేరుచక్క, ముస్తలు, కురువేరు, అగరుశొంఠి, నేలవేము, కొడిశచక్క, చందనము వట్టివేరు, పద్మకము వీనినిశీతకషాయము జ్వరాతిసారములను హరించును. (భైష)

గుడూచీతైలము—తిప్పతీగె 100 ప॥ నలియగొట్టి 64 శరావముల నీటిలోవైచి 16 శరావములు మిగులునట్లుకాచి వడియగట్టి అందు నువ్వులనూనె 4 శరావములుచేర్చి సంప్రదాయానుసారముగ కాచి వాడిన వాతరక్తమును హరించును (భైష)

తిప్పరెల్లు:- సం ఇక్షుకుసుమ, కాండశర అందురు మూత్రకృచ్ఛ్ర అశ్మరి తాపము రక్తదోషము పిత్తము క్షయ మున్నగు రోగములను హరించును.

తియ్యదొండ:—మధుతుండి, తిత్తిరిఫల, తుండికేరీ, బింబికా అనియు హిం కందూరీ అనియు పేరు. దొండ తీగ బారును. చేదుదొండ తీయదొండ యని రెండువిధములు. ఇంకను కాకిదొండ మురుదొండ నాగదొండ అను భేదములుకూడ కలవు. తీయదొండ దొడ్లలో వేసి పెంచబడును. చేదుదొండ అరణ్యములలో స్వయముగ మొలచును. దొండతీగ నరికి పాతిన బ్రతుకును. దొండకాయలు కొంచెము కోలగ గుండ్రగ నున్నగఉండును పచ్చికాయలు ఆకుపచ్చగను పండినపుడు పగడమువంటి చక్కని యెరుపురంగును కలిగియుండును. దొండాకుమూడుఅంచులుకలదై మృదువుగఉండును. తీయదొండ కాయలను కూర వండుకొని తిందురు.

తియ్యదొండకాయ తీపి రుచి గురుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. పిత్తరక్తము వాతము కఫము క్షయ కామిల పిత్తశోఫ రక్తవికారము విషము కాస జ్వరము హరించును. లేఖనకారి మలబద్ధము స్తన్యము (చనుబాలు) అధ్మానము గలుగజేయును. కడుపులో వాతమును పుట్టించును. రుచిబుట్టించును.

ఆకు రక్తపిత్తము క్షయ శ్వాసకాసలు కామిల అనువానిని బోగొట్టును. దొండఆకుపసరులో మిరియాల చూర్ణము హారతికర్పూరము కలిపి రాచిన సర్పి తలమావ మొదలగు పుండ్లు మానును. తీయదొండాకు రసమును త్రాగించిన పశువులకువచ్చు కొన్నిరోగములుమానును దొండాకుకూర మధురకషాయ తిక్తరసములు లఘుగుణము శీతవీర్యము కటువిపాకముగలది. మలబద్ధము చేయును. వాతమును పెంచి కఫపిత్తములను హరించును.

తీయదొండవేరు మేహము అరచేతులంటుమంట వాంతి భ్రాంతులు నశింపజేయును. ధాతువృద్ధికలిగించును.



దొండపూవు దురద పిత్తము కామిల అనువానిని నశింపజేయును

తియ్యనిమ్మ:—సం మిష్టనింబు అనియు, హిం. మీఠానీంబ్ అనియు పేరు. మామూలు నిమ్మకాయలకును దీనికిని ఆకారభేదమేమియు లేదు. ఇదితీపి రుచి గురుగుణము. శీతవీర్యము, మధురవిపాకము కలది. వాతపిత్తములు, విషము, అనువాని హరించును. శ్లేష్మమును పెంచును. రక్తమును చెరుచును.

తియ్యపొట్ల:—అనగా మంచిపొట్ల ఆకుకూర పిత్తకఫములను హరించును. కాయకూర త్రిదోషహరము. వేరురసము లేక కషాయము కఫమును తగ్గించును.

తియ్యమాదీఫలము:— సం మధుకేసరి అందురు. తియ్యనిమ్మ యొక్క గుణములను కలిగియుండును. చూ॥ తియ్యనిమ్మ.

తిలకపుచెట్టు:—సం. తిలక, క్షురక. పురుష, ఛిన్నపుష్పక అనియు, హిం. తిలక అనియు పేరు. ఇదిపుష్పప్రధానమైన క్షుపము. దీని పూవులు పెద్దచీమలంత ఉనువుగ నువ్వుపూవుల పరిమాణముగఉండును.

తిలకపుష్పము మధుర కటురసములు లఘు రూక్షగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. కఫము కుష్ఠు క్రిమి వస్తి ముఖ దంతరోగములు విషము దురద వ్రణము పాలవలనబుట్టు చంటిబిడ్డల వ్యాధులు మున్నగువానిని హరింపచేయును. దీనిని సమూలముగ దెచ్చి యెండించి కాల్చి క్షారపాకవిధానమున తయారుచేసిన క్షారము గుల్మ శూల ఉదరము హరించును. దీనిచక్క వగరుగ నుండును. దంతరోగములు రక్తదోషము క్రిమి వ్రణము శోఫ అనురోగములను హరింపచేయును. ఉష్ణవీర్యముకలది.

తీగనిమ్మ:—సం. త్వచ, భవ్య, భవిష్య, రోమఫల అందురు ఇది తీగబారును. దీనికాయ తీపి వగరు పులుపు రుచులు గురుగుణము శీతవీర్యము అమ్లవిపాకము గలది. మలబద్ధము ముఖశుద్ధి వీర్యస్తంభనము జేయును. పిత్తకఫములను హరించును.

తీగబచ్చలి:—సం. కలంబీ, శతపర్వ అనియు, హిం. కలమీశాక అనియు పేరు. చనుబాలను శుక్రమును వృద్ధిచేయును. మధురమైనది.

తుంగముస్తలు:—సం. మేఘ ఘన, ముస్తఅనియు హిం. మోథాఅనియు పేరు. ఒకవిధమగు గడ్డిదినుసుయొక్క దుంపలను తుంగముస్తలందురు. మెట్టనుకొన్నియు నీళ్ళలోకొన్నియు పుట్టును. కైవర్తముస్త నాగరముస్త, భద్రముస్త, ముస్తఅని ఇది నాలుగు విధములు కైవర్త ముస్తకు సం వన్య, కుట, నట, కుటన్నటఅనియు హిం. కేవటీ మోథా అనియు పేరు. నాగరముస్తకు సం. నాదేయీ, కచ్ఛరుహా, వృష, ధ్వాంక్షీ, చూడాలా, పిండముస్తా అనియు, హిం. నాగరమోథా అనియు పేరు. భద్రముస్తకు సం గాంగేయ కురుబిల్వ, భద్రముస్త అనియు, హిం. భద్రమోథా అనియు పేరు. వీనికన్నిటికి మంచి పరిమళము కలదు. ఇందులో కొన్నిచిన్నవిగను కొన్నిపెద్దవిగను ఉండును. తుంగముస్త మొక్కలు దుబ్బుగా పెరుగును. ఆకులు సన్నముగ నునుపుగ పొడవుగ నుండును. అనూప దేశమునందు (నీళ్ళుగలప్రదేశములందు) పుట్టిన నాగరముస్తలు శ్రేష్ఠములుగ నుండును. ముస్తలను చక్కగా నలియగొట్టి మూడుదినములు కాంజికములో నానబెట్టి యెండించి పంచపల్లవీరసములతో స్వేదనముచేసి బెల్లపునీళ్ళతో ఉడికించి చూర్ణించి మేకమూత్రము మునగచక్కరసము అనువానితో భావనచేసిన ముస్తలు పరిశుద్ధములై యోగ్యమగు గుణముల నీయజాలినవై యుండును.

మెట్టను త్రవ్వితీయబడిన ముస్తలు కారము, వగరు, రుచులు, లఘురూక్ష గుణములు, శీతవీర్యము, కటువిపాకము గలవి. రక్తవికారము కఫ పిత్తములు, జ్వరము, క్రిమి, వాతము, అతిసారము, అనురోగములను హరించును. పవిత్రమైనది.

భద్రముస్తలు కారము, చేదు, వగరు, రుచులు శీతవీర్యము, లఘు రూక్షగుణములు, కటువిపాకముగలవి దీపనపాచనములనుగలిగించు



కఫపిత్తములు క్రిమి అరుచి పోగొట్టును.

నాగర ముస్తలు తిక్త కటు కషాయ రసములు శీతవీర్యము గలవి, అతిసారము అరుచి, క్రిమి, దప్పి తాపము, శ్రమ మున్నగు వానిని హరించును.

కైవర్తముస్తలు కటుతిక్త కషాయరసములు గలవి. కఫపిత్తములు విసర్పి, కుష్ఠము, దురద, విషము మున్నగు రోగములను హరించును. ముస్తలునాల్గును యించుమించు సమాన రసవీర్యాదులం గలిగి యుండును

తుంగముస్తల చూర్ణము 2 తులములు నల్లఉప్పి వేరు చక్కచూర్ణము 1 తు॥ యీమూడు తులముల చూర్ణ తడిపి గుప్పెడితో నొక్కిన ముద్దఅగునంత చందినిఅత్తరుచేర్చి పైసముదాయ మంతయు నొకరాత్రిపూట తినవలెను. ఆరాత్రి భుజించరాదు మరునాడు ఉశిరిగ పచ్చడిఅన్నము మజ్జిగ ఆహారముగ పుచ్చుకొన వలెను పిదప అయిదు రోజులవరకు యిచ్ఛాపథ్యముగ నుండవలెను. ఇట్లుచేసినచో పచ్చసెగరోగము తప్పక నివర్తించును. మరలమరల ఔషధమును సేవించనక్కరలేదు. ఒక్కపూట మాత్రమే చాలును.

ముస్తల చూర్ణమును పెసరపిండితో కలిపి శరీరమునకు నలుగు పెట్టిన శరీరకాంతి నిచ్చును. చర్మరోగములు నశించును.

తుంబురులు:—సం. తుంబురు సౌరభ, సౌఖనజ, తీక్ష్ణవల్కమహాముని అనియు హిం. తుంబురూ అనియుపేరు.

తీపిచేదు రుచులు, రూక్ష తీక్ష్ణ, లఘుగుణములు, ఉష్ణవీర్యము, కటువిపాకము గలది. విదాహమును పుట్టించును. వాతకఫములు, నేత్ర, కర్ణ, శిరోరోగములు, క్రిమి, కుష్ఠు శూల, అరుచి, శ్వాస ప్లీహ, మూత్రకృఛ్రి మున్నగు రోగముల హరించును.

తుత్తనాగము:—ఇదియొక నిజవస్తువు, రసశాస్త్రమున దీని ప్రశంస గనుపట్టదు గాని సాధారణముగా నిది దొరకుచున్నది. నల్లగబరువుగ నుండును. సీసమునువలె శుద్ధిభస్మముల జేసి బలాను సారముగ సేవించిన సెగసవాయిలు శుక్లనష్టము, తెల్లకుసుమ తగ్గును. తుత్త

నాగమును తులసి యాకుతో వేయించి చూర్ణించి వస్త్రగాలితము చేసి రసికాయ కురుపులపై జల్లిన రసికట్టును. దీనిని శుద్ధిచేయక తినిన అనేక రోగములు గలిగించును. వాంతిచేయును.

తుత్తిరిబెండ:—చూ. బలాచతుష్టయము.

తుమికిచెట్టు:—(చిన్నది) సం. తుంబురు, స్వానుజ, మహాముని, అనియు హిం. తుంబురుకాకాఫేన్ అనియు పేరు పెద్దతుమికి చిన్నతుమికి అనియిది రెండువిధములు పెద్దతుమికికి సం. కాకపీలు కుపీలు విష తిందుక అందురు

తుమికి కారము చేదు రుచులు, ఉష్ణవీర్యముగలది. కఫవాతములు అపతంత్రము శూల, మహోదరము, కడుపుబ్బరము, కృమి వీనిని నశింపజేయును. అగ్నిదీప్తినిచ్చును.

తుమికికాయ పచ్చిది వగరు చేదు రుచులు, శీతవీర్యము, లఘుగుణము కటువిపాకము గలది. మలబద్ధము జేయును.

పండినపండు తీపి, చేదు, వగరు, రుచులు, గురువిశద గుణములు శీతవీర్యము, మధుర విపాకముగలది. పిత్తము, ప్రమేహము, రక్తదోషములు, కఫము అను వానిం బోగొట్టును, పెద్దతుమికికిని యివియే గుణాదులు గాని విశేషముగ చలువ మలబద్ధము జేయును.

తుమ్మచెట్టు:—సం. శాఖోటక, బబ్బూల అనియు, హిం. సహోరా, సహోడా అనియుపేరు. పెద్దచెట్టు కొమ్మలం దంతటను వాడియైన సన్నని ముండ్లుండును. పసుపుపచ్చగను గుండ్రగనుండు చిన్నపూవులు పూచును. పూవునకు అరంగుళము పొడవుగల సన్నని తొడిమయు నల్లగ మందముగ కర్కశముగనుండు మానుపై పట్టయు తెలుపు మెరుపు నలుపు రంగులగల జిగురును సన్నగ పొడవుగ పలచగ నుండు కాయలును జమ్మియాకులవలె చిన్నవిగ ఉండును. ఆకులు నుండును. ఇందు తెల్లతుమ్మ నల్లతుమ్మ కస్తూరితుమ్మ అనిమూడు భేదములుకలవు. తెల్లతుమ్మమాను అంతయు తెల్లగ బూడిద చరచినట్లుండును పూవులుకూడ తెల్లగపూచును. కస్తూరితుమ్మ సాధారణమైన చెట్టు. ఇంచు



మించు తెల్లతుమ్మవలె నుండును. దీనికాయమిక్కిలి పొట్టిది.

నల్లతుమ్మచెక్క వగరు, రుచి, లఘు రూక్షగుణములు ఉష్ణవీర్యము, కటువిపాకము గలది. తుమ్మచెక్క కషాయమునందు కవిరిచేర్చిగాని పొంగించిన పటికిచేర్చిగాని పుక్కిటబట్టిన నోటిపూత చిగురువాపు దంతరోగములు మానును. చెక్క కషాయముతో వ్రణములను కడిగిన పరిశుద్ధములై వెంటనే మానుపట్టును. తుమ్మచెక్క రసమును లేక కషాయమును త్రాగిన కళ్లెదగ్గు తగ్గును. తుమ్మాకు నల్లమందు కలిపి పుటపాకము చేసి నూరి కంటిచుట్టు పట్టువేసిన వాతమున బుట్టు నేత్రరోగములు మానును. నల్లతుమ్మచెక్క కషాయమున పంచదార జేర్చి త్రాగిన తెల్లకుసుమ కట్టును. మూత్రము వెంటను పురీషము వెంటనుపడు రక్తముకట్టును. మలబద్ధము చేయును అతిసార విరేచనములు కట్టును. తుమ్మచెక్క తోళ్ళు బాగుచేయుట కుపయోగించును.

400 తులముల నల్లతుమ్మ పట్టను నలియగొట్టి 4 ద్రోణములనీటిలో వేసి 4 వ వంతు మిగులువరకు కాచి వడియగట్టి అందు 1200 తులముల బెల్లము 64 తు॥ ల ఆరెపూవుల చూర్ణము 8 తు॥ ల పిప్పలి చూర్ణము జాజికాయ. తక్కోలములు, ఏలకులు, దాల్చినపట్ట, జాపత్రి, నాగకేసరాలు, లవంగాలు, మిరియాలు అను 8 వస్తువుల చూర్ణము ప్రత్యేకము 4 తులముల చొ॥ చేర్చి యొకకుండలో బోసి చీలజేసి యొకమాసము నిలువయుంచి పిదప వడియగట్టిన నది బబ్బూలారిష్ట యనబడును. దీనిని బలాను సారము సేవించిన క్షయ కుష్టు అతిసారము, ప్రమేహము, దగ్గు, ఉబ్బసము నశించును.

తెల్లతుమ్మ పట్టనుకాల్చి తెల్లని బూడిదజేసి సారాయిలో కలిపియిచ్చిన రక్తప్రదరమును పుల్లనిమజ్జిగలో కలిపియిచ్చిన తెల్లకుసుమయు కుదురును.

కస్తూరి తుమ్మకాయలును ఆముదములోవేసి కాచివడియగట్టి చంటిబిడ్డలకు త్రాగించిన పాలఉబ్బసము కాస, గురక, పడిసెము మొదలగు వికారములు తగ్గును. మంచినూనెలో వేసి కాచిన నూనెను శరీర

మునకు అభ్యంగనము చేయించిన చర్మరోగములు మానును. రసవీర్యాగులు మూడిటికి సమము,

తుమ్మిచెట్టు:— సం. ద్రోణపుష్పి, ఫలేపుష్పా కురంభికా ద్రోణా అనియు హిం. గూమా, గోమా, అనియు పేరు ఇది క్షుపము ప్రతిగణుపునందును గుచ్ఛములు యేర్పడి అందు తెల్లని చిన్నపూవులును గుచ్ఛముయొక్క చివర రెండు చిన్నాకులును మొలచును.

తుమ్మి తీపి ఉప్పధనము, కారము, రుచులు, రూక్షగురు తీక్ష్ణ గుణములు, ఉష్ణవీర్యము, మధుర విపాకము గలది. మలమును భేదించును కఫపిత్తములు, ఆమము, కామిల, శోఫ తమకశ్వాస (మేఘరంజి) క్రిమి అర్శస్సు అగ్నిమాంద్యము పక్షాఘాతము అను రోగములను హరించును.

తుమ్మిఆకు తీపి, కారము, రుచులు, గురురూక్ష గుణములు ఉష్ణవీర్యము మధుర విపాకము గలది, పిత్తమును హెచ్చించును. కామల శోథ జ్వరము మేహము హరించును. ఆకుకూర మధుర సరగురు రూక్షగుణములును ఉష్ణవీర్యము మధురవిపాకముగ్గలది. తుమ్మిఆకుకూర తినిన గ్రహణి మూలరోగము కఫము గలవారలకు హితముగ నుండును. ఆకుపసరును శరీరమునకు పూసిన దద్దురు తామర చీడమున్నగు చర్మరోగములు మానును. తుమ్మిపూవులు మిర్యాలు సమముగ కలిపి నూరి స్త్రీలు బహిష్ఠలైన మూడుదినములలో ఉదయ సాయంత్రములందు కుంకుడు కాయకన్న కొంచెము చిన్నవియగు మాత్రలను మ్రింగిన ఋతుశూల రుతుబదము నశించును గర్భకోశము బాగగును. సంతానయోగ్యత కలుగును. ఆమూడుదినములును పాలు అన్నముమాత్రము తినవలెను.

తుమ్మెదమామిడి:— సం, కోశామ్రి ఘనస్కంధ ననామ్రి జంతుపాదప అనియు హిం, కేవోడా జలపాయీ అనియు పేరు. దీనిఆకారమంతయు మామిడిచెట్టునుపోలియుండును. గానిదీనియాకులు కాయ చి



న్నవిగ ఉండును దీని టెంకలో తుమ్మెదవంటి యొకపురుగు ఉండును గనుకనే తుమ్మెదమామిడి యనిదీనికి పేరుకలిగెను

దీనిచెక్క రసము కుష్ఠము శోథ రక్తపిత్తము వ్రణము కఫము హరించును. పచ్చికాయ పులుపు రుచి గురుగుణము ఉష్ణవీర్యము అమ్ల విపాకముగలది. పిత్తమును పెంచి వాతమును హరించును. మలబద్ధము చేయును, పండినపండు తీపి రుచి లఘుగుణము ఉష్ణవీర్యము మధురవిపాకముగలది. కఫవాతములను హరించును. దీపనకారి, పండు గుంజు మధురముగ స్నిగ్ధముగ మధురవిపాకము గలదిగ ఉండును. అగ్నిదీప్తి నిచ్చును. వాతపిత్తములను హరించును. గింజలనుండి తీసిన తైలము చేదు తీపి పులుపు రుచులు సరగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. కృమి, కుష్టు, అనువానినిహరించును. శరీరకాంతి బలము నిచ్చును. బయట పూయుటకును తినుటకును గూడ ఉపయోగపడును.

తురకవేప:— సం. భూతీక, భూత్రిక అందురు. పెద్దవృక్షము. దీనిఆకులు వేపాకులకంటె పెద్దవిగ పెద్దపెద్ద కంగోరాకలవిగఉండును. ప్రసిద్ధమైనచెట్టు. చేదు రుచి రూక్షగుణము ఉష్ణవీర్యము కటువిపాకము గలది. విషము పిత్తము వ్రణము కృమి శిరోరోగము అశ్మరి మూత్రకృఛ్రి ఋతుబద్ధము జ్వరము నంజు కుష్ఠము దురద గలగండము గండమాల మున్నగురోగముల హరించును.

చెక్క చూర్ణమును పటికిబెల్లము కలిపి తినిన తిమ్మిరివ్యాధియు పూవులు మిరియాలు కలిపి నూరి కురుపులకుకట్టిన పురుగులు పడిన వ్రణములును ఆకురసమున హారతి కర్పూరము కలిపి రాచిన గలగండము కుష్టు చీడ మొదలగు చర్మరోగములును, తురక వేపాకు వావిలి ఆకు కలిపి ఆముదమున వెచ్చజేసి తలకు గట్టిన వాతమున బుట్టిన తలపోటు నొప్పి మున్నగు శిరో వ్యాధులును ఆకు రసమున వాయువిడంగ చూర్ణమును చేర్చి యిచ్చిన కృమిరోగమును మిరియాల చూర్ణము కలిపి యిచ్చిన ఋతుబద్ధమును నేలయుసిరిగ సమూల చూర్ణమును కలిపి యిచ్చిన దారుణమగు ఋతుశూలయు గోంగూర తుర

కవేపాకు కలిపి నీళ్ళ ఆవిరిమీద ఉడికించి నూరికట్టు కటిన సెగగడ్డల
ను వట్టిదిత్రాగిన మలబద్ధమును అకురసమున రేవల్చిన్ని చూర్ణము జే
ర్చియిచ్చిన మూత్రబద్ధ అశ్మరీ రోగములను రసకర్పూరము హారతిక
ర్పూరము కలిపిరాచిన పొక్కుసవాయి మచ్చలును ఫిరంగిచెక్క చూర్ణ
మును కలిపియిచ్చిన అనేకవిధములగు సవాయిరోగములును కుదురును.

దీనివిత్తులనుండి తీసిన తైలమునకు వేపనూనె గుణము లన్నియు
కలవు. దీనిమానునుండి తీసిన కల్లునకు వేపకల్లు గుణములన్నియు కల
వు. దీనిఆకులతో విసరిన మశూచికపు రోగులకు ఆరోగ్యముగ నుం
డును. ఆకులను తోరణముగ్రుచ్చి గుమ్మములకు గట్టిన కలరా మశూ
చికము మొదలగు వ్యాధులను పుట్టించు సూక్ష్మజీవులు లోనికి జొర
కుండ చేయును. మరియు వాదయోగములలో మిక్కిలి బహుళముగ
దీనిని ప్రశంసింతురు.

తురుష్కము:—చూ. గంధఫిరోజా.

తులసి:—సం. తులసీ, శ్వేతతులసీ అనియు, హిం. సఫేద్‌తు
లసీఅనియుపేరు. కారము చేదు రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము క
టువిపాకముగలది. తాపము పిత్తము హెచ్చించును.

అగ్నిదీప్తి, వాతకఫములు, జ్వరము, సన్నిపాతము, సంగమ
దోషము, వాంతి. దుర్గంధము, రసదోషములు, నోటిపూత, కృమి,
శూల, విషము, మూత్రకృచ్ఛ్ర, రక్తదోషము, ఎక్కిళ్ళు, భూతబా
ధ, పాపము అనువానిని హరించును. కృష్ణతులసికిగల ప్రభావములన్ని
యు గలవు. చూ కృష్ణతులసి.

తువరిమన్ను:—సం సౌరాష్ట్రీ, తువరి అనియు, హిం. గోపీ
చందన్, సోరరకీమిటీ అనియు పేరు. సౌరాష్ట్రదేశమునందు పుటి ప
సుపు పచ్చగ నుండు ఒకవిధమగు మన్నునకు తువరిమన్ను అనిపేరు.
దీనిని గోపిచందనముఅనియు వాడుదురు. దీనిని తిరుమణిధరింతురు. ఔ
షధములందును వాడుదురు. ఇది చలువజేయును. తాపము వ్రణము,
విషము, విసర్పము, నరుకుగాయము, రక్తవికారము, పిత్తకఫములు, ప్ర



దరము అను రోగములను హరించును. పైన పూయుటకును తినుట
కును గూడ ఉపయోగింపనగును. గర్భపాత చిహ్నము కనబడినప్పుడే
దీనిని తులసియాకురసముతో నిచ్చిన గర్భమునిలుచును. గర్భశోషము
లనుహరించును. కడుపులోబిడ్డ తిరగకయుండునపుడు గర్భిణులకు దీని
నిచ్చిన శిశువుతిరుగును. సాధారణముగా దీనిని అణాయెత్తుమొదలు జే
డెత్తువరకు వాడవచ్చును.

తూటికూర:—సం. కుంభిక, వారిపర్ణి, వారిమూలీ అనియు,
హిం. జలకుంభి, కుంభీ కాయీ అనియుపేరు. నీళ్ళలోమొలచునాచు
జాతి తీగ. అమితముగ అల్లుకొని నీళ్ళలో పెరుగును. ఆకులు
రెండుమూడు అంగుళముల పొడవుగనుండును. బూరాలవంటిమృదువై
న తెల్లనిపూవుపూచును. పూవునకు కొంచెము మెరుపు నలుపురంగుల
మిశ్రమముకూడ యుండును. పరిమళములేదు. గుండ్రనికాయ కాచు
ను. దీనికాడనడుమ బోలుగనుండును.

ఇది చేదు కారము తీపి రుచులు లఘు రూక్ష గుణములు శీతవీ
ర్యము కటువిపాకముగలది. త్రిదోష హరము. రక్తదోషమును జ్వర
మును హరించును.

తూనివృక్షము:—సం. తూణీ, తున్నక. ఆపీన, కుబేరక అని
యు, హిం. తున్‌అనియుపేరు. అరణ్యములందు పెరుగు పెద్దవృక్షము
ఆకులు నిమ్మఆకులవలెనుండును. కొంచెముపెద్దవి. మిక్కిలిచిన్నవియ
గు తెల్లనిపూవులు పూచును. దీనికర్ర మిక్కిలి ప్రశస్తమైనది. దీనిని
నందివృక్షమనియు వాడుదురు.

ఇది వగరు తీపి రుచులు లఘుగుణము శీతవీర్యము కటువిపాక
ముగలది. మలబద్ధము వీర్యవృద్ధి గలిగించును. వ్రణము కుష్ఠము ర
క్తపిత్తము బొల్లి స్త్రీసంగమదోషము. తలనొప్పి దురద తాపము హ
రింప జేయును.

తెగడ:—సం. త్రివృత్ అనియు, హిం. పనిలక్, నిసోథ్,
నిసోత్ అనియు పేరు. తెగడ తీగజాతిలోనిది మెరుపు తెలుపు

నలుపు పూవుల భేదముచేత నిదియూడు విధములు తెల్లతెగడ అన్నిటిలో మంచిది. తెల్లతెగడకు శుక్లభండీ త్రిభండి సరళా సర్వానుభూతి అనియు నల్లతెగడకు శ్యామా మాళవిక పాలందీ అనియు, ఎర్ర తెగడకు రత్నమూల, కళింగ, పరిపాకిని, సూత్రమధ్య అనియు సంస్కృతనామములు. తెగడతీగలు అరణ్యమున కంచెలయందు స్వయముగబుట్టును అకులు గుండ్రగ కొంచెము కోలగ కొనదేరియుండును. అంత గుండగనుండవుగాని ఆకులు తిప్పతీగ ఆకులను పోలియుండును ఆకుపైన గొగ్గులుగనుండును. పూవులు గుండ్రగ నుండును. పూవు రేకులు మందముగ జిగిగలవిగనుండును దీనికాయలో నాలుగు గింజలు సెనగలంత పెద్దవిగ నల్లగ గుండ్రగనుండును కాడముప్పరితాకువలెనుండును. నల్లతెగడ యెర్రతెగడల పూవులు కాయలు గూడ తెల్లతెగడకన్న కొంచెముచిన్నవిగ అదేప్రకారము ఉండును తెగడవేరునే ఔషధముగ వాడఁబడును. ముదిరినకాడగూడ వేరుకంటె కొంచెముతక్కువగుణముగలదియై వేరుయొక్క పనినిచేయును.

తెగడ సామాన్యముగ మధుర తిక్త కషాయరసములురూక్ష తీక్ష్ణగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. విరేచనము చేయును. వాతముపెంచును. మలబద్ధము గ్రహణి కఫము ఉదరము శోధ పాండువు కృమి ప్లీహ జ్వరము పిత్తము వాతరక్తము ఉదావర్తము హృద్రోగము కుష్ఠము దురద వ్రణము మొదలగు రోగములను నశింపచేయును. మూడువిధములగు తెగడలలో తెల్లది మిగులశ్రేష్ఠము. దానికన్న నల్లది దానికన్నయెర్రది తక్కువగుణములు గలిగియుండును. తెగడవేరు పాట్లుగీకివేసి పట్టుగ్రహించి పాలఆవిరిపై ఉడికించి యెండించి చూర్ణించి పంచదారకలిపి తినిన చక్కగ విరేచనము చేయును. ఆయుర్వేదమున విరేచనకరౌషధులలో నిది ప్రశస్తముగనెన్నబడును.

ఉశిరిగపప్పు, వాయువిడంగాలు, ఏలకులు, దాల్చినపట్ట, ఆకుపత్రి తుంగముస్తలు, త్రికటుకములు, కరక్కాయ ఇవి ప్రత్యేకము ఒకభాగము, తెల్లతెగడవేరు 3 భా॥ అన్నిటికి సమము పంచదార వీని



యన్నిటి చూర్ణమునకు అహిపతి చూర్ణమని పేరు. దీనిని రెండుమొదలు అయిదు చిన్నములవరకు ఉష్ణోదకముతో సేవించిన శూల, అగ్నిమాంద్యము, మూలరోగము, ప్రమేహము, క్రిమి, గర్భశూల, వాతపిత్తకఫ పాండువులు శమించును.

ద్రాక్షపండు, శొంఠి, రేవల్చిన్ని, జంగిలీహరడా, సునాముఖి. గంటుభారంగి, ఇవి ఒక్కొక్కభాగము తెగడ 6 భా॥ శర్కర 12 భా॥ ఈవస్తువుల చూర్ణమును తేనెతో మర్దించి కుంకుడుకాయంత మొదలు ఉశిరిగ కాయంతవరకు మాత్రలుచేర్చి రాత్రి పరుండబోవునపుడు మ్రింగిన ఉదయమునకు సుఖవిరేచన మగును. మూలరోగులకు మలబద్ధరోగులకు అనుకూలముగ నుండును. ఇదియొక విధమగు త్రివృత్ లేహ్యము.

తెలకపిండి:—సం. తిలకపిణ్యాక అందురు. నువ్వులనుగానుగలో బోసియాడి చమురుతీసిన వట్టిపిండికి తెలకపిండి యనిపేరు. పొట్టుతీసిన నువ్వుల తెలకపిండిని కూరవండుకొని తినిన చనుబాలు వృద్ధియగును. శరీరమందలి చెడ్డనీరునులాగి శరీరమునార్చును. బాలింతలకును ఉబ్బురోగులకు హితకరముగ నుండును. మిగులవేడి పిత్తము జేయును. ఆలస్యముగ జీర్ణమగును. తలత్రిప్పును మలబద్ధము జేయును.

ఇదిమధురరసము, రూక్ష తీక్ష్ణగురు గుణములు, ఉష్ణవీర్యము. మధుర విపాకముగలది. బలము పుష్టి యిచ్చును. నేత్రములకు జబ్బుచేయును, పశువులకు తినిపించిన పాలు వృద్ధియగును,

తెలకపిండిచెట్టు:— చూ, పిండికొండచెట్టు.

తెల్లఆముదాలు:—సం. శ్వేతైరండ అనియు హిం. సఫేద్ అండ అనియు పేరు.

తెల్లఆముదాలు మధుర తిక్తకటు రసములు తీక్ష్ణసర గురుగుణములు, ఉష్ణవీర్యము. మధురవిపాకముగలవి. వాతము. ఉదావర్తము, కఫము, జ్వరము, కాస, ఉదరము, శోథ, శూల, కటి, వస్తి శిరోరోగములు బోగొట్టును. ఈగింజలనుండి తీసినతైలమునకును యివియేగుణము

లు యెఱ్ఱఆముదాల గుణములు దీనియందు కలవు. చూ. ఎఱ్ఱఆముదపుచెట్టు.

తెల్లకస్తురితీగ:—సం. యవతిక్త మహాతిక్త దృఢపాద శంఖిని, సూక్ష్మపుష్పి మహేశ్వరి అనియు హిం. శంఖినీ అనియు పేరు. ఇదితీగ జాతిలోనిది తీగయు కాయయు శివలింగాకారముగ నుండును. గాని శివలింగము యొక్క శిరసున నుండు తెలుపు మాత్రమీ కాయకుండదు. ఈకాయలోని గింజలు శంఖమువలె నుండును. గానదీనికి శంఖినియు శివలింగాకారముగ నుండునుగాన మహేశ్వరి యనియు మిగులచేదు గలది గనుక మహాతిక్తయనియు వేరుమిక్కిలి బలముగ నాటుకొనియుండునుగాన దృఢపాద యనియు సన్నని తెల్లని పూవులు బూచునుగాన సూక్ష్మపుష్పి యనియు దీనికి పేళ్లుకలిగెను.

ఇదికటుతిక్త రసములు, స్నిగ్ధసర గురుగుణములు, ఉష్ణవీర్యము కటువిపాకము గలది. శీఘ్రముగ శరీరమున వ్యాపించును. అగ్నిదీప్తికరము, జ్వరము, కృమి, విషదోషము, అతిసారము, చంటిబిడ్డలకు వచ్చు వివిధవ్యాధులు కుష్ఠము, ఆమము, రక్తదోషము, శోథ మున్నగు వ్యాధుల హరించును. విరేచనము చేయును.

తెల్లగురివెంద:—చూ. ఎఱ్ఱగురివెంద.

తెల్లదింతెన:—చూ. గంటెన.

తెల్లమిర్యాలు:—సం. సితమరిచ శిగ్రూత్థ, సితవల్లీజ అనియు; హిం. సఫేద్-మిరిచ అనియుపేరు.

యెండిన తెల్లమిర్యాలు కారము రుచి, రూక్ష తీక్ష్ణ గుణములు ఉష్ణవీర్యము, కటు పాకము గలది. దీపనము జేయును. కఫవాతములను హరించి పిత్తమును పెంచును. శ్వాస, శూల. కృమి హరించును. వీర్యమును వృద్ధిచేయును. పచ్చివియగు తెల్లమిర్యాలు కారమురుచి గురుగుణము ఉష్ణవీర్యము మధుర విపాకముగలవి. కొలదిగ వేడిచేయును. కొలదిగ శ్లేష్మమును పెంచును. పిత్తము హరించును. తెల్లమి



ర్యాలు నల్లమిర్యాలగుణముల నన్నిటిని గలిగియుండును. గానివిశేషముగ నేత్రవ్యాధులందుపయోగపడును. చూ. మిరియాలు.

తెల్లములక:—చూ ములక.

తెల్లరాజనాలు:—సం. శ్వేతశాలి, మహాశాలి అనియు, హిం. రాజశాలి అనియుపేరు. ధాన్యవిశేషము. వీనిఅన్నము తీపి రుచి గురుగుణము శీతవీర్యము మధురవిపాకము గలది. వీర్యపుష్టి బలము కాంతి ఆయువు తృప్తి కలిగించును శ్లేష్మమును పెంచును. తెలుపు యెరుపు నలుపు శాలిధాన్యములకును యివియే గుణములు. గాని తెల్లరాజనాలు శ్రేష్టము.

తెల్లవట్టివేరు:—సం. శ్వేతలామజ్జక అందురు. చేదురుచి లఘుగుణము శీతవీర్యము కటువిపాకము గలది. త్రిదోషహరము. దుర్గంధము తాపము దప్పి మూత్రకృచ్ఛ్ర రక్తపిత్తము మున్నగురోగములను హరించును. చూ. వట్టివేరు.

తెల్లవుప్పి:—నల్లఉప్పితో సమానగుణములు కలది చూడు. ఉప్పిచెట్టు.

తెల్లావాలు:—సం. సిద్ధార్థ అందురు. కటుతిక్తరసములు, ఉష్ణవీర్యముగలవి. చర్మరోగములు శోథ వ్రణముహరించును. యెఱ్ఱావాలయొక్క గుణములన్నియు దీనికిగలవు. గాని తెల్లావాలు విశేషముగ బాలగ్రహబాధలు భూత ప్రేత పిశాచబాధలు మున్నగు వానియందు ధూపార్థముగ నుపయోగింపనగును.

తెల్లసీమనేపాలము:—సం. భద్రదంతి, కేశరుహా, భిషగ్భద్రా ఆవర్తకి అందురు. కారము రుచి సర తీక్ష్ణగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. విరేచనము చేయును. శూల కుష్ఠు ఆమదోషము కృమి హరించును.

తేనె:—సం మాక్షిక, క్షౌద్ర, కుసుమాసవ, సారఘు, పుష్పరసోద్భవ, మార్ధ్వీక, వరటీవాంత అనియు, హిం. శహద్. మధు అనియుపేరు భ్రామరము, పౌత్తికము, క్షౌద్రము, మాక్షికము అని తేనె

నాలుగువిధములు. భ్రామరము తెలుపుగను పైత్తికము నేయియొక్క రంగుకలదిగ, క్షౌద్రము కపిలవర్ణముగ, మాక్షికము తైలవర్ణముగనుండును. మతాంతరమున పైత్తికము భ్రామరము క్షౌద్రము మాక్షికము ఛాత్రము ఆర్ఘ్యము ఔద్దాలకము దాళము అని యెనిమిది విధములు గలది.

తేనె సామాన్యముగ మధురకషాయరసములు, లఘుగుణము. శీతవీర్యము, ఆమ్ల విపాకము గలది. నేత్రములకు హితముచేయును. ఆశ్చ్యోతనము వ్రణలేపనము మున్నగు ప్రక్రియలందు పనికివచ్చును. భుజించినచో శరీరమందలి ఘనపదార్థముల కూటమిని విప్పును. దప్పి శ్లేష్మము విషము హిధ్మ రక్తపిత్తము మేహము కుష్ఠము క్రిమి ఛర్ది శ్వాస కాసలు అతిసారము అనురోగములను నశింపచేయును వాతమును పెంచును. వ్రణములపై పూసిన అందలి దుష్టమగునీరును వెడలించి ఆర్చును. రెండు మూడు ముఖములు గల వ్రణమును ఒకముఖముగల దానినిగ సంధానము చేయును. వ్రణచికిత్స యందు తేనెను బయట పూయుటకే గాని తినిపించుట కుపయోగింపరాదు.

భ్రామరమను తేనె తృప్తినిచ్చును. తీయగ నుండును. పైత్తికమను తేనె త్రిదోషములను ప్రకోపింప జేయును. క్షౌద్రమను తేనె గురుత్వము కలది శ్లేష్మమును పెంచును. శ్రేష్ఠమైనది. మాక్షికమను తేనె రూక్షగుణము స్వల్పమగు గురుత్వము మధురరసముగలది. వాతమును పెంచును. వ్రణచికిత్స యందుత్తమముగ నుండును.

తేనె బెల్లము పంచదార అనువస్తువులు ఒకసంవత్సరము నిల్వయుంచ బడిన యెడల శ్రేష్ఠములుగనుండును. పాతతేనె చులకగ దోషరహితముగ నుండును. క్రొత్తతేనె అల్పగుణములను బహుదోషములను గలిగి యుండును. కాచివడియ గట్టిన తేనె త్రిదోషహరముగను పచ్చితేనె పుల్లగ త్రిదోష కారిగనుండును. విషపుష్పములనుండి గూడ తేనెను తేనెటీగలు చేర్చును. గాన తేనెను ఉష్ణముగ నుండునపుడు



గాని ఉష్ణముగనుండు పదార్థములలో కలిపిగాని తినరాదు. అట్లుచేసిన విషసమముగ నుండును గాన లేహ్యాదులందు తేనెను చేర్చ వలసియుండు నెడ స్వాంగశీతలమున జేర్చదగును. తేనెమీది మీగడ పాతతేనె కంటె కొంచెము తీక్ష్ణముగ రూక్షగ లఘువుగ నుండును.

వేడినీళ్ళలో తేనెవేసి త్రాగిన ఊపిరిగొట్టునొప్పి తాంబూలమును మ్రింగినపుడు గలుగు గుండెనొప్పి తగ్గును. ప్రతిప్రాతఃకాలము నందును చల్లనినీళ్ళలో తేనెకలిపి త్రాగుచున్న స్థౌల్యరోగము నశించును. జ్వరమునందును లంఘనమునందును తేనెనువాడిన జ్వరమును బలపరచి త్రిదోషములను ప్రకోపింప చేయును. అల్లపురసమందు తేనెకలిపి త్రాగిన దగ్గుతగ్గును. అజీర్ణము కడుపుబ్బరము హరించును. నేయి తేనె సమభాగములుగ కలిపిన విషతుల్యముగ నుండును. దీనిని త్రాగిన చంపును. దీనికి విరుగుడుగ తెల్లపట్టుబట్ట కాల్చిన మసిని నీళ్ళలో వేసి త్రాగవలెను. గాయములు గలవారలకు తేనెహితముగను నవజ్వరితులకు అపథ్యముగనుండును. తేనెతో జేయబడిన మద్యమునకు మాధవమద్యమని పేరు. దీనిని సేవించిన శరీరమునగడ్డకట్టియుండు దుష్టపదార్థములకూటమిని విప్పును. తీక్ష్ణమైనది. మేహము పీనస, కాస, పోగొట్టును. సురయను మద్యములో తేనెజేర్చి చేయబడిన సురాసవము మధురముగ తీక్ష్ణముగ నుండును. మిక్కిలి మత్తుచేయును వాతమును హరించును.

తేయాకు:—సం. చాహా, చాహ అనియు హిం. చా; అనియు పేరు. ఇదివిదేశము నందలిఆకు. వావిలి యాకును పోలియుండును. మన దేశమందుగూడ కొన్నిచోట్ల పైరగుచున్నది. మొదట తేయాకు చీనా దేశము నందుండెడిది.

ఇదివగరురుచి, తీక్ష్ణ లఘుగుణములు, ఉష్ణవీర్యము. మధురవిపాకముగలది. కఫపిత్తములను హరించి కొద్దిగ వాతమును ప్రకోపింప జేయును. తేయాకు కషాయమును త్రాగిన నిద్రరాకుండ జేయును. చెమట పుట్టించును. జలుబువలన గలుగు శిరోభారము తగ్గించును ఆకలి బుట్టించును. అగ్నిదీప్తినిచ్చును. అలసట జెందినవారికి హితముగనుం

జేను. దడ, వాఋకు, మాంద్యము తగ్గించును. మొత్తముమీద తేయాకు కొన్నిసుగుణములను గలిగియున్నను ఉష్ణదేశ వాసులకు మలబద్ధము బుద్ధిమాంద్యము అజీర్ణము, పిత్తము, పిచ్చి మొదలైన దుర్గుణములను పుట్టించును

తేలుమణిచెట్టు:—సం. వృశ్చికాళీ, నఖపర్ణీ, పిచ్ఛిల, ధూమ్రపుష్ప సూతివల్లభ అనియు హిం. బిచ్ఛువా ఘాస్ అనియుపేరు. ఇదిక్షుపము ఆకులు చిన్నవిగ గరుకుగ ఉండును. చెట్టుచివర తేలుకొండివంటి వెన్ను వేయును.

ఇదిచేదు కారము రుచులు, లఘుగుణము, ఉష్ణవీర్యము, కటువిపాకముగలది. విరేచనము చేయును, మూత్రపుసంచి యందలి దోషములను రక్తపిత్తమును అరోచకమును పోగొట్టును. విదాహమును దగ్గును అణచును.

తృణకుంకుమ కేసరము:—సం. తృణకుంకుమ, తృణాస్ర, గ్రంథితృణ తృణపుష్ప అందురు. ఇది గడ్డిదినుసు మొక్క. దీనిపూవులు తెల్లగ సువాసనగలిగియుండును.

చేదు రుచి లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. కఫవాతములు శోఫ దురద తామర కుష్టు ఆమదోషము హరించును. దీని సమూల రసమును శరీరమునకు పూసిన శరీరమునకు మంచి కాంతి కలుగును.

తృణపంచమూలములు:—కుశదర్భ, రెల్లుదర్భ, కాకివెదురు, దర్భ, చెరకు యీఅయిదింటివేళ్ళకు తృణపంచమూలములనిపేరు. వీని కషాయము పిత్తజ్వరము దప్పి రక్తదోషము అమ్లపిత్తము స్త్రీరోగములు రక్తపిత్తము ప్రమేహము అను రోగములను నశింపజేయును.

తొగరుచెట్టు:—ఇది పెద్దవృక్షము. ఆకులు కొంచెము కోలగ నునుపుగ మర్రియాకులంత ప్రమాణముగనుండును. తెల్లనిపూవులును నిమ్మకాయలంత కాయలును కాచును. కాయలు గొగ్గుగనుండును. దీనిని మోలుగు మూలుగుచెట్టు అనియు వాడుదురు.



చెక్కరసము వగరు రుచి లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది కఫవాతములు కుష్ఠము దురద వ్రణము సర్పి మొదలుగాగల చర్మరోగములు, అజీర్ణ విరేచనములు అనువానిని జయించును. తొగరుకాయలను కూరగనండుకొని తినిన చర్మరోగులకు హితముగనుండును. మలబద్ధముచేయును. ఆలస్యముగ జీర్ణమగును. మూత్రమును జారీచేయును. బాగుగాపండినపండును దినిన మలమూత్రములను సాఫుచేయును. ఋతురక్తమును వెడలించును.

తోటకూర:—సం. మారిష, బాష్పక అనియు, హిం. మరసా అనియుపేరు. ఇది యెఱ్ఱతోటకూర, పెరుగుతోటకూర, కొయ్యతోటకూర అని మూడువిధములు. పెరుగుతోటకూర తెల్లగను, మెఱ్ఱది యెఱ్ఱగను, కొయ్యతోటకూర మెరుపు తెలుపు వర్ణములు కలదిగనుండును.

తెలుపు (పెరుగు) తోటకూర మధురరసము గురుగుణము శీతవీర్యము మధురవిపాకము గలది. మలబద్ధమును పిత్తమును చేయును. రక్తపిత్తమును హరించును. జఠరాగ్నినిసమముగ జేయును.

యెఱ్ఱతోటకూర తీపి ఉప్పు రుచులు గురు సరగుణములు శీతవీర్యము కటువిపాకము గలది. శ్లేష్మమును పెంచును కొద్దిదోషములు గలది

కొయ్యతోటకూర తీపి రుచి లఘు తీక్ష్ణగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. మిక్కిలి వేడిచేయును. యీకూర ఉబ్బురోగులకు హితమైనది. మలబద్ధముచేయును. కాకతత్వముగలవారికి కడుపుబ్బో మంట శూల తలనొప్పి పుట్టించును. ఇది అమితమైనవేడిచేయునదగుటచే సామాన్యముగ దీనిని గ్రామచిత్రమూలమందురు.

త్రికంటములు:—శొంఠి, తిప్పతీగ దూలగొండి యీమూడును చేరిన త్రికంటకమగును దీనికషాయము పిత్తజ్వరము నేత్రరోగము ఛర్ది తలనొప్పి అనువానిని హరించును.

త్రికటుకములు:—శొంఠి, పిప్పలి, మిరియము చేరిన త్రికటుకములనబడును, దీనికి త్ర్యూషణమనియు పేరు. వీనిచూర్ణము లేక కషాయము లేక కల్కము శ్వాస కాసలు, కఫము, గుల్మము, బోదకాలు కంఠరోగములు, కుష్ఠము, జలుబు పీనస, అగ్నిమాంద్యము, శూలకముపుబ్బురము మొదలగు వానిని జయించును.

త్రికర్షికము:—శొంఠి అతివస, తుంగముస్తలు, త్రికర్షికమగును. దీకిచూర్ణము లేకకషాయము జ్వరము శోథ పిత్తము వాతము భ్రమ ఆమము, శూల, అతిసారము, గ్రహణి అనురోగములను హరించును.

త్రిజాతము:—లవంగాలు యేలకులు ఆకుపత్రి లేకతాల్చిన చక్క అనుమూడును చేరి త్రిజాతమగును. వేడిచేయును. జఠరమును వృద్ధిపరచును మేహము శ్లేష్మపిత్తము హరించును. రుచిబుట్టించును.

త్రిఫలములు:—కరకకాయ ఒకటి తానికాయలు రెండు ఉశిరిగపండ్లు నాలుగు చేరిన త్రిఫలము లనబడును దీనిచూర్ణమును తినిన నేత్రవ్యాధులు దగ్గు ఆయాసము, కృమి, అజీర్తి నశించును. వీర్యవృద్ధి కలుగును కాయసిద్ధి నిచ్చును. చూర్ణమును వ్రణములపై చల్లినను కషాయముతో గడిగినను కురుపులు మానును. త్రిఫలకషాయముతో స్నానము చేయించి సాంబ్రాణి పొగను శరీరమంతట పట్టుచున్న బగ్గిసవాయి మానును.

త్రిసమము:—కరక్కాయ శొంఠి. బెల్లము అనుమూడు చేసి త్రిసమమగును. రుచిబుట్టించును. నేత్రరోగముల మాన్పును నాతిమును హరించును. మలమును వెడలించును వాతపిత్తముల హరించును

త్రిసుగంధము:—ఏలకులు, జాపత్రి, దాల్చినచక్క అను మూడును చేరిన త్రిసుగంధమగును వాతకఫ హరము వీర్యపుష్టి, జఠరదీప్తి గల్గించును. విషదోషము బోకడచును.

దంతి:—ఇది అడవులలో మొలచు చెట్టు. సాధారణమైనచెట్టు చెట్టుతీరున పొదవుగ వాడిగనుండుముండ్లను మందముగ కోలగ చిన్నవిగ



వగరుగనుండు ఆకులనుండును.

దీనివేరు విరేచనముచేయును. గుల్మము, ప్లీహ, అజీర్ణము మున్నగురోగములను హరించును. ఆకును నమిలిన నోటిపూతతగ్గును. చిగుళ్ళవాపుతగ్గును. దీనిని పొలపుదంతియని వాడుదురు.

దంతియిగుళ్ళను పదితులములు తెచ్చి రెండుతులముల పంచదార కలిపి నూరి ప్రతిపూటయుముమాత్ర మేతినవలెను. ఇట్లు 5 దినములు తినిన ఆకుపచ్చ పసుపుపచ్చ రంగులుగల దారుణ సెగరోగములుకూడ తప్పక నివర్తించును. సొరివము, మంట, పోటుతగ్గును. యిచ్చాపత్యము.

దంతిమూలము:—నేపాలపుచెట్టువంటి యొకచెట్టుయొక్క వేరు. నేపాలపుచెట్టునకు దీనికి భేద మేమియునుండదు. దీనివేరుమాత్రము వాడుదురు. పొలపుదంతిగుణముల నన్నిటిని గల్గియుండును. అంతకన్న మిగుల శ్రేష్ఠము.

దబ్బచెట్టు:—సం. బృహజ్జంబీర అందురు. ఇది నిమ్మజాతిలో చేరినది. కాయలు నిమ్మకాయలకంటె 5, 6 రెట్లు పెద్దవిగనుండును. తక్కిన స్వరూపాదులన్నియు నిమ్మచెట్టునే పోలియుండును. దబ్బఆకులు కొంచెము పొడవుగ నుండును. నారదబ్బ దబ్బ అని యిందు భేదములు కలవు.

నారదబ్బకాయ చేదు వగరు రుచులు సరగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలది. దీపనపాచనముల గలిగించును. పిత్తమును అణచును. నులుపురుగును చంపును.

దబ్బకాయ పులుపు వగరు రుచులు లఘు సరగుణములు శీతవీర్యము అమ్లవిపాకముగలది. దబ్బకాయపై పెచ్చు అజీర్తిచేయును. లోపలకేసరములు జీర్ణశక్తినిచ్చును. రుచిబుట్టించును, గొంతుకనొప్పి చేయును. పడిశెముదెచ్చును. విషమును పిత్తవికారములనుపోగొట్టును. దబ్బఆకులను మజ్జిగలో వేసిన మజ్జిగకు సువాసనవచ్చును. దానిని త్రాగిన తృప్తికలుగును. దప్పినణచును. దబ్బకాయకు నారింజకాయ గుణములన్నియుకలవు. చూ. నారింజకాయ.

దర్భ:—సం కుశ, దర్భ, సూచ్యగ్ర, యజ్ఞభూషణ అనియు హిం. కుశదాభ్ అనియు పేరు. జాతృణజాతిలోనిది. వేరు ప్రధానముగా గలది.

దర్భఆకు మధురకషాయరసములు స్నిగ్ధగుణము, శీతవీర్యము, మధురవిపాకముగలది. మూత్రకృచ్ఛ్ర, అశ్మరి, దప్పి, వస్తిరోగము, ప్రదరము, రక్తదోషము, పిత్తతాపము, స్త్రీల రజోదోషములు, శ్వాస, కామిల, విసర్పము, ఛర్ది, శూల, మూర్ఛ మున్నగురోగముల హరించును. దీనివేరునకును యివియేగుణములు.

దవనము:—సం. దమనక అనియు, హిం. దౌనా అనియు పేరు దవనము, అడవిదవనము, అగ్నిదవనము అని యిది మూడుజాతులు గలది. అగ్నిదవనము కారము రుచి రూక్షగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. రుచిబుట్టించును. మనోహరముగనుండును. వాతకఫములు గుల్మము ప్లీహ నశింపచేయును. చూ. అడవిదవనము.

దశమూలములు:—మారేడు దుందిలము, గుమ్మడి, కలిగొట్టు తక్కెడ, ముయ్యాకుపొన్న, కొలపొన్న, వాకుడు, పెద్దములక, పల్లేరు ఈపదింటివేళ్ళ సముదాయమునకు దశమూలములనిపేరు.

దశమూలకషాయము శ్వాసకాసలు శిరోరోగములు తంద్ర శోథ జ్వరము అనాహము అరుచి పక్షవాతము అను వానిని నశింపచేయును. త్రిదోషహరముగనుండును.

దానిమ్మచెట్టు:—సం దాడిమ, కుట్టిమ, ఫలషాడబ, రక్తబీజ అనియు, హిం అనార్ అనియు పేరు. తియ్యదానిమ్మ తీపి పులుపు దానిమ్మ పుల్లదానిమ్మ అని యిందు మూడుభేదములు.

తీపిపండ్లదానిమ్మ గింజలు త్రిదోషహరమైనవి. మరియు దప్పి తాపము జ్వరము హృదయ కంఠ ముఖరోగములహరించును. శుక్రవృద్ధిచేయును. మలబద్ధముచేయును. లఘుగుణము ఉష్ణవీర్యము కలది.

తీపి పులుపు రుచులుగల దానిమ్మపండు గింజలు లఘుగుణము



ఉష్ణవీర్యము మధురవిపాకముగలవి దీపనము చేయును. రుచిబుట్టించును. కొంచెము పిత్తమును పెంచును

పుల్లదానిమ్మపండు గింజలు ఉష్ణవీర్యము ఆమ్లవిపాకము లఘుగుణముకలవి. పిత్తమును పెంచి వాతకఫముల హరించును.

దానిమ్మపండు బెరళ్ళ చూర్ణము రక్తాతిసారము కృమి హరించును. మలబద్ధముచేయును. దానిమ్మపూవుల రసమును ముక్కులో పిండిన ముక్కులవెంటపడు రక్తము నాపును. దానిమ్మబెరడు చూర్ణమును వాయువిడంగరసముతో సాయంత్రము పరుండబోవునపుడు మ్రింగి ఉదయమున విరేచనౌషధము సేవించిన నులిపురుగులు పడిపోవును. ప్రసవమైనతరువాత కొందర స్త్రీలకు గలుగు యోని భ్రంశమునకు దానిమ్మచెక్క రసముతో కడిగి బెరడుచూర్ణమును చల్లిన యోనికిబిగువు కలుగును.

దానిమ్మచెక్క కషాయమును నోటిలో ధరించిన నోటిపూతతగ్గును. దానిమ్మచిగురు రససిందూరము కలిపి నూరి కుంకుడుగింజంత మాత్రచేసి చ్చిన రక్తగ్రహణి రక్తకాస తక్షణముతగ్గును.

లేతదానిమ్మకాయను పుటపాకముచేసి రసమునుపిండి అందు తేనె జేర్చి త్రాగిన అన్నివిధముల అతిసారముకట్టును.

దానిమ్మకాయబెరడు 2 పలములు, శర్కర 8 ప॥ లవంగపట్ట యేలకులు జాపత్రి యివి మూడు కలసి 1 ప॥ త్రికటుకములు 3 ప॥ ఈవస్తువులన్నిటిచూర్ణమునకు దాడిమాష్టకచూర్ణమనిపేరు. దీనిని సేవించిన రుచి అగ్నిదీప్తి కలుగును కంఠస్వరమును బాగుచేయును అతిసారము కాస జ్వరము నశించును.

దానిమ్మకాయ బెరడు 8 ప॥ శర్కర 8 ప॥ పిప్పళ్ళు నూడి వాముము మిర్యాలు ధనియాలు జీలకర్ర శొంఠి యివిప్రత్యేకము ఒకపలము తవక్షీరి 1 కర్షము. దాల్చినచెక్క యేలకులు జాపత్రి నాగకేసరములు యివి ప్రత్యేకము 1 కోలము, ఈవస్తువులన్నిటి చూర్ణమునకు

వృద్ధదాడిమాష్టకచూర్ణమని పేరు. దీనిని సేవించిన అతిసారము క్షయ గుల్మము సంగ్రహణి కంఠరోగములందు దానిమ్మబెరడు చేర్చబడును.

దాల్చినచెక్క:—సం. గుడత్వక్, వరాంగ. ఉత్కట అనియు హిం. దాలచీనీ అనియుపేరు. సింహళము మలబారు మొదలగు దేశములందు దాల్చినచెట్లు మొలచును. దీనిఆకులు తమాల పత్రములవలె నుండును. గులాబీపూవు వాసనగల తెల్లని పూవులు పూచును. యెండినఆకులకు లవంగపు వాసన యుండును. ఈచెట్టుబెరడునే దాల్చినచెక్క అందురు.

దాల్చినచెక్క కారము తీపి చేదు రుచులు, లఘురూక్ష గుణములు శీతవీర్యము, కటువిపాకము గలది. వాతపిత్తములు, కాస, కంఠరోగములు, అరుచి, ఆమము, యెక్కిళ్ళు, హృద్రోగము, పీనస దురద అర్శస్సు, కృమి, దప్పి మున్నగు రోగములను హరించును. వీర్యవృద్ధి జఠరదీప్తి కలిగించును.

దాల్చినచెక్క రసమును త్రాగిన నీళ్ళవిరేచనములు కడుపునొప్పి జిగటవిరేచనములు కట్టును. దీనిరసముతో యేలక్కాయ చూర్ణముచేర్చి యిచ్చిన రక్తవమనము కట్టును. దాల్చినచెక్క చూర్ణమును చిల్లగింజ గంధములో కలిపి మాత్రలుచేసి ప్రతిదినము రెండుచొ॥ తినిపాలు త్రాగుచున్న వీర్యస్తంభన వీర్యవృద్ధి కలుగును. శుక్లనష్టము కట్టును. మోతాదు కుంకుడు గింజంత.

దాల్చినచెక్కనుండి తీసిన తైలమును దాల్చిన అరఖు అందురు. దీనిని 2 మొదలు 5 చుక్కలవరకు తమలపాకునకు రాచి నమలిమ్రింగిన యెడల అగ్నిమాంద్యము వాతము దగ్గు ఎగరొప్పు ఆధ్మానము ఆక్షేపవాతము ఛర్ది గ్రహణి దంతరోగములు నశించును. యీతైలమును రాచిన దంతమాంసముల వాపు పుప్పిపన్నుబాధ తగ్గును.

దాసానిచెట్టు:—సం. ఓఢ్రపుష్ప, జపా, పాత్రికా, హరివల్లభా రక్తపుష్పి అనియు, హిం. ఓడహుల్, గుడహార్ అనియు పేరు. ఇది సాధారణమైనచెట్టు. ఉపవనములలో వేసి పెంతురు. ఇంచుమించు



దీనిఆకులు అడ్డసరపుఆకులవలె పెద్దవిగను, పూవులు ఎర్రగాముద్దవలె పెద్దవిగనుఉండును. ఇది పుష్పప్రధానమైన వృక్షము. దీనికి మందార చెట్టుఅనియు పేరుగలదు.

తీపి రుచి స్నిగ్ధగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. మలబద్ధముచేయును. వెంట్రుకలకు నలుపెక్కించును. వాంతిచేయును. గర్భిణీస్త్రీల గర్భమును పోషించును. క్రిములబుట్టించును తాపము ప్రమేహము అర్శస్సు ఇంద్రలుప్తము మొదలగు వానిని నశింపజేయును. మందారపువ్వునకుగూడ పైగుణములుండును. విశేషముగ వెంట్రుకలను వృద్ధిచేయుటకును రక్తవికారము స్త్రీల రజోవికారము పోగొట్టుటయందు ఉపయోగపడును. పువ్వు చేదు రుచి లఘుగుణము శీతవీర్యము కటువిపాకముగలది. మందారపూవుల కషాయమున పంచదార చేర్చి ఇచ్చిన తాపజ్వరము మేహము పిత్తము మూత్రకృచ్ఛ్ర యోనియందలి మంట నొప్పి పోటు తగ్గించును.

దింతెనచెట్టు:—చూ. గంటెన.

దిరిసెనచెట్టు:—సం. శిరీష, భండీర, మృదుపుష్ప, శుకప్రియ అనియు, హిం. సిరస్ అనియుపేరు. ఇది పెద్దవృక్షము. దీనికొమ్మలు మిక్కిలి పెళుసైనవి. ఈచెట్టు శాఖోపశాఖలుగా పెరుగునదగుటచే పందిరివలె ఛాయాప్రధానముగాకూడ ఉపయోగపడును. కాయలుపల్చగా బద్దలవలె పొడవుగను పూవులు కేసరములవలె సన్నగా మృదువుగా గుత్తులవలెనుండును. ఆకులు మునగాకువలె నుండునుగాని అంతకంటె కొంచెముపెద్దవి. పూవులకు కొంచెము పరిమళముండును. కాయలు 3 మొదలు 8 అం॥ ల వరకు పొడవుగనుండును. ఒకకాయలో పదిగింజలకంటె ఎక్కువఉండవు.

దిరిసెనచెక్క తీపి చేదు వగరు రుచులు లఘుగుణము కొలదిగ ఉష్ణవీర్యము కటువిపాకముగలది. వాపు విసర్పి దగ్గు వ్రణము విషము హరించును. కుష్ఠము దురద తామర మొదలగు చర్మరోగముల నన్నిటిని పోగొట్టును. ఆకురసమును కలికము వేసిన స్త్రీసంగమదోష

మును నివర్తించును. అనేక నేత్రరోగములు కుదురును. చక్కచూర్ణమును నరమూత్రములో కలిపి ఇచ్చిన పాము విషము నశించును ఆకు రసమును త్రాగిన అపరిశుద్ధ తాళక మణిశిలలను తినుటచే గలుగు వికారములు హరించును. విత్తులనుండి తీసిన తైలమును పదిమొదలు ముప్పది చుక్కలవరకు లోపలకు తినుచు పైకికూడ పూయుచున్న బొల్లి నశించును. తెల్లదిరిసెన నల్లదిరిసెన అని పూవుల భేదముచే రెండువిధములు. తెల్లదిమంచిది.

దీర్ఘరోహిషము:—సం. దీర్ఘరోహిషా, దృఢకారికా, దృఢచ్ఛదా అందురు. ఇది తృణజాతిలోనిది. పొడవుగ పరిమళముగా పెరుగును. ఆకులు చిన్నవిగ ఆకుపచ్చగ మనోహరముగ నుండును. దీనినుండి తైలముతీయుదురు. ఇది మిక్కిలి పరిమళయుక్తమైయుండును. రాజపుటానా మాళవదేశములందు అడవులలో నిది విశేషముగదొరకును.

ఇది చేదు కారము రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముకలది. కఫవాతములు భూతబాధ విషము వ్రణము నరుకు గాయము అనువానిని హరించును.

దుందిలపుచెట్టు:—సం. శ్యోనాక, శుకనాస అనియు, హిం. సోనాపాతా, అరళు, టేంటు అనియు పేరు. ఇది పెద్దవృక్షము. గురుపంచమూలములలో చేరినది. నాగదుందిలము దుందిలము అని ఇందు రెండువిధములుగలవు నాగదుందిలము కాయలు ఫిరంగికత్తులవలె పొడవుగా కాయచివర పాముతలయొక్క ఆకారముకలదిగ నుండును. రెండేసికాయలు జంటగాపుట్టును. ఇది ఆంధ్రదేశమున అరుదుగానున్నది. నాగదుందిలము మంచిది.

దీనివేరు చక్క వగరు కారము చేదు రుచులు రూక్షగుణము శీతవీర్యము కటువిపాకముకలది అగ్నిదీప్తి మలబద్ధము వీర్యము బలము గలిగించును. వాతపిత్తములు సన్నిపాతజ్వరము ఆగుచి ఆమవాతము క్రిమి ఛర్ది అతిసారము దప్పి దగ్గు శ్వాసకాసలు వస్తిరోగము అనువానిని జయించును.



దీని లేతకాయ వగరు కారము ఉప్పు తీపి రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. రుచిని అగ్నిదీప్తిని కలిగించును కంఠస్వరమును బాగుపరచును. గుల్మము వాత కఫార్శస్సులు క్రిమి నశింపచేయును.

ముదిరినకాయ గురుత్వముకలదిగ వాతమును ప్రకోపింప జేయునదిగనుండును. దీనిని పుటపాకముచేసి రసమునుపిండి త్రాగిన చిరకాలమునుండియున్న దారుణ అతిసారములు కుదురును. రెండువిధములైన దుందిలములు ఇంచుమించు సమానగుణములు కలవి. దుందిలపు చిగుళ్ళు కూరవండుకొని తినిన అకలిపుట్టును సులభముగ జీర్ణమగును. అన్నహితవు గలిగించును.

దుంపరాష్ట్రము:—సం. మహాభరి అందురు. దీనిరసము శ్వాసకాసలు వాతము మూలవ్యాధి అగ్నిమాంద్యము మొదలగు రోగములను పోగొట్టును. చంటిపిల్లలకు త్రాగించిన గొంతుకలో గురగుర లాడుట జలుబు తగ్గును. చూ. కలింగరాష్ట్రము.

దుప్పి:—ఇదియొకజంతువు. దీనిశరీరముపైన తెల్లని మచ్చలుండును. లేటివంటి ఆకారముగలది. దీనిమాంసము తీపి వగరు రుచులు గురుగుణము ఉష్ణవీర్యము మధురవిపాకము గలది. వీర్యపుష్టి బలము కాంతి గలిగించును. కఫవాతములు శూల గుల్మము హరించును.

దుప్పికొమ్ము అరగదీసి యాగంధమును పట్టువేసిన రొమ్ము తలనొప్పి మేహవాతపునొప్పులు కీళ్ళపోటు నశించును. కడుపునకు రాచిన కడుపుబ్బరము తగ్గును. దుప్పికొమ్మును మినపపిండిలో పెట్టి పుటమువేసిన తెల్లగభస్మమగును. దీనిని గుంజెత్తుమొదలు నాలుగు గుంజలెత్తువరకు పంచదార వెన్న మొదలగు అనుపానములతో నిచ్చిన తెల్లకుసుమ శూల మేహము అత్యుష్ణము జీర్ణజ్వరము పొడిదగ్గు శుక్లనష్టము తెల్లసెగ పచ్చసెగ అతిమూత్రము మొదలగురోగములు కుదురును.

దుష్టపుచెట్టు:—సం పయస్యా, అర్కపుష్పి, సూర్యవల్లిఅనియు, హిం. అంధాహులి, అర్కహులి, ధధియార్ అనియు పేరు. ఇది

తీగ బారును. ఆకుగిల్లినను అమితముగ పాలుగారును. ఆకులు గుండ్రగా కొనదేరియుండును. పూవులు గుత్తులుగా తెల్లగ అందముగ నుండును ఇది మిక్కిలి వేడిని గాఢవిరేచనమును చేయును. దారుణవాతరోగములు ఉబ్బు పాండువు ఆహికజ్వరము దగ్గు పాము తేలు విషములు యోనిశూలము మున్నగు రోగములను హరించును. దుష్టపుయిగుళ్ళు 5 మిరియాలు 3 కలిపి నూరి జ్వరమువచ్చుటకు వకగంటముందు మింగిన చలిజ్వరమును రాకుండ ఆపుజేయును.

దుష్టపుపాలతో పామును భావనచేసి విరోచనార్థమువాడనచ్చును. దీనియాకును ఆముదములో ఉడికించి వ్రణములకుకట్టిన మాన్పును వేరురసమును త్రాగిన ఋతుబద్ధమువిప్పును. గర్భిణులు త్రాగిన గర్భస్రావముచేయును. దీనివేరు చూర్ణమును పెరుగుతో కలిపి ఇచ్చిన గర్భదోషముల నివర్తించి స్త్రీలకు సంతానయోగ్యత నిచ్చును. వేరుగంధమును తేలుకుట్టినచోట రాచిన బాధనయమగును. పాముకాటుకులో పలకిచ్చుటకును పైకిగాయుటకుకూడ ఉపయోగించవలెను. దీనిని వాడునపుడు జాగ్రత తీసికొననియెడల దారుణ వమనవిరేచనములుచేసి చంపును. దీనిని జుట్టుగ చెట్టనియు వాడుదురు. దుష్టపాకురసముతో కాంతము అభ్రకము మొదలగువానిని నూరి పుటమువేసిన సిందూరింపజేయును. దుష్టపుపాలు పాషాణములను కట్టును. వాదవిద్యయందు దీనికిమిక్కిలి ఉపయోగముకలదు.

దూలగొండిచెట్టు:—సం. కపికచ్ఛు, ఆత్మగుప్త, శూకశింబి, కండూరా అనియు, హిం. కౌంఛ్, కివాంచ్ అనియుపేరు. ఇదితీగ. ఇందులో చిన్నదూలగొండి పెద్దదూలగొండి యని రెండుభేదములుకలవు. దీనిపూవులు కాయలు గూడ చిక్కుడు పూవులను కాయలను పోలియుండును. దూలగొండికాయలపైన విశేషముగ నూగుండును. గింజలుగూడ గుండ్రగ చిక్కుడుగింజలవలె ఉండును. కాయలపైనూగు శరీరమునకు తగిలినచో ఆప్రదేశము కోసినను తీరనంత దురదపుట్టును. చిన్నదూలగొండితీగ బారెకక్షుపము పెరుగును.



పెద్దదూలగొండివేరు మధురతిక్తరసములు గురుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. వాతము పిత్తము క్షయ శీతపిత్తము రక్తవికారము దుష్టవ్రణములు హరించును. వేళ్ళకషాయము త్రాగిన వాతజ్వరము హరించును. దూలగొండివేరు యాలక్కాయలు రసము తీసి పొంగించి త్రాగిన అజీర్ణవిరేచనములు కలరావ్యాధి నయమగును

పెద్దదూలగొండి విత్తనములు చూర్ణించి పంచదారకలిపి తినిన అమితవీర్యవృద్ధి కలిగించును. కామోద్రేకము సంభోగశక్తి మదము బుట్టించును. దూలగొండివిత్తులు యెనుగుపల్లేరువిత్తులు సీమగొబ్బివిత్తులు సమభాగముగ గ్రహించి చూర్ణించి ఆవుపాలతో ఉడకబెట్టి పంచదార కలిపి ప్రతి ప్రాతఃకాలమున దినుచున్న మితిమీరిన శుక్రవృద్ధియగును. వీర్యము గట్టిపడును. శుక్లనష్టము కట్టును. యేకారణముచేత కలిగిన మధ్య నపుంసకత్వమునైనను నశింపజేసి పుంస్త్వమును కలుగజేయును. దూలగొండివేరు పిండికొండవేరు కలిపి కషాయముకాచి త్రాగిన మూత్రము జారీచేయును.

చిన్నదూలగొండి వగరు చేదు రుచులు లఘుగుణము శీతవీర్యము కటువిపాకముగలది. వేరు రసమును త్రాగిన స్త్రీల యోని దోషములు హరించి గర్భధారణ యోగ్యతగలిగించును. నష్టసంతానముగల స్త్రీలకిది అమృతతుల్యము మరియు వాతపిత్తము సిధ్మ ఆధ్మానము కుష్ఠము వ్రణము రక్తదోషము అతిసారము మున్నగు రోగముల హరించును. వంధ్యలకు మిగుల హితమైనది.

దూలగోవిలచెట్టు:—సం. యాస, యవాస అనియు, హిం. జవాసా అనియుపేరు. దీనిని తీటకసివింద యనియు వాడుదురు. ఇందు తీటకసివింద పిన్నతీటకసివింద అని రెండుజాతులుకలవు. ఇవిక్షుపములు చెట్టునందంతట నూగుండును. చిన్నకాయలు కామంచికాయలకంటె కొంచెము పెద్దవిగ కాచును. యీచెట్టు శరీరమునకుతగిలిన అమితమైన దురద పుట్టును. ఆకులు చిన్నవిగ గుండ్రగ నుండును.

తీటకసివెంద తీపి వగరు చేదు రుచులు సర లఘుగుణములు శీత వీర్యము కటువిపాకముకలది. కఫపిత్తములు రక్తవికారము కుష్ఠము విసర్పము మేదోరోగము భ్రమ మదము వాతరక్తము దప్పి ఛర్ది శ్వాస తాపము జ్వరము హరించును. పిన్నతీట కసివెందకు యించుమించు యివియేగుణములు. పిన్నతీట కసివెందకు, సం. ధన్వయాస, దురాలభ, తామ్రమూలీ కచ్ఛురా అందురు,

దూసరితీగ:—సం. ఛిలిహింద మహామూల, పాతాళగరుడ అనియు, హిం. ఛిరేటా అనియు పేరు. ఇది తీగ బ్రాకును. వేరు మిగుల గాఢముగ నాటుకొనును. ఆకులు కొంచెముకోలగ చిన్నవిగ మిక్కిలి ముదురుఆకు పచ్చరంగుగలవిగనుండును. దీనికాయ చిన్నది పచ్చిదిగనుండునపుడు ఆకు పచ్చరంగుగ, పండినపిదప నలుపురంగుగ ఉండును.

ఇది మధురరసము గురుగుణము శీతవీర్యము మధురవిపాకముకలది. సమూలరసమునందు ఆవునేయిచేర్చి ప్రతియుదయమునను త్రాగిన ఉన్మాదము చిత్తభ్రమ తగ్గును. పంచదార కలిపి త్రాగిన మూత్రకృచ్ఛ్ర పిత్త తాపము దప్పి కట్టును. ఆకునుకూరవండుకొని తినినను ఆకు రసమున గవ్వపలుకు సాంబ్రాణి చూర్ణమునువేసి త్రాగినను మధుమేహము తగ్గును. పిత్తముహరించును. నిత్యాక శరీరము యెండిపోవుట మానును. దీనిపసరును నీళ్ళలోపోసిన పసరు కొంతసేపటికి గడ్డకట్టును. దానిని యెండించి పటికిబెల్లపుచూర్ణము కలిపి దినమునకు మూడుసార్లు తినుచున్న వారము దినములకు సెగరోగము నయమగును. మోతాదు రెండుతులములు, మరియు దూసరియాకుస్వరసము విషదోషము రక్త వికారము తాపము పిత్తము మున్నగురోగములను హరింపచేయును. విరేచనముచేయును దగ్గునుతగ్గించును. అగ్నిదీప్తి బలము వీర్యము గలుగజేయును.

దేవదారు:—సం. సురదారు, భద్రదారు, పారిభద్రక, కిలిమ అనియు, హిం. దేవదారు అనియు పేరు, ఇది పెద్దవృక్షము. ఆకులు



గుండ్రగ చిన్నవిగనుండును. దీనిపండ్లు పగడమువలె యెర్రగ చిన్నవిగ రుచిగనుండును.

దీనిచెక్క చేదు రుచి ఉష్ణవీర్యము లఘుగుణము కటువిపాకము గలది. శీతపిత్తజ్వరము మెరుపు తెలుపు కుసుమరోగములు కఫవాతములు కృమి వాపు ఎక్కిళ్ళు జ్వరము ప్రమేహము పీనస దురద వీనిని హరించును. దేవదారుఆకును కూరవండుకొని తినిన కడుపులోని నులిపురుగులు చచ్చును. దేవదారుకట్టెలనుండి పాతాళ యంత్రమున తీసిన తైలము లేక ద్రావకము యెర్రగ చిక్కగనుండును. యీతైలమును పూసిన సవాయిపుండ్లు మచ్చలు దద్దుర్లు తామర చీడ కుష్ఠు మొదలగు సకల చర్మరోగములు నశించును. పంచదారమున్నగువానితో వేసి లోపలకుగూడ పుచ్చుకొనవచ్చును. యోనిదోషములు ప్రదరము మొదలగు వ్యాధులందది అమోఘముగపనిచేయును.

దేవనళము:—సం. మహానల వన్య దేవనాళ అనియు, హిం, నరసల్ అనియు పేరు. ఇది వెదురువలె జలప్రాయ ప్రదేశములందు పుట్టును. దీనిఆకులు చెఱకుఆకులవలె నుండును. ఆకారమంతయు చెరకు నేపోలియుండును గాని చెరకుకన్న యిది మూడురెట్లు యెక్కువగ పెరుగును. చెరకునకువలె దీనికిని వెన్నుపుట్టును. దీనినాళములనడుమ వెదురునకువలె బోలుండును, నలము దేవనళము అని యిది రెండువిధములు. నళమునకు, సం. నల పోటగళ శూన్యమధ్య ధమన అని పేరు.

నళము మధురతిక్త కషాయ రసములు ఉష్ణవీర్యము గురుగుణము మధురవిపాకముగలది. కఫము రక్తదోషము హృద్రోగ వస్తిరోగ యోనిరోగములు తాపము పిత్త విసర్పము హరించును. దేవనళమునకుగూడ యివియేగుణములు. అయినను దేవనళము శ్రేష్ఠముగ నుండును ఇది రసకర్మయందుత్తమముగ నుపయోగపడును.

దేశవాళీనేపాలము:—సం. బృహద్దంతి గుచ్ఛఫల, దుగ్ధగర్భ అనియు, హిం. ముగలాయి అండ అనియు పేరు. పెద్దచెట్టు. ఆకులు మానుతెల్లగనుండును. కాయలు గుత్తులుగకాయును. కొమ్మవిరిచిన

నీళ్ళవంటి పాలుగారును. ఇది కారము రుచి లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. జఠరరోగము అర్శస్సు వ్రణము అశ్మరి శూల చర్మరోగములు అనువానిని హరించును. దీనిపాలు పూసిన మేహవాతపునొప్పులు తగ్గును. దీనిగింజలు మధురరసము గురు స్నిగ్ధగుణములు ఉష్ణవీర్యము మధురవిపాకముగలవి విరేచనముచేయును. బలము వీర్యము గలిగించును. వాంతిచేయును. కఫపిత్తములను పెంచును. వాతము తాపము పుట్టించును. ఇవి విషతుల్యములు. శోధనముచేయక నుపయోగింపరాదు. దీనిని నేపాలములవలె శుద్ధిచేయనగును.

దేశవాళీబాదాం:—సం. క్షుద్రబాదామ, క్షుద్రబీజ,అందురు. ఇది పెద్దచెట్టు. ఆకులు పెద్దవిగ మృదువుగ కొనదేరక పొడవుగ నుండును. విస్తరికుట్టి భోజనముచేయుట కుపయోగింతురు. కాయలు గుత్తులు గుత్తులుగ కాయును. పచ్చివి ఆకుపచ్చగను, పండినపుడు యెఱ్ఱగను ఉండును. చెట్టుకొమ్మలు మిగుల పెళుసుదనముకలవి.

ఇది పుల్లుపు తీపి వగరు రుచులు శీతవీర్యము గురుగుణము ఆమ్లవిపాకముగలది. మలబద్ధముచేయును. పిత్తముహరించును. కఫ శుక్రములను వృద్ధిచేయును.

దొండచెట్టు:—చూ. తియ్యదొండ.

దొగ్గలికూర:—సం. కుణాంజర, కుణాంజీ, అరణ్యవాస్తుక అనియు, హిం. లేసువా అనియుపేరు. ఇదితీగె. యెఱ్ఱగ తెల్లగ నుండును. వర్షఋతువునందు బయలుదేరును. కూరవండుకొని తిందురు. ఇది తీపి కొంచెము వగరు రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము మధురవిపాకము గలది. త్రిదోషహరము. అగ్నిదీప్తి మలబద్ధము జేయును. పిత్తశ్లేష్మముల హరించును.

దోసతీగ:—సం. కర్కటి, ఏర్వారు, వ్యాళపత్రి, తోయఫల యనియు హి. కకడీ అనియుపేరు. ఇది తీగజాతిలోనిది. ఆకులు వెడల్పుగ గరగర లాడుచుండును. పసుపుపచ్చనిపూవులును లావుగ కొంచెము కొలగ నుండు కాయలును ఉండును. ఇందుఅనేక జాతులు గలవు. పచ్చికాయ ఆకుపచ్చగను పండినపుడు తెలుపు పసుపు పచ్చరంగులుగను ఉండును.



దోసఆకు కూరవండుకొని తినిన పిత్తముహరించును. దోసకాయపచ్చిది మధుర రసము గురుగుణము, శీతవీర్యము, మధురవిపాకము గలది. మలబద్ధము జేయును. పిత్తము హరించును. బాగుగా పండినది జఠరము పిత్తము మూత్రము దప్పిఅనువానిని వృద్ధిచేయును. రుచిబుట్టించును. సంతాపమును మూర్ఛను పోగొట్టును. వాతప్రకోపమును గల్గించును. ఛర్దిని ఆపును. దోసపండ్లవరుగు కూరవండుకొని తినిన సులభముగ జీర్ణించును. పథ్యముగనుండును. శరీరమందలి నీరుఆర్చును. దోసకాయను తిని నీరుత్రాగిన జలుబు చేయును. దగ్గుపుట్టును. అజీర్తిచేయును. దోసగింజలపప్పును వేయించి పటికబెల్లము కలిపితినిన వీర్యవృద్ధి బలముకాంతి గల్గించును. మూత్రమును జారీచేయును. దోసగింజల కషాయమును త్రాగిన మూత్రకృచ్ఛ్ర అశ్మరి నశించును. మేహశాంతి చేయును. యూనానీ సంప్రదాయమున విశేషముగవాడుదురు.

అడవిదోసకాయ చేదురుచి ఉష్ణవీర్యము లఘుగుణము కటువిపాకముగలది. విరేచనముచేయును. కఫము, కృమి, పిత్తము, దురద, జ్వరము హరించును. చూ. చేదుదోస, పందిరిదోస, ములుదోస.

ద్రాక్ష:—సం. ద్రాక్ష, మధురరస, మృద్వీక, గోస్తని, తాపసప్రియఅనియు, హిం. దాఖ్ అనియుపేరు. నల్లద్రాక్ష తెల్లద్రాక్ష అని ద్రాక్ష రెండు విధములు.

ద్రాక్షపండు తీపి వగరు రుచులు గురు స్నిగ్ధగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. అన్నిపండ్లలో ఉత్తమమైనది. నేత్రములకు హితమైనది. బలము శుక్రవృద్ధి గలిగించును. మలమూత్రములను వెడలించును. వాతము వాతపిత్తము నోరుచేదు కామిల మదాత్యయము దప్పి వాతరక్తము శ్వాసకాసలు ఉదావర్తము శ్రమ స్వరభేదము క్షతక్షయము అనువానినిహరించును. రుచిబుట్టించును. పొట్టలో వాతము

ను పుట్టించును. కఫమును పెంచును. మూత్రకృచ్ఛ్ర మేహము హరించును. పర్వతములందు పుట్టు దాడిమతీగయొక్క పండ్లు పుల్లగనుండును. శ్లేష్మపిత్తములను పుట్టించును. ఇవి కలిపె పండ్లయొక్క గుణములన్నిటిని గల్గియుండును.

తేత దాడిమపండు ఉష్ణవీర్యము విశదగుణము పులుపు రుచి అమ్లవిపాకము గలది. పిత్తరక్తమును పుట్టించును. కొంచెము ముదిరిన పచ్చిదాడిమపండు పులుపు తీపి రుచులు గలది. రుచి అగ్నిదీప్తి కలిగించును. నల్లదాడిమలకు నివియే గుణములు

దాడిమపండు 50 పలములు తొక్కి రెండుద్రోణముల యుదకములోవేసి నాల్గవవంతు మిగులునట్లుకాచి వడియగట్టి చల్లారినపిదప ఆకషాయమునందు బెల్లము 200 పలములు దాల్చినచక్క యేలకులు జాపత్రి. నాగకేసరములు ప్రేంకణము, మిర్యాలు పిప్పళ్ళు, వాయువిడంగములు వీనిచూర్ణము ప్రత్యేకము ఒకపలముచేర్చి యొకకుండలో బోసి పైన మూతపెట్టి చీరజేసి యొకమాసము నిలువయుంచి తీసివడియగట్టుకొనవలెను ఇదియ దాడిమారిష్ట మనబడును. దీనిని పలము మొదలు రెండు పలములముల వరకు త్రాగుచున్న ఉరఃక్షతము క్షయ దగ్గు ఉబ్బసము కంఠరోగము నశించును. రక్తశుద్ధి రక్తవృద్ధి బలము కాంతి గల్గించును సకాలమునకు విరేచనము చేయును.

దాడిమపండు 100 తులములు, పటికిబెల్లము 400 తు॥ రేగువేరుచక్క 50 తు॥ ఆరెపూవు 25 తు॥ పోకచక్క, లవంగము, జాపత్రి' జాజికాయ, దాల్చినచక్క, పెద్దయేలకులు. ఆకుపత్రి, శొంఠి, మిర్యాలు చన్నపిప్పళ్ళు. నాగకేసరాలు, రూమిమస్తకి. అక్కలకర్ర, చంగల్వకోష్టు ఇవిప్రత్యేకము 10 తు॥ అన్నిటికి నాలుగురెట్లు ఉదకములో పైవస్తులను నలియగొట్టివేసి మట్టిపాత్రలోనుంచి దృఢముగ చీరజేసి 14 దినములు భూమియందు పాతిబెట్టి 15 వ దినమున పైకితీసి బాగుగాచేతితో పిసికి అర్కయంత్రమునందుంచి వండవలెను. అట్లు వండి తయారుచేసిన దాడిమకమునందు కుంకుమపూవు 2 తు॥ కస్తూరి 1 మాషముచేర్చి గా



జుబిరడాగల సీసాలో భద్రపరచవలెను. తయారైన పిదప మూడు నెలలవరకు మందు సేవించరాదు. దీనిని బలానుసారము సేవించిన దౌర్బల్యము శ్వాసకాసలు క్షయ మలబద్ధము ఊపిరి తిత్తులలోని జబ్బులు కుదురును. ఇదియ దాడిమాసవమనబడును. ఇది అత్యుత్తమయోగము

దాడిమపండు కరక్కాయ నేలయుసిరిగ కళింగరాష్నము కర్కాటకశృంగి దూలగొండివేరు పిప్పలి యెఱ్ఱగలిజేరు తెల్లగలిజేరు వాకుడువేరు వీని కషాయచూర్ణమునకు దాడిమాదిక్వాథ చూర్ణము అని పేరు. దీనికషాయమును త్రాగిన క్షయ ఉబ్బసము కాస మొదలగు సకల విధములగు దగ్గులును కుదురును. ఇది సింహళదేశమందు విశేషముగ వాడుకచేయు యోగము.

దాడిమపండ్లనుండి తీసిన విదేశీయమైన సారాయము అనగా "వైన్" తీపిగ కొంచెము గాటుగనుండును. కొంచెము మత్తుచేయును. చురుకు బుద్ధి వికాసము ఆకలి రక్తము బలము ఉత్సాహము పిత్తము అనువానిని పుట్టించును. అగ్నిదీప్తినిచ్చును. చిరకాలము వ్యాధిపీడితులై బలమును గోలుపోయినవారు కొంచెము కొంచెముగ పుచ్చుకొనుచున్న సత్త్వము రక్తబలము కలుగజేయును. విశేషముగ త్రాగిన మిగుల మేహశాంతిచేసి వంజునుబుట్టించును.

ద్రోణీలవణము:—సం. ద్రౌణేయ, వార్ధేయ, వార్ధిజ, వార్ధిభవ అందురు. ఇది కొద్దిగ వేడిచేయును. విదాహమును, బుట్టించదు. మలమును భేదించును. స్నిగ్ధముగనుండును. కొలదిగ పిత్తముజేయును. శూలలనుహరించును.

ధనియాలు:—సం. ధన్యాక, ధాన్యక, కుస్తుంబురు, వితున్నక అనియు, హిం. ధనియా అనియు పేరు. చిన్నమొక్క. ఆకు నల్లివాసనగనుండును. చిల్లలుచిల్లలుగల మృదువైన ఆకులును గుత్తులు గుత్తులుగ తెల్లగ చిన్నవిగ నుండు పూవులును ఉండును. గింజలు గుండ్రగ పరిమళముగ పచ్చిగనున్నపుడాకుపచ్చరంగు. యెండినపిదప గోధుమవర్ణము కలవిగనుండును. ధనియపుమొక్కలకు కొత్తిమీరమొక్కలని పేరు. కొ

కొత్తిమిరిఆకులను చారు పులుసు పచ్చడి మున్నగు వ్యంజన పదార్థములలో కలిపి తిందురు.

ధనియాలు తీపి వగరు రుచులు కొంచెము ఉష్ణవీర్యము లఘుగుణము మధురవిపాకముగలవి. జ్వరము కాస దప్పి ఛర్ది కఫము అరుచి మున్నగువానిని జయించును. దీపన పాచనముల గలిగించును. ఉష్ణము వలన గలుగు విరేచనములనాపును. ధనియాలరసమునందు పంచదార చేర్చి త్రాగిన ఎక్కువైన పిత్తతాపము విదాహము కట్టును. ఆకలిని అన్నహితమును కలిగించును. ధనియాల కషాయమున పాలు పంచదార చేర్చి త్రాగుచున్న నిద్రపట్టించును. తలత్రిప్పు మూత్రమువెంట జారిపోవు శుక్రమును ఆపుచేయును. దీనిరసమునందు రేవల్చిన్ని చూర్ణము కలిపి యిచ్చిన మూత్రము ధారాళముగ వెడలును. నేతితో వేయించిన ధనియాల చూర్ణముతో ఉప్పు కారము కలిపి అన్నములో కలుపుకొని తినిన అన్నము సులభముగ జీర్ణింపచేయును. పథ్యముగనుండును. రుచిబుట్టించును. పచ్చిధనియాలకును యివియే గుణములు. విశేషముగ పిత్తమును హరింపచేయును కొత్తిమిరీఆకు పిత్తమును హెచ్చించును. వేడిచేయును. రుచికరముగ నుండును.

ధూమము:—సాంబ్రాణి గుగ్గిలము మున్నగువానిని నిప్పుపై వేయగా వచ్చిన పొగబట్టిన విషవాయువులు హరించును. ఆరోగ్యముగ నుండును. కురుపులు మొదలగువానికిని మశూచికము పొంగు మొదలగు రోగములుకలవారలకును పొగబారనిచ్చిన త్వరలో వ్రణములుఆరును. క్రిములు పట్టకుండజేయును. దుర్గంధమును తగ్గించును. అగ్నియందు నేయి మున్నగు హోమద్రవ్యములను వేల్చునపుడు వచ్చెడు ధూమము శరీరమునకు తగిలిన ఆయుర్వృద్ధి ఆరోగ్యముకలుగును. శవములు గోళ్ళు వెండ్రుకలు కాల్చునపుడువచ్చు పొగ తగిలిన ఆయుఃక్షీణము రోగములు కలుగును. దరిద్రకరము, అలవాటులేనివారు పొగఆకు చుట్టలను కాల్చిన ధూమమును పానముచేయుటవలన సొలసిపోవును. వికారము పెట్టును. వాంతియగును. అభ్యాసముగలవారికి దగ్గు శ్లేష్మములు తెగును



విరేచనమగును. శరీరమునందు పొగాకుయొక్క విషమువ్యాపించి ఆహికజ్వరము మున్నగు అనేకరోగములను క్రమముగ కలుగచేయును. స్నిగ్ధము మధ్యము తీక్ష్ణము అని త్రివిధములగు ధూమమును మెడకొంకులకుపైనుండు ప్రదేశములందు కఫవాతములచే రోగములు కలుగకుండుటకును, కలిగిన రోగమునను నివర్తి చేయుటకును, అగరు గుగ్గిలము తామరపూవులు ఏలకులు పసుపు దశమూలములు మున్నగు వానితో చేయుట వానిక్రమములు కాలములు సవిస్తరముగ చరకాదులందు చూడనగును. గ్రంథవిస్తరభీతిచే వ్రాయబడలేదు.

నందివర్ధనము:—సం. కింకిరాత, కింకిరాట, పీతక, శీతభద్రక అనియు, హిం. కింకిరాత్ అనియుపేరు. క్షుపము తెల్లనిపువులు పూచును. ఆకులు స్నిగ్ధముగ పెళుసుగ నలుపుకలసిన ఆకుపచ్చరంగుగ నుండును. పుష్పవనములలోవేసి పెంతురు. ఇందు ముద్దపువ్వులు ఒంటిరేకు పూవులు పూచుచెట్లు రెండువిధములుగ నుండును.

నందివర్ధనము చేదు వగరు రుచులు లఘుగుణము శీతవీర్యము కటువిపాకముగలది. విషము క్రిమి శోథ శ్లేష్మము దప్పి తాపము ఛర్ది రక్తదోషము జ్వరము మేహము అను రోగములను హరించును. పూవులను నీళ్ళలో ఒకగంటసేపు నానబెట్టి రాత్రిపూట కన్నులపై వేసి కట్టినయెడల అత్యుష్ణమువలన నిద్రాభంగమువలనను గలిగిన కండ్ల యెరుపు మంట తగ్గును. చలువచేయును. సమూలరసము సందికొక్కు విషమును హరించును.

నందివృక్షము:—చూ. తూని.

నకచికిని:—సం. ఛిక్కనీ. క్షవకృత్ ఘ్రాణదుఃఖదా అనియు, హిం. నకచికినీ అనియు పేరు. ఇదియొక తీగ. ఆకులు చిన్నవిగ తీగ సన్నముగనుండును. ఆకును నలపి వాసనజూచిన అమితముగ తుమ్ములువచ్చును. దీనికి దురదయుండును. ఆకు చేతితో నలిపి యెండలో చూపిన చేతులు తళతళలాడును. వాదవిద్యయందు అనేక విధములు దీనికి ఉపయోగములుకలవు. తామ్రాదులకు స్వర్ణచ్ఛాయ కలిగించునది

గాపున గాబోలు దీనిని వాదజ్ఞులు "రంజనీ" అని వాడుదురు. దీని రసమువలన మృద్దారుశృంగము తెల్లగ భస్మమగును. గాని వైద్యమునం దుపయోగించరు.

కారము వగరు రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. అగ్నిదీప్తినిచ్చును. సకల చర్మరోగములను పోగొట్టును. తినుటకును పైకి పూయుటకును గూడ ఉపయోగింప నగును. వాతరక్తము కుష్ఠము క్రిమి వాతకఫములు మున్నగు రోగములందు విశేషఫలప్రదమైనది. బొల్లి గ్రహబాధ రక్తదోషము దృష్టిదోషము మున్నగు వానికిగూడ ఉపయోగించును.

నక్కదోస:—సం. పీనస, శ్లక్ష్ణవృంత అందురు. నక్కదోసతీగ చేలగట్లయందు విశేషముగ పెరుగును. ఆకారమంతయు దోసను పోలియుండును గాని కాయ, ఆకు, తీగ మిక్కిలి చిన్నవి. నక్కదోస ఆకు చేదు రుచి లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది. పిత్తము క్రిమి గుల్మము జ్వరము శ్లేష్మము హరించును. నక్కదోసకాయ కొంచెము ఉప్పగనుండును. కఫవాతములను హరించి పిత్తమును పెంచును. రుచిని అగ్నిదీప్తిని కలిగించును. హృదయమునకు మేలుచేయును. అష్ఠీలమును అనాహమును పోగొట్టును. లఘువుగనుండును.

నక్కపీతిరిచెట్టు:—దీనిని నక్కపెంటిక చెట్టనియు వాడుదురు. భూమినంటియుండు చిన్నమొక్క. చెట్టునందంతటను నక్కపెంటికలను పోలిన కంతులవలెయుండు ఆకారములనుగలిగియుండును. లోపలకు తినుటకుపయోగింపరు. గాని దీని సమూలము కాల్చి మసిచేసి యాముదములో కలిపి రాచిన గజ్జి చిడుము చీడ కార్పాణి కురుపులు తప్పక మానును.

నక్కమాంసము:—త్రిదోషములనుహరించును. కారము రుచి గలది గంధర్వరోగము సమస్తవాతములు క్షయ హరించును. ధాతుపుష్టి శరీరపుష్టి బలము గలిగించును. ఇది శరీరమునందలి నీరును ఆర్చు స్వభావముకలదిగాన ఉబ్బురోగులకు పథ్యముగనుండును. నక్కకొమ్ము



ను అరగదీసి కంటిలోబెట్టిన భూత ప్రేత పిశాచములు వశ్యములగునని చెప్పుదురు.

నక్కవిరిగిపండు:—ఇది విరిగిపండుకన్న చిన్నదిగనుండును. చేదు తీపి రుచులు గురుగుణము ఉష్ణవీర్యము కటువిపాకము గలది. పిత్తము మేహము గ్రహణి మున్నగురోగములను కలిగించును. అపథ్యమైనది.

నక్కెరచెట్టు:—సం. కర్బుదార, బహువార అనియు, హిం. లిసోడా, నిసోరే, లభేరా అనియు పేరు. అరణ్యములలో పెరుగునట్టి పెద్దవృక్షము. దీనిఆకులు గుండ్రగ కొంచెము కోలగనుండును. పండ్లుగుండ్రగ కుంకుడుకాయలంత పెద్దవిగ మిక్కిలినున్నగ పచ్చిగనున్నపుడు ఆకుపచ్చ, పండినపుడు లేత గులాబీరంగుగ నుండును. పండుయొక్క చర్మము మిగుల దళసరిగనుండును.

నక్కెరకాయ తీపి వగరు రుచులు చేదు లఘుగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. పిత్తము తాపము మేహము అణచును. కాకతత్వముగలవారల కారోగ్యముగనుండును. వాతమును పెంచును. మలబద్ధము చేయును.

బాగుగాపండినపండు మధురరసము స్నిగ్ధ రూక్షగుణములు శీతవీర్యము మధురవిపాకముగలది. వాతపిత్తముల హరించును. రక్తదోషమును పోగొట్టును. మలబద్ధముచేయును.

చెక్కచూర్ణము లేక కషాయము కారము వగరు తీపి రుచులు స్నిగ్ధగుణము శీతవీర్యము కటువిపాకముగలది. వెంట్రుకలకు నలుపెక్కించును. శూల ఆమదోషము రక్తవికారములు విస్ఫోటము వ్రణము పిత్తము విసర్పము సకలవిషములు హరించును.

నక్కెరాకును కూరవండుకొని తినిన వాతపిత్తములు హరించును రుచిబుట్టించును. వగరుగలదిగాన మలబద్ధముచేయును.

నఖముచిప్పలు:—సం. నఖ, వ్యాఘ్రనఖ, చక్రకారక అనియు, హిం. నఖీ, ఛోటనఖీ అనియుపేరు నఖమనునది అయిదు విధములుగనున్నది. ఒకటి రేగుఆకంతయు, రెండవది నల్లకలువ రేకంతయు,

మూడవది గుర్రపుడెక్కంతయు, నాల్గవది యేనుగుచెవియంతయు, అయిదవది పందిచెవియంతయు నుండును. ఇవి నదులలో పుట్టు ఒకవిధముగు జంతువుల అస్థిపంజరములు. సుగంధముకలవిగ నుండును. గాన సుగంధతైలముల పాకములలోనివి చేర్చబడును. గుర్రపుడెక్కంత నఖములు అనేక ఔషధయోగములలో చేరునని చరకాచార్యులు వ్రాయుటచే అయిదింటిలో నిది యుత్తమమని యూహించనగియున్నది.

నఖములు కారము తీపి రుచులు లఘుగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలవి. గ్రహబాధ శ్లేష్మవాతములు రక్తదోషము వ్రణము విషము అలక్ష్మి ముఖదుర్గంధము కుష్ఠము దురద మున్నగురోగములహరించును. శుక్రము కాంతి బలము పుష్టి గలిగించును. నఖమును శుద్ధిచేయక నుపయోగించిన రోగకారణమగును. గాన శోధనముచేసి తినవలెను. పంచపల్లవముల కషాయముతో మామిడి నేరేడు వెలగ మారేడు ఫలము మారేడు వీనిచిగుళ్ళు, కడిగిన నఖము సాధారణముగా శుద్ధిజెందును. లేక గోమయరసము చింతాకురసము కరక్కాయ కషాయము బెల్లపునీరు అనువానితో ఉడకబెట్టినను శుద్ధిపొందును. ఇది విశేష విధానము.

నత్తలు:—సం. శంబూక. కోశస్థ, లఘుశంఖ, శంఖనక అనియు, హిం. ఘోంఘా అనియు పేరు. ఇవియు నీటిలోనుండు ఒకవిధముగు క్షుద్రజంతువులు, శంఖముల ఆకారముగలిగి యుండును. గాని శంఖములకన్న చాలచిన్నవి.

కటురసము సర లఘుగుణములు శీతవీర్యము కటువిపాకముగలది. నేత్రరోగములు ఆస్ఫోటము శీతజ్వరము హరించును. దీపన పాచనముల గలిగించును. మలబద్ధముచేయును.

చచ్చిపోయిన నత్తగుల్లలు గాల్చిన సున్నమగును. దీనిని తినిన శూల కడుపుబ్బరము అజీర్ణము నశించును. ప్రత్యేకముగ దీసిన నోరుపుండగును.

నమ్మకుంప:—చూ. కోవెలుంప.



నరమామిడి:—చూ. అశోకము.

నలిక:—సం. విద్రుమలత, కపోతచరణ నటి. ధమనీ అందురు. ఇదియొక సుగంధద్రవ్యము. పగడపుతీగవలెనుండును. పక్కాముగ సుగంధిద్రవ్యము అని ఆంధ్రదేశమున పిలుతురు. ఉత్తరహిందూస్థానమున విశేషముగ వాడుకయైయున్నది.

ఇది కటు తిక్త మధుర రసములు సర లఘుగుణములు శీతవీర్యము కటువిపాకముగలది నేత్రరోగము వాతపిత్తములు రక్తపిత్త కృమి విష కఫవాతోదరములు శూల అశ్మరి మూత్రకృఛ్రి రక్తదోషము దప్పి దురద కుష్ఠము జ్వరము వ్రణము దుర్నామరోగము అను వానిని జయించును.

నల్లకలువ:—సం. నీలోత్పల అందురు. రక్తప్రదరము రక్తపిత్తము పిత్తము దప్పి తాపము కఫ కాస శ్రమ ఛర్ది మున్నగురోగములను హరించును. రసాదులు తెల్లకలువ వలెనే గ్రహించునది. చూ. కలువ.

నల్లగుంటగలగర:—చూ. గుంటగలగర.

నల్లజీడిచెట్టు:—చూ. జీడిచెట్టు.

నల్లజీలకర్ర:—సం. కృష్ణజీర, జరణ, సుగంధ అనియు, హిం. కాలా జీరా అనియుపేరు. ఇది నల్లగ మిరమిరలాడుచుండును చేతితో నలిపి వాసనచూచిన గాటుగల సువాసనవచ్చును.

ఇది కారము రుచి రూక్షగుణము ఉష్ణవీర్యము కటువిపాకము గలది. మలబద్ధముచేయును. కఫము శోఫ అజీర్ణము జ్వరము నేత్రవ్యాధులు శిరోరోగము కుష్ఠము మున్నగువ్యాధులను హరించును. దీనిని గుడ్డలో మూటగట్టి నలిపి వాసనజూచుచున్న శిరోభారము తలనొప్పితగ్గును. మెత్తగానూరి ఆముదములో కలిపి శరీరమునకురాచిన చీడ దురద గజ్జి తగ్గును. మెత్తని చూర్ణముచేసి కంటిలో వేసిన కొన్ని నేత్రరోగములుహరించును. లోపలకుతినిన మలబద్ధముచేయును.

నల్లపెసర:— సం. కృష్ణముద్గ. వాసంత, మాధవ, సుగాష్ట్రిజ అనియు, హిం. కాలాముగానీ అనియు పేరు.

నల్లపెసలు తీపి రుచి లఘుగుణము శీతవీర్యము మధురవిపాకము గలవి. త్రిదోషములను హరించును. దీపనపాచనముల జేయును. బలము వీర్యము పుష్టి గలుగజేయును పథ్యమైనవి.

నల్లమందు:— సం. ఆఫేన, అహిఫేన, ఖసఖసరస అనియు, హిం. అఫీమ్ అనియు పేరు. నల్లమందు గసగసాలు అను బీజముల రసమునుండి తయారుచేయుదురు. నల్లమందు జారణము మారణము ధారణము సారణము అని నాలుగు విధములు. జారణము తెల్లగ, మారణము నల్లగ, ధారణము పచ్చగ, సారణము చిత్రవర్ణముగ నుండును. ఇది విదేశీయమైన యౌషధము, ఉపవిషవర్గములలోనిది.

నల్లమందు చేదుగనుండును. వీర్యవృద్ధి బలము మలబద్ధము చేయును సప్తధాతువులను శోషింపచేయును. వాతపిత్తముల బెంచును. ఆనందమిచ్చును. మత్తు కునికిపాటు కడుపుబ్బరము తలత్రిప్పు మతిచలనము వీర్యస్తంభనము గలుగజేయును. నేత్రరోగముల మాన్పును. కృమి జలుబు దగ్గు జ్వరము విషూచి అజీర్ణ విరేచనములు వాపు పోటు ఆమవాతపునొప్పులు మాన్పును. మలమూత్రములను బంధించును. అలసటపడినందున కలుగు నొప్పులనులాగును. శ్వాసకాసలను ఆపును నరుకు గాయమునకు రాచిన రక్తస్రావమునాపి పుండును మాన్పును. అరగదీసి పట్టువేసిన కీళ్ళనొప్పులదీయును. హఠాత్తుగా యెత్తునుండి పడిన వారికిచ్చిన నొప్పులను బాధను తెలియనీయకుండ శరీరమునకు లఘుత్వమును నిద్రను కలుగజేయును. అతిమూత్రమును కట్టును. అమితముగ దినిన బుద్ధిమాంద్యము ఆయుర్నాశనముచేయును. రక్తమును విరుచును. పిచ్చియెత్తించును. వీర్యమును యెండించును. నూనెతో కలిపి త్రాగిన చంపును. నల్లమందు రసకర్పూరము కలిపి నూరి ఆవగింజంత మాత్రలుచేసి బిడ్డలకువాడిన జలుబు దగ్గు అజీర్ణము తగ్గును. నల్లతుమ్మాకు నల్లమందు అను రెంటిని చనుబాలతో నూరి కంటిచుట్టుపట్టు



వేసిన కండ్లమంట యెరుపు పోటు తగ్గును. జాజికాయలో నల్లమందు పెట్టి గుంటగలగరాకురసములో ఉడికించి నూరి కుంకుడుగింజలంత మాత్రలుచేసి యిచ్చిన వీర్యనష్టము కఫము దగ్గు తగ్గును వీర్యమును స్తంభించును. సంభోగశక్తినిచ్చును. శీఘ్రస్ఖలనమునాపును.

జారణమను నల్లమందు భుజించిన ఘనపదార్థములను జీర్ణింపచేయును. మారణమనునది చంపును. ధారణమనునది ముదిమినిహరించును. సారణము మలమును శోధించును. అని విషయ విశేషములు తంత్రాంతరములందు వ్రాయబడినవి.

నల్లమద్ది:— చూ. మద్దిచెట్టు.

నల్లేరు:— సం. అస్థిసంహార, వజ్రవల్లి, కులిశ, శిరాలక అనియు హిం. హాడభాంగా అనియు పేరు. డొంకలయందును చెట్లమీదను ప్రాకుతీగ 4, 5 అంగుళములకొక కణుపును, కణుపువద్ద ఆకులును ఉండును. కాడ పలకలుగానుండును, ఇందు రెండు మూడు నాలుగుపలకలుగల కాడలుగలవు. మూడుపలకల నల్లేరు కొన్ని భస్మములు చేయుటకును పాదవిద్యయందుపయోగించుటకును మంచిది. నల్లేరుకాయలు పచ్చివి ఆకుపచ్చగ పండినవి నల్లగ గుండ్రగ చిన్నవిగ కరివేప పండ్లంత యుండును. కాడలుమాత్ర మౌషధముగ వాడనగును. దీనిరసము శరీరమునకు తగిలిన దురదపుట్టి దద్దుగు లేచును.

నల్లేరు (నాలుగుపలకలది) తీపిరుచి, రూక్ష సరగుణములు, ఉష్ణవీర్యము, అమ్లవిపాకము గలది. కృమి, దుర్నామ రోగము, నేత్రరోగము, అర్శస్సు, అగ్నిమాంద్యము, మలబద్ధము ఉబ్బు, పాండువు, దగ్గు, ఎగరొప్పు, భూతబాధ, ఆధ్మానము, వాతము, వాతరక్తము అపస్మారము మున్నగువానిం జయించును. బలము దీపన పాచనములు వీర్యము గలిగించును.

త్రిధారలుగల నల్లేరు లఘురూక్ష సరగుణములు గలది అగ్నిదీప్తి హితము కృమి అర్శస్సు అనువానియందు విశేష ఫలాదాయకము మరియు పిత్తమును పెంచును. ప్లీహోదరము హరించును. లేతనల్లేరు

కాడలు ఉప్పు మిరపకాయలు కలిపి రుబ్బి వడియాలుచేసి యెండించి కాల్చుకొనిగాని నేతిలోవేయించిగాని తినిన జీర్ణశక్తికలుగును దగ్గు నశించును. రక్తము శుద్ధమగును. సుఖవిరేచనము చేయును. మలబద్ధము ఉబ్బు మూలరోగము కలవారలకివి హితముగనుండును. పైచర్మమును తీసివేసిన నల్లేరుగుంజు పప్పు (కందులు పెసలు, శనగలు మున్నగు ద్విదళధాన్యము) చేర్చి నూరి నువ్వులనూనెలోవేసి వేయించితినిన సమస్త వాతహరముగ ఉండును.

నల్లేరునుండి క్షారపాకవిధానమున తీసిన క్షారమును మండూరముతోచేర్చి యిచ్చిన పాండువు కామిల శోఫ తగ్గును. రక్తము పట్టును. జీర్ణశక్తి ఆకలి హెచ్చగును. నల్లేరుక్షారమును నీళ్ళతోయిచ్చిన మూత్రబద్ధము విప్పును. అజీర్ణశూలనివర్తించును.

నలము:—చూ. దేవనళము.

నవనీతము:—నూతనమైనవెన్న సాధారణముగ చలవ శుక్రవృద్ధి కాంతి బలము పుష్టి గలిగించును. మలమును గట్టిపరచును. వాతము పిత్తరక్తము క్షయ అర్శస్సు అర్దితవాతము కాస అనువానిని పోగొట్టును. నేత్రములకు హితముగనుండును. బాలురకు వృద్ధులకు మిగుల పథ్యము. సౌకుమార్యము ఆనందము ఉత్సాహము సంభోగశక్తి గలిగించును. వెన్నలో పంచదారకలిపి తినుటకంటె ఉత్కృష్టమై వీర్యవృద్ధికరయోగము లేదని చెప్పబడినది.

నవీనముగువెన్న మధురము కొంచెము వగరు పులుపు రుచులు స్నిగ్ధ గురు గుణములు శీతవీర్యము మధురవిపాకముగలదిగనుండును.

ఆవు గేదె మొదలగువాని వెన్నల గుణముల నాయాశీర్షికల క్రింద చూచునది.

నవాసాగరము:—సం. నరసార, అమృతలవణ, చూలికాలవణ, సాదర, వజ్రక్షార అనియు, హిం నవసాదర్ అనియుపేరు.

వరగోగుచక్కను కాల్చి బూడిదచేసి ఆబూడిదను క్షారపరిభాషననుసరించి ఏడుసారులు వండినయెడల నవాసాగరము సిద్ధమగును



ఇటుకవాములను తగులబెట్టినపుడు బయలుదేరు తెల్లని లవణమునుకూడ నవాసాగరమందురు.

ఉప్పు రుచి సరగుణము శీతవీర్యము మధురవిపాకముగలది. శోఫ యకృత్ ప్లీహ దోషజ్వరము తలనొప్పి అర్బుదము స్తనరోగములు రక్తపిత్తము కాస భగ్నవ్యాధి యోని వ్యాపత్ వ్రణము గుల్మము మలబద్ధము మూత్రకృఛ్రి మున్నగువ్యాధులను హరింపచేయును. నీళ్ళతో నవసారమును నూరి కుంకుడుగింజంత మాత్రను మింగిన యెడల తక్షణము దారుణమైన యెక్కిళ్ళు నిలచును. నవాసాగరభస్మమును పంచదార వెన్న మున్నగు అనుపానములతో ఒక యవప్రమాణము మొదలు గుంజెత్తువరకు సేవించిన దారుణ మూత్రకృచ్ఛ్ర నివర్తించును. నవాసాగరసున్నము తాటిబెల్లముతో పొదిగి, తినిన శూల నివర్తించును. నవాసాగరమైనమును గురివెందంత తినిన చలిజ్వరము ఆపును. తెల్లకుసుమను మాన్పును. నవాసాగరము వాదజ్ఞులకు కల్పతరువువంటిది. అనేకవిధముల ఉపయోగించును. నవాసాగర శుద్ధి భస్మము మైనము మొదలగు వివరణము మారసరత్నసముచ్చయ గ్రంథమున జూచునది

నాగకేసరాలు:—సం. చాంపేయ, కేసర, నాగకేసర, కనకాహ్వయ, మహౌషధ అనియు, హిం. నాగేశ్వర అనియుపేరు. కొంకణ గోవా దేశములనుండి నాగకేసరములు మనకువచ్చుచున్నవి. పున్నాగవృక్షముయొక్క కేసరములును నాగచంపయను చెట్టుమొగ్గలును నాగకేసరములని వాడబడును. యీరెండువిధముల నాగకేసరములు తోకమిర్యాలవలె నుండును,

ఇవి వగరు చేదు రుచులు లఘు రూక్షగుణములు ఉష్ణవీర్యము కటువిపాకముగలవి. ఛర్ది కఫము వాతము రక్తవికారము దురద హృద్రోగము స్వేద దుర్గంధము విషము దప్పి కుష్ఠు విసర్పము మూత్రపు సంచియందలి రోగములు వాతరక్త కంఠరోగములు తలనొప్పి ఓకిరింత మున్నగువానిని జయించును. నాగకేసరచూర్ణమును ఆవుపాలతో త్రాగిన తెల్లకుసుమ యోనిరోగములు ఋతుసంబంధవ్యాధులు నశించును.

నేలయుసిరిగరసములో చూర్ణమునుకలిపి త్రాగిన సంతానము నిచ్చును. గర్భదోషముల హరించును. ఆముదములో కలిపి శరీరమునకు పూసిన శరీరకాంతి కలుగును. దురద చీడ మున్నగు చర్మరోగములు నశించును. తేనెకలిపి నాకిన జోకులుకట్టును. కషాయముత్రాగిన ఉడుకుజ్వరము తగ్గును. పొట్టకు బలముచేయును. దీపన పాచనముల గలిగించును.

నాగజిహ్వా:—నాహు, నాగజిహ్వా, క్షితౌక్షుపతినియు, హిం. ఛోట కిరాయతా అనియుపేరు. దీనికి ఒకఅంగుళము ప్రమాణముగపొడవుగనుండు ఆకులును చిన్నచిన్న గుండ్రనికాయలును ఉండును. భూమియందు ఆనుకొని చిన్నక్షుపముగ పెరుగును.

చేదు రుచికలది. ఆకులనునూరి కుంకుడుకాయంతమాత్ర మింగిన క్రిములుచచ్చును. వ్రణములపైగట్టిన వ్రణములుమానును. క్షార ప్రధాన కర్మలందుపయోగించును.

నాగదుండిలము:—చూ. దుండిలము.

నాగదొండ:—దీనికి పాముదొండఅనియుపేరు. దీని ఆకారమంత దొండతీగను పోలియుండును. ఆకులపైన పామునకువలె మచ్చలుండును. తీయదొండయొక్క రసవీర్యాదులు దీనికిగలవు. దీనిని విశేషముగ మాంత్రికులు వశ్యవిద్యయందును రసవాదులు వాదవిద్యయందును వాడుదురు.

నాగబల:—చూ. బలాచతుష్టయము.

నాగపుష్పి:—సం. నాగపుష్పి, శ్వేతపుష్ప, నాగినీ, రామదూతికఅందురు. ఇదితీగ. వనములలో చెట్లయందుపాకును. పూవులు తెల్లగ నల్లగ నుండును. ఒకకొమ్మకు ఒకఆకుండును. దీనికి దుంపఉండును.

ఇది చేదు రుచి తీక్షణగుణము ఉష్ణవీర్యము కటువిపాకముగలది కఫపిత్తములు విషము శూల యోని దోషము ఛర్ది కృమి అనురోగములు నశింపచేయును.



నాగమల్లి:—ఇదిక్షుపము. ఆకులు కొనదేరి కొంచెము పొడవుగనుండును. పూవులు తెల్లగ చిన్నచిన్నవిగ పూచును. ఆకును నలిపి రాచిన తామరనయమగును. ఆకులరసమును శరీరమునకు పూసిన చీడ దురద తగ్గును. వేరును నిమ్మపండ్లరసముతో అరగదీసి నాగగంధమున హారతికర్పూరము కలిపి పూసిన సకల చర్మవ్యాధులు మానును. వేరు కల్కము లేక చూర్ణమును నరమూత్రములో కలిపి త్రాగిన సర్పవిషము హరించును. లోపలకుతినుటకంటె దీనిని బయటపూయుట కెక్కువ నుపయోగింతురు.

నాగార్జుని:—(చిన్నది) సం. నాగార్జుని, పయోవర్ష యోగినియు, హిం. దుద్ధీ, దూధియా, దూధికలవ అనియు పేరు. దీనికి రెడ్డివారినానబాలు అని తెలుగున వాడుక పేరుకలదు. ఇందు మూడుజాతులున్నవి. ఒకటి జానెడుమొదలు మూరెడెత్తువరకును లేక్కానవి రెండు నేలమీదను పెరుగును పెద్దదానిఆకులు కోలగ అంగుళము పొడవున నుండును. రెండవదానికి చిన్నచిన్న ఆకులును దానికన్న చిన్నఆకులు మూడవదానికిని ఉండును. మూడుమొక్కలను త్రుంపిన అధికముగ పాలుగారును. మూడవదానికాడ యెర్రగనుండును. యెర్రని చిన్నపూవులుపూచును. పెద్దదానిపూవు గుచ్ఛముగ నుండును. దీనికాయలు నేలయుసిరిగకాయలంత యుండును. చిన్నరెడ్డివారి నానబాలచెట్లు రెండును నేలయుసిరిగను పోలియుండును. మూటిలో యెరుపు తెలుపు జాతులున్నవి.

పెద్దరెడ్డివారినానబాలకు, సం. దుగ్ధ క్షీరాత్మిక క్షీరీ క్షీరాపీ అనియు, రెండవదానికి, సం. దుగ్ధఫేనీ పయఃఫేనీ పయస్వినీ ల్యూతారి వ్రణకేతు గోజాపర్ణి యనియు పేరు. క్రమముగ దుగ్ధి (పెద్దది) తీపి కారము చేదు రుచులు గురు రూక్షగుణము ఉష్ణవీర్యములు కటువిపాకముగలది. మలమూత్రములను జారీచేయును. గర్భదోషములహరించి స్త్రీలకు గర్భధారణ యోగ్యతను కలిగించును. కఫము కుష్ఠము కృమి హరించును.